C

AH9

Archaeological Series No. 35

AH
24

విజయనగరచరిత్ర

[మొదటి భాగము]

రచయిత

డా. నేలటూరి వెంకటరమణయ్య

జనరల్ ఎడిటరు

మహమ్మద్ అబ్దుల్ వహీద్ ఖాన్, F. R. A. S. (Lond.)

డైరెక్టరు, పురావస్తుశాఖ,

ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

ప్రకాశకులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

వెల రు. 12-50

CL

A

REHIBO2N239

Archaeological Series No. 35

విజయనగరచరిత్ర

[మొదటి భాగము]

రచయిత

డా. నేలటూరి వెంకటరమణయ్యా

జనరల్ ఎడిటరు

మహమ్మద్ అబ్దుల్ వహీద్ ఖాన్, F. R. A. S. (Lond.)

డైరెక్టరు, పురావస్తుశాఖ,

ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

ప్రకాశకులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

వెల రు. 12-50

B

PRINTED IN INDIA
AT THE ANDHRA PRADESH TEXT-BOOK PRESS,
MINT COMPOUND, HYDERABAD.

కృతిసమర్పణము

ఈ చరిత్ర లేఖరచన కెవ్వాడు కారణభూతుడో
ఆ ప్రియమిత్రుడు ఖాసాసుబ్బారావు కీర్తిమూర్తికి.

నేలటూరి వెంకటరమణయ్య

ד

విజయనగర సామ్రాజ్యము

ప్రవేశిక

దేశచరిత్రయన దేశమున వెలసిన మహాపురుషుల చరిత్రయే యను సూక్తియొకటి యాంగ్లము నందుగలదు. అస్మద్దేశచరిత్రం విషయమెట్లుండినను విజయనగర సామ్రాజ్య చరిత్ర మిది చక్కగ నన్వయించుచున్నది. ఈ సామ్రాజ్య స్థాపన ముగ్గురు మహాపురుషుల దృఢసంకల్పమునకు ఫలితము; పెంపొందినదియు మహాపురుషుల కృషిమూలమునసే. సామాన్యుల స్వార్థపరతవలననే తుదకది యంతరించినది.

విజయనగర సామ్రాజ్యమునకు విద్యానగర లేక కర్ణాటక సామ్రాజ్యములనియు నామాంతరములు గలవు. ఈ నామాంతరములు గలుగుటకు గారణ మీక్రింది చరిత్రవలన విశదము గాగలదు.

విజయనగర సామ్రాజ్యము మువ్వురు మహాపురుషుల కృషివలన స్థాపింపబడెనని మీదచెప్పియున్నది. వీరియందగ్రగణ్యుడు విద్యారణ్యస్వాములవారు. ఈయన సన్యాసి. తక్కినవారు సంగమ రాజపుత్రులు హరిహర బుక్కరాయలను సోదరులిద్దరు. వీరు ముగ్గురునుకూడి యేకాగ్రచిత్తులై సామ్రాజ్య స్థాపనకుగడగిరి. వీరియందు విద్యారణ్యస్వాములవారగ్రగణ్యులైనను రచనాసౌలభ్యముకొఱకు సంగమ రాజపుత్రుల పుట్టుపూర్వవృత్తాంతములతో విజయనగర చరిత్రను ప్రారంభించుచున్నాడను.

ఈ సంగమరాజు యదువంశ సంభూతుడనియు బుక్కరాజ కుమారుడనియు నతని పుత్రుల శాసనములందు జెప్పియున్నది. ఎచ్చటివాడో తెలియదు. మంగళ నిలయపట్టణ మితని నివాసస్థానమని విద్యారణ్యవృత్తాంతమున గలదు. ఈ మంగళ నిలయ మెచటనుండెనో దృఢముగ నిశ్చయించి చెప్పుటకు దగినంత సాహస్యము లేకపోయినను నది యిప్పటి గుంటూరు మండలములోని సంతమంగళూరని యెంచుట కవకాశమున్నది. సంగమ రాజకృత ఘనకార్యము లెచ్చటను వర్ణింపబడి యుండకపోవుటవలన నితడు సామాన్య క్షత్రియుడని యెంచుట యుక్తము. సంగమున కైదుగురు పుత్రులు, హరిహర కంప బుక్క ముద్దప మారపలను వారు పుట్టిరి. వీరియందు హరిహర బుక్కరాయలిరువురే సుప్రసిద్ధులు. వీరి బాల్యచరిత్రనుగూర్చి తెలియదు. యౌవనముతోడనే వీరిచరిత్ర ప్రారంభమగుచున్నది. ఆ కాలమున గొంచెమించుమించుగ నాంధ్రదేశమున కంతటికిని ఏకచ్ఛత్రాధిపతియై యుండిన కాకతీయ ప్రతాపరుద్రదేవు నాశ్రయించి తమ యంతస్తుకుదగిన యుద్యోగమును బడయుటకు హరిహర బుక్కలిరువురును ఓరుగంటికి బోయిరి. మహారాజు ననుగ్రహమునకు పాత్రులై యతని కోశాగార ప్రతీహారులపదవిని సంపాదించిరి. హరిహర బుక్కలెప్పుడు ప్రతాపరుద్రుని కొలువును బ్రవేశించిరో నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. ఇది వారి జీవనచరిత్రలోని ప్రారంభదశ.

హరిహర బుక్కరాజులు ప్రతాపరుద్రుని కొలువున చిరకాల ముండలేదు. మహమ్మదీయ దండయాత్రలవలన రాజ్యవిప్లవము సంభవించినది. దక్షిణ భారతదేశము సర్వమును యవనాక్రాంత

మాయెను. తురకదండయాత్రలు క్రీ. శ. 13 వ శతాబ్దాంత్యదశకమున ప్రారంభమైనవి. ఆ కాలమున దక్షిణాపథమును పాలించుచుండిన నాలుగు హిందూ రాజవంశములలో మూడు కూలిపోయినవి. క్రీ. శ. 1295 వ సంవత్సరమున దేవగిరి రాజధానిగ మహారాష్ట్రోత్తరకర్ణాటకముల నేలుచుండిన యాదవవంశజుడు రామదేవరాయలు మహమ్మదీయుల కోడి ఢిల్లీసుల్తానునకు అల్లావుద్దీన్ ఖిల్జీ కరిగాపాయెను. క్రీ. శ. 1314 వ సంవత్సరమున రామదేవరాయల మరణకాలమువఱకు దేవగిరి రాజ్యమునతడు పాలించుచుండినను, తరువాత నది ఢిల్లీ తురక సామ్రాజ్యమున గలసిపోయెను. నాడు మొదలు దేవగిరి దక్షిణాపథమున తురకలకు కేంద్రస్థానమాయెను. క్రీ. శ. 1310-1314 ల మధ్య తక్కిన దాక్షిణాత్య హిందూరాజు లందఱును తురకలకు మారొడ్డజాలక శరణువేడి కప్పముగట్టి తమ తమ రాజ్యములను నిల్పుకొనిరి. ఢిల్లీయందు ఖిల్జీ సుల్తానుల యధికారము సాగినంతకాలమును ఈ యేర్పాటు భంగములేక నడచినది. క్రీ. శ. 1320 వ సంవత్సరమున ఖిల్జీవంశ మంతరించినది. తుఘ్లూకులు సామ్రాజ్య పీఠము నధిష్ఠించిరి. దాక్షిణాత్య హిందూ ప్రభువులు గప్పముసీయక తిరుగబడిరి. మరల మహమ్మదీయ దండయాత్రలు ప్రారంభమైనవి. ఢిల్లీసుల్తాను ఘయాజుద్దీన్ తుఘ్లూకు దాక్షిణాత్య రాజవంశములను నిర్మూలము గావించి వారి యేలుబడియం దుండిన రాష్ట్రము నంతటిని ఢిల్లీ సామ్రాజ్యమున గలుపుకొన నిశ్చయించి దనకుమారుడు ముహమ్మదు బిన్ తుఘ్లూకు నాధిపత్యముక్రింద క్రీ. శ. 1323 నొక మహాదండయాత్రనంపెను. ఈ దండయాత్ర మొదటి తాకాంధ్రదేశమునకు దగిలినది. ప్రథమమున నాంధ్రులు విజయమందిరను తరువాత పరాజితులైరి. ఆంధ్రరాజధాని యోరుగల్లు తురకలకు హస్తగతమాయెను; ప్రతాపరుద్రుడు బందీకృతుడై తురకలచే ఢిల్లీకి గొంపోబడుచుండగా మార్గమధ్యమున నర్మదాతీరమున స్వేచ్ఛతోడనే స్వర్గవాసి యాయెను. అంతట కాకతీయ రాజ్యము సమాప్తియైనది. ఓరుగల్లును స్వాధీనపఱచుకొనిన పిమ్మట మరికొన్ని రోజులకె మధుర పాండ్య రాజ్యమును మహమ్మదీయులు జయించి ఢిల్లీ సామ్రాజ్యమున గలుపుకొనిరి. హిందూ స్వాతంత్ర్యము భరతఖండ మంతటను సంపూర్ణముగ నశించినట్లు తోచెను.

ఓరుగల్లు మహమ్మదీయులకు వశమైనపిమ్మట హరిహర బుక్కరాజులకు అచట నివసించుట క్షేమకరముగ దోచలేదు. పూర్వము ప్రతాపరుద్రుని కొలువునందుండిన యుద్యోగస్థులందఱు ముహమ్మదు బిన్‌తుఘ్లూకు అనుమానమునకు గురియైరి. వారిని వధించుటకుగాని బలాత్కారమున మహమ్మదీయ మత దీక్షను వారికిచ్చుటకుగాని యతడు ప్రయత్నము సేయుచుండెను. కావు సోదరులిరువురును ఆంధ్రదేశమును త్యజించి తురకల యేలుబడి క్రిందికి రాని స్థలాంతరమునకు పోనిశ్చయించుకొనిరి. ఇంకను మహమ్మదీయులు లొంగని దేశములు రెండుమాత్రము దక్షిణదేశమం దుండినవి. ఒకటి దక్షిణ కర్ణాట మందలి ద్వారసముద్ర హొయ్సలరాజ్యము; రెండవది కుంతలమున నూతనముగ స్థాపింపఁబడిన కంపిలి రాజ్యము. మొదటిది చాలదూరమున నుండెను; మఱియు వీరి నాదరించగల పరిచయస్థులును నచట లేరు. కంపిలి సమీపమున నుండెను ఓరుగంటి కాకతీయ రాజ్యపు గడి సీమయం దుండుటవలన వారి కది కేవల మపరిచితమైనదికాదు. మఱియు గంపిలి రాయలకుమారుఁడు పరదారసోదరరామనాథుడు శరణాగతత్రాణ నాబిరుదాంకితుఁడు. కావున హరిహర బుక్కరాయలు కంపిలిరాజ్యమునకు పారిపోవుట యుక్తమని యచటికిబోయి చేరిరి. రామనాథుఁడు వారిని చక్కఁగ నాదరించి వారి యంతస్తునకు దగిన యుద్యోగముల నిప్పించెను. కంపిలి రాజ్యమునందే స్థిరముగ నివసించుటకు నిశ్చయించి హరిహర బుక్కలిరువురును రాజకుటుంబమునకు జెందిన కురుబ స్త్రీలను వివాహమాడిరి; కాని మూఁడు నాలుగు సంవత్సరములకు మించి కంపిలి రాజ్యమున నిలిచియుండుట వారికి వలనుగాక పోయినది. తురకల యొత్తిడి యతిశయించెను; తత్కారణమున వా రిడుముల

పాలై కులభ్రష్టులై దేశాంతరగతులు కావలసి వచ్చినది.

క్రీ. శ. 1325 లో ఢిల్లీసుల్తాన్ ఘయ్యాసుద్దీన్ తుగ్లుకు మరణమునందెను. అతని పెద్ద కొడుకు ముహమ్మదు బిన్‌తుగ్లూకు రాజ్యాధిపతి యాయెను. సింహాసనము నధిష్ఠించినప్పటినుండియు నతడు కంపిలిరాజ్యమును నిర్మూలముగావింప నిశ్చయించుకొనెను. దీనికి రెండు ముఖ్యకారణములు గలవు. మొదటిది, కంపిలి రాజ్యాధిపతియగు కంపిలి రాయలకు మహమ్మదీయులయెడ గల ద్వేషము. కంపిలిరాయలు ప్రథమమున దేవగిరి యాదవ రామదేవరాయల కొలువున సేనాపతులై యుండి హొయ్సలులతోడ యుద్ధముజయం దద్వితీయమైన తన శౌర్య ప్రకటనచే ప్రసిద్ధికెక్కిరి; కాని యా రామదేవరాయలు ఢిల్లీ సుల్తానగు అల్లావుద్దీన్ ఖిల్జీ కోడి యతని కపిగా పైనది మొదలు స్వతంత్రుడై తుంగభద్రాతీరమందలి కంపిలి నగరమును రాజధానిగ జేసికొని యా పరిసరప్రాంతములను స్వాధీనపఱచుకొని రాజ్యము సేయగడగెను. ఇతని కుమారుడు పరదారసోదర రామనాథుడితనికి దక్షిణ హస్తము; కార్యమునకును ఖడ్గమునకును గర్త. మహమ్మదీయులు పాడుసేయుచుండిన హిందూ ధర్మమును సంస్కృతిని గాపాడుటకు వీరిద్దరు బద్ధకంకణులు. తురకల బారినుండి తప్పించుకొని వచ్చిన వారి నందరికి నాశ్రయమొసగి యాదరించుచుండిరి. మఱియు ఢిల్లీ సుల్తాను సైన్యములను పలుమార్లోడించి పరిభవించిరి. జగదేకవీరుడని ప్రసిద్ధిగాంచిన మల్లిక్ కాఫురును పరాజితుని గావించిరి. కావున కంపిలిరాయడు ఢిల్లీసుల్తాను క్రోధమునకు పాత్రుడగుటయందు వింత యేమికలదు? రెండవది, మఱియు ప్రబల కారణము, సుల్తాన్ ముహమ్మదు బిన్ తుగ్లూకునకు బహోవుద్దీన్ గర్షాస్పుడను పేరు గలవాడు మేనత్త కొడు కొక్కడుండెను. ఇతడు శూరుడు. మొగలాయీలతోడి యుద్ధమున నతడు దన మేనమామయగు ఘయ్యాజుద్దీన్ తుగ్లూకు పక్షము జూలసహాయ మొనర్చిన కారణమున సుల్తానతని కృష్ణాతట మందలి సుప్రసిద్ధ గడిదుర్గమగు సగరున కధిపతిగ నియమించెను; కాని యతనికి దనమేనమఱదియగు మహమ్మదు బిన్‌తుగ్లూకు నెడ తీరని పగ. కావున ముహమ్మదు బిన్‌తుగ్లూకు తండ్రి మరణానంతరము రాజ్యాభిషిక్తుడైన పిదప నితడందరు అమీరులవలె నతని యధికారము సంగీకరింపక నిజ స్వాతంత్ర్యమును ప్రకటించి ఢిల్లీ సింహాసనమును దానే యాక్రమించుకొనుటకు ప్రయత్నము సేయగడగెను. ముహమ్మదు బిన్‌తుగ్లూకతని యెత్తుగడను గ్రహించి ప్రచండ సైన్యము నతనిపై కంపెను; గర్షాస్పుడు యుద్ధమున నోడి సుల్తాను కోపమునకు జడిసి ఢిల్లీ సామ్రాజ్యమున నుండుట క్షేమకరము గాదని కంపిలి రాజ్యమునకు పరారియై వచ్చి కంపిలిరాయని శరణు వేడెను; కంపిలిరాయ డాతని కాశ్రయమొసగి సంరక్షించెదనని వాగ్దానమిచ్చి సుల్తాను నాగ్రహమునకు పాత్రుడాయెను.

పై కారణములవలన సుల్తాను కంపిలిరాజ్యమును, నిర్మూలము గావించుట కర్తవ్యమని యెంచి సైన్యముల నా రాజ్యమును జయించుట కంపెను. మూడు దండయాత్రలు నడచినవి. మొదటి రెండు పర్యాయములును సుల్తాను సైన్యము పరాజయము నంది వెనుకకు మరలిపోవలసి వచ్చినది. మూడవ మాఱు సుల్తాను స్వయముగ దండు వెడలినచ్చెను. యథాపూర్వను కంపిలిరాయ డద్వితీయ పరాక్రమముతో ఢిల్లీ సైన్యముల నెదిర్చెను. కాని యీ పర్యాయము జయమాతనికి చేకూఱలేదు. ఎంతటి శూరుడైనను ఢిల్లీ సుల్తానుతో సరితూగగలశక్తి యతని కెక్కడిది? ధనసంపదయందును బలాధిక్యతయందును వారిరువురకుగల తారతమ్యము తృణ మహామేరువుల భేదమువంటిది. రెండు దండయాత్రల పోరాటమున కంపిలిరాయని బలము జాలవఱకు సమసిపోయినది. మూడవపర్యాయము అతడు తురక సైన్యములతో సరిపోరజాలక పోవుటయందు వింత యేమికలదు. యుద్ధమున పరాజయము నిశ్చయమని తోచినంతటనే కంపిలిరాయడు గర్షాస్పునికి

దోడిచ్చి ద్వారసముద్రమునకు ముమ్మడి బల్లాళ రాయనికడ కంపెను. కుమ్మఠము ముట్టడియందు పరదారసోదర రామనాథుడు రణశయ్య నలంకరించెను. కుమ్మఠమంతట సుల్తానునకు హస్తగతమైనది. కంపిలిరాయ లంతట హొసమలదుర్గము (ఆనెగొంది) నకు బోయెను. తురకలు వెన్నంటి తఱుముచుబోయి యా దుర్గమును ముట్టడించిరి. నెలరోజులు సాగినది ముట్టడి; ఇక కోటలోపల నిభాయించుటకు వలనుపడలేదు. తుట్టతుదకు, అంతఃపురమునందును దొరలమందిరములందును స్త్రీలగ్నిహోత్రుని శరణువేడి తమ మాన సంరక్షణము గావించుకొనిరి. సంసారబంధము లిట్లు తొలగిపోయిన వెనుక కోటతలుపులు దెఱపించి కంపిలిరాయలు మంత్రి సామంతులతోడను హరిహరబుక్క ప్రముఖ వీరవర్గముతోడను శత్రుసైన్యముపై బడి నిహతుడాయెను. నాయకులనేకులు మడిసిరి. హరిహరుడనుజునితోగూడ బందీకృతుడాయెను; కంపిలి రాజ్యము సుల్తాను హస్తగతమాయెను.

కంపిలిరాజ్య వినాశముతో ఢిల్లీశ్వరుని దండయాత్ర ముగియలేదు. గర్వాస్పు డింకను ముహమ్మదు బిన్ తుఘ్లూకు చేజిక్కలేదు. అతని ధ్వంసము సేయుటకు శత్రువులు నిశ్శేషముగ నమసిరను తృప్తిలేకపోయెను; కావున సుల్తాను గొప్ప సైన్యముతోగూడ దన సర్వసేనాధికారిని ద్వారసముద్రముపై కంపెను. కాని యుద్ధమున కవసరము లేకపోయినది. హొయ్సల ముమ్మడి బల్లాళుడు కంపిలి రాయలవలె కేవల ఖడ్గవాదిగాడు; ఖడ్గమునకంటె గార్యమునందే యతని కెక్కుడు విశ్వాసము. అనుకూల సమయములందు ఖడ్గప్రయోగమునకు వెనుదీయడు. శూరధర్మమువలె రాజధర్మము నెఱవేర్చుట తన కర్తవ్యమని యతడెఱుగు. శత్రువు ప్రబలుడనియు జయము సంశయాస్పదమనియు దోచినప్పుడు ఖడ్గమును డాచి కార్యమును జయప్రదముగ సాగించుట శ్రేయస్కరమని యతని యూహయము. ఢిల్లీసైన్యములు దనదేశముపైవచ్చుచున్నవని వినగనే అపుడు సుల్తానునకు విధేయుడగుటకు నిశ్చయించుకొనెను. నవలక్ష ధనుర్ధరాధిపతియైన కాకతి ప్రతాపరుద్రదేవుని కంటెను, సకల ద్రావిడదేశమునేకచ్ఛత్రము క్రిందికి దెచ్చి పాలించుచుండిన పంచపాండ్యుల కంటెను దాను బలవంతుడుగాడు ; కంపిలి రాయనికి మించిన శూరుడునుగాడు ; కాని వారేరి ? తురకలకు మాఱొడ్డి నిలువగలిగిరా ? కావున యుద్ధప్రస్తావన సేయక, దన్ను నమ్మియుండిన గర్వాస్పునిబట్టి బందిగావించి సుల్తానుకు గప్పముతో గూడ కంపిలి కంపి తాను సుల్తాను శ్రేయమును గోరు ననుచరులలో నొక్కడననియు దనయవజ్ఞతను క్షమించి రక్షింప వలయుననియు వేడుకొనెను. సుల్తాను కప్పమును గ్రహించి బళాళుని దన సామంత కోటియందు జేర్చుకొని దండయాత్ర నుపసంహరించెను.

క్రీ. శ. పదునాల్గవ శతాబ్ది ప్రథమ పాదమంత మందినది. ద్వితీయపాద ప్రారంభమున క్రీ. శ. 1326 లో గంపిలి రాజ్యము ఢిల్లీ సుల్తానుకువశమైనది ; హొయ్సల వీరబళాళుడు సుల్తాను నాధిపత్య మంగీకరించి యతని కరిగాపాయెను. అంతట సేతు శీతాచలపర్యంత వ్యాప్తభరతఖండమంతయు మహమ్మదీయుల యధికారము క్రిందికి వచ్చినది. హిందూ స్వతంత్ర భానుడస్తంగతుడాయెను. పారతంత్ర్య యుగము ప్రారంభమైనది.

యుద్ధమునందును నూతనరాష్ట్ర సంపాదనయందును మహమ్మదీయులు నేర్పులే ; కాని రాజ్యపాలనమునందు నైపుణ్యము వారికి చాలదు. దీనికి ప్రధానకారణము వారి యన్యమతద్వేషము. మహమ్మదీయులు గానివారికి వారి యేలుబడియందు తావులేదు. మహమ్మదీయ మతమున బలాత్కారముగ వారిని గలుపుకొనుటయో యది

ఆంధ్రదేశ ప్రజలస్థితి ఇట్లు దుర్భరమై యుండినది. ద్రావిడజనులగతి మఱీయు శోచనీయము. వారి గోడును మధురావిజయమున గంగాదేవి ఇట్లు వర్ణించియున్నది. 'పూజా పురస్కారములు నిలిచిపోవుటవలన దేవాలయములు పాడుపడిపోయినవి. మృదంగధ్వానములకు బదులు వానియందు నక్కలయూళలు సెలగుచున్నవి. నీతిలేని తురుష్కులవలె, కావేరి తన పూర్వమర్యాదల నుల్లంఘించి తఱచుగ దన ప్రవాహమువలన సర్వనాశనము గావించుచున్నది. అగ్రహారములందు సతతాధ్వర సౌరభములకు బదులు పచ్చిమాంసపుపొల గుబులుకొనుచున్నది; వేదఘోషణకు మారు వికృతతురుష్కసింహనాదములు వినవచ్చుచున్నవి. మధురాపురి పరిసరములందలి యుపవనములు చూచుటకు ఘోరములై యున్నవి. నారికేళషండములు ఖండితములైనవి ; ఎటుచూచినను మనుష్యకపాల మాలికలువేలాడు శూలపరంపరలు గానవచ్చుచున్నవి. ఏ పట్టణపు రాజవీధులు రమణీమణుల మణినూపురప్రణాదములవలన రమణీయములై యుండెనో యవి ఇపుడు ద్విజులయొక్క సంకేలుల చప్పుడువలన కర్ణశూలములైనవి. సాలీని గూండ్లు పురగోపురసాలభంజికలకు పట్టుపుట్టములైనవి. హేమచందనవారిసేకములచే నే రాజమందిరాంగణములు జల్వలీనుచుండెనో యవి నేడు బందీకృతులైన వనితాజనముల కన్నీటిచే దడియుచున్నవి. పూర్వము జలకములాడు స్త్రీలమేనిచందనములు గఱగుటవలన దేని జలములు పాణ్డురమగుచుండెనో ఆ తామ్రపర్ణి పావనోదకములు నేడు నృశంసులైన తురుష్కులచే జంపబడిన గోవుల రక్తమువలన నెఱ్ఱనై పాఱుచున్నవి. వేదము విస్మరింపబడినది; ధర్మడాగినది; న్యాయౌదార్యములు భూమియందెందును గానరావు. దిక్కులేని ద్రావిడుల ముఖములందు నిరాశ నెలకొనియున్నది.'

సమకాలికురాలైన హిందూకవయిత్రి తన వారి కష్టములనుగాంచి హృదయవేదనకు దాళజాలక ఇట్లు వ్రాసెనని తలచుట యుక్తముగాదు. అన్య దేశజులగు మహమ్మదీయ ప్రయాణీకులు గూడ తురుష్కుల రాక్షసకృత్యములను వర్ణించియున్నారు.

సాధ్యముగాని పఱమున వారిని కాలఱెట్టి నేలరాచి సర్వనాశనము సేయుటయో మహమ్మదీయ ప్రభువులకు గరమునచ్చిన పద్ధతులు. అన్యమార్గములను వారెఱుగరు. కావున దక్షిణభారతదేశము వారికి వశమైనప్పటినుండియు నచటి హిందూప్రజలకు గష్టకాలము సంప్రాప్తమాయెననుట యతిశయోక్తి కాదు. అప్పటి స్థితిగతులను పలచుకొనిన నేటికిని యలమటింపు గలుగుచున్నది. మహమ్మదీయులచే దాము పడినపాట్లను అప్పటివారే విపులముగ వర్ణించియున్నారు. ఒకానొక శాసనమున నిట్లు చెప్పియున్నది. 'ప్రతాపరుద్రుడను భానుడు అంతర్హితుడు కాగా లోకమున తురుష్కాంధకారము వ్యాపించినది...దేశము యవనాక్రాంతమయిన పిదప ధనవంతులు అనేకములయిన పాపపు ఉపాయములచేత ధననిమిత్తము పీడింపబడినారు. కొందరు పారశీకులను (తురకలను) చూచి చూచుట తోడనే తమ ప్రాణములను వదలినారు. ద్విజులు తమ యజ్ఞకర్మలను వదలుకొనవలసినవారైనారు. దేవప్రతిమలు సమస్తము భగ్నములైపోయినవి. చిరకాలముగ మహాపండిత భుక్తములగుచున్న అగ్రహారములన్నియు అపహరింపబడినవి. పాపులయిన యవనులు బలాత్కారముగా వ్యవసాయము చేసినందువలని పంటపర్యాయములు లాగుకొనుట చేత దరిద్రులు, ధనికులు అను భేదములేక రైతుల కుటుంబములెల్ల నాశనములయిపోయినవి. ఆ మహా విపత్కాలమున ధనము, భార్య మొదలగు వేని యందును ప్రజలకు స్వాయత్తతాభావము (ఇది నాది అను భావము) పోయినది. కల్లు త్రాగవలెను; ఆవుమాంసము తినవలెను; స్వచ్ఛంద విహారము చేయవలెను; బ్రాహ్మణులను చంపవలెను. ఇది యవనాధముల వృత్తి. వారి వ్యాపారమిట్లున్నయెడల ఇంక భూమిమీద ప్రాణిలోకము బ్రతుకు నెట్లు? ఈవిధముగా రాక్షసులవంటి తురుష్కుల వలన పీడింపబడిన త్రిలింగదేశము రక్షించువారెవరును మనస్సుకు కూడ తట్టక కార్చిచ్చుచుట్టుకొన్న అడవివలె సంతపించి పోయినది.' (భారతి. సం. ౧౯ పుట ౩౧౧.)

హిందువులు మంచి గృహముల నివసింపరాదు; భూషణముల ధరింపరాదు. మంచిబట్టల గట్టరాదు. గజాశ్వాందోళికాదివాహనముల నెక్కి స్వారి సేయరాదు. ధనము గూర్పరాదు. వేష భాషల మహమ్మదీయుల ననుకరింపరాదు. సర్కారు ఉద్యోగములందు వారికి ప్రవేశములేదు; సైన్యమున జేరుట కర్హతలేదు. తురకలు వారియెడ నెట్లు ప్రవర్తించిను దప్పులేదు. చంపిను అడుగగూడదు.

ఈ దారుణ ప్రభుత్వము రాను రాను దుస్సహము కాజొచ్చినది; హిందువుల జీవనము క్రమక్రమముగ దుర్భరమైనది. అసంతృప్తి యెల్లయెడలను పొడసూపినది; ప్రజలయం దాందోళన యతిశయించినది. ఈ యీతిబాధలను బడజాలక తురకలను వెడలనడచి హిందూధర్మమును పునరుద్ధరింపవలయుననుచింత మొట్టమొదట యాంధ్ర దేశమున నంకురించెను. ప్రజలందఱు నేకమై తమ సామాన్య శత్రువులగు తురకలపై దిరుగుబడ నిశ్చయించుకొనిరి. ఇది యావద్భరతఖండమందును చారిత్రకయుగము నందానిర్భవించిన ప్రథమ జాతీయ స్వాతంత్ర్యోద్యమము. కాని ప్రజ బహుముఖమైనది; ప్రబలులగు మహమ్మదీయుల నెదుర్కొనునపుడు శక్తిసంపన్నులైన నాయకులుండినగాని జయముచేకూడదు. కావున వారికి ప్రథమమున నాయకనిర్ధారణ కర్తవ్యమైనది. అధర్మము ప్రబలి ధర్మము నశించునపుడు యుగయుగమునను ధర్మోద్ధరణకొఱకు దా నవతరించెద నని శ్రీకృష్ణ భగవానుఁడుచేసిన వాగ్దత్తము నెఱవేర్చుటకై పురాణపురుషుఁడు యవన సంహారము కొఱకు చతుర్థ వర్ణమున బొడచూపెను.

'అనంతరము యవనులు పెట్టుచున్న యీ విధమైన బాధలను-చూచి దయార్ద్రహృదయుఁడై భగవంతుఁడయిన విష్ణువు తన అంశతో అవతరించినట్లు ప్రోలమహీపతి అవతరించి భూభారము వహించెను. పురాణ పురుషుని పదములయందు కలికాలమున శ్రేష్ఠమైనదని యెన్నిక గాంచిన వర్ణము పుట్టినది. ఆ వర్ణమున ముసునూరి వంశము ప్రశస్తమైనది. ముసునూరి వంశజుడైన ఆ ప్రోల భూపతి విశృంఖలమును, విశ్వమునకు జీవనాధారమునైన తన బాహుబలముచేత ఆవిధమయిన యవనుల ఆధిపత్యమును నాశనముచేసెను' 'యవనులచేత బాధితులయిన జనులు మనువువంటి ఆ ప్రోల భూపతినే నీటిమడుగులను నిదాఘూర్తులవలెనే ఆశ్రయించినారు.' (భారతి. 19. పుటలు 311-312).

ఆ విపత్కాలమున ఆంధ్రులకు సంరక్షకుడై నిలచి వారు ప్రారంభించిన జాతీయోద్యమమును జయప్రదముగ సాగించిన నాయకుడు ప్రోలయ నాయకు డొక్కడే కాదు. అతనికి సహాయులు డెబ్బది యేవురు నాయకులుండిరి; వీరియందు ప్రోలయ వేమారెడ్డి, రావుసింగమనీడు, చోడభక్తి రాజు మున్నగువారు ముఖ్యులు. ప్రోలయ నాయకుడు రాజుకాదు; తనతోడి డెబ్బదియేవురు నాయకవర్గమున కధ్యక్షుడు. ఏకాధిపత్యము క్రింద గాని తురకలపై జయ చేకూఅదని యెఱిగి యాంధ్ర నాయకులంద రేకమై తమయందు శక్తిసామర్థ్యములచే నతిశయుడైన ముసునూరి ప్రోలయను దమ కందరికిని నాయకునిగ నెన్నికొనినట్లున్నది.

స్వాతంత్ర్యసమరము ఓరుగల్లు తురకలకు స్వాధీనమైన మరుసటియేటనే దక్షిణాంధ్రమున నెల్లూరు సీమయందు ప్రారంభమాయెనని యెంచుటకు గొంత యవకాశముగలదు. అప్పటి కింకను ఆంధ్రనాయక సంఘ మేర్పడలేదు. నెల్లూరివాడగు ప్రోలయ వేమారెడ్డిశాసనములు క్రీ. శ. 1324 వ సం॥ మునుండియు దక్షిణాంధ్ర తీరభూమియందు గానవచ్చుచున్నవి. ముసునూరి ప్రోలయ నాయకుడును నాప్రాంతము వాడగుటచే నాద్యమున వారిరువురును ధైర్యమును చిక్కబట్టి తురకలతో స్వాతంత్ర్యసమరమును ప్రారంభించిరని యెంచుట యసమంజసముగాదు. దీని సత్యాసత్యములెట్లున్నను వీరి కృషికి ఫలితముగ క్రీ. శ. 1330 వ సంవత్సరమునాటి కాంధ్రనాయక సంస్థ యేర్పడినదని దృఢముగ జెప్పవచ్చును.

ఇట్లు ప్రారంభమైన స్వాతంత్ర్యసమరము చరిత్రను సూక్ష్మముగ నిర్ణయించి తెలిసికొనుటకు దగిన

సాధనములు లభ్యపడలేదు; కాని స్థూలముగ దానికి జెందిన విశేషాంశము లన్నియు స్పష్టముగ దెలియవచ్చుచునే యున్నవి. సమర చరిత్రయందు రెండు ఘట్టములు గానవచ్చుచున్నవి. ప్రారంభము నుండి ప్రోలయ నాయకుని మరణ పర్యంతము మొదటి ఘట్టము. జాతీయ నాయక సమితి యేర్ప డిన పిమ్మట జాతీయ దళములను రెండుపాయలుగ జీల్చిరి; అందొకటి ప్రోలయ నాయకుని యాధిపత్యము క్రింద తీరాంధ్ర దేశమును దురకలనుండి జయించి పారతంత్ర్య విముక్తి గావించుటకు బయలువెడలినది. తీరభూమియందు తురకల బలము లతిశయముగ నుండుటచేత ప్రోలయ వేమ చోడభక్తిరాజాది సుప్రసిద్ధ నాయకులెల్లరు నత నికి బాసటయైనడచిరి మధ్యాంధ్రదేశమున (అనగా గోదావరీ కృష్ణానదుల నడిమిదేశమున) తురక లతో ఘోర యుద్ధము జరిగినది. తురకలు పరాజి తులై తెలింగాణమునకు బాఱిపోయిరి. దేశమును జాతీయ సైన్యము లాక్రమించుకొనెను. తరువాత గోదావరి యుభయతటములను సముద్రముమొదలు పాపికొండల పర్యంతము వ్యాప్తమైన సీమలను జయించి వశపఱచుకొనెను. దక్షిణమున కందుకూరి నుండి యుత్తరమున కళింగదేశ గడిసీమవఱకుగల తీరరాష్ట్రమంతయు జాతీయ నాయకుల యధి కారము క్రిందికి వచ్చినది. గోదావరీ తటమున మాల్యవంత పర్వత సానుప్రదేశముననుండు రేక పల్లిని నెలవు జేసికొని ప్రోలయ నాయడు మహ మ్మదీయులకడనుండి జయించిన దేశమును పాలింప సాగెను.

రెండవపాయ చాళుక్య సోమదేవరాజు నాధి పత్యముక్రింద పశ్చిమాంధ్రమును జయించుటకు బయలువెడలెను. ముహమ్మదు బిన్ తుఘ్లూకు కంపిలిరాజ్యమును గూలద్రోసినపుడు పశ్చిమాంధ్ర మును జయించి రెండు రాష్ట్రములను జోడించి యొక నూతన మండలము నేర్పఱచి, మల్లిక్ మహమ్మదను నతని నా నూతనమండలమునకు బాల కునిగ నియమించెను. కాని యారాష్ట్రప్రజలు అతని యధికారమునకు లొంగక పన్నుల నీయక తిరుగబడిరి. వారి తిరుగుబాటున కప్పు డాంధ్ర దేశమునంతటిని కలవరపెట్టుచుండిన జాతీయోద్య మమే ముఖ్యకారణము. జాతీయదళములతోగూడ సోమదేవరాజెత్తివచ్చుచున్నాడని తెలియవచ్చి నంతటనే ద్రాష్ట్రజనులందఱు నేకమై కలియ బలికి కొని తమరాష్ట్ర పాలకునిపై గత్తిదూసిరి. తుర కలధాటి కాగజాలక పర్వతములందు దాగియుం డినవారు మరల తలచూపిరి; సుల్తానునకు జడిసి తమ గ్రామములకును పట్టణములకును గప్పముకట్ట నియ్యకొనినవారు తిరుగబడిరి; ఇంతటనే సోమ దేవుడును వారిని గలిసికొనెను. నల్లగొండ సీమ లోని నాగులపాటినుండి జాతీయసైన్యముతో బయలువెడలి సోమదేవుడు కృష్ణా తటమునసె కూచి సేయుచు నందలి ముఖ్యదుర్గములగు సాతానికోట, కందనవోలు ముసలిమడు మొదలగు దుర్గములను బట్టుకొనెను. పైనెత్తివచ్చుచుండిన శత్రువు నరికట్టుటకు మల్లిక్ మహమ్మదు పలు మారు ప్రయత్న మొనర్చెను; కాని యొక్క పర్యాయమైనను జయము చేకూడలేదు. జాతీయ సైన్యములు పశ్చిమాంధ్రమునంతటి నాక్రమించు కొని కృష్ణాతుంగభద్రల మధ్యనుండు నంతర్వేదిపై నడచినవి. దిల్లీసుల్తానుపక్షమున పోరుచుండిన నాయకులనేకులు బందీకృతులైరి; కొంగ అసువు లను గోలుపోయిరి. అంచటి దుర్గములును సీమ లును సోమదేవుని చేజిక్కినవి. రాయచూరు హస్తగతమైనది; ముదిగల్లులోబడినది; అంతర్వేది యంతయు జాతీయ నాయకుల స్వాధీనమైనది అంతట వారిదళములు కృష్ణనుత్క్రమించి ఏత గిరిని స్వాధీనపఱచుకొనెను. రాజధాని యగు నానెగొందియొక్కటి తప్ప కంపిలి మండల మంతయు మరల హిందువులకు స్వాధీనపడెను. చిట్టచివర సోమదేవుఁడానెగొందికి ముట్టడివేసెను; మల్లిక్ మహమ్మదుకు ముట్టడిని భరించి నిలువగల శక్తి యెక్కడిది? ధనములేదు; పన్నులీయక ప్రజలు నిరాకరించిరి; ధనమునెట్లో సంపాదించు కొన్నను ఆహారపదార్థములు దుర్లభములాయెను; వెలుపటినుండి యాహారపదార్థములను లోనికి జొరనీయక సోమదేవు డరికట్టెను. మల్లిక్ మహ మ్మదు తన దుస్థితికి వగచి సోమదేవునికి దన

తబేలాయందలి గుఱ్ఱముల నాఱువేలను సమర్పించి సంధిచేసికొనెను.

ఆంధ్రనాయకుల విజయము ద్రావిడదేశమున కలవరము గలిగించెను. ఈ కలవరము జనసామాన్యమునందు గలిగిన జాతీయప్రబోధము వలన పొడమినదికాదు ఢిల్లీసుల్తాను పక్షమున మధురరాజ్యమును పాలించుచుండిన అధికారి సయ్యదుజలాలను నతనికి స్వతంత్రుడు కావలయు నని బుద్ధి పుట్టినది. స్వతంత్రులైన ఆంధ్ర నాయకులను జయించినకాని సుల్తాను మధురపై నెత్తివచ్చుటకు వీలులేదు; సుల్తానాంధ్రనాయకులను జయించుట సులభసాధ్యముగాదు. కావున నతడు స్వామిభక్తిపరాయణులైన సుల్తాను సేవకులనందఱిని కృత్రిమముగ వధించి సుల్తాన్ జాలాలుద్దీన్ అహసన్‌షా యను బిరుదనామము ధరించి స్వతంత్రుడాయెను.

జాతీయోద్యమ మింతవఱకును జయప్రదముగ సాగినది. తీరాంధ్రభూమియంతయు జాతీయవాదులకు వశమైనది; పశ్చిమాంధ్రము కృష్ణా తుంగభద్రల యంతర్వేదితో గూడ జయింపబడినది; మహమ్మదీయు లన్నియెడలను పరాజయమునంది తమ యేలుబడియందుండిన సీమలను హిందువుల కప్పజెప్పియోసరిలిరి. కాని జాతీయనాయకులు దలపెట్టిన కార్యమింకను ముగియలేదు. ఆంధ్రదేశమునకు హృదయమువంటి తిలింగమింకను మహమ్మదీయుల యధికారముక్రిందనే యుండెను; మఱియు మహమ్మదీయుల మూలబలము నింకను నాంధ్రనాయకులు దారసిల్లలేదు. వారంతవఱకు జయించిన మహమ్మదీయబలములన్నియు సుల్తానాయా మండలములను సంరక్షించుటకొఱకు వెనుకడించిపోయిన స్థానికదళములే. హిందువుల తిరుగుబాటును మండలాధిపతుల యోటమియు రాజ్యనష్టమును చెవిసోకగనే తన యధికారమును మరల నెలకొల్పుటకు ప్రచండసైన్యముతో సుల్తాను రాకపోడు. కావున భాషాకార్య నిర్వహణమెట్లు సాగింపవలయునను సమస్య కాంధ్రనాయకులు సమాధానం వెదుకవలసి యుండినది.

ఈ సమయమున యావద్దక్షిణదేశ భవిష్యచ్చరిత్రను మార్చివేయగల చరిత్రాంశములు రెండు సంభవించినవి; క్రీ. శ. ౧౩౩౦ ప్రాంతమున నాంధ్ర నాయకసమితి కధ్యక్షుడగు ముసునూరి ప్రోలయ నాయకుడు మృతినందెను. అతనిస్థానమున నతని తమ్ముని కుమారుడు కాపయనాయకు డాంధ్ర నాయకసంఘమున కధ్యక్షుడాయెను. కాపయ నాయకు డఖండప్రతిభాశాలి; తన పెదతండ్రికంటె నన్నివిషయములం దధికుడు. ప్రోలయ నాయకుడు గొప్పశూరుడు; నేర్పరియైన దక్షనాయకుడు; కాపయనాయకు డీ గుణములందు ప్రోలయను మించినవాడు. ప్రోలయనాయకుని రాజకీయదృష్టి సంకుచితమైనది. ఆంధ్రదేశపు నాలుగుచెరగుల నది దాటలేదు. కాపయనాయకునిదృష్టి విశాలమైనది. యావద్దక్షిణ భారతము నది యాకళించుకొనినది మఱియు నతనికి రాజకీయరంగమున ముందు జరుగ బోవు విషయములను గ్రహించి వానివలన గలుగ బోవు నాపదలను ప్రతిహతము సేయగల యెత్తు గడలువేయు శక్తి సామర్థ్యములు గలవు.

కాపయ యాంధ్రనాయకసమితి కధిపతియైన పిమ్మట నతడు సత్వరముగ సేయవలసిన ముఖ్య కార్యములనుగూర్చి చింతింపగడగెను మొదటిది తెలింగాణముయొక్క దాస్యవిముక్తి. అది సులభమైన కార్యముగాదు. తీరదేశమునుండి పాఱిపోయిన తురకలంద ఱచట గుమిగూడి యుండిరి. వారికి తోడు సుల్తాను స్వయముగ రాజాలకపోయినను బలవత్తరములైన సైన్యము లంపగలడు. తాత్కాలికముగ దన కచటనచట జయము గలిగినను సుల్తాను ఉపపత్తియెక్కడ తా నెక్కడ? అతనికి గల కోశలబలసంపదలు తన కెక్కడివి? కాని తెలింగాణమును స్వాధీనపఱచుకొనుటకును ఆంధ్రస్వాతంత్ర్యమును స్థిరముగ నిలబెట్టుటకును మార్గము లేక పోలేదు; దాక్షిణాత్య హిందువు లందఱు నేకమై తురకలకు మాఱొడ్డి నిలిచినవారు దక్షిణదేశమును త్యజించిపోక తప్పదు. అప్పుడొక యాంధ్రులకేకాని దక్షిణ భారతీయ హిందువుల కందఱికిని స్వాతంత్ర్యము జేకూడగలదు; కాని మిగిలియుండిన దక్షిణ హిందూరాజులలో నెల్ల గొప్పవాడను బలవత్తరు

డును నగు హొయ్సలరాజు ముమ్మడి బల్లాళుని సానుభూతియు సహాయమును లేక తాను దలపెట్టిన యుద్యమము కొనసాగదని యతడు గుర్తించెను; కావున కాపనాయకుడు స్వయముగ బల్లాళరాయలను గలిసికొని యతనితో విషయమును జర్చించి నచ్చజెప్పినగాని కార్యసాధనగాదని నిశ్చయించి ద్వారసముద్రమునకు బయలు వెడలిపోయి యతని దర్శించెను. అచ్చట జరిగిన చర్చలకు ఫలితముగ వారిరువురి యభిప్రాయము లేకమై యొడంబడిక కుదిరినది. దీని ఫలితార్థమేమనగా,—మొట్టమొదలు బల్లాళరాయలు వనరాజ్యపుటుత్తర గడిదేశమున ఢిల్లీసైన్యములు వచ్చుమార్గములను దెలవీడు గావించుకొని తురకలను సాగిరానీయక మరలు టకు గావుండవలయును. మఱియు గాపనాయకునకు తురకలను దెలింగమునుండి వెడలగొట్టి దేశమును స్వాధీనపఱచుకొనుటకు సైన్యసహాయము సేయవలయును. ఈ రెండు కార్యములును ముగిసిన పిమ్మట ఉత్తరమునుండి కాపనాయకుడును బశ్చిమమునుండి బల్లాళుడును నేకకాలమున ద్రావిడ దేశమును ప్రవేశించి తురకలను బాఱదోలి వారికి పాదాక్రాంతులై యుండు నాదేశపు రాజును దాస్యమునుండి విముక్తుని గావింపవలయును. ఈ యొడంబడికవలన ముమ్మడి బల్లాళుడు సర్వదాక్షిణాత్య హిందూ స్వాతంత్ర్యసంఘమున కధిపతి యాయెను. అటుమీద హిందూ స్వాతంత్ర్య సమరమును నడపుభారమంతయు నతనిపై బడినది. కాపనాయకుడు తిలింగమును సాధించుటకు వలసిన మిత్రబలమును సంపాదించుకొనెను.

మఱియొక విశేషము కంపిలికి సంగమరాజపుత్రుల పునరాగమనము. సోమదేవరాజున కోడి సంధిగావించుకొన్నను మల్లిక్ మహమ్మదు కంపిలి రాజ్యమును విడిచిపెట్టిపోలేదు. శత్రువుల యుద్రేకమును దన శక్తిహీనతను విశదపఱచుచు సమర్థు నొక్కని కంపిలిరాజ్యమునకు పాలకునిగా నియమింపవలయునని యతడు సుల్తానునకొక విజ్ఞాపన మంపి యతనియాజ్ఞ కెదురుచూచుచుండెను. ఆ విజ్ఞాపనయందగనే సుల్తాను దన యాప్తమంత్రివర్గమును బిలిపించి సభగూర్చి విషయమును వారికి దెలియజెప్పి వారిసలహా నడిగెను. మల్లిక్ మహమ్మదు లాతివాడగుటచే దన యధికారముక్రింది ప్రజల స్వభావమును గుర్తెఱిగి వారిని లోబఱచుకొన జాలకపోయెననియు, వారితత్వమెఱిగిన స్థానికుని విశ్వాసపాత్రుని వారిపై బాలకునిగ నియమించుట యుక్తమనియు వారు సలహాచెప్పిరి. వారి యభిప్రాయము నంగీకరించి సుల్తాను కంపిలి వాస్తవ్యునొక్కని యా రాష్ట్రమునకు బాలకునిగ నియమించుట మేలని నిశ్చయించి యా పదవికి దగిన వాడెవ్వడని విచారింపగడగెను. కంపిలి దేశస్థులనేకులప్పుడు ఢిల్లీయందు ప్రవాసముండిరి. ఆనెగొంది, సుల్తాన్ మహమ్మదు బిన్‌తుఘ్లూకునకు స్వాధీనపడినపుడు కంపిలి రాజపుత్రులు కొందఱును, హరిహర బుక్కాది యాశ్రితులనేకులును సుల్తాను చేజిక్కిరి. వారిని బంధించి సుల్తాను దనవెంట ఖైదీలుగ ఢిల్లీకి గొంపోయెను; కొంతకాలమైన పిమ్మట వారికి మహమ్మదీయమత దీక్ష నిప్పించి చెఱనుండి వదలిపెట్టి తన కొలువునందుద్యోగములనిచ్చి సంరక్షించుచుండెను. వారిలో నెవ్వానిని కంపిలిరాష్ట్రమున కధిపతిగ నియమించుట యుక్తమో విచారింపగడగెను. కంపిలి రాజపుత్రుల ప్రస్తాపమాత డెత్తుకొనలేదు. కారణము తెలియదు; కాని యూహించుటకు దుస్సాధ్యముగాదు. దేశమందు వారికి పలుకుబడి యుండుట వాస్తవమే; కాని వారు స్వతంత్రులగుటకు ప్రయత్నపడిన, పూర్వరాజకుటుంబముపై గల యభిమానాదారములవలన జనులు వారికి ప్రాపై నిలువవచ్చును; కావున వారిని నియమించుట శ్రేయస్కరముగాదని తోచియుండును. ఈకారణమువలన నన్యులను నియమించుటయె యుక్తమని యతనికి దట్టియుండవలయును. వితర్కించి వితర్కించి తుదకు సంగమ రాజపుత్రులను రాష్ట్రపాలకులనుగ నియమించుట మేలని నిశ్చయించుకొనెను. కంపిలి రాజకుటుంబముతో వారికి సంబంధమున్నను, రాజపుత్రులవలె వారు ప్రజల యాదరాభిమానములకు గురి కాజాలరు; దాక్షిణాత్యులైనను కంపిలి దేశస్థులుగారు. వారికి గంపిలి దేశపాలనయం దనుభవముగలదు; జనుల స్వభావమును చక్కగ గుర్తెఱుగుదురు; వారికి స్థానబలము తక్కువ యగుటవలన నెల్లప్పుడును తన బలముపై నాధారపడి

యుందురు అని నిశ్చయించి సుల్తాను హరిహరుని తమ్మునితోగూడ సముఖమునకు బిలిపించి సత్కరించి కంపిలికి మండలేశ్వరులనుగ నియమించి కొంత సైన్యమును దోడిచ్చి పంచెను.

హరిహరుడు తమ్మునితోగూడ కంపిలిరాజ్యమును జేరెను. మల్లిక్ మహమ్మదతనికి మండలాధిపత్యము నప్పగించి ఢిల్లీకి బయనమైపోయెను; కాని పండన్నంటనె నోరు తియ్యగాకపోయినట్లు మండలాధిపత్యమును బొందినంతటనె యధికారము చేతికి రాదాయె. కంపిలి మండలమంతయు జాతీయ నాయకుల వశమై యుండినది. నూతన మండలాధిపుని యధికారము నంగీకరించ నిష్టపడు వారెవ్వరును లేరు; కావున తమ యధికారమును నెలకొలుపుటకు హరిహర బుక్కరాయలకు ప్రథమమునుండియు యుద్ధమె కర్తవ్యమాయెను.

ఢిల్లీనుండి కంపిలిరాజ్యము నేల గ్రొత్తమండలేశ్వరులు వచ్చిరను వార్త తెలియవచ్చినంతటనె దేశీయనాయకులు దమ సేనలను గూర్చుకొన నారంభించిరి. కాపయనాయకునితో జేసికొనిన యొడంబడిక మేఱకు ముమ్మడి బల్లాలరాయలు సహాయార్థము దండుతో గదలివచ్చి జాతీయదళములను గలిసికొనియెను. ఇరుపక్షములవారికిని తుంగభద్రాతటమున యుద్ధము నడచెను; హరిహర బుక్కరాయలు జాతీయసైన్యములధాటి కోర్వక యోడియూ సమీప సాంద్రారణ్యమునందు తలలు దాచుకొనిరి.

కంపిలి స్థితిగతు లిట్లుండగా సుల్తాను ఢిల్లినుండి మహాసైన్యముతోగూడ మధురా రాజ్యముపై దండయాత్ర వెడలెను. మధురా రాజ్యపాలకుడగు జలాలుద్దీన్ అహసన్‌షాహు సుల్తానును దిరస్కరించి తన స్వాతంత్ర్యమును ప్రకటించుకొనెను గదా. అతని నణగగొట్టి మధురా రాజ్యమును స్వాధీనము జేసికొనుటకై తన సేనల నా దేశమునకు రెండు పర్యాయము లంపి యుండెను. కాని యా సేనలు మధురా రాజ్యమును ప్రవేశించగనే యహసన్‌షాహుతో యుద్ధముసేయుటకు బదులతనిగూడి సుల్తానుతో ప్రతిఘటించెను; కావున దండును స్వయముగ సుల్తానే నడపుకొని రావలసివచ్చెను. త్వరత్వరగ కూచిచేసి సుల్తాను సైన్యముతోగూడ వచ్చి మోరుగల్లు జేరి యచట నొక నెలరోజుల వఱకు నాగియుండెను. దేవగిరినుండి చక్కని మార్గమున మధురకుబోవక యత డోరుగంటి మార్గము నేలబట్టెనో తెలియదు. ఆంధ్రనాయకులతో బోరుట కత డామార్గమున నడచి యుండిన నుండవచ్చును. ఏ యుద్దేశముతో నత డోరుగంటికి వచ్చియుండినను అందువలన నతనికి చేటుకలిగినది. సుల్తానచటికి వచ్చినప్పటికిచట మారి మసగియుండినది; పట్టణపుగాలి సోకగనే మారి స్కంధావారమును ప్రవేశించినది. అమ్మవారి రౌద్రము రానురానతిశయించి వేలకొలది తురకభటుల జీవము నాహుతిగొనసాగినది. ఎచట జూచినను జాడ్యగ్రస్తులైన తురకభటులే. నిలచినవారు నిలువున జచ్చిపడిరి; చచ్చినవారి శవముల నెత్తి యంత్యక్రియలు సేయువారు లేకపోయిరి. వైద్యులు లేరు. మందు లేదు. ఢిల్లీసైన్యమున ముప్పాతిక పాలిట్లు నశించినది. అనేకులు ప్రముఖులును నమీరులును మడిసిరి. తుదకు సుల్తానుకే మారి సోకినది; మృతినందునను భయమందఱికిను గలిగినది; కాని చిట్టచివరకు వ్యాధి తిరుగుముగమైనది. అంతట సుల్తాను దండయాత్రను జాలించి ఢిల్లీకి వెనుదిరిగి పోనిశ్చయించుకొనెను. పయనము వెడలుటకు పూర్వము పరిపాలనా సౌకర్యార్థము కొఱకు పూర్వ పశ్చిమములను రెండు భాగములుగ తెలింగాణమును విభజించి, పూర్వ తెలింగాణము నోరుగంటినుండి మల్లిక్ మక్బూలను నాంధ్ర మహమ్మదీయుడును పశ్చిమ తెలింగాణమును నుస్రత్ ఖానుడను నాఫ్ఘానుడును పాలించునట్లేర్పాటు గావించి సుల్తానచటినుండి తరలి దేవగిరిమీదుగ ఢిల్లీకి పోయెను.

సుల్తాన్ మహమ్మదుదండయాత్ర వలన తుఘ్లూకు సామ్రాజ్యముయొక్క పాదుగదలి సంధులు సడలినవి. ఢిల్లీసైన్యమందు విశేషభాగము ఓరుగల్లున మారియందు సమసిపోవుటవలన కేంద్రప్రభుత్వముయొక్కబలము సన్నగిలినది; సుల్తాను తనయధికారమును దొలగద్రోసి స్వాతంత్ర్యస్థాపనకు గడగిన నాయకులను రాష్ట్రాధిపతులను నణగ

గొట్టజాలక భగ్నమనోరథుడై వెనుదిరిగిపోవలసి వచ్చినందున నతని పరువు ప్రతిష్ఠలు డిందువడినవి. ఉత్తరహిందూస్థానమునందంతటను నల్లరులు రేగినవి. దక్షిణ భారతము ఢిల్లీ సామ్రాజ్యమునుండి వేర్పడి యనేక నూతన స్వాతంత్ర్యరాజ్యములకు జన్మస్థానమైనది. జలాలుద్దీన్ అహసన్ శాహు యొక్క స్వాతంత్ర్యము మధురరాజ్యమున స్థిర పడినది; ఆంధ్రనాయకుల భయము తీరినది. కాపయ నాయకుడు హోయ్సల బల్లాళుడు సాయమంపిన సైన్యములతోగూడ తెలింగాణముపై దండెత్తి ఢిల్లీ సేనల నోడించి తఱుమగొట్టి దేశము నాక్రమించు కొనెను. జాతీయదళముల ధాటి కాగజాలక మల్లిక్ మక్కూలు పరారి చిత్తగించి ఢిల్లీ మార్గమును బట్టెను. ఓరుగల్లు కాపయ నాయకునికి హస్తగత మాయె; స్వతంత్రాంధ్రరాజ్యమునకు రాజధాని యాయె.

దక్షిణ భారతదేశమునందలి అన్నిప్రాంతము లను బోలి కంపిలి రాజ్యమందును రాజకీయ పరి స్థితులు మారినవి. ఇచట నొక నూతన స్వతంత్ర హిందూరాజ్య మేర్పడినది. తక్కిన ప్రాంతముల కంటె కంపిలియందు కొంత భేదము గానవచ్చు చున్నది. ఇచట స్వతంత్రరాజ్యమును స్థాపించిన వారు జాతీయనాయకులుగారు; వారు సుల్తాను ముహమ్మదుచే కంపిలి రాష్ట్రపాలకులుగ నియ మింపబడిన సంగమ రాజపుత్రులు. ఢిల్లీనుండి కంపిలిరాజ్యమునకు వచ్చిన పిమ్మట తుంగభద్రా తటమున సోమదేవరాజు మున్నగు జాతీయనాయ కులతోడను వారికి ప్రాపువచ్చిన హోయసల బల్లాళ రాయల సైన్యములతోడను బోరి పరాజితులై పాటిపోయిరికదా. మఱి వారెట్లు స్వతంత్రరాజ్య మును స్థాపింపగలిగిరో విచారించవలసియున్నది. వారు అరణ్యమున సంచరించి తుదకు తుంగభద్రా తీరమున పంపాక్షేత్రమునందు తపము గావించు చుండిన విద్యారణ్య మునీశ్వరుని ఆశ్రయించిన గాని తమకు మేలుగలుగదని నిశ్చయించి యచటికి బోయిరి. సన్యాసి నాశ్రయించిన నతనివలన నేమి లాభము చేకుఱునని యెంచి వారచటి కేగిరనుసవా లొకటి రావచ్చును. ఈ సందర్భమున స్మరణయం దుంచుకొనదగిన ముఖ్యాంశములు రెండు గలవు. ఒకటి, విద్యారణ్యుడు సన్యాసియేకాని, శృంగేరి యద్వైతమఠాధిపతియగు విద్యాతీర్థులకు ప్రియ శిష్యుడు; శృంగేరి మఠము ఆది శంకరులు స్థాపిం చినది; అద్వైతమఠముల కెల్ల నాదిపీఠము; కావున శృంగేరిమఠాధిపతి ఆదిశంకరులవారి ప్రతినిధి; మఱియు నత డాదిశంకరుల యవతారమని లోక ప్రతీతి. శృంగేరి పీఠాధిపతి జగద్గురువు. అప్పటి మాండూప్రపంచమున శృంగేరి జగద్గురువునకు గల పలుకుబడి మఱి యే మతాచార్యునకు లేదు. ఆయనకు విద్యారణ్యుల యెడగల గౌరవాభిమాన ములవలన సర్వవిషయములందును విద్యారణ్యుల సలహా ననుసరించియే కార్యనిర్వాహణ మొనర్చు వాడు; కావున విద్యాతీర్థులవలన నేయర్థము నేనియు బొంచగోరువారు విద్యారణ్యులవారి నాశ్రయించవలసి యుండెడిది. రెండవది, సుల్తాన్ ముహమ్మదుచే గంపిలిరాష్ట్రమున కధిపతులుగ నియమింపబడినప్పుడు హరిహర బుక్కలిరువురును మతమునందు మహమ్మదీయులు. హిందూ జాతీ యోద్యమముచే నుద్రిక్తమైన దక్షిణభారతమున మహమ్మదీయులకు దావులేదు; మఱియు వారిరు వురు హిందూజన కంటకుడైన సుల్తాన్ మహమ్మ దునకు ప్రతినిధులుగ రాష్ట్రపాలనము సేయవచ్చిన వారు. యుద్ధమున జాతీయ నాయకులచే నిర్జితులై పదభ్రష్టులైనవారు. అప్పటి పరిస్థితులందు తమకు జయము సంశయాస్పదమని వారు గుర్తించిరి. మఱియు, ఢిల్లీనుండి సహాయమువచ్చునను నాసకు గూడ నెడములేదు.

ఈ విషమావస్థయందు వారు తమ భవిష్య జీవనప్రవృత్తిని నిర్ణయము జేసికొనవలసి వచ్చినది. రాజ్యకాంక్షకు స్వస్తిచెప్పి మల్లిక్ మక్కూలువలె ఢిల్లీయందు సుల్తాను దర్బారును జేరబోవుటయో, లేక స్వీకృత మహమ్మదీయమతమును విసర్జించి హిందూధర్మము మరల నవలంబించి నష్టమైపోయిన ప్రభుత్వాధికారమును మరల సంపాదించుటయో యవశ్యము కర్తవ్యమైనవి. ఢిల్లీకి మరలిపోవుట వారికి నచ్చలేదు; మహమ్మదీయులతో వారికి పొత్తు కుదురలేదు; బలాత్కారముపై నవలంబించవలసి

వచ్చిన ఇస్లాముపై వారికి భక్తికలుగలేదు; కావున నిస్లామును విసర్జించుటకును ననాది సిద్ధమైన హిందూధర్మమును మరల స్వీకరించుటకును వారు నిశ్చయించిరి. కాని ఇచ్ఛామాత్రమున వారి మనోరథమును సిద్ధించునదికాదు. ఇతర మతములవారిని గలుపుకొనుటకును పతితులను మరల జేర్చుకొనుట కును హిందూమతమునందవకాశములేదు. స్మృతు లిట్టిమార్పు నంగీకరింపవు; కాని కాల విపర్యాస మున కనుగుణముగ సంఘసంరక్షణార్థ మిట్టి మార్పు లావశ్యకము లాయెను. కాదాచిత్కముగ బలా త్కారమువలన నన్యమతదీక్షను బుచ్చుకొనిన వారికి సంఘ పురోవృద్ధిపై దృష్టిగల విశాలహృద యులైన మతాచార్యుల సంస్కరణల మూలమున హిందూమతములోనికిపునఃప్రవేశముగలుగుచువచ్చి నది. విద్యారణ్యులవారి సహాయమువలన దామును దమ పితృ పైతామహమైన హిందూమతమున మరల జేరవచ్చునను నాసతో సంగమ రాజ కుమారు లిద్దఱును పంపాక్షేత్రమునకు వెడలిరి.

విద్యారణ్యస్వామి వారి కాశాభంగము గలి గించలేదు. ఆయనవంటి విశాల హృదయుడైన సన్యాసి యీయుగమున మఱియొకడు గానరాడు. శాస్త్రవిజ్ఞానమున నాతని మించినవా రెవ్వరును లేరు; అద్వైత వేదాంతమున మొదటి బంతిలోని వాడు; సర్వకళావిశారదుడు; సర్వతంత్ర స్వతంత్రుడు; రాజ్యతంత్ర పారంగతుడు. ఈ గుణ ములన్నియు గొంచెమో గొప్పయో యన్యుల యందును గానరావచ్చును; కాని యతని విశిష్టత మ్లేచ్ఛదోషావసన్నమై సమసిపోవ సంసిద్ధమై యుండిన సనాతన హిందూధర్మమును పునరుద్ధ రింపవలయునను దృఢసంకల్పము. కాని రాజకీయస్వాతంత్ర్యము లేక హిందూధర్మమును పునరుద్ధరించుట దుస్సాధ్యమని యతడెఱుగును. మఱియు విద్యారణ్యుల వా రాంధ్రదేశములోని ములకనాడు వాస్తవ్యుడైనకారణమున నప్పు డాంధ్రదేశమును ముంచుకొనియుండిన జాతీయాభి మానమతని హృదయాంతరాళమున నిండుకొనినది. కావున సంగమరాజపుత్రులయెడ సానుభూతిచూపి వారిని దనశిష్యకోటియందు జేర్చుకొని వారి మూల మునదక్షిణభారతమునుండి తురకలనుసంపూర్ణముగ దఱిమివేసి హిందూధర్మమునకు నూతనాభ్యుదయ మును గల్గింపవలయునని నిశ్చయించుకొనెను; కాని తలపెట్టిన కార్యము సులువైనదికాదు. తన గురువును ఒప్పించవచ్చును; పండిత లోకమునకు నచ్చజెప్పి వారి సహకారము బడయవచ్చును; కాని తురకలచే నీతిబాధలుపడిన జనసామాన్య మును సమాధానపఱచుట కష్టతరము. సంగమ రాజపుత్రులు హిందూసంఘమున మరల జేరుటకు వారి కాక్షేపము లేకపోవచ్చును; సుల్తాను ప్రతి నిధులుగవచ్చిన వారి ప్రభుత్వమును మాత్రము వా రంగీకరింపరు. వారిని సమాధానపెట్టుటకు విద్యా రణ్యులొక క్రొత్త మార్గమును గనిపెట్టిరి. పూర్వము ఇక్ష్వాకువంశప్రభువు హరిశ్చంద్రుడు దక్షిణ దేశమునకు యాత్ర వచ్చినప్పుడు పంపా క్షేత్రమున విరూపాక్షస్వామిని దర్శించి దక్షిణ దేశమునంతటిని యా దేవునికి ధారాపూర్వకముగ దత్తముజేసెనను గాథయొకటి ప్రచారమున నుండెను. ఈ గాథ నాధారపఱచుకొని విద్యా రణ్యులు దక్షిణభారతదేశమున కంతటికిని పంపా విరూపాక్షస్వామి వారొడయలని ప్రకటించిరి. కాని హరిశ్చంద్ర దత్తమైన భూమియంతయు నన్యుల స్వాధీనమందుండినది. చాలభాగము మధురసుల్తాను యేలుబడిక్రిందను, కొంతభాగము బల్లాళరాయలు మొదలయిన హిందూరాజుల స్వాధీనమునను నుండెను. ఈ రాజ్యమునంతటిని వశపఱచుకొనవలసి యుండెను. శక్తిసామర్థ్యములు గల శూరుల సహా యమువలనగాని యా కార్యము నెఱవేరదు; కావున దేవునిపేర నా రాజ్యమును జయించుటకును జయించిన రాజ్యమును పాలించి ప్రజాసంరక్షణ సేయుటకును హరిహరబుక్కరాయలను ప్రతినిధు లుగ నియమించుటకు నిశ్చయించెను. కాని గురువు గారి సమ్మతిలేక యేకార్యమును తుదముట్టజరుగదు! కాబట్టి విద్యారణ్యులు మొదట విద్యాతీర్థులవారికి తనయభిప్రాయమును విశదపఱచి వారి యంగీకార మునుబడసి హరిహరబుక్కలను విధ్యుక్త కర్మల నాచరించి హిందూమతమున గలుపుకొని విరూ పాక్షస్వామిపేర గంపిలిరాజ్యమును పాలింప నియ

మించెను. విద్యారణ్యులొనర్చిన సంవిధానమును కంపిలిరాష్ట్ర ప్రజలును దొరలును ఒప్పుకొని హరిహర బుక్కరాయల యాధిపత్యము నంగీకరించిరి. ఈ యేర్పాటంతయు నాచరణకు దెచ్చుటకు క్రీ. శ. ౧౩౩౬ వ సం. ఏప్రిలు ౧౮-వ తేదినాడు రాజ్యాధిపతియగు పంపావిరూపాక్ష దేవుని సన్నిధి యందు విక్రమాదిత్యుని వజ్రసింహాసనముపై హరిహరరాయలకు పట్టాభిషేకము నడచెను. ఆ శుభ ముహూర్తముననే విరూపాక్షస్వామి యాలయము చెంత విజయనగరమను నూతనరాజధాని నిర్మాణమునకు శంకుస్థాపన జరిగినది. ఇట్లు విద్యారణ్యులు రాయసింహాసనమును స్థాపించి రాయసామ్రాజ్యమునకు బునాది వేసినందున ఆయనకు విజయనగర సామ్రాజ్యస్థాపనాచార్యుడను బిరుదు గలిగెను. విద్యారణ్యుల కృషిమూలముననే విజయనగరము నిర్మాణమగుటవలన దానికి విద్యానగరమను నామాంతరము గలిగెను. దాదాపు మూడు శతాబ్దములకు పైబడిన కాలము యావద్దక్షిణ భారత దేశమును మహావైభవముతో పాలించిన రాయ సామ్రాజ్యమిట్లుత్పత్తియైనది.

విజయనగర సామ్రాజ్యచరిత్రను బఠియించు వారెల్లప్పుడును జ్ఞప్తియం దుంచుకొనవలసిన విషయమొకటి కలదు. సామ్రాజ్యమునకు వాస్తవమైన యధిపతి పంపావిరూపాక్షస్వామి. అది యా దేవుని సొమ్ము. హరిహరాది రాయపీఠస్థులందరు దేవునిపేర దేవాలయభూములను పాలించుపారుపత్యకాండ్రు. దేవుని కార్యములను నిర్వహించు సేవకులు. కావుననే రాజశాసనములను ధర్మశాసనములు రాయల సంతకముతోగాక శ్రీవిరూపాక్ష స్వామివారి సంతకముతో ప్రకటింపబడుచువచ్చినవి. రాయలొనర్చు దానధర్మాదులన్నియు విరూపాక్ష స్వామివారి సన్నిధానమునసే జరుగుచు వచ్చినవి; నూతన రాజధానియగు విద్యానగరము విరూపాక్ష స్వామివారి కోవెలకు సమీపమున నిర్మింపబడినది.

సంగమవంశము

మొదటి హరిహరరాయలు

(క్రీ. శ. ౧౩౩౬—౧౩౫౬)

విజయనగర శంకుస్థాపనతోడను మొదటి హరిహరరాయల పట్టాభిషేకముతోడను విజయనగర సామ్రాజ్య చరిత్ర ప్రారంభమైనది. ఆంధ్రకర్ణాట దేశములకూడలియందు సంస్థాపితమగుటచే నాద్యమునుండియు ఉభయప్రజలకును సంగమస్థానమై వెలసినది; ఉభయుల ప్రయత్నమువల్లనే పెంపందినది. ప్రారంభదశయందు విజయనగరమొక చిన్న సంస్థానము. క్రీ. శ. ౧౩౩౬ లో హరిహరరాయల పట్టాభిషేకకాలమునం దతని యాధిపత్యముక్రింద నుండినరాష్ట్రముయొక్క వైశాల్యము స్వల్పము. కర్ణాటకమున బళ్లారి చిత్రదుర్గకడూరు శివమొగ్గ ధార్వాడజిల్లాలును ఆంధ్రదేశమున రాయచూరు కర్నూలు అనంతపుర కడప కోలారు జిల్లాలును నెల్లూరు చిత్తూరుజిల్లాలో విశేషభాగమును నతని యధికారమునకులోనై యుండినవి; ఈ రాష్ట్రమంతయు హరిహరరాయలకెట్లు స్వాధీనమాయెనో తెలియదు. జయించిన క్లేచ్ఛటను జెప్పి యుండలేదు. ఒకవేళ హరిహరరాయలను సుల్తాను మహమ్మదు బిన్ తుఘ్లూకు కంపిలి మండలమునకు పాలకునిగ నియమించుటకు పూర్వమే యీ రాష్ట్రమంతయు నామండలాంతర్గతమై యుండెనేమో? ఎట్లతనియాధిపత్యముక్రిందికి వచ్చినను నది యంత విస్తారమైనదికాదు. కాని యచిర కాలముననే రాజ్యము విస్తరించుట కారంభించినది. క్రీ. శ. ౧౪ వ శతాబ్దాంతమునకు కృష్ణ మొదలు రామసేతువుపర్యంతముగల యావద్దక్షిణదేశమును రాయల యేలుబడి క్రిందికి వచ్చినది. చిన్న సంస్థానముగనుండిన విజయనగరము పెద్ద సామ్రాజ్యముగ మారి భరతఖండములో హిందూరాజ్యముల కన్నిటికంటెను బల్లిదమాయెను.

ఈ పరిణామమెట్లు కలిగెనో గ్రహింప వలయుననిన నప్పటి దాక్షిణాత్య రాజ్యములను గూర్చియు, రాజకీయ పరిస్థితులను గూర్చియు నత్యంత సంగ్రహముగనైన గొంత తెలిసికొనవలసి యున్నది. దక్షిణభారతమున తుఘ్లూకు సామ్రాజ్యము విచ్ఛిన్నమైపోయి పెక్కు నూతన స్వతంత్రరాజ్యము లేర్పడినను, తుఘ్లూకుచక్రవర్తులు రాజ్యనష్టమున కియ్యకొని తమ సార్వభౌమపదమును విసర్జించలేదు. ఎప్పుడు సుల్తాను మరల సైన్యములను గూర్చుకొని వచ్చి తన యధికారమును యథాపూర్వము పునఃప్రతిష్ఠ సేయగడగునో యను భయమెల్ల వారి హృదయములను కలవరపెట్టుచుండినది. కాని సుల్తానుపై దిరుగబడి స్వతంత్రులై క్రొత్త రాజ్యములను నెలకొల్పిన ప్రభువులేమి, మహమ్మదీయ దండయాత్రలలో గూలిపోక నిలిచియుండిన ప్రాచీన హిందూ రాజ్యాధిపతులేమి యైకమత్యములేక యొండొరులతో బోరుచుండిరి. ఈ రాజ్యములతో విజయనగరాధిపతులు దఱచుగ యుద్ధముల జేయవలసి యుండెను. విషయము సుబోధమగుటకొఱకీ రాజ్యముల నిట సంగ్రహముగ వర్ణించుట యుక్తము.

తెలింగాణము : విజయనగరమునకు పూర్వ దిగ్భాగమున నాంధ్ర రాజ్యము లుండినవి. ఐకమత్యముపల్లనే తాము మహమ్మదీయులను నిగ్రహించి స్వాతంత్ర్యమును బడయగలిగితిమను సంశయము నాంధ్రనాయకులు సత్వరము మఱచిరి. తమ యాధిక్యమును ప్రకటించుటకొఱకును రాజ్య వైశాల్యములను విపులీకరించుటకొఱకును వారొండొరులతో బోరగడగిరి. ఆంధ్రనాయక రాజ్యములలో ముఖ్యమైన వానిని మాత్ర మిట బేర్కొనిన జాలును. తొలుత నెన్నదగినది యోరుగంటి రాజ్యము. ఆంధ్రనాయక సమితి కధ్యక్షుడైన ముసునూరి కాపయనాయకుడు దీని కధిపతి. ఆంధ్రనాయకులలో నెల్ల నితడు బలవత్తముడు. తెలుగుదేశమున జాలభాగ మితని యేలుబడిక్రింద నుండెను. కాని యితని యధికారము గృష్ణకు దక్షిణమున జెల్లలేదు. 'ఆంధ్రదేశాధీశ్వర,' 'ఆంధ్ర సురత్రాణ' మున్నగు నితని బిరుదులనుబట్టి చూడగా నితడు ఆంధ్రదేశమునకంతటికిని దానె యధిపతియని ప్రకటించుకొని నట్లున్నది. కాని యితని యాధిపత్యము ననేకు లొప్పుకొనలేదు. నల్లగొండ జిల్లాలోని రాజుకొండ ప్రాంతమున బాలించుచుండిన వెలమలతనికిలొంగరైరి. వారి ప్రభువు రావుసింగమనీడు రాజ్యతృష్ణగల దొర. అతడు చుట్టుప్రక్కలనున్న చిన్న చిన్న ఱత్రియ సామంతులను గూలద్రోసి వారి దుర్గములను రాష్ట్రములను ఆక్రమించి స్వతంత్రరాజ్యమునకు బునాదివేయనారంభించెను. కావున వెలమలతో గాపయనాయకునికి పోరాటము తప్పకపోయెను.

రెడ్డిరాజ్యము : వెలమలవలె రెడ్లును గాపయనాయకునితో బ్రతిఘటించిరి. వీరి ప్రభువు ప్రోలయ వేమారెడ్డి ముసునూరి ప్రోలయనాయకుని సహాయులలో ముఖ్యుడు. తీరాంధ్రదేశమునుండి తురకలను దఱిమివేసి హిందూస్వాతంత్ర్యమును పునరుద్ధరించుటకత డెట్లు ప్రోలయనాయకునికి దోడ్పడి యుండినదియు పూర్వప్రకరణమున వర్ణింపబడియున్నది. ప్రోలయనాయకుని యనంతరము కాపయతో నతని సంబంధమెట్టిదో వివరించి చెప్పుటకు వీలులేదు ; కాని ముసునూరి నాయకులకు రెడ్ల రాష్ట్రముపై నెట్టి యధికారమును ఉన్నట్లగపడదు. ప్రోలయ వేమారెడ్డికాలమున రెడ్డిరాజ్యము గడుచిన్నది. దక్షిణమున నెల్లూరు మండలములోని కందుకూరినుండి యుత్తరమున కృష్ణానదివఱకును బశ్చిమమున నెల్లమలలయందలి శ్రీశైలాహోబిలములనుండి తూర్పున సముద్ర పర్యంతముగల రాష్ట్రమతని యధీనమందుండెను. మొదట నితని రాజధాని ఇప్పటి గుంటూరుజిల్లా యొంగోలు తాలూకాలోని యద్దంకి ; తరువాత నరసారావుపేట తాలూకాలోని కొండవీడు. రెడ్ల రాజ్యమునకు దక్షిణమునను బశ్చిమమునను సరిహద్దు విజయనగరము. కృష్ణవఱకును తీరాంధ్ర భూమి నెట్లయిన తమ రాజ్యమున గలుపుకొన వలయునని విజయనగర రాయల యుద్దేశమగుట చేత ప్రథమమునుండియు నా రెండు రాజ్యముల వారికిని పోరు సహజమాయెను.

ద్రావిడదేశము : దక్షిణమున ద్రావిడ దేశమున రెండు రాజ్యములుండినవి. మొదటిది సంబువరాయ సంస్థానము. సంబువరాయల రాజ్యము చిన్నది. ఉత్తర ఆర్కాటు చెంగల్పట్టు జిల్లాలును దక్షిణ ఆర్కాటున గొంత భాగమును నితని యేలుబడియందుండినవి. కంచి యితని రాజధాని. పడైవీడు లేక రాజగంభీర దుర్గము ఇతని ముఖ్యదుర్గము. సంబువరాయడు స్వతంత్రుడు గాడు; హొయ్సల ముమ్మడి బల్లాళుని కాశ్రితుడు. సంబువరాయ రాజ్యమునకింకను దక్షిణమున మధుర మహమ్మదీయ రాజ్యముండెను. దక్షిణ పెన్న యీ రెండురాజ్యములకును బొలిమేర. దక్షిణ పెన్నకు దక్షిణముననుండు యావద్రావిడ దేశమును అనగా దక్షిణ ఆర్కాటులో గొంత భాగమును తంజావూరు తిరుచినాపల్లి మధుర రామనాథపుర జిల్లాలును కోయంబత్తూరు జిల్లాలో జాలభాగమును మధుర రాజ్యమున జేరియుండెను. మధుర ప్రధానరాజధాని. తిరుచినాపల్లి సమీపమున కావేరీతటమందలి కన్ననూరు కుప్పము ప్రధాన దుర్గము. మధుర సుల్తాను బల్లిదుడు; ద్రావిడ దేశమును సర్వమును దన యధికారము క్రిందికి దెచ్చుకొని మహమ్మదీయుల ప్రభుత్వము నచట స్థిరముగ నెలకొల్పవలయునని యతని దృఢ సంకల్పము; కాని ముమ్మడిబల్లాళుని ప్రతిష్టంభను వలన నీకోరిక యీడేరినది కాదు.

హొయ్సల రాజ్యము : బల్లాళుడు ద్రావిడ ప్రభువుగాదు; కర్ణాటకచక్రవర్తి. మైసూరి దేశములోని ద్వారసముద్రమతని రాజధాని. దక్షిణ కర్ణాటకము సర్వమును, పశ్చిమ సముద్రతీరమందలి తులురాజ్యమును అతని యేలుబడియండుండినవి. ద్రావిడదేశము నతడు ప్రవేశించుటకు రెండు కారణములు గలవు. తురకలను ద్రావిడదేశమునుండి వెడలనడచి హిందూ స్వాతంత్ర్యమును, ధర్మమును పునఃప్రతిష్ఠసేయుట కొఱకతడు ద్రావిడమును బ్రథమమున బ్రవేశించెను. కాపయ నాయకునితో సఖ్యము గుదిరిన పిమ్మట ముమ్మడి బల్లాళుడు దాక్షిణాత్య హిందూ సంఘమున కధ్యక్షుడాయె గదా. తెలింగాణమునుండి సుహమ్మదీయులను బాఅదోలి కాపయనాయకుని యధికారమును స్థాపించిన వెనుక యొడంబడిక ప్రకారము కాపయ నాయకుని సహాయముతో ద్రావిడదేశముపై నెత్తిపోయి తురకలను తొండమండలమునుండి తఱుమగొట్టి యా రాష్ట్రమునకు వెన్నుమణ్ణొకండ సాంబువరాయని అధిపతిని గావించెను. కాని తురకలను ద్రావిడ దేశమునుండి సంపూర్ణముగ వెడలగొట్టుట సులభసాధ్యము గాకపోయెను; ఆ కార్యము నెఱవేఱువఱకును అతడు తిరువణ్ణామలను నెలవీడు గావించుకొని యచటనే నిలిచెను. ఇంతకంటె బలవత్తరమైన కారణ మతని రాజ్యాంక. అతని పూర్వికులు కావేరీతటమందలి కన్ననూరు కుప్పమును రాజధానిజేసికొని చోళ మండలమును పాలించియుండిరి. వారు పాండ్యులనే నచటినుండి తఱుమగొట్టబడిరి. ద్రావిడ దేశమున నష్టమైపోయిన కులక్రమాగతరాజ్యమును మరల సాధించి తన పెద్దలవలె దానును నచట ప్రభుత్వము సలుపవలెనని యతని కోరిక. చోళ మండలమంతయు నప్పుడు మధురసుల్తాను వశమందుండినందున వారిరువురికి దీర్ఘయుద్ధము సంప్రాప్తమాయెను.

విజయనగర రాయలకును ముమ్మడిబల్లాళునికిని ఆద్యమునుండియు బగ గలదు; దీనికి వాస్తవమైన కారణము దెలియదు; కాని యూహింపవచ్చును. వారి విరుగుపొరుగు రాజ్యములు : కంపిలిరాయని కాలమునుండియు ముమ్మడిబల్లాళుడు కుంతలముపై గన్నువేసి యుండెను. పెక్కు యుద్ధములందు కంపిలిరాయనిచే బరాజితుడైనను అడియాస యతని వదలక పీడించుచుండినది. కంపిలిరాయడు గతించి యతని రాజ్యము లయమైపోయినను సంగమరాజపుత్రులపుడతని పాలనక్రింద నుండిన రాష్ట్రమున కధిపతులైరి; కావున బల్లాళునికి విజయనగర రాయలతోడి విరోధమునకు గారణము వారిరాజ్యము నపహరింప వలయునను దురాశయై యుండవచ్చును.

దేవగిరి : విజయనగరమునకు ఉత్తర సరి హద్దు ఢిల్లీ సామ్రాజ్యము. కృష్ణానది ఈ రెండు రాజ్యములను వేఱుపఱచుచుండినది. దక్షిణాపథము నందెల్ల యెడలను ఢిల్లీసామ్రాజ్యము భగ్నమై పోయినను మహారాష్ట్ర ఉత్తరకర్ణాటము లింకను ఢిల్లీసుల్తాను క్రిందనే యుండినవి. సుల్తాను ప్రతి నిధి దేవగిరియందు నివసించుచు మిగిలియుండిన సామ్రాజ్యభాగము నేలుచుండెను; కాని యచట గూడ సుల్తాను నధికారము చిరకాలము సాగ లేదు. అతిదారుణమైన యతని పాలన కోర్వ జాలక అమీరు లందఱొకమై తిరుగబడిరి. విప్లవ కారులను జిదుగగొట్టి తన యధికారమును మరల నెలకొల్పవలయునని సుల్తాను రెండుమూడు పర్యాయములు ప్రయత్న మొనర్చెను; కాని యందువల్ల నతనికి లాభము గలుగ లేదు. తుదకు విప్లవకారుల నాయకుడు 'జఫర్ ఖా' నను నతడు క్రీ. శ. ౧౩౪౭ వ సంవత్సరమున ఢిల్లీ సైన్యముల నోడించి స్వతంత్రుడై దక్కనుకుదానె సుల్తాను నని ప్రకటించి, సుల్తాన్ అలావుద్దీన్ హసన్ గంగూ బహమనీ యను బిరుదనామము ధరించి, గుల్బర్గపట్టణమున బట్టాభిషేకము జేసికొనెను. సుల్తాన్ అలావుద్దీన్ హసన్‌గంగూ స్థాపించిన రాజ్యమునకు బహమనీరాజ్యమని పేరు. ఇతని సంతతివారు దాదాపు నూటడెబ్బదియేండ్లకాలము గుల్బర్గ బీదరుపట్టణములు రాజధానులుగ దక్కను పాలించిరి. బహమనీ సుల్తానులు దక్షిణాపథమున మహమ్మదీయ ధర్మము నుద్ధరింప గంకణము గట్టు కొనుటచే హిందూస్వాతంత్ర్య ప్రతిష్ఠాపకులైన విజయనగర ప్రభువులకు వారితో బోరాట తప్పినదికాదు.

రాజ్యాభివృద్ధి :— (౧) ఉదయగిరి విజయము : ఉదయగిరి విజయముతో రాయ రాజ్య విస్తరణము ప్రారంభమైనది. హరిహర రాయల తమ్ముడు బుక్క-రాయలు మాయణ మాధవాచార్యుల సాయముతో నీ దుర్గమును సాధించెను. ఉదయగిరి నెల్లూరు మండలమున పశ్చిమోత్తర భాగమునందున్నది. పూర్వకాల మున దక్షిణదేశమున పేరెన్నిక కెక్కిన గిరి దుర్గములలో నిది యొక్కటి. దక్షిణదిక్కున తీరాంధ్రదేశమున కిది బోరుతలుపు. ఉదయగిరిని స్వాధీనపఱచుకొన్న వారికి తీరాంధ్రమును జొచ్చుట సులువైనపని. అప్పటి రణకోవిదులు దీనిని రాయ రాజ్యమందలి ప్రథను దుర్గమని పరిగణించువారు. ఉదయగిరి విజయ మద్దంకిరెడ్డి రాజ్యాక్రమణ కంకురార్పణము; భవిష్యత్కాల తీరాంధ్రదేశ చరిత్రగతి నది మాఱుత్రోవను ద్రిప్పినది. కావున విజయనగరచరిత్రాధ్యాపకు లీ విజయ ప్రాముఖ్య మును జక్కగ గ్రహింపవలసి యున్నది.

(౨) హొయ్సలరాజ్యాక్రమణము : ఉదయగిరిని జయించినపిమ్మట బుక్కరాయలు చిరకాల మచటనుండలేదు. హొయ్సలరాజ్యగడి దేశమునం దతని సాన్నిధ్య మావశ్యక మగుటచే దన కుమారుని విరూపణ్ణను ఉదయగిరి దుర్గాధ్య క్షునిగ నియమించి యతడచటికి తరలిపోయెను. హొయ్సల ముమ్మడి వీరబల్లాళునికి విజయనగర రాయలతో గలిగిన వైరమునకు గారణమింతకు పూర్వము నిరూపింపబడినది. అందువలన నుభయ పక్షములవారికిని గడి ప్రాంతముల బలుమారు పోరాట కలుగుచు వచ్చెను. అనంతపుర కోలారు మండలములందు ఘర్షణ యతిశయించి క్రీ. శ. ౧౩౩౮-౮ ప్రాంతమున యుద్ధము పొసగెను. రెండు మూడేండ్లపర్యంత మిరు పక్షములవారును సమానముగా బోరాడుచుండిరి. క్రీ. శ. ౧౩౪౦ వ సంవత్సరమున బుక్కరాయలు పెనుగొండ దుర్గ మునకు ముట్టడివేసి స్వాధీనపఱచుకొనెను. బుక్క-రాయల విజయమునకు రాయరాణువయొక్క బలపరాక్రమములె ప్రధాన కారణములుగావు. హొయ్సలుల దృష్టి యన్యథా లగ్నమైయుండి నది. వారు పెనుగొండ దుర్గసంరక్షణమునందు దమశక్తి సామర్థ్యములను సంపూర్ణముగ వినియో గింపజాలకపోయిరి. ముమ్మడిబల్లాళుడు ద్రావిడ దేశమున హిందూస్వాతంత్ర్యమును బునఃప్రతిష్ఠ సేయుటకును, నష్టమైపోయినచోళమండల రాజ్య మును మరలసంపాదించుటకును దిరువణ్ణామలపట్టణ మును నెలవీడు గావించుకొని మధుర సుల్తానుతో

బోరాడుచుండెనని చెప్పియుంటిమిగదా! రాను రాను మధుర సుల్తానుతో యుద్ధము తీవ్రముగా జొచ్చినది. బల్లాళుడు తురకలతో యుద్ధము సలుపుటకు దన సేనలలో విశేషభాగమును, సుప్ర సిద్ధదండనాయకుల నందటిని ద్రావిడదేశమునకు గొంపోయెను. కర్ణాటకమున నతని రాజ్యమును సంరక్షించుటకు దగిన దండు లేకపోయెను. ఈ కారణమున బుక్కరాయలకు వెనుగొండ దుర్గ మును లగ్గలు వట్టి స్వాధీనపఱచుకొనుటకు వీలై నది. వెనుగొండ విజయము హొయ్సల రాజ్య మునకుజుక్కవాలు. బల్లాళ రాజ్యక్షయమునకదియె ప్రారంభము. మధుర మహమ్మదీయు లెన్ని పర్యాయములు నిర్జితులైనను రామబాణహతి డొల్లిన రావణు శిరములవలె నభివృద్ధినందుచు వచ్చిరి.

మధుర రాజ్యస్థాపకుడగు జలాలుద్దీన్ అహ సన్‌షాహు ఐదేండ్లు రాజ్యపాలన మొనర్చినపిమ్మట క్రీ. శ. ౧౩౪౦ సం॥ లో నొక హంతకునిచే మడి సెను. తరువాత అలావుద్దీన్ ఉదైజి యనువాడు సుల్తానాయెను. ఇతడు మంచియోధుడు. ఇతడు రాజ్యము చేసినకాల మొక్కసంవత్సరము మాత్ర మెయైనను హొయ్సల సైన్యముల నోడించి వారి యాటోపమును దగ్గించెను. కాని యొకానొక యుద్ధమున శత్రువుల నసేకుల నాశముగాంచి, డప్పిగొని నీరు ద్రావుటకు శిరస్త్రాణమును దీసి వేసెను ; ఆకస్మికముగ నెచటినుండియో బాణ మొక్కటివచ్చి నాటినది యాతని కంఠమున ; తక్ష ణమె విగతజీవుడై యతడు నేలబ్రాలెను. ఉదైజి మరణమువలన తురకబలమునకు నడుము విరిగినది. ఎచ్చటివా రచ్చటనుండి యథాయథలై పఱచిరి. బల్లాళుని అడ్డపెట్టువారు లేకపోయిరి. పాఱుచున్న తురకలను వెన్నంటి తఱుముచు సేతువు పర్యంతము బోయి యతడచట జయస్తంభమును ప్రతిష్ఠించి వెనుదిరిగి మధుర సుల్తానుకుండెందిన దుర్గములను పట్టణములను బెక్కంటిని సాధించి కన్ననూరు కుప్పమునకు ముట్టడివేసెను. కోటయందుగాపుండిన తురకదళ మల్పమైనను బల్లాళున కది సులభముగ వశపడలేదు. ధైర్యముతో వారతని నెదిరించి కొంతకాలము పోరాడిరి. కాని వారికి శత్రువులను దటిమివేయుటకు శక్తిచాలదు. మటియు గోట యందు వలసినంత వస్తుసామగ్రి లేదు. ఎన్నిదినము లెదురుచూచినను మధురనుండి సహాయమువచ్చు చిహ్నము లేమియు గానరాకపోయె; కావున కోటను సంరక్షింపగలుగుదుమను నాసయడుగంటి నది-కోట యెట్లయినను శత్రులకు స్వాధీనపడునని వారికి నిశ్చయమైనది. ఈ విషమావస్థయందు కర్తవ్యమేమో నిశ్చయించుకొనజాలక త్రొక్కడ పడజొచ్చిరి. తలవనితలంపుగ శత్రుపక్షము వారికి మార్గము జూపినది. కోటను లగ్గలు వట్టిన నందలి ధాన్యము ప్రాణములపై నాసవిడిచి యుద్ధము సేయుననియు, సందువలన తురకలు సంపూర్ణముగ సమసిపోయినను, దగపడుమును జనక్షయమగునని గుర్తెఱిగి, కోటను దనకు వశపఱచునెడల నందు గాపుండు వారి కందటికేవిపత్తుగలుగనీయక క్షేమముగ స్వరాష్ట్రమునకు బోవనుజ్ఞ యొసగు దునని బల్లాళుడు వారికి వర్తమానమంపెను. కోటను వశపఱచుటకు ధాన్యమున కిష్టములేదు ; కాని బల్లాళుని సందేశమును ద్రోసిపుచ్చుటయు మేలు గాదు; కావున వారొక యుక్తిని బన్నిరి. సుల్తాను అంగీకారము లేక కోటను స్వాధీనపఱచుటకు దమ కధికారము లేదనియు నొకపక్షము వ్యవధియొస గిన సుల్తానుకు దెలియబఱచి యటనియంగీకారమును బడసి కోటను స్వాధీనము జేయుదుమనియు జవా బంపిరి. బల్లాళుడందుకు సమ్మతించెను. అంతట వారు తమ స్థితిగతులను విశదపఱచుచు, దమకు సత్వరము సహాయమంపవలయునని ప్రార్థించుచు సుల్తానుకు సందేశ మంపిరి. బల్లాళుడు దనకు కోటవశమైనట్లు తలచి స్కంధావారమున ప్రచారమునుండు కావలి కట్టుబాట్లను మఱచి ప్రమత్తుడై యుండెను. కన్ననూరు, కుప్పమునుండి వర్తమానమందగనె యప్పుడె రాజ్యాభిషిక్తుడై యుండిన సుల్తాను ఘయ్యాజుద్దీన్ దామఘనీ తన యూవచ్ఛక్తినివినియో గించి దళముల గూర్చుకొని హుటాహుటిగ ప్రయాణముజేసి కన్ననూరున కత్యల్పకాలమున జేరి యొకనాటి మధ్యాహ్నసమయమున దటాలున హొయ్సలస్కంధావారముపై బడెను. ఎండవేడిమికి డస్సి హొయ్సల సైనికులు నిదురించుచుండిరి.

తురకల తాకువల్ల గలిగిన యలబలమునకు మేల్కొనిన కర్ణాటకుల కాత్మసంరక్షణ కాయుధముల బట్టుటకు గూడ వ్యవధిలేకపోయినది; కసాయివాని చేజిక్కిన గొఱియలవలె హొయ్సలసైనికు లానాడు తురక ఖడ్గమున కెరయైరి; బల్లాళుని స్కంధావార మంతయు గొల్లవోయినది. ఆతడును బందీకృతు డాయెను.

మధుర సుల్తాను అంతటి ఘనవిజయము నెన్నడును పొందియుండలేదు. ప్రబలుడైన శత్రువు పరాజితుడయి చేజిక్కెను; అతని బలము సర్వనాశన మాయెను. హస్తగతుడైన శత్రుని విడుచుట సుల్తాను డాంఘనీ కిష్టములేదు; స్వభావముచే నతడు క్రూరుడు, హిందూజాతికి సహజ శత్రువు. కాని యతడు బల్లాళుని క్షణమె చంప దలపెట్ట లేదు. బల్లాళుడు ధనసంపన్నుడైన రాజు; అతని జంపుటకుముందు అతని ధనమంతయు నెట్లయిన హరింప నిశ్చయించుకొనెను. ధనమింత యిచ్చిన విడిచెదను నంతయిచ్చిన విడిచెదనని యాసచూపుచు క్రమక్రమముగ నతని సర్వస్వమును హరించెను. అతని ద్రవ్యమునంతయు గొనినపిమ్మట ఇక నతని వలన గలుగు లాభములేదని యెఱిగి క్రీ. శ. ౧౩౪౨ వ సంసత్సరము చివర నాతని మధుర చెరసాల యందు జంపించి తిత్తొలిపించి కోటకొమ్మకు గట్టించెను. దాక్షిణాత్య హిందూరాజులలోనెల్ల గొప్ప వాడని పేరుపొందిన ముమ్మడిబల్లాళరాయని జీవిత చరిత్ర యిట్లు మధుర చెఱసాలయందు పరిసమాప్తి నందినది.

ముమ్మడిబల్లాళునితో హొయ్సల రాజ్యము తుదముట్టినది. కన్ననూరు-కుప్ప రణక్షేత్ర మున నతని సైన్యము సర్వనాశనమైనది; అతని చెఱవలన బొక్కసము శూన్యమైనది. మరణముచే రాష్ట్ర మనాథయైనది. మరణానంతర మతని కుమారుడు విరూపాక్ష బల్లాళుడు రాజ్యాధిపతియై క్రీ. శ. ౧౩౪౩ వ సంవత్సరమున బట్టాభిషేకము జేసికొనెను; కాని యతనికి బలములేదు; కోశము లేదు; నిర్వాహకత చాలదు. శత్రుబాధలేకపోయిన నతడును దన పెద్దలవలె రాజ్యము జేసియుండును. కాని రాజ్యమునకు సంభవించిన విపత్తు నాధార పఱచుకొని కొందరు నాయకులును సామంతులును ద్రోహముసేయగడగిరి. వారితో సఖ్యము జేసి కొని హొయ్సల రాజ్యాక్రమణ కదియె యను కూలసమయమని తలచి విజయనగర రాయలెత్తి వచ్చెను. విరూపాక్ష బల్లాళుడు రాష్ట్రసంరక్షణ కేమి కట్టుబాట్లు చేసెనో తెలియదు. హొయ్సల రాజ్యములో నూటికిమించిన సంఖ్యగల పట్టణము లను దాను జయించి శత్రువుల యధికారమును దొలగించి విడిపించితినని బుక్కరాయలు దన శాసనములందు జెప్పుకొని యుండుటచేత దేశము విజయనగరము వారికి సులభముగ స్వాధీనపడలేదని తెల్లమగుచున్నది. హొయ్సల దళము లేకమై రాజ్యసంరక్షణకు ప్రయత్నపడకున్నను అడుగడు గునకును కర్ణాటకులు విజయనగర సైన్యములకు నరికట్టుచుండిరి. కాని ప్రయోజనము లేక పోయెను. విరూపాక్ష బల్లాళుని పట్టాభిషేకము జరిగిన మూడు మాసములలోపల హొయ్సల రాజధాని ద్వారసముద్రము బుక్కరాయలకు స్వాధీనమైనది. రాష్ట్రమంతయు వశపడుటకు మఱి మూడేండ్లు పట్టినవి. హొయ్సల రాజ్యముతో పాటు తుళువదేశముగూడ రాయల యేలుబడి క్రిందికి వచ్చినది. ఇట్లు హొయ్సల తుళురాజ్యము లను సాధించినపిమ్మట క్రీ. శ. ౧౩౪౬ వ సంవత్సర మార్చి తే ౯ ది నాడు హరిహరరాయలు శృంగేరి యందు విద్యాతీర్థశ్రీపాదుల యధ్యక్షతక్రింద విజయోత్సవము సల్పెను. ఆ యుత్సవకాలమున నచటికి హరిహరరాయలును అతని తమ్ములును కుమార్లును అల్లుండ్లును సామంతాది సమస్త నియోగివర్గమును వచ్చిరి. హరిహరరాయలు పెక్కు దానములనిచ్చెను. పై పేర్కొనిన విజయ ముల మూలమున రాయరాజ్యము విశేషముగ బెంపంది, పూర్వసముద్రము మొదలు పశ్చిమ సముద్రమువఱకును వ్యాపించెను. హరిహర రాయల పట్టాభిషేక కాలమున చిన్న సంస్థానమై యుండిన విజయనగరము మఱి పది యేండ్లకు విస్తారమగు రాజ్యమై మారెను. హరిహరరాయలు పూర్వపశ్చిమ సముద్రాధిపతి యాయెను.

మధురసుల్తానుపై దండయాత్ర :— హొయ్సలరాజ్య ధ్వంసమువలన విజయనగర రాయలకు సంప్రాప్తమైనది వారి యేలుబడి యందుండిన రాష్ట్రమొక్కటియేకాదు; రాష్ట్ర ముతో గూడ బల్లాళరాయల యాశయములును నన్యరాష్ట్రములతోడి వారి సంబధ బాంధవ్య ములును సంక్రమించినవి. దాక్షిణాత్యహిందు వులకు నాయకుడైన ముమ్మడిబల్లాళుడు హిందూ స్వాతంత్ర్యపునఃప్రతిష్ఠకై మధుర సుల్తానుతో బోరుచు రణరంగమున నిహతుడాయెకదా. ఆ యుద్దేశముతోడనే నూతన హిందూసామ్రాజ్య ప్రతిష్ఠకు గడగిన విజయనగరరాయల కాతని ప్రయత్నమును గొనసాగించుట యవశ్యము కర్తవ్యమాయెను. మఱియు బల్లాళరాయని మరణానంతరము ద్రావిడదేశమున మహమ్మదీయుల యాటోపము హెచ్చెను; సంబువరాయలు మధుర సుల్తానుతో యుద్ధమున నోడి బందీకృతుడాయెను. తొండమండలమంతయు మరల మహమ్మదీయులాక్రమించుకొనుటకు సిద్ధమైయుండిరి. కావున హరిహరరాయలు ద్రావిడదేశ హిందూజన సంరక్షణకొఱకు మధురసుల్తానుపై దండు పెట్ట వలసివచ్చెను.

ఈ దండయాత్ర వృత్తాంతమంత విశదముగ దెలియదు; కాని ముఖ్యాంశములు స్పష్టముగ విదితమగుచున్నవి. దీనికి ముఖ్యసేనాధిపతి బుక్కరాయల పుత్రుడు కుమారకంపణ్ణ. సైన్య మంతయు నేకవాహినిగ నడువలేదు; రెండు పాయలై సాగినది. ఒకటి పశ్చిమోత్తరమున కుమారకంపణ్ణ నాయకత్వము క్రింద ముల్బాగలు నుండి బయలువెడలి తూర్పుకనుమలలోని లోయ మార్గములగుండ కూచిచేసిపోయి తిరువణ్ణామల ప్రాంతమున విడిసెను; అచటినుండి కుమారకంపణ తమ్ముడు సావణ కొంత దండుతో బయలుదేరి చోళదేశమును జొచ్చి కరూరు ప్రాంతసీమల నాక్రమించుకొనెను. మఱియొకటి యుత్తరమున నుదయగిరినుండి మొదటి కంపణ్ణ కుమారుడగు వీరసావర్ణ యాధిపత్యముక్రింద తీరదేశముగుండ కంచిమీదుగ నడచిపోయి చోళమండలము ప్రవేశించి తంజావూరు ప్రాంతభూముల నాక్రమించుకొనెను. విజయనగరసైన్యముల రాకను విని సుల్తాను దన సైన్యములను గూర్చుకొని వారి నెదిరించి తటిమి వేయుటకొఱకు వచ్చెను; ఉభయగిరి సైన్యములతో నతనికి భీమసంగ్రామము నడచినది. ఉదయగిరి సామంతులలో ప్రముఖుడైన సాళువమంగి పరాక్రమమువలన మధురసేన పరాజయము సందెను; సుల్తాను బందీకృతుడాయెను; సాంబువరాయలు చెఱనుండి విముక్తుడై వీరసావణ్ణ సాళువమంగుల సహాయముపలన కుమారకంపణ యనుగ్రహమునకు పాత్రుడై నిజరాజ్యమున సుప్రతిష్ఠితుడాయెను. ఈ కారణమున వీరసావణ్ణయు సాళువమంగియు శంబువరాయ స్థాపనాచార్య యను బిరుదును బడసిరి.

మధురపై దండయాత్ర ఇట్లు జయవంతముగ కొనసాగినది. సుల్తాను యుద్ధమున బరాజితుడగుటయేగాక శత్రువులచే బట్టుపడి చెఱసాల జిక్కెను. మధుర మహమ్మదీయరాజ్య మనాథ మైనది. అమీరు లొండొరులతో గలహింపుచుండిరి. రాజ్య స్థితి యిట్లరాజకమై విజిగీషాపరులైన శత్రువుల జైత్రయాత్రాప్రయత్నముల కనుకూలమైయుండిన తురక దొరతనమును గూలద్రోసి హిందువుల యధికారమును మరల నెలకొల్పుటకు వలనుపడలేదు. దీనికి ముఖ్యకారణము భారతీయ రాజకీయ వాతావరణమున గలిగిన మార్పు. క్రీ. శ. ౧౩౫౧ వ సంవత్సరమున ఢిల్లీ సుల్తాను ముహమ్మదు బిన్ తుఘ్లూకు పరలోకగతుడాయెను. అతనికి సంతతి లేకపోవుటవలన నతనియనంతర మతని జ్ఞాతి ఫిరోజు శాహు తుఘ్లూకు ఢిల్లీ సింహాసనము నధిష్ఠించెను. ఫిరోజుశాహు సుల్తాన్ ముహమ్మదువలె యుద్ధప్రియుడు గాడు; అంతటి మేధావియు శక్తిసామర్థ్యములు గల దళనాయకుడును గాడు. కాని నష్టమైపోయిన సామ్రాజ్య భాగములను మరల సాధింపవలయుననన్న యాసమాత్ర మాతని విడువ లేదు. కావున ఢిల్లీ సామ్రాజ్యపీఠముపై సుస్థిరుడై నెలకొనిన తరువాత దక్షిణహిందూస్థానమున నూతనరాజ్యములను బాదుకొల్పిన ప్రభువుల కందటికిని దన యాధిపత్యము నంగీకరించి కప్పముగట్ట

వలసినదని ఫర్మానాల నంపెను. అట్టి ఫర్మానా యొకటి మధురకు క్రీ. శ. ౧౩౫౩ వ సంవత్సరమున జేరినది. అప్పటికే మధురసుల్తాను విజయనగర సైన్యముచే బట్టుబడి చెఱవోయి యుండుటచే నమీరులంద ఱొకమై యోచనచేసి ఢిల్లీసుల్తాను ఫర్మానాను దిరస్కరించి పంపివేసిరి. కాని వారికి బెదురుగల్గినది. ఫిరోజుశాహు తమ రాజ్యమును జయించుటకు బ్రత్యక్షముగనో గూఢముగనో ప్రయత్నము సేయునన్న శంక వారి హృదయములందు నాటినది. అది యట్లుండగా విజయనగర సైన్యము లే నిమిషమున నైన దమపైఁబడి పూర్ణాహుతి సేయగలవని వారికి నిశ్చయమైనది. ఈ విపత్సమయమున శత్రువులను నిగ్రహించి తమ యధికారమును నిల్పగల నాయకు డెవ్వడును దమ వారిలో గానరాలేదు. ఇక తమకు రక్షణకలుగు మార్గమెద్ది? యని చింతింపగడగిరి. వారిదృష్టి దేవగిరి వైపునకు బాఱినది. సుల్తా అల్లావుద్దీగంగూ తమ శత్రులకు శత్రుడు. కావున అతడు తమకు సహజ మిత్రుడు. అతని నాశ్రయించిన తమకు గల్గి యుండు కష్టములను తరించి గట్టెక్కుటకు సాధనము దొరుకకపోదని వారు నిశ్చయించి, తమలో ముఖ్యులైన వారిని దేవగిరికి రాయబార మంపిరి. సుల్తా అల్లావుద్దీను వారియెద సుముఖుడై రాయబారమును జిత్తగించి వారితోడి సఖ్యమున కొడంబడెను. మధుర మహమ్మదీయులతో స్నేహము దనకు లాభకారియని యత డెఱుగును. విజయనగర రాయల యధికార మనుదిన మతిశయించుచుండెను; హోయ్సలులను జయించి కర్ణాటకమును దుళు రాజ్యమును గబళించిరి. హోన్నావురు సుల్తాను వారి కాశ్రితుడు; క్రీ. శ. ౧౩౪౭ వ సంవత్సరమున హరిహరరాయల సైన్యము లతని గమ్మడు మారప నాయకత్వమున చంద్రగుప్తినుండి బయలు వెడలి వనవాసి కదంబ రాజ్యమును జయించి స్వాధీనపఱచుకొనెను. తన పురోవృద్ధికి వారి ప్రాబల్యమును దగ్గించుట యత్యంతావశ్యకము. క్రీ.శ.౧౩౪౮ వ సంవత్సరమున దన పట్టాభిషేకమైన మరుసటి వర్షమున నొక దండయాత్రను విజయనగర గడిదేశముపై సాగించియున్నను, నందువలన దనకు విశేష లాభము గలిగినదికాదు. మధుర వారితో సఖ్యము గుదుర్చుకొనిన విజయనగరరాయలతో యుద్ధమున వారు సహాయభూతులు కాగలరు. కావున అల్లావుద్దీ వారి రాయబారము నంగీకరించి తన యల్లుని (కుర్బతె హసగంగూను) మధురకు సుల్తానుగ నియమించి యచటి కంపి, మధురపై నడచుచుండు విజయనగర దండయాత్ర నాపుట కొఱకు సైన్యములతో దేవగిరినుండి బయలువెడలి కృష్ణాతుంగభద్రల యంతర్వేదిపై గూచిచేసెను. హరిహరరాయలకు మహమ్మదీయులతో నుభయ పార్శ్వములనుండియు నేకకాలమున యుద్ధము సేయుట భరమాయెను. కావున మధుర దండయాత్రను దాత్కాలికముగనాపి. మధుర తురకల కంఱె బలాధికుడైన బహమనీ సుల్తానుతో బోరాటము సేయుటకే తన యావచ్ఛక్తిని వినియోగించెను. ఈ యుద్ధవృత్తాంతము మన కింకను స్పష్టముగ దెలియరాదు. సుల్తాను అల్లావుద్దీను హసగంగూ విజయనగరరాయల నోడించి తుంగభద్ర పర్యంతముగల రాష్ట్రమును స్వాధీనము జేసికొనెనని మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసియున్నారు. విజయనగర శాసనము లందు హరిహరరాయలు సుల్తాను నోడించి విజయుడాయెనని చెప్పియున్నది. హైదరాబాదురాజ్యములోని శాసనములన్నియు బ్రకటింపబడినగాని ఈ యుద్ధమెట్లు తుదముట్టినదియు నిర్ధారించుటకు వీలులేదు; కాని కృష్ణా తుంగభద్రల యంతర్వేది యంతయు గాక పోయినను జాలభాగమునైనను హరిహరరాయలు గోలుపోయినట్లున్నది.

ఈ యుద్ధము జరుగుచుండగనో లేక యది ముగిసిన తరువాత అల్పకాలముననో హరిహరరాయలు దేహము చాలించెను. ఇతని మరణము క్రీ. శ. ౧౩౫౫ న సంభవించెనని చరిత్రకారుల యభిప్రాయము; కాని యుడిపియందొక శాసనమున నితడు శా. శ. ౧౩౭౮ నకు సరియైన దుర్ముఖవర్ష ఫాల్గుణ శుక్లపక్షము నందింకను రాజ్యము సేయుచుండినట్లు చెప్పియుండుటవలన క్రీ. శ. ౧౩౫౬ వ సంవత్సరము వఱకు నితడు సజీవుడై యుండెనని తెలియుచున్నది.

పట్టాభిషేకము జేసికొనిన పిమ్మట హరిహర రాయలిరువదేండ్లు విజయనగరమును పాలించెను. చరమదశయందు కృష్ణాతుంగభద్రాంతర్వేదియం దును నంతకింక నుత్తరమందును గొంత రాష్ట్రము నష్టమయిపోయినను హరిహరరాయలు రాజ్యా రంభమున జిన్న సంస్థానముగ నుండిన విజయ నగరము తూర్పు పశ్చిమ సముద్ర తీరముల దాకు విస్తారరాజ్యమై యభివృద్ధి నందినది. ఈ యభివృద్ధి యంతయు హరిహరరాయల మూలముననే కలిగి నదని యెంచరాదు. రాజ్య సంపాదనయందును ప్రజాపాలనయందును అతని సోదరులును వారి పుత్రులును అతనికి దోడ్పడిరి. మొదటి తమ్ముడు కంపణ, క్రీ. శ. ౧౩౪౩ వ సంవత్సరమున ఉదయ గిరికి రాజ్యాధిపతిగా నియమింపబడెను. ఇతడు క్రీ. శ. ౧౩౫౪ వ సంవత్సరము వఱకును నా రాజ్యవ్యవహారములను విచారించుచుండి కాల ధర్మము నందెను. ఇతనికి వేదభాష్యకర్త మాయణ మాధవాచార్యుల తమ్ముడు సాయణాచార్యులు మంత్రియై కార్యమునందును ఖడ్గమునందును దోడై యుండెను. కంపణకు బుత్రులిద్దఱు కలరు. పెద్ద వాడు వీరశావణ్ణ. క్రీ. శ. ౧౩౪౬ వ సంవత్సరము నుండి తండ్రికి రాజకార్య నిర్వహణయందు తోడై శ్రీనాయకుడై యుండెను; క్రీ. శ. ౧౩౫౭ వ సంవత్సరమున గుమార కంపణకు ప్రాపుగ మధుర పై దండయాత్రను నడపెను. రెండవ వాడిమ్మడి సంగముడు. ఇతడు సాయణాచార్యుల శిష్యుడు. తండ్రి మరణానంతరము తనయన్నతో గూడ నీత డుదయగిరి రాజ్యమును గొంతకాలము పాలించెను. హరిహరరాయల రెండవ తమ్ముడు బుక్కరాయలు. ఇతడే రాజ్యాభివృద్ధికి ముఖ్యకారకుడు. శాసనము లందితడు పాండవమధ్యముని వంటివాడని ప్రశం సింపబడి యున్నాడు. ఆద్యమునుండియు నితడు శ్రీరామునికి సౌమిత్రివలె హరిహరునకు దోడునీడ యై సంచరించుచు సర్వకార్యములందును చేదోడు వాదోడై మెలగుచుండెను. మొట్టమొదట నితఁడుద యగిరినిజయించెను; అచటనకుమారునివిరూపణ్ణను పాలకునిగ నియమించి హోయ్సల రాజ్యగడిప్రదే శమున గలహాముపుట్టగా నచటికి బోయి వెను గొండను సాధించెను. తరువాత క్రీ. శ. ౧౩౪౩ వ సంవత్సరమున హోయ్సల రాజ్యముపై నెత్తి పోవుచు విరూపణ్ణనుదయగిరి నుండి పిలువనంపి వెనుగొండ నతని కప్పగించి దిగ్విజయయాత్ర వెడ లెను. క్రీ. శ. ౧౩౪౩-౧౩౪౬ ల మధ్య హోయ్సల రాజ్యమును సంపూర్ణముగ జయించి స్వాధీనపఱచు కొనెను. కొంతకాలము బుక్కరాయలు యౌవ రాజ్యపదమునధిష్ఠించెను; తరువాత రాయపదమును బడసి హరిహరరాయలతో గలసి రాజ్యపాలన మొనర్చెను. బుక్కరాయలకు పుత్రులు పలువురు గలిగిరి. విరూపణ్ణ కుమార కంపణ్ణ లింతకుముందు వేగొన్కనబడియున్నారు. వీరుగాక హరిహర భాస్కర భవదూర సాయణలు సుప్రసిద్ధులు. అంద ఱును రాజ్యాభివృద్ధికి నిరంతరము గృషిసేయుచు దమ తండ్రికి సర్వకాలములందును ననుకూలురై తోడ్పడుచుండిరి.

బుక్కరాయలకు వెనుకటివాడు మారప. ఇతడు మొదట చంద్రగుప్తిరాజ్యమును పాలించు చుండెను. తాను హరిహరరాయలక్రింద యువ రాజుగ నుంటినని యితడు చెప్పుకొనియున్నాడు ఇది బుక్కరాయలు రాయపదమునుబొందిన పిమ్మటనై యుండవచ్చును. మారప క్రీ. శ. ౧౩౪౬ ప్రాంతమున దండువెడలిపోయి వనవాసికదంబ రాజ్యమును జయించెను. ఇతనికి చౌండపమాధవుడు మంత్రియు సేనాధిపతియునైయుండి రాజ్యపాలన మందును రణరంగమందును సహాయభూతుడై యుండెను. మాధవమంత్రి గొప్ప విద్వాంసుడు. మతముచే నతడు శైవుడు. కాశీవిలాసక్రియాశక్తి శిష్యుడు. ఆగమము లాతనికి గరతలామలకములు. శైవమును ప్రచురించుటకొఱకతడు సూతసంహితకు వాఖ్యానమునురచించెను.

హరిహరరాయల కడగొట్టు తమ్ముడు ముద్దప. ఇతని చరిత్ర మనకేమియు దెలియదు. హరిహరరాయలతోగూడ నితడు ములాగలు రాజ్యమును పాలించుచుండిన ట్లొకానొక శాసన మందు జెప్పియున్నది.

పై పేర్కొనిన తమ్ములును వారి పుత్రు లును సనుచరులును గాక హరిహరరాయలకు

రాజ్యపాలనయం దనేకులు మిత్రులు హితులు మంత్రులు మున్నగువారు తోడ్పడియున్నారు. వీరియం దగ్రగణ్యుడు విద్యారణ్యస్వామి. బుక్క రాయలకు ఉదయగిరిని జయించుటకు సహాయభూతుడై యుండిన మాయణ మాధవాచార్యులే సన్యసించిన పిమ్మట విద్యారణ్యులను నామము ధరించిరనియు, గావున మాధవాచార్యులును విద్యారణ్యులును నే, పురుషులే కాని భిన్నవ్యక్తులు గారనియు ప్రాచీన కాలమునుండియు నొక ఇతిహాసము పరంపరగవచ్చుచున్నది. మాధవాచార్యులచే విరచితములైన పరాశరమాధవీయాది గ్రంథములయందు దేవేంద్రునికి బృహస్పతి యెట్లో తానునట్లే బుక్క రాయలకు కులగురువునని జెప్పియున్నాడు. విజయనగరస్థాపనయందు సంగమ రాజపుత్రులకు మాధవ విద్యారణ్యస్వామివా రొనర్చిన మేలింతకుముందే వర్ణింపబడియున్నది. రాజ్యస్థాపనతో దనకార్య మంతయు సంపూర్ణముగ ముగిసినదని యాయన యనుకొనలేదు. ప్రారంభదశయందు మాధవ విద్యారణ్యులు విజయనగర సంస్థానమును గంటిని రెప్పవలెసంరక్షించుచుండెను. కానిరాష్ట్రపాలనయం దాయన ఆవంతయేనియు జోక్యము గలిగించుకొనలేదు. మంత్రమాత్ర సహాయుడు. ధర్మోద్ధరణమెట్లు సేయవలయునో, రాజ్యము నెట్లభివృద్ధినందింపవలయునో, రాజధర్మమెట్టిదో తెలియజెప్పుచు సంగమ రాజపుత్రులకు ఆయన మార్గదర్శకుడాయెను. మఱియు వైదిక ధర్మపునరుద్ధారణ క్షత్రియులగువారి ముఖ్యధర్మమని తెలియజెప్పి మ్లేచ్ఛదోషావసన్నమై మాసిపోవుచుండిన ఆర్యధర్మమును మరల నెలకొల్పి హిందూమతమునకును సంస్కృతికిని యమూల్యమయిన సేవ యొనర్చి సంగమరాజపుత్రుల కీర్తిని ఆచంద్రార్కతారకస్థాయిగ నిలిపెను. మాధవ విద్యారణ్యుల వారికి మహోద్యమమున నాతని యనుజన్ములు సాయణాచార్యులవారు దోడ్పడిరి. సాయణాచార్యులు వేదవేదాంగపారంగతుడు. సర్వశాస్త్ర విశారదుడు. ధనుర్వేదకుశలుడు. వేదార్థమును విశదీకరించుట కాయన వేదములకన్నిటికి వ్యాఖ్యానమును రచించెను. ఈ కార్యమునందు దాక్షిణాత్య విద్వాంసు లనేకులాయనకు దోడ్పడిరి. మాయణ పుత్రులకృషివలన వైదిక ధర్మము మరల భరత ఖండమున రెక్కొన్నది. వీరి ప్రోత్సాహమువలన విద్వాంసులును శాస్త్రజ్ఞులును పెక్కు ప్రాచీన వైదిక శాస్త్రగ్రంథములకు వాఖ్యానములను వ్రాయుటయేగాక నూతన గ్రంథరచనకు గడగిరి. వారి యునికివలన విజయనగరము వాస్తవముగ విద్యానగర మాయెను.

మాధవ విద్యారణ్యులతరువాత నెన్నదగినవాడు చంద్రభూషణ క్రియాశక్తి. ఈయన క్రియాశక్తి గురుపీఠమున కధిపతి. రాజకుటుంబముం దనేకు లీతనికడ శైవదీక్షను బుచ్చుకున్న శిష్యులే. చంద్ర భూషణాచార్యుడు వేదములతో పాటు శైవాగమములన్నిటిని మథించి యందలిసారమును నిశ్శేషముగ గ్రోలిన మహామహుడు. కళానిధి. ఆయన యెఱుగని శాస్త్రములేదు. మతవిషయములందును విద్యావిషయములందును చంద్రభూషణాచార్యులవారి యభిప్రాయములు సమకాలికుల కాదరపాత్రములైయుండెను.

హరిహరరాయల కాలమునను దరువాతను రాజ్యపాలనమందు దోడ్పడిన మంత్రులు పెక్కండ్రు గలరు. వీరిలో ముఖ్యుడు అసంతరసు. ఇతడు ఆంధ్ర నందవైదిక బ్రాహ్మణుడు. రాష్ట్రమును పాలనా సౌకర్యార్థము సీమలు నాడులు స్థలములుగ విభజించి, కర్ణికనిరాసుల నేర్పఱచి, కావలి కట్టుబాట్లు గావించి, పాలనను జక్కని పద్ధతుల మీద నడపుటయందు హరిహరరాయల కితడు కుడిచేయివలె పనిజేసెను. మఱియు నితడు కృషీవలుల మేలుగోరి వ్యవసాయమునకు వలసిన జలమునకు గొదవగానీకుండ పెక్కు చెఱువుల ద్రొవ్వించెను. ఇతని సేవకు మెచ్చి హరిహరరాయ లితనికి దన యాస్థానమున సర్వశిరఃప్రధానుని పదమిచ్చి చిక్క ఉడయలను బిరుదమిచ్చెను.

బుక్కరాయలు

(క్రీ. శ. ౧౩౪౪—౧౩౭౭)

హరిహరరాయలకు సంతు లేదు; అతని మరణానంతరము క్రీ. శ. ౧౩౪౪ వ సంవత్సరము నుండియు నతనికి జతగ సామ్రాజ్యమును పరిపాలించుచుండిన అతని రెండవ తమ్ముడు బుక్కరాయ లేకాధిపత్యము వహించెను. పెద్ద తమ్ముడు ప్రథమ కంపరాయలును నతని పుత్రులు నుండగా రెండవవాడగు బుక్కరాయ లెట్లు రాజ్యాధిపతి యాయెనో తెలియదు. అప్పటికి మొదటి కంపరాయలు గతించి యుండినందువలన, రాజ్యమున జాల నిర్వాహకుడై యుండిన బుక్కరాయలు దన యన్నకొడుకులకు రాజ్యమును జెందనీయక ఆక్రమించి సింహాసనము నధిష్ఠించెనని కొందరు పరిశోధకు లభిప్రాయపడుచున్నారు. కాని ఇది యంగీకార్యము గాదు. ఏలనగా, మొదటి కంపరాయ లింకను సజీవుడై యుండగనె హరిహరరాయలు దన రెండవ తమ్ముని బుక్కరాయలను దనకు తుల్యునిగావించి రాజపదము నొసగి రాజ్యమునకు భాగస్వామిగ జేసి యతని సహాయముతో ప్రజాపాలన సేయ గడగెను. ఈ యేర్పాటునకు పెదకంపరాయలు గాని యతని పుత్రులుగాని ప్రతిఘటించినట్లు కాన రాదు. లభ్యమైన సాక్ష్యమునుబట్టి చూడగా వారు బుక్కరాయల యాధిపత్యము నంగీకరించి నట్లే తోచుచున్నది. వారట్లు సమ్మతించుటకు గారణమేమో నిశ్చయించి చెప్పుటకు వీలులేక పోయినను గొంతవఱ కూహించవచ్చును. మహమ్మదు బిన్ తుఘ్లూకు కంపిలిరాజ్యమునకు హరిహర బుక్కలను బంపినపుడు వారి నిరువురిని ఆ రాజ్యమున కధిపతులుగ నియమించినట్లు తెలియవచ్చుచున్నది. ఇంతేకాక రాజ్యస్వాతంత్ర్య స్థాపన యందేమి యటుపిమ్మట రాజ్యవిస్తరణము నందేమి సర్వకార్యములును బుక్కరాయల మూలమునను జరిగెను. కావున హరిహరరాయలు వజ్రసింహాసనాధిష్ఠుడై సామ్రాజ్యమును పాలించు చుండినను బుక్కరాయల యాధిపత్యము నంద ఱును ఆద్యమునుండియు నంగీకరించినట్లున్నది. ఈ కారణమువలనే హరిహరరాయల మరణానం తరము సామ్రాజ్యమున కంతటికిని బుక్కరాయలే ఏకాధిపతియై సర్వజన సమాదరణను బొంది యుండవచ్చును.

తొండమండల విజయము:

బుక్కరాయలు సకల సామ్రాజ్యముపై నేకాధిపత్యమును వహించినవెంటనే తొండమం డలముపై దండెత్తిపోయి సంబువరాయల యధి కారమును దునుముట్టించి యతని యేలుబడిక్రింద నుండిన దేశమునంతటిని వశపఱచుకొని సామ్రా జ్యమున గలుపుకొనెను. ఈ దండయాత్రకు కారణమేమో తెలియదు; కాని యూహించుటకు దుస్సాధ్యముగాదు. విజయనగరసామ్రాజ్యము పై బహమనీసుల్తాను అలావుద్దీను హసనుగంగూ ఎత్తివచ్చుటయె నిజ స్వాతంత్ర్య ప్రకటనకును రాజ్యవిస్తరణకును నదనని తలచి రాజనారా యణ సంబువరాయలు ద్రావిడ దేశమందు విజయనగరరాయలకు జెందిన రాష్ట్రమును స్వాధీనముజేసికొనినట్లున్నది. బహమనీ సుల్తా నెత్తిరాగా నుత్తరదిక్కున నిజరాజ్య సంరక్షణ కొఱకు సాగుచుండిన మధురదండయాత్ర నాపి దక్షిణదేశమున నుండిన సైన్యములను రాయలు రప్పించుకొనుటచే రాజనారాయణసంబువరాయ లకు దక్షిణమందలి రాయరాష్ట్రము సులభముగ స్వాధీనమై యుండవచ్చును. బహమనీదండ యాత్రవల్లను హరిహరరాయల మరణమువల్లను బుక్కరాయలకు ద్రావిడదేశముపైపు దృష్టిని మరల్చుటకు సాధ్యముగాకపోయెను; బహమనీ దండయాత్రవలన రాయల బలము సన్నగిలెనని సంబువరాయ లభిప్రాయపడియుండిన నతడు

జాల పొరపాటుపడెను. అల్పకాలముననె రాజకీయ వాతావరణస్థితి మారిపోయినది. క్రీ. శ. ౧౩౪౯ వ సంవత్సర ప్రారంభమున నల్లావుద్దీను హసన్ గంగూ బహమనీ మృతినందెను; తరువాత నతని జ్యేష్ఠపుత్రుడు మొదటి ముహమ్మదు శాహు బహమనీ రాజ్యమున కధిపతియా యెను. ముహమ్మదుశాహు పసివాడు; అప్పటి రాజకీయ పరిస్థితు లతని కనుకూలముగ నుండలేదు: అన్యరాష్ట్రములపై దండెత్తిపోగలశక్తి యప్పుడతనికిలేదు. కావున బుక్కరాయలతని వలని భయము మాని తొండమండలముపై దండంపెను.

ముందటివలెనే ఈ దండయాత్రకు ప్రధాన నాయకుడు ముల్బాగలు రాష్ట్రపతియగు కుమారకంపణ. ఇతనితోగూడ నితని ప్రధాని సోమప్ప దండనాయకుడును నితని పుత్రుడు గండరగూళి మారయనాయకుడును గోపన దండనాయకుడును సాళువమంగియు యుద్ధమునకు నడచిరి. వీరికి ప్రాపుగ నుదయగిరి సేనలు సావణ ఉడయుల యాధిపత్యముక్రింద బయలువెడలినవి. సావణ ఉడయుల సోదరుడగు నిమ్మడి సంగముడును వారి కులగురువును మంత్రియునగు మాయణసాయణాచార్యులును యుద్ధమునకు దరలిరి. ముందటివలెనే విజయనగరసైన్యము లన్నియు గలసి యేక వాహినిగ సాగలేదు. రెండు పాయలుగ బరగినవి. ఒకటి కుమారకంపణ యాధిపత్యముక్రింద ముల్బాగలునుండి; రెండవది సావణ ఉడయుల నాయకత్వమున ఉదయగిరినుండి. రెండును తొండమండలమున సంగమమైనవి; సంబువరాయ రాజ్యమును ముంచివేసినవి.

రాజనారాయణసంబువరాయ లేకకాలమున రెండు రంగములందు విజయనగరమువారి నెదుర్కొనవలసి వచ్చినది. నిజబలము లన్నిటి నొక తలజేసి యెదుర్కొనినను రాయరాణువతో సరిపోలగలశక్తి యతనికి లేదట. ఇక సేనల రెండు భాగములుగ విభజించి, ఇరు పార్శ్వములనుండి యొక్కమ్మడి పైనెత్తివచ్చిన శత్రువులతో గయ్యము సేయవలసి వచ్చిన నతనికి జయము కలుగుట కవకాశమెక్కడిది. కాని తోట దల వెట్టి రోకటి పోటునకు వెరచిన నేమి లాభము? విజయనగరముతోటి పగ తెచ్చిపెట్టుకొనినపుడు, జయాపజయములను విచారించక యుద్ధము సేయక తప్పునా?

తొలుత నుదయగిరి సేనల యుద్ధకార్యము విచారింతము. యథాపూర్వము వారు తీరదేశముగుండ దిగబడి యనేక స్థలముల నాక్రమించుకొనిరి. గరుడనగరి చెంత సంబువరాయల దళములు చారసిల్లినవి. భీకర సంగ్రామము నడచినది. సాయణాచార్యులవారి పరాక్రమ ప్రకటన వలన నుదయగిరి సైన్యము జయమందెను. తరువాత వీరసావణ్ణఉడయలు కాంచీపురమును గైవసము జేసికొనెను.

ఉదయగిరి దళములిట్లు తీరద్రావిడదేశమున జయభేరిని మ్రోయించుచుండిన కాలమునె పశ్చిమ రంగమున ముల్బాగలు బలములు పొడసూపినవి. ముల్బాగలునుండి దండు తరలి కుమారకంపణ తూర్పుకనుమలలోని లోయమార్గముగుండ పయనము సాగించి వచ్చి పాలేటిని దాటి దాని దక్షిణతటమున విరించిపురమున విడిసెను. రాజనారాయణ సంబువరాయడు స్వయముగ దండును నడుపుకొనుచు శత్రువులను పాఱదోలుట కచటికి వచ్చెను. ఉభయపక్షములవారికిని పాలారు తీరమున ఘోరసంగ్రామము పొసగినది. యుద్ధమున రాజనారాయణ సంబువరాయ డోడి శత్రుదుర్భేద్యమని పేరెన్నిక కెక్కిన పడైవీడు రాజగంభీరగిరి దుర్గమున దల దాచుకొనెను. అతని వెన్నంటి తఱుముచు వచ్చిన కుమారకంపణ ఆ కోటను ముట్టడించెను. ముట్టడి కాగజాలక రాజనారాయణుడు కోట దర్వాజాలలో నొక దానిని దెఱపించి ఖడ్గహస్తుడై వెలువడి కుమార కంపణతో నేకాంగి పోరు సలిపి రణశయ్య నలంకరించెనట. అంతట గండరగూళి మారయనాయకుని యాధిపత్యముక్రింద విజయనగర సేనలు రాజగంభీర దుర్గమును లగ్గలువట్టి వశపఱచుకొనిరి. కోటయందుండిన రాజనారాయణుని పుత్రుడిమ్మడి వెఱ్రిమణ్

కొండ సంబువరాయడు మారయనాయకునిచే బందీకృతుడాయెను. అంతట దొండమండలమున సంబువరాయల యేలుబడి తుదముట్టినది. కుమార కంపణ రాజగంభీర దుర్గమునుండి బయలుదేరి యంతకుముందే వీరసావణ్ణ స్వాధీనముజేసికొని యుండిన సంబువరాయని రాజధాని కాంచీపుర మునకుబోయి యచట స్థిరముగ నిలిచి తొండ మండలరాజ్యమును పాలింపగడగెను.

తొండమండల విజయముతో కుమారకంపణ దక్షిణ దిగ్విజయయాత్ర ముగియలేదు. మధుర మహమ్మదీయ రాజ్యమును గూలద్రోయవలయు ననియతని ముఖ్యోద్దేశము. దండయాత్రను బంపునపుడు రాయ లొసగిన యాదేశమట్టిది. ఈ దండయాత్ర కేవలము రాజ్యవిస్తరణకొఱకు తలపెట్టినది కాదు. హిందూధర్మ పునరుద్ధారణయే దాని పరమావధి. సామాన్యముగ చరిత్రకారుల దృష్టికెక్కని విషయమొకటి దీని దేటతెల్లము సేయుచున్నది. కుమారకంపణతో గూడ బయలు దేరినాడు కాపేటి రంగధాముడు నిజావాసస్థల మును జేరుటకు. మల్లిక్ కాఫురుచే దఱుమగొట్టబడి, యాదేవు డదిమొదలు పరదేశముల గ్రుమ్మరి క్రుమ్మరి తుదకెట్లో తిరుమలకు వచ్చి శ్రీ వేంకటేశ్వరు నాశ్రయించెను. ఆపద్బాంధవుడు గదా యేడుకొండలవాడు. ఉండ నెలవు జూపి గ్రాసవాసములకు గొదువకానీయక బగు యేర్పా టులను గావించెను. దేశ ద్రిమ్మరితనముబోయి కాలము సుఖముగ గడచుచుండినను అంతటి దేవునికి పరపంచల బ్రాకులాడుట నచ్చునా? పరాన్నము రుచించునా? కావున నెట్లయిన నిజ నివాస స్థలమునకు మరలిపో నిశ్చయించుకొనెను. అప్పుడె కుమారకంపణ దక్షిణ దిగ్విజయయాత్ర వెడలుచున్నాడను విషయ మాయన దివ్యచిత్త మునకు వచ్చినది. ఇక తురకల భయము లేదనియు స్వదేశమునకు బోవచ్చుననియు ధైర్యము గలిగి నది. తన్నిలు సేర్పజాలిన భక్తశిఖామణి కుమార కంపణ దండనాయకులలో గానవచ్చినాడు. అభినవ ద్రోణాచార్యుడని ప్రఖ్యాతినందిన ద్విజోత్తముడు గోపన్న దనకు నచ్చిన భక్తుడు. అత డుద్దేశించిన కార్యమును పట్టుదలతో నెరవేర్పగలడు. కావున కార్యవాదియగు శ్రీ రంగనాయకుడు గోపన్నకు స్వప్నమున బొడసూపి 'పత్సా, మహమ్మదీయు లను బాఱదోలి మమ్ము శ్రీరంగము సేర్పు' మని యాజ్ఞాపించెను. నిదుర మేల్కని గోపన్న వేంక టాచలమునకు బోయి రంగనాథుని నాచ్చి యూరులతో గూడ దోడ్కొని కుమారకంపణ వెంట దక్షిణ దిగ్విజయ యాత్ర వెడలెను. తొండ మండలమును సాధించి సంబువరాయ రాష్ట్రము సంపూర్ణముగ స్వాధీనపఱచుకొనిన పిమ్మట కుమారకంపణ మధుర మహమ్మదీయ రాజ్యగడి ప్రదేశమున నుండు చెంజిమల దుర్గమునకు గోపన్న నధ్యక్షునిగ నియమించెను. 'శింజీపురముచెంత సింగరాయపురాఖ్య మగ్రహారముజేసి యందు బసిడి కోవెల గట్టించి గోపనాయడు రంగపతిని ప్రతిష్ఠించె భక్తినచట'. శ్రీరంగపతి యాదేవుని యాజ్ఞ చొప్పున శ్రీరంగమున ప్రతిష్ఠింపక మార్గమధ్యమున నొక బ్రాహ్మణాగ్రహారమున బసిడి కోవెల గట్టించి యచట నేల నిలుపగలసి వచ్చెనో కనుగొనవలసియున్నది. దీనికి రెండు కారణము లూహ్యములు — మొదటిది వన్యరాజ ప్రతిష్ఠంభము. సంబువరాయ మధురరాజ్యముల మధ్య గడిప్రదేశమున గొన్ని యాటవిక సంస్థా నము లుండినవి. దుర్గమారణ్యమధ్య సీమల నుండుటపలన నవి సులభసాధ్యములు గావు- వాని జయించి వశపఱచుకొనక ముందు సాగుట యుక్తముగాదు. తత్కారణమున మధురరాజ్య ముపై వెంటనే కూచిసేయుట కనుకూలపడియుం డక పోవచ్చును. దీనికంటె బలవత్తరమైన కార ణము బహమనీ రాజ్యముతోడి యుద్ధము.

సుల్తాను మహమ్మదుశాహు బహమనీసింహా సనము నధిష్ఠించినపుడు రాజకీయవాతావరణము నందతనికి ప్రతికూల చిహ్నము లనేకములు పొడ సూపినవి. రాజ్యములోపల నంతశ్శత్రుపర్గము బలిసి యతని యధికారమును గూలద్రోయుటకు ప్రయత్నము సల్పుచుండినది. బలవంతులగు పెక్కండ్రమీరుల కతడు తఖ్తు నెక్కుట ఇష్టము లేదు. అతని విరోధి రాజమండలముతో వారు

గుఱ్ఱలు సలుపుచుండిరి. ఢిల్లీసుల్తాను ఎత్తివచ్చు నను భయమతని గళవళ పెట్టుచుండినది. ఇదియుత్త భయముగాదు. ఢిల్లీ పాదుశాహు ఫీరూజుశాహు తుఘ్లూకు సమయము చిక్కినప్పుడెల్ల దక్కనుపై దండయాత్ర వెడలి ఖలపడిపోయిన ఢిల్లీశ్వరు నధికారమును పునఃప్రతిష్ఠ యొనరింపబోవు చున్నాడనని బెదరించువాడు. మాటలతో నతడు దృప్తిపడియుండిన భయమున కవకాశ ముండి యుండదు. ఒరిస్సా దండయాత్ర నతడు జయ వంతముగ ముగించుకొని ఢిల్లీకి తిరిగివచ్చిన పిమ్మట, హిజిరీ ౭౬౨ నకు సరియైన క్రీ. శ. ౧౩౬౦ వ సంవత్సరమున, దౌలతాబాదుచెంత వేటాడు మిషమీద సైన్యముతో బయలువెడలి యొక మజిలీదూరము ప్రయాణముజేసెను. ఇంతటనె యుత్తర హిందూస్థానమున గొంత సంక్షోభము గలుగగా ప్రయాణమునుసాలించి వెనుదిరిగిపోయెను. ఆయవాంతర మట్లు గడచి పోయినను ముహమ్మదుశాహు హృదయమున నతనివలన భయ మతిశయించినది. ఈ భయమును నివర్తి జేసికొనుటకొఱకు అతడప్పుడు ఈజిప్టుదేశ మున వలసయుండిన మహమ్మదీయ మతగురువగు ఖలీఫా నాశ్రయించెను. గతించిన తన తండ్రి యాత్మసంతృప్తికొఱకు మక్కా మొదలగు పుణ్యస్థానములకు యాత్రవెడలుచుండిన తల్లిచేతికి బొక్కసములోని ధనమును మణిభూషణాదుల నూడ్చి యిచ్చి, వానిమూలమున మక్కా లోని సయ్యదులను దృప్తులనుజేసి వారి సాహాయ్యమువలన నతని ప్రసాదము వడసి ఢిల్లీ పాదుశాహుకు బహమనీ సుల్తానుపై యుద్ధ ప్రయత్నములను మానుకొనవలసినదని యతనిచే నొక ఫర్మానాను వ్రాయించి ఢిల్లీ దర్బారునకు రవానా సేయున ట్లేర్పాటులను గావింపవలయు నని చెప్పి పంపెను.

ముహమ్మదు శాహుకు శత్రువు ఢిల్లీ సుల్తా నొక్కడేకాదు. ఆతని తండ్రియొక్క రాజ్య లాలసత్వమువలన ఇరుగు పొరుగు హిందూ రాజ్యాధిపతులతో నతనికి వైరము గలిగినది. కంపిలిరాయల కాలమునుండియు కంపిలి రాజ్య మునకును దేవగిరి రాష్ట్రమునకును కృష్ణానది సరిహద్దుగ నుండినది: ముహమ్మద్ బిన్ తుఘ్లూకు కంపిలిని జయించి ఢిల్లీ సామ్రాజ్యమున గలిపి కొనిన పిమ్మటగూడ నవి వేర్వేరు మండలాధిపతుల పాలనక్రింద నుండినందువలన నీసరిహద్దు మారలేదు. హరిహర బుక్కలు మహమ్మదీయ మతమును విసర్జించి ఢిల్లీ పాదుశాహుపై దిరుగబడి స్వాతంత్ర్యమును బ్రకటించిన తరువాత గూడ కృష్ణకు దక్షిణముననుండిన రాష్ట్రము వారి యేలు బడి క్రిందనే యుండినది. కాని సుల్తాను అలావుద్దీను హసనుగంగూ గుల్బర్గయందు స్వతంత్ర ప్రభుత్వ మును స్థాపించినప్పటినుండియు గృష్ణాతుంగభద్రల మధ్య యంతర్వేదిని గబళింప నుద్యమించి హరి హరరాయల రాజ్యాంత్యదశయం దెత్తివచ్చి యందుజాలభాగము నాక్రమించుకొనెను. అట్లే తెలింగాణముపై నెత్తిపోయి కాపయనాయకు నోడించి యతనికడనుండి కొలాసు మున్నగు సీమల నొడిచికొనెను. వారు తమ తమ రాష్ట్రము లను మరల స్వాధీనపఱచుకొను తరుణముకై వేచియుండిరి. ముహమ్మదు సింహాసనము నధిష్ఠిం చిన వెంటనె విజయనగర తెలింగాణరాజు లిరువురును బూర్వము గోలుపోయిన నిజరాష్ట్ర ములను మరల సాధించుట కదియె యనుకూల సమయమని నిశ్చయించి యొండొరులతో మైత్రి గావించుకొని యేకకాలమున గుల్బర్గకు రాయ బారుల నంపిరి. అనాదినుండియు విజయనగర రాజ్యమునకును మహమ్మదీయ రాష్ట్రమునకును కృష్ణానది యెల్లయై యుండెననియు, సుల్తాను అల్లావుద్దీను హసన్‌గంగూ అక్రమముగ కృష్ణను దాటి దానికి దక్షిణమునందుండిన విజయనగర రాష్ట్రము నాక్రమించుకొనెననియు నిట్లత డక్రమముగ గొన్నరాజ్యమును మరల దనకప్ప గించవలయుననియు లేనియెడల ప్రచండసైన్య ముతో నెత్తివచ్చి తన రాష్ట్రమును దాను స్వాధీనము జేసికొనెదననియు బుక్కరాయలు వర్తమాన మంపెను. కొలాసు మున్నగు సీమ లనాది నుండియు దెలింగాణమునకు జెందిన వనియు సుల్తాను అల్లావుద్దీను హసన్‌గంగూ వాని నక్రమముగ వశపఱచుకొనెననియు వాని

మరల దనకిచ్చివేయవలసినదనియు లేనిపక్షమున దండెత్తివచ్చి కైవసము జేసికొనెదనని కాపయనాయకుడు రాయబారమంపెను. ముహమ్మదు శా హేమి సేయగలడు? అప్పటి దుర్బల స్థితియం దతనికి యుద్ధము తలపెట్టరాని విషయము. అమీరులా విశ్వాసపాత్రులుగారు; బలమా చాలదు; ధనమా లేదు. మీదుమిక్కిలి ఢిల్లీ పాదుశా హెత్తివచ్చు ననుభయము. ఈ స్థితియందు విజయనగర తెలింగాణ ప్రభువు లేకమై కయ్యమునకు గాలుద్రవ్విన వారి నత డెట్లైదు రొక్కనగలడు? కాని యప్పటి స్థితిగతు లట్లె నిలుకడగ నుండజాలవు. ఖలీఫాకడకు బోయిన తన తల్లి కార్యమును సాధించుకొని వచ్చిన హిందూరాజులకు దగినశాస్తి చేయవచ్చును. కావున తనతల్లి తిరిగివచ్చునంతవఱకు కాలము గడపిన నటువెనుక సర్వకార్యములును సానుకూలపడవచ్చును. అని చింతించి ముహమ్మదు శాహు కాలహరణము సేయ నిశ్చయించి, విజయనగర తెలింగాణ రాయబారులను సత్కరించి లాలించిబెలించి ప్రతిసందేశమును జెప్పి వీడికోలిచ్చి పంపక పదినెనిమిది మాసములు గడపెను.

అంతట ముహమ్మదుశాహు తల్లి తిరిగి వచ్చినది మక్కానుండి. తాను కోరినట్లే ఖలీఫా ఢిల్లీ సుల్తానుకు ఫర్మానా వ్రాసి యంపెనని తెలియ వచ్చెను. ఫీరూజుశాహు తుగ్లూకు మతమునందు గాఢాభిమానముగల ప్రభువు. ఖలీఫా యాజ్ఞను జవదాటక యాచరణకు దేగలడనుటకు సంశయములేదు. కావున రాజకార్యముల నిచ్చవచ్చినట్లు జరుపుటకు జంక బనిలేదు. మొట్టమొదట తనయెడ విముఖులైన యమీరులను శిక్షించెను. పిమ్మట విజయనగర తెలింగాణ రాయబారులను రప్పించి కోపోద్రేకముతో వాని నేలిన ప్రభువులు తనకు జెల్లింపవలసిన కప్పమును ఖజానాకు జమకట్టక నింతకాల మాలస్య మేలచేసిరో తెలుపవలసినదని తీవ్రముగ మందలించెను. రాయబారులంతట భయభ్రాంతచిత్తులై తమ సంస్థానములకు మరలి చని తమ ప్రభువుల కా విషయములను నివేదించిరి. అందుమీదట బుక్కరాయలును గాపయనాయకుడును బహమనీ సుల్తానుపై యుద్ధము ప్రకటించిరి. తూర్పున గాపయనాయకుని సైన్యములు వచ్చి పూర్వము అల్లావుద్దీన్ హసన్‌గంగూ తెలింగాణమునుండి జయించి కైవసము జేసికొనియుండిన కొలాసు మొదలగు స్థలములను స్వాధీనపఱుచుకొనెను. అట్లే దక్షిణము నుండి విజయనగర సైన్యములు వచ్చి కృష్ణా తుంగభద్రల మధ్యసీమల నాక్రమించుకొనెను. ఇట్లు విజయనగర బహమనీ రాజ్యములకు యుద్ధము పొసగినది.

ఈ యుద్ధ వృత్తాంతమును నిశ్చయముగ నిర్ణించి చెప్పుటకు వీలులేదు. మహమ్మదీయ చరిత్రకారులు పలువు రీ యుద్ధమునకు సంబంధించిన ముఖ్యాంశముల నన్నిటిని విపులముగ జర్చించియున్నారు; కాని వారియందొకఱు చెప్పిన విషయమును మఱియొకఱు చెప్పరు; చెప్పిన విషయములకైనను బొందిక లేదు. మటియు వారు మహమ్మదీయుల పరువు ప్రతిష్ఠలను గాపాడుటకొఱకు నిజమును గప్పిపుచ్చుటకు ప్రయత్నించియుండుటవలన వాస్తవముగ నీ యుద్ధ మిట్లునడచెనని కాని యిట్లు పర్యవసాన మందెనని కాని దృఢముగ జెప్పుటకు వలనుపడదు. మహమ్మదీయ చరిత్రకారులలో ప్రఖ్యాతుడైన ఫెరిష్తా ముహమ్మదుశాహు అప్రతిహత వీరుడనియు, నతడు ప్రళయ మారుతమువలె సర్వమును ధ్వంసము జేయుచు విజయనగర సామ్రాజ్యమునం దొకకొన నుండి మఱియొక కొనవరకు ద్రొక్కిచూచెననియు వ్రాసియున్నాడు. అతని చరిత్రవలన ముహమ్మదు శాహు బుక్కరాయలను దారసిల్లిన ప్రతిరణక్షేత్రమునను బరాజితుని గావించి, వేటకాడు మృగమును బోలి వెన్నంటి నిలిచినచోట నిలువనీయక దఱుముచు, తుద కతడు దన రాజధాని యందు తలదాచుకొనగా, నొక యుక్తినిబన్ని వెలుపలి కెలయించి యుద్ధమున జిదుగమోది, తన కిష్టము వచ్చినట్టి సంధిషరత్తుల కతని బద్ధుని గావించెననియు దెలియ వచ్చుచున్నది. ఇది వాస్తవమునకు దూరము. అతడు చెప్పిన విషయములలో గొన్ని నిజము కావచ్చును; కాని యుద్ధమున విజయనగర

సైన్యములు అతడు వర్ణించి నంతటి సత్వహీనము లును శౌర్యరహితములును గావు. మహమ్మదీయు లతో రణరంగమున సరిపోరుచు దెబ్బకు బదులు దెబ్బ గొట్టుచు పోట్లాడినట్లు రుజువు జేయు సాక్ష్యము గలదు. చిట్టచివరకు ముహమ్మదుశాహు రెండు రాజ్యములకు మధ్య పొలిమేర కృష్ణా నదియే యనియు, గృష్ణకు దక్షిణమున నుండిన కొన్ని మహాళ్లుభయ రాజ్యముల యుమ్మడిపాలన క్రింద నుండవలయుననియు నొప్పుకొని బుక్క రాయలతో సంధి గావించుకొనెను. ఫెరిష్తాకూడ ఈ సంధిషరత్తులను జెప్పియుండుటవలన నవి వాస్తవములనుటకు సంశయమందవలసినది లేదు. వీనినిబట్టి చూడగా నీ సంగ్రామమున చిట్టచివరకు విజయము విజయనగరము వైపుసకే మ్రొగ్గినట్లు తోచుచున్నది. ఈ సంగరముయొక్క కారణము లను స్మరింపుడు. ఉభయరాజ్యములకు ఎల్ల కృష్ణా నది యని యంగీకరించి యంతకుముందు బహమనీ సుల్తా నక్రమముగ నాక్రమించిన కృష్ణ దక్షిణ మందలి విజయనగర రాష్ట్రమును వీనకు మరల నిచ్చివేయవలసినదని బుక్కరాయలంపిన రాయ బారమును ముహమ్మదుశాహు నిరాకరించుటవలన గదా యీ యుద్ధమారంభమైనది. సంధి షరత్తుల ప్రకారము కృష్ణానదియే యుభయరాజ్యములకును సరిహద్దని ముహమ్మదుశాహొప్పు కొనవలసి వచ్చెగదా. కృష్ణకు దక్షిణమున గొన్ని మహాళ్లపై నతని యధికారమింకను సాగుచుండెనే యనిన నదియును సంపూర్ణమైనదికాదు; ఉమ్మడియధి కారము; విజయనగరరాయల పొత్తున ననుభవింప వలసి యుండినది. కావున ఈ షరత్తులు బహమనీ సుల్తానునకు ముదావహములును లాభకరములును గావు. ఇందువలన ముహమ్మదుశాహు పూర్వమతని తండ్రి విజయనగర రాయలకడ నుండి జయించిన రాష్ట్రమునుమరల నీయవలసివచ్చెను. సంపూర్ణముగ విజయుడైన యేరాజు రాష్ట్రనష్టము గలిగించు సంధి కొడబడగలడు ? కావున ముహమ్మదుశాహు నకు ఫెరిష్తా చెప్పిన ట్లీయుద్ధమున జయము జేకుఱ లేదనియు బుక్కరాయలే తుట్టతుదకు విజయు డాయెననియు నిష్కర్షగ జెప్పవచ్చును. ఈ సంగ్రా మము ముగిసి సంధి క్రీ. శ. ౧౩౬౫ సంవున కుది రెను. అది మొదలు క్రీ. శ. ౧౩౭౮ పర్యంత మీ రెండురాజ్యములకును మరల యుద్ధము పొసగ లేదు.

పూర్వ దిగ్విజయము

బహమనీ యుద్ధము సమాప్తమైన పిమ్మట బుక్కరాయలు రెడ్డిరాజ్యముపై దండువెడలి నట్లున్నది. దండయాత్రకు గారణములుకాని, యుద్ధవృత్తాంతముగాని తెలియరావు. రెడ్డిరాజ్య స్థాపకుడగు ప్రోలయవేమారెడ్డి క్రీ. శ. ౧౩౫౫ వ సంవత్సరమున గతించెను. అనంతర మతని జ్యేష్ఠ పుత్రుడు అనపోతారెడ్డి సింహాసనము నధిష్ఠించెను. ఇతడు శూరుడు; యుద్ధాసక్తగలవాడు; ఇందు మూలమునసేమొ ఇతనికి శూరాన్న పోతనృపతి యను పేరు గలిగినది. ఇతని యుద్ధలాంపట్యము వలన రెండు రాజ్యములకును గలహము సంభవించి యుండిన నుండవచ్చును. ఈ యుద్ధ వృత్తాంత మేమియు మనకు దెలియకపోయినను రాయలకు జయము చేకూరినట్లు మనము దృఢముగ జెప్ప వచ్చును. ఏలన ప్రోలయవేమారెడ్డి ఏలుబడియందు రెడ్డిరాజ్యము క్రిందనుండిన యహోబల వినుకొండ భూములు రెండును అనపోతారెడ్డి కాలమున రాయరాజ్యమున గలిసిపోయినవి. అనపోతారెడ్డి పరాజితుడు గాకపోయిన యెడల వైసీమలు రెండును రాయల యాధిపత్యము క్రిందికి వచ్చి యుండవు.

మధురా విజయము

(క్రీ. శ. ౧౩౭౦-౭౧). పూర్వోత్తరరాజ్య ముల కార్యముల నిట్లు తృప్తికరముగ దీర్చుకొనిన పిమ్మట బుక్కరాయలు దన దృష్టిని దక్షిణదిశకు ద్రిప్పెను. మహమ్మదీయుల పాలన క్రింద హిందువు లచట నెట్టి దురవస్థల పాలైనదియు నింతకుముందు కొంత తెలియబఱచి యున్నాడను. హిందూదేవా లయము లనేకములు ధ్వంసము గావింపబడినవి. పెక్కు తురకలకు మసీదులుగ మార్పబడినవి. వేల కొలదినిరపరాధులు హిందువులు వధింపబడుచుండిరి;

వారి యాస్తిపాస్తులు తురకలపాలైనవి; మతాచరణము మాన్పబడినది; గోవధము అడ్డమాకలేక జరుగుచుండినది; భయభ్రాంతులై ప్రజలలమటించుచుండిరి. హిందూ స్వాతంత్ర్యమును బునరుద్ధరించుటకొఱకును హిందూధర్మమును బునఃప్రతిష్ఠించుటకొఱకును స్థాపింపబడిన హిందూ సామ్రాజ్యాధిపతి బుక్కరాయలు వారి కడగండ్లను కన్నులార గాంచుచు నూరక నెట్లుండగలడు? తురకలను దటిమివేసి వారి బారినుండి దాక్షిణాత్య హిందువులను సంరక్షించవలసిన భారము దనపై నున్నదని యతడు నిశ్చయించి యుద్ధప్రయత్నములు సేయగడగెను. సమయము గూడ ననుకూలపడినది. మధుర మహమ్మదీయులు దేవగిరినుండి కోరితెచ్చుకొనిన కుర్బత్‌ఖానుగంగూ బుద్ధి కనకపు సింహాసనముపై గూర్చుండబెట్టిన శునకము ననుకరించినది. రాజ్య సంరక్షణ యందును శత్రునిర్మూలమునను జూపవలసిన నేర్పు స్త్రీల యుడుపులను భూషణములను ధరించి స్త్రీ వేషమున దర్బారు సేయుట యందును రూపవంతులగు యువకుల సంగతిని ప్రొద్దుపుచ్చుట యందును జూపమొగలిడెను. అమీరులకును పెద్దలకును మతాచార్యులకును నతనిపై నేవ జనించినది. అంతఃకలహము లభివృద్ధియైనవి. ఏసమయమున నైకమత్యమావశ్యకమో యప్పుడు వైమనస్య మెక్కుడైనది. మధురా రాజ్యమందలి స్థితిగతులను జూరులమూలమున జక్కగ నెఱిగిన బుక్కరాయలు దాని సాధించుట కదియె తరుణమని గ్రహించి, క్రీ. శ. ౧౩౬౦-౬౧ మొదలు తొండమండలమును దనకు ప్రతినిధిగ పాలించుచుండిన దన పుత్రుడు కుమారకంపణ నాయకత్వము క్రింద నొక ప్రచండ సైన్యమును దురకల యధికారమును గూలద్రోసి సేతువు పర్యంతము వ్యాప్తమైయుండు దక్షిణదేశము నంతటిని స్వాధీనపఱచుకొన నియోగించెను.

కుమారకంపణ మధుర దండయాత్ర కేవలము రాజ్యసంపాదనకొఱకు దలపెట్టిన జైత్రయాత్రమాత్రముకాదు. అది ధర్మవిజయయాత్ర; మహమ్మదీయుల జిహాదునకది హిందువుల జవాబు. మ్లేచ్ఛసంహారము కొఱకును హిందూసనాతన ధర్మసంరక్షణ కొఱకును ఉద్యమింపబడినది. సింగరాయ పురమున విడిసియుండు కావేటిరంగని నిజనిలయమునకు జేర్చి యచట నాదేవుని నెలకొల్పుట దాని ప్రధానోద్దేశము. త్రిజగన్నాథు డొంటిగ పయనము సేయునా? దేవదేవుని బురస్కరించుకొని, తురకల దౌర్జన్యమునకు దాళజాలక యంతర్ధానమందియుండిన దాక్షిణాత్య దేవత లందఱును విజయనగర సైన్యములను వెన్నంటి నడచిరి. తురకలపై రాయసైన్యముల విజయములతో గూడ దేవాలయ పునర్నిర్మాణ సంప్రోక్షణలును దేవతల పునఃప్రతిష్ఠలును నడచినవి. తురకలు మాయమైరి; వారి మసీదులు ధూన్యాలయములలైనవి.

ఈ ధర్మవిజయ యాత్రయందు రెండుఘట్టములు గానవచ్చుచున్నవి. ప్రథమఘట్టము కావేరీ తట గడిదుర్గములనుండి మహమ్మదీయులను దఱుముటతో ముగిసినది. క్రీ. శ. ౧౩౭౦ వ సంవత్సర ప్రారంభమున రాయరాణువ గోపన దండనాయకుని నాయకత్వముక్రింద చెంజినుండి బయలువెడలి తీవ్రప్రయాణములమీద కావేరీతీరమును బోయి చేరెను. శ్రీరంగమునకు సమీపమునందు సమయవరముకడ మహమ్మదీయ బలములు మార్గము నరికట్టినవి. పెద్దయుద్ధము నడచినది; మహమ్మదీయులు పరాజితులై పాఱిపోయిరి. ఆ ప్రాంతదేశమున వారి ముఖ్యదుర్గమగు కన్ననూరు కుప్పము విజయనగరమునకు వశపడెను. కన్ననూరు కుప్పముకడ రాయసైన్యమునకు గలిగిన విజయము మధ్యయుగ దక్షిణభారతమున సంభవించిన ప్రధానచరిత్రాంశములలో నొక్కటి. అది యిస్లామువై హిందూ ధర్మముయొక్క విజయమును ప్రకటించినది. మధుర సల్తనతుయొక్క విధ్వంసము సన్నిహితమైనదని సూచించినది. ఈ విజయోత్సవము నుచిత రీతిని నడపుటకొఱకు రాయసైన్యములు గన్ననూరు కుప్పమునందు కొంతకాలమాగినవి. దేవాలయములను బాగుచేసి దేవతల బునఃప్రతిష్ఠగావింపవలసినదని కుమారకంపరాయల యుత్తరువైనది. తురకలు మసీదుగ మార్చియుండిన కన్ననూరుకుప్ప మందలి హొయసలేశ్వరాలయమునకు సంప్రోక్షణ గావించి హొయసలేశ్వర లింగమును ఆగమోక్తప్రకార మచట నతడు మరల స్థాపించెను. అంతకు

మించిన మహావైభవముతో సాగినది శ్రీరంగ నాయకుని పునఃప్రతిష్ఠ. దేవాలయ జీర్ణోద్ధారణతో ప్రారంభమైనది కార్యక్రమము. తురకల యుపద్రవ మును దప్పించుకొనుటకొఱకు దశదిశల బఱచి యుండిన భక్తబృందము గోవెలకు మరలి చనుదెంచెను. వేదాంతదేశికాది వైష్ణవ శిఖామణుల యాగమనము ఆ యుత్సవ ప్రాముఖ్యమును మఱియు హెచ్చించెను. గోపనాయకుని పారుపత్య మున సర్వకార్యములును నిర్విఘ్నముగ సాగినవి. పెరుమాళ్లు మరల కోవెలయందు సుప్రతిష్ఠితుడైన పిమ్మట నా దేవుని నిత్యనైవేద్య పూజా పురస్కా రములును పఱోత్సవ మాసోత్సవ బ్రహ్మోత్సవాదు లును నిరంతరాయముగ సాగుటకు గోపన్నయు నతనితోడి రాయదండనాయకులును సామంత మన్నీలును ధన కనక వస్తువాహనములను భూము లను సమర్పించిరి. హొయసలేశ్వర రంగనాయకుల వలె చోళమండలమునం దన్నియెడలను పట్టణముల నుండియు గ్రామములనుండియు పలసలు బోయి యుండిన దేవళ్ళందును తమతమ నిజస్థానములకు మరలివచ్చి కుదురుకొనిరి.

శ్రీరంగనాథుని పునఃప్రతిష్ఠతో మధురా విజయమున పూర్వార్థము ముగిసినది. కుమార కంపణ అంతట సైన్యములను గదల్చుకొని మధు రపై నడచెను. ఉత్తరార్థమున జరిగిన యుద్ధమును గూర్చి తెలియవచ్చెడి విషయ మల్పము. కంప రాయని నిగ్రహించుటకు గుర్బత్ హసన్ గంగూ యెట్టి ప్రయత్న మొనర్చెనో తెలియదు. స్త్రీ వేష ధారణయం దాసక్తు డగుటవలనదన వారిచే గర్హితు డైనను అతడు రణభీరువు గాడు. విజయనగర సైన్యములు మధురపై నెత్తివచ్చుచున్నవని విన్నం తటనె, తనయందింకను విశ్వాసమును గోలుపోని యనుచరులనెల్ల గూర్చుకొని బయలువెడలి మధుర తిరుచినాపల్లెల మధ్య నొకచోట శత్రుమార్గము నరికట్టి మాటొడ్డి నిలిచెను. ఇరుదెగలవారికిని ఘోర సంగరము సంఘటిల్లినది. తురకలు పరాజయ మందిరి. సుల్తాను వీరస్వర్గమును జూఱగొనెను.

సుల్తాను మరణముతో కుమారకంపణ దండ యాత్ర సమాప్తినందలేదు. రణక్షేత్రమునుండి తప్పించుకొనిపోయిన సర్దారులు కొందఱు మధు రనుజేరి కోటతలుపులను మూయించి ముట్టడి నిలిచిరి. కోట సులభముగ స్వాధీనపడలేదు. కుమార కంపణ దళనాయకులలో నొక్కడైన సాళువమంగి మహారాజు ఈ ముట్టడియందు దన ప్రతాపమును వెల్లడించి కోటదర్వాజాలయందొక దానిని భగ్నము గావించి లోపల ప్రవేశించెను. పట్టణమంతయు కుమారకంపణకు వైవసమాయెను.

నలుబదియేండ్ల కాలము ద్రావిడ హిందూ ప్రజలను మసగినమారివలె బాధించుచుండిన మధుర సల్తనతంతరించెను. దానిచరిత్ర హిందువుల రక్త ముతో వ్రాయబడినది. అట్టి సర్వజనకంటకమైన దొరతనము మఱియెచటను గానరాదు. అన్ని మహమ్మదీయరాజ్యములనుబోలి యందును హిందు వులకెట్టి హక్కులను లేకపోవుట విశేషముగాదు. దేవాలయనాశన ప్రతిమాభంజనాదులను మతా చార నిషేధమును సామాన్యమే. కాని మధుర సుల్తానులవలె హిందూ రక్తమును చిందించిన క్రూరకర్ములు మహమ్మదీయ ప్రభువులలో నైతము మఱియెందును గానరారు; కొందరు మధురసుల్తా నులను మనుష్య రూపమున నవతరించిన రాక్షసు లనియే చెప్పవలసియున్నది. హిందూజన హింసయే వారి సహజక్రీడ; వారి రక్తదాహము తీరనిది. హిందూజాతి నిర్మూలనమే తమ రాచరికపు పర మావధియని వారెంచినట్లున్నది. పురుషులనక స్త్రీ లనక వృద్ధులనక శిశ్డలనక వారవలంబించిన హిందూ సంహరణ పద్ధతి భయంకరమైనది. అట్టి లోకకంటకుల అధికారము గూలిపోవుటను గాంచి పీడితులైన హిందువులెవ్వరు సంతసింప కుందురు?

మధురావిజయముతో సేతుబంధ రామేశ్వ రము వఱకును వ్యాప్తమైన దక్షిణ భారతదేశమం తయు రాయరాజ్యము క్రిందికి వచ్చినది. క్రీ. శ. ౧౩౩౬-వ సంవత్సరమున హరిహర బుక్కలు తుంగభద్రయొడ్డున స్థాపించిన చిన్న సంస్థానము, హొయ్సలరాజ్య సమీకరణముతో గొప్పరాజ్యమై పెంపొంది మధురావిజయముతో నొక విశాల

సామ్రాజ్యముగ బరిణామ మందినది. తన రాజ్య కాలపు కడపటి దశయందు బుక్కరాయలు సకల దక్షిణ భారత భూమి కంతటికిని చక్రవర్తి యాయెను.

ద్రావిడ దేశమున కంతటికిని తద్విజేతను కుమారకంపణను బుక్కరాయలు పాలకునిజేసెను. దశముల నడపుటయందెట్లో ప్రజావిరిపాలనము నందును నట్లే కుమారకంపణ కడు సమర్థుడు. తురక కల దుష్పరిపాలనవల్ల గాడుపడి యుండినదేశమును వృద్ధిపఱచి యడుగాటిపోవుచుండిన జాతీయజీవనము నుత్సన్నము గానీయక కాపాడుట యావశ్యకమని యతడు గ్రహించెను. చెఱువులను బాగుచేయించి రైతులభూములను సాగుచేయుటకు బ్రోత్సాహ మెట్టెను. గ్రామజీవనమున దేవాలయ ప్రాముఖ్య మును గురించి మహమ్మదీయులచే ధ్వంసము నేయబడిన దేవాలయములను జీర్ణోద్ధారణ గావించి వానికి జెందినపూర్వదత్తి దేవాదాయములను మరల వాని వశపఱచుటయే కాక నూతన దానముల నొసగి నిత్యనైవేద్యదీపారాధనాది పూజాపురస్కా రములును నిత్యోత్సవాదులును జరుగుటకు దగు రీతిని యేర్పాటులను గావించెను. కాని కుమార కంపణ మదురా విజయానంతరము చిరకాలము జీవించి యుండలేదు. నిరంతరము యుద్ధకార్యము లందు నిమగ్నుడై యుండుటవలననేమొ కుమార కంపణ కారోగ్యము చెడి, క్రీ. శ. ౧౩౭౪ వ సంవత్సరారంభమున రాయరాజ్య ప్రజలను దుఃఖ సాగరమున ముంచి యకాలమరణము నందెను.

కుమారకంపణకు దేవు లిరువురు. ఒకతె గంగాదేవి. ఆమె మహాకవయిత్రి. గీర్వాణభాష యందు తనభర్త యుద్ధయాత్రలను మధురావిజయ మను కావ్యమున వర్ణించినది. ఈమె కవితా మహత్వము పూర్వ పాశ్చాత్యపండితుల ప్రశంసకు పాత్రమైనది. మఱియొకతె పేరు రామాదేవి. మఱియు నతనికి పుత్రు లిరువురుండిరి. ఒకడు జొమ్మణ, మఱియొకడు హరిహరుడు.

కుమారకంపణ మరణానంతరము బుక్కరాయలు మఱి మూడేండ్లకాలము రాజ్యపాలన మొనర్చెను. ఈ మూడేండ్లలోపలను యుద్ధము లెవ్వియు జరుగలేదు. బుక్కరాయల యనంతరము రాజ్యాధిపతి యెవ్వడగునా యను విషయమందఱిని కలవర పెట్టసాగినది. బుక్కరాయలకు పుత్రులనేకు లుండిరి. అందఱును రణరంగమునం దాఱితేరిన శూరులే. అందఱును ప్రజాపాలనా దక్షులే. వీరి యం దుదయగిరి విరూపణ్ణ చిక్కకంపణ భాస్కర భవదూర హరిహరాదులు ముఖ్యులు. వీరియందు హరిహర రాయలు వజ్రసింహాసనము నెక్క నర్హు డని నిశ్చయించి బుక్కరాయ లతని దన యనంత రము రాజ్యాధిపతిగ నియమించెను.

కుమార హరిహరరాయల సామ్రాజ్యాధి పత్య నియుక్తి యందఱికిని నచ్చలేదు; తక్కిన పుత్రులుగాని వారి సంతుగాని యీ యేర్పాటు నంగీకరింపరని బుక్కరాయలు చక్కగ నెఱుగును. కావున రాజ్యమున విప్లవమును జరుగనీయకుండు టకై పాలనయందతడు కొన్నిమార్పుల నొనర్చెను. అందఱియందును బలవంతుడు ఉద్దగిరివిరూపణ్ణ. మఱియు బుక్కరాయల పట్టమహిషి జొమ్మాదేవి గర్భసంభూతుడగుటచేదనకే రాజ్యాధిపత్యమునకు వారసత్వపు హక్కు గలదని యతని యభిప్రా యము. కుమారకంపణ పుత్రుడు జొమ్మణకుగూడ కుమార హరిహరరాయలయెడ సౌహార్దములేదు. వారి యుద్దేశములను గ్రహించి బుక్కరాయ లుద్దగిరి విరూపణ్ణనతడు పాలించుచుండిన ఆరగ రాజ్యమునుండి రాజధానికి రప్పించెను. ఆతనిస్థాన మున నంతవఱకు మంత్రిగ నుండిన చౌడపమాధ వుని ఆరగ-తులు నాడు రాజ్యములకు బాలకునిగ నియమించెను. మఱియు ద్రావిడ దేశమునకు జొమ్మణ నతని తండ్రి స్థానమున పాలకునిగ నియో గింపక ఆ రాజ్యపాలనకు సంబంధించిన వ్యవహార ముల నన్నిటిని తానే స్వయముగ విచారింపగడ గెను. ఈ యేర్పాటులవలన రాజకుటుంబమునం దసంతృప్తి గలిగినను రాజ్యమున శాంతికి భంగము గలుగలేదు. ఇట్లు మహావైభవముతో రాజ్యమునేలి బుక్కరాయలు క్రీ. శ. ౧౩౭౭ ఫిబ్రవరి మాసమున దేహము చాలించెను.

భరతఖండము నేలిన సార్వభౌములలో బుక్కరాయలు మహామహుడు. సామ్రాజ్యనిర్మాణమున నతడు చంద్రగుప్తమౌర్యునికిని శివాజీకిని సమానస్కంధుడు. సామ్రాజ్యనిర్మాణ కీర్తినతడు దన యన్నయగు హరిహరునితోడను గురువగు విద్యారణ్యులతోడను బాల్గొనవలసియున్నను, అతడే విజయనగర సామ్రాజ్యమునకు వాస్తవమైన నిర్మాతయని చెప్పవలయును. ఆతడు శూరాగ్రేసరుడు. రణరంగమున నతని ప్రతాపము వినుతికెక్కినది. మహమ్మదీయులపై నతని విజయములను గాంచి యచ్చెరువంది సమకాలిక హిందువులతని పాండవులలో నర్జునుని వంటివాడని మెచ్చిరి. అనేకు లాతడు కలియుగ రాజసులనదగు మహమ్మదీయులను సంహరించుట కవతరించిన శ్రీకృష్ణమూర్తి యనిరి. రాజ్యపాలనమునందు సాధ్యమైనంత వఱకతడేమియు గొత్త మార్పులను దెచ్చిపెట్టలేదు. రాయసామ్రాజ్యమునకు హృదయతుల్యమైన రాయలసీమయందు పాలనవిధానము హరిహరరాయ లేర్పఱచిన పద్ధతులమీదనె నడచుచుండెను. ఇతర ప్రాంతములందు ప్రాచీనహిందూ పాలనాపద్ధతులను చెక్కు చెదరనీయక గాపాడెను. కాని కొన్ని పాలనా విశేషముల నిచట సంగ్రహముగ దెల్పుట యుక్తము. రాజ్యముయొక్క ఆర్థికపరిస్థితులను బెంపొందించుట కొఱకు జేసిన యత్నములు ముఖ్యముగ పరిగణింప దగినవి. రాజ్యసంపద యంతయు వ్యవసాయముపై నాధారపడి యుండుటవలన కృషీవలుల స్థితిని బాగుసేయుటకును, భూమిని సాగుచేయుటకుదగిన సహకారమొనగూర్చుటకును గట్టి ప్రయత్నములు జరిగినవి. రాయలసీమయందు పెద్దపెద్ద చెఱువులును వాని జలసంభరితములు సేయగల కాలువలును ద్రవ్వబడెను. అరవదేశమునందు గ్రామజీవనమున ముఖ్యస్థానములగు దేవతాయతన పునర్నిర్మాణము బహుళముగ నడచెను. గ్రామజీవనమున కెట్టిలోపమును గలుగనీయక పోషించుటకు దగిన వసతులు సమకూర్పబడెను.

ఇచ్చట చెప్పదగిన ముఖ్యవిషయ మింకొకటి కలదు. అది మతాచార వ్యవహారములయెడ రాయలవలంబించినమార్గము. బుక్కరాయల రాజ్యకాలమున వైష్ణవులకును జైనులకును మతవిషయమై కలహము గలిగినది. ఈ కలహము నాస్పదము జేసికొని బుక్కరాయ లామతాను యాయులొండొరులయెడ ప్రవర్తించనలసిన విధమును నిర్ణయించుచు నొక ధర్మశాసనమును బ్రకటించి దాని ప్రతులను రాష్ట్రమందలి ముఖ్యస్థానములందు శిలలపై జెక్కించి నిలిపెను. ఈ శాసనమున బ్రతిపాదింపబడియుండు మతసామరస్యము వైష్ణవ జైన దర్శనములయెడనే కాక తక్కిన మతముల కన్నిటికిని అన్వయింపగలదని సూచన. కావున నీ వైష్ణవ జైన ధర్మశాసనము మతవ్యవహారములయెడ విజయనగరరాయ లవలంబించిన మార్గమును దెలుపుచున్నది. సింహాసనాసీనులైన ప్రభువులకు వ్యక్త్యాత్మక మతాభిమాన ముండవచ్చును; కాని రాయసంస్థానమున కట్టి మతాభిమానమును దన్మూలమున గలుగు మతపక్షపాతమునులేవు. సంస్థానమున నన్నియు సమానములే, ఆపరపాత్రములే. సింహాసనస్థుడు మూర్తిభవించిన సంస్థానము. రాష్ట్రవాసులందఱికి నతడు ప్రతినిధియగుటవలన అన్యవిషయము లందువలె మతవిషయములను జాతిమతభేదములను పరిగణింపక నిష్పక్షపాతముగ వర్తింపవలసినది హిందూ ధర్మశాస్త్రములందు వివరింపబడిన రాజధర్మము. వజ్రసింహాసనము నెక్కిన విజయనగర చక్రవర్తులందఱు నీ ధర్మము ననుసరించియె మత వ్యవహారములను జరుపుచువచ్చిరి. కావుననే సామ్రాజ్యనివాసులైన యూదులును క్రైస్తవులును, మహమ్మదీయులును హిందూ ప్రజలవలె రాయలే తమ సమయ సాంఘిక మర్యాదలకు సంరక్షకుడని విశ్వసింపగలిగిరి.

మఱియు బుక్కరాయలు వైదికధర్మము అభివృద్ధిసేయుటయందు చాల శ్రద్ధవహించెను. వేదమార్గ ప్రతిష్ఠాపకుడను బిరుదు వహించి వేదవిద్యావిశారదులైన పండితోత్తములనేకులను దన సభకు రప్పించి వారి నుచితరీతిని సత్కరించి గ్రామవాసాదులకు దగిన యేర్పాటులను గావించి తన కులగురువైన మాధవాచార్య విద్యారణ్యులవారి కప్పగించి యాయన జెప్పిన రీతిని వేదములకును

వేదాంగములకును సకలశాస్త్రములకును వ్యాఖ్యలను వ్రాయించెను. వైదికవిద్య యందును గీర్వాణాంధ్రభాషల యందును బుక్కరాయలకు గల యభిమానముచే విజయనగరసంస్థానము వేదవేదాంగవిదులకు సర్వశాస్త్రపారంగతులకును సంస్కృతాంధ్రకవి జనులకును నునికిపట్టాయెను. దేశమంతటను నూతనవిద్యావిలసనము బొడకట్టెను, బుక్కరాయలచే నాటబడిన విజ్ఞానబీజ మంకురించి యతని తరువాతివారి పాలనక్రింద నానాశాఖలతో వృక్ష ప్రాయమై పెరిగి విద్యావంతుల కెల్ల నాశ్రయ మొసగినది. హరిహర బుక్కలతో ప్రారంభమైనది యాంధ్రవాఙ్మయమునకు రాయపీఠముతోడి యనుబంధము. ఓరుగంటి ప్రదాపరుద్రుని కొలువున మహాకవియు విద్వాంసుడునని ప్రఖ్యాతివహించిన శాకల్యమల్లు భట్టును హరిహరరాయలు దనచెంతకు రప్పించి యాశ్రయ మొసగి సంరక్షించెను. నన్నయ తిక్కనలకు దుల్యుడైన మహాకవిని నాచనసోముని బుక్కరాయ లగ్రహారాదికముల నిచ్చి సత్కరించి కావ్యరచనకు బురికొల్పెను. విద్యానగరరాయల వదాన్యతవలన సోముడు రచించిన యుత్తర హరివంశము నేటికిని కవితత్వవిశారదులచే నుత్తమోత్తమ కావ్యముగ బరిగణింపబడుచున్నది.

రెండవ హరిహరరాయలు

(క్రీ. శ. ౧౩౭౭-౧౪౦౪)

బుక్కరాయలు క్రీ. శ. ౧౩౭౭-వ సం॥ ఫిబ్రవరి ప్రారంభమున శివసాయుజ్య మందెను. వెంటనె రెండవ హరిహరరాయలు సింహాసనము నధిష్ఠించెను. కాని సామ్రాజ్యమునం దెల్లయెడలను నతని యధికారము చెల్లుబడి కాలేదు. తన్ను ల్లంఘించి రాజ్యాధిపత్యమును వహించెనని ఈర్ష్యచే గోపము వహించి ఉద్దగిరి విరూపణ్ణ దన యధికారము క్రింద నుండు ఆరగరాజ్యమునకు బోయి విజయనగరమందలి కేంద్ర ప్రభుత్వమును సరకు సేయక స్వతంత్రునివలె పాలింప నారంభించెను; ప్రత్యక్షముగ విరూపణ్ణ హరిహరరాయలపై దిరుగబడెనని చెప్పుటకు దగిన సాక్ష్యము లేదు; కాని యప్పుడు కొంకణదేశమున రేగిన నగరికేశవదేవుని హావళితో నితనికి గొంతసంబంధము గలదని తలచుటకవకాశముగలదు. ఇట్టి తిరుగుబాట్లన్యమండలములందును బొడచూపినవి. ద్రావిడదేశమున విశేషముగ విప్లవకారులు విజృంభించిరి. తుండీరచోళపాండ్య ప్రభువులేకమై స్వతంత్రులగుటకు బ్రయత్నములు సేయదొడగిరి. కుమారకంపణ పుత్రులును మఱికొందఱు నాయకులును రాజ్యపాలనకొఱకు బుక్కరాయలు చేసిన యేర్పాటుల నంగీకరింపక విప్లవకారులను గూడి రాయల యధికారమును ధిక్కరించిరి.

హరిహరరాయలు విప్లవకారుల నణగగొట్టి తనయధికారమును సామ్రాజ్యమున నెల్లయెడల నెలకొలుపుటకు దగు యేర్పాటులను సత్వరముగ గావించెను. తన కుమారులలో శక్తిసంపన్నుడైన విరూపణ్ణ ఉడయలను* దక్షిణదేశముపై దన ప్రతినిధిగ నియమించి, గొప్ప సైన్య మిచ్చి, ద్రావిడదేశమునకంపెను. విరూపణ్ణ ఉడయలు స్వల్పకాలముననే విప్లవకారులను జిమగబొడిచి సేతువు పర్యంతము గల దేశముపై రాయల యధికారమును మరల నెలకొల్పెను. దేశమున శాంతి కుదిరి రాజ్యవ్యవహారము లన్నియు యథాపూర్వము నిర్వ్రక్రముగ సాగనారంభించిన పిమ్మట విరూపణ్ణ ఉడయలు సింహళముపై దండయాత్రవెడలి యా ద్వీపాధిపతిని యుద్ధమున నోడించి యతనికడ కప్పముగొనెను. విజయనగర సామ్రాజ్యమునకును సింహళ ద్వీపమునకును నిదియే ప్రథమసంఘట్టన.

* ఇతని పితృవ్యుడగు ఉద్దగిరి విరూపణ్ణ ఉడయలును నితడును భిన్న పురుషులని జ్ఞప్తియందుంచుకొనవలయును.

బహమనీ దండయాత్ర :

సామ్రాజ్యమిట్లు విప్లవకారుల దుశ్చేష్టల వల్ల గలత నొందియుండగనె మహోపద్రవ మొకటి సంభవించెను. బహమనీ సుల్తాను ముజాహిదు శాహు మహా ప్రచండసైన్యముతో నెత్తివచ్చి విజయనగరమునకు ముట్టడి వేసెను. దీనిని బుక్కరాయ ముహమ్మదు శాహుల యుద్ధము నకు దరువాయి యనుట యుక్తము. కృష్ణాతుంగ భద్రల మధ్యదేశముకొఱకు బుక్కరాయలతో ముహమ్మదుశాహు బహమనీ యుద్ధమొనర్చి విజయుడు కాజాలక క్రీ. శ. ౧౩౬౫ వ సం॥ న సంధిజేసికొన్న విషయము పాఠకుల స్మరణయం దుండి యుండవచ్చును. ఆ సంధి షరత్తుల ప్రకారము విజయనగర బహమనీ రాజ్యములకు నడుమ గృష్ణానది యెల్లయని నిర్ణయింపబడెను; కాని కృష్ణ గోదావరి తటమునందుండిన కొన్ని మహాళ్లు రెండు దొరతనముల యుమ్మడిపాలన క్రింద నుండవలసినట్లు యేర్పాటు గావింపబడెను. ఈ సంధి షరత్తులు బహమనీ సుల్తానుకు నచ్చలేదు. కాని సమయ మనుకూలము గాకపోవుటచే ముహమ్మదు శాహు మరల విజయనగర ప్రభువుతో బోరు పెట్టుకొనలేదు. క్రీ. శ. ౧౩౭౬ వ సంవత్సరమున బుక్కరాయల మరణమునకు గొన్ని నెలలకు ముందు ముహమ్మదు శాహు బహమనీ కాలధర్మము నందెను. అనంతర మతని కుమారుడు ముజాహిదు శాహు తఖ్తునెక్కెను. ఇతడు సాముగరిడీలం దారితేరిన మల్లుడు. బలవంతుడని బిరుదందినవాడు. సింహాసనము నెక్కినప్పటినుండియు ముజాహిదు శాహునకు గృష్ణాతుంగభద్రల మధ్య దేశము నాక్రమించి తుంగభద్రను దనరాజ్యమునకు దక్షిణ సరిహద్దుగ జేసికొనపలయునను తలపు గలిగినది. మఱియు దాను గద్దె నెక్కిన కొన్ని నెలలకే విజయనగరమున బుక్కరాయలు మృతినందుటయు, నతని కుమారుఁడగు నిమ్మడిహరిహరరాయల యధికారము నంగీకరింపక రాజకుమారులు కొందఱును సామంతులు కొందఱును దిరుగబడి సామ్రాజ్యమున బలుతావులం డల్లరులు రేపుటయు ననయుద్యమమున కనుకూలముగ గాన్పింప విజయనగరమున కతడిట్లు రాయబారమంపెను: "కృష్ణాతుంగభద్రలమధ్య కొన్ని సీమలు రెండు సంస్థానముల యుమ్మడిపాలన క్రింద నున్నవి. ఈ కారణమువలన నుభయరాజ్యములకు నిరంతరము ఘర్షణ గలుగుచున్నది. కావున కృష్ణాతుంగభద్రల మధ్యదేశము నంతటిని బహమనీ సుల్తానున కిచ్చివేసి తుంగభద్రనే రెండు రాజ్యములకు నడుమ సరిహద్దుగ నంగీకరించవలసినది," అని. హరిహరరాయ లీ రాయబారమును నిరాకరించెను. అందు మీఁద ముజాహిదు శాహు విజయనగరరాజ్యముపై నెత్తివచ్చెను.

ఈ దండయాత్రయందు నడచిన యుద్ధములను గూర్చి కాని, యన్యచరిత్రాంశములను గూర్చి కాని నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. ఈ యుద్ధచరిత్రను ఫెరిష్తాయను మహమ్మదీయ చరిత్రకారుడు విపులముగ వర్ణించి యున్నాడు; కాని యతడు వ్రాసినదంతయు సత్యమని నమ్మటకు వలనుపడదు. అది తప్పులకుప్ప. ఇతడు చెప్పిన విషయములు సత్యమని రుజువుసేయగల సాక్ష్య మన్యత్ర యెచ్చటను గానరాదు. వాని ప్రస్తాప మన్య మహమ్మదీయ చరిత్రలయందు లేదు. అట్లనుటవలన వానియందు ముజాహిదు హరిహరుల యుద్ధప్రసక్తియే లేదనుకొనరాదు. యుద్ధములను వర్ణించినను అందు నడచెనని ఫెరిష్తా చెప్పు విషయముల మాట యందు కానరాదు.

ఫెరిష్తా చరిత్ర ప్రకారము ముజాహిదు శాహు దండయాత్ర ఈ క్రమమున నడచినది. ఒహమనీ దండయాత్ర వచ్చుచున్నదని విని కృష్ణదేవరాయలు* సైన్యములను గూర్చుకొని తుంగభద్ర తటమున ఆదోని పరిసరములందు వారి మార్గము నరికట్ట సంసిద్ధుడై యుండెను; కాని ముజాహిదుసైన్యము సమీపమునకు రాగనే భయ కంపిత చేతస్కుడై రాజధాని సంరక్షణ కార్య మును మంత్రుల కప్పగించి పరారిచిత్తగించెను. ముజాహిదుశాహు అతని విడువలేదు. నిలచిన చోట నిలువనీయక వెన్నంటి తఱుము నారంభిం చెను. నాడులు సీమలు దేశములు కొండలు అరణ్యములు దిరిగి తిరిగి విసివివేసారి విస్తారమైన ఉన మహాసామ్రాజ్యమునం దెచటను తల దాచు కొను తావును గనుగొనజాలక తుట్టతుదకు రాజ ధానికే తిరిగివచ్చి యందు జొరబడెను. ముజా హిదు కూడ వెనువెంట వచ్చి కోటను ముట్టడిం చెను. ఆరంభదశయందు ముట్టడి సుల్తానున కను కూలముగ సాగినది. కాని యచిరకాలమునసే వెలుపటినుండి సహాయము వచ్చినది. రాయల తమ్ముడు గొప్ప దండుతో విజయనగరమును జేరెను. అతని రాకతో దురకల స్థితి దుస్సహ మాయెను. కోటను లగ్గలువట్ట ముజాహిదు ప్రయత్నమొనర్చెను: కాని పరాజితుడై దండును మరల్చుకొని వెనుదిరిగి యాదోనికి బోయి యా కోటను దొమ్మిదిమాసములకాలము ముట్టడించియు గైవసము జేసికొనజాలక పోయెను. దండయాత్ర నంతట జూలించుకొని నిజరాజధానియైన కలుబరిగెకు బోవుచుండగా మార్గమధ్యమున క్రీ. శ. ౧౩౭౮ ఏప్రిల్ ౧౭ వ తేది రాత్రి యతని శిబిరమున నెవ్వరో యతని వధించిరి.

ఇతడు పేర్కొనిన యంశములు మూడింటిలో రెండవ్య మహమ్మదీయ చరిత్రలయందు కానరావు. రాయల పలాయనము గాని, ముజాహి దాతని వెన్నంటి తఱుముచు బోయి విజయనగరమును ముట్టడించుటను గాని యితర మహమ్మదీయ చరిత్రకారు లెవ్వఱు నెఱుగరు. ఇవి యల్పవిషయ ములు గావు. ఫెరిష్తా రచనయందు కల్పన చాల కలదు. ముజాహిదు ప్రతిపక్షియైన విజయనగర రాయ లెవ్వరో యతడెఱుగడు. కృష్ణరాయలని కల్పించినాడు. ఇంకొకసంగతి—ముజాహిదు ఆదోని ముట్టడిని తనంటతానె చాలించుకొనినట్లు కదా చెప్పియున్నాడు ఫెరిష్తా. ఇది సత్యము గాదు—శత్రువులధాటి కోహటించి శిబిరమును లేవదీసికొని పోయినాడు. ఒకానొకశాసనమున నిట్లు కలదు: 'తురకలు దండెత్తివచ్చి యాదవాని రాజ్యమును, దుర్గమును ముంచివేసిరి. అప్పుడు హరిహరరాయల తమ్ముడగు మల్లప్పఉడయల కుమారుడు చెన్నప్ప ఉడయలు ప్రచండసైన్యముతో వచ్చి రణరంగ మున వారిని పంచబంగాళముజేసి రాజ్యమును జయించి తన పెదతండ్రి కుపాయనముగ సమ ర్పించెను.' అని చెప్పియున్నది. ఈ శాసనము క్రీ. శ. ౧౩౮౦ వ సం॥న వ్రాయించినది. సమ కాలిక ప్రమాణము. ఈ సమయమునసే ముజా హిదు తమ్ముడగు ఫతేఖానుడును మాతామహు డైన మల్లిక్-సైఫ్-ఉద్దీన్-ఘోరియు హరిహర రాయల ముఖ్య సైన్యాధిపతులలో నొక్కడైన గుండ దండ నాయకునిచే బట్టువడి బందీకృతు లైనది. ఇది సమకాలిక చరిత్రాధారములవల్ల దెలియవచ్చు నాదవాని ముట్టడియొక్క వాస్తవ చరిత్ర. ఒక వేళ ఫెరిష్తా చెప్పిన విషయములన్నియు సత్యములే యని యొప్పుకొన్నను, తుదకు ముజాహిదుశాహు ముజాహిదుశాహు కీ దండయాత్రయందపజయము విజయనగర దండయాత్ర కథా సారాంశము. గలిగెనే కాని జయము చేకురలేదు.

---

* ఇది తప్పు. ఫెరిష్తా యన్ని ప్రతులందును కృష్ణదేవరాయ లనియే యున్నది. మఱియు ముద్రితమైన నిజామ్-ఉద్దీన్-అహమదు యొక్క తబకాత్-ఇ-అక్బరీ యందును నిట్లే కలదు. దీనికి కారణ మెద్ది యో తెలియదు. ముజాహిదు ప్రతిపక్షి రెండవ హరిహర రాయలు కాని కృష్ణదేవరాయలు గాడు.

ఆదోని కడ ముజాహిదు శాహు పరాభవ ముతో యుద్ధము ముగియలేదు. మహమ్మదీయ చరిత్రకారు లటుపైనడచిన వృత్తాంతమును దెలు పరు. ఆధునిక చరిత్ర పరిశోధకుల దృష్టి మహమ్మ దీయ చరిత్రల దాటి పాఅదు. వారిపై నాధార పడిచరిత్రరచనకు గడగు గ్రంథకర్తలమాట చెప్ప వలయునా? గోరుచుట్టుపై తోకటిపోటు బడినట్లయినది. తురకలకు ఆదోని పరాజయము తరువాత వారి ప్రభువగు ముజాహిదుశాహు వధ. బహమనీ రాజకుటుంబమున కలతలు పెరిగినవి. రాష్ట్రమును రక్షించుటకు దగిన సేన గాని, సేనను గూర్చి శత్రుల నరికట్టి దేశమున శాంతిని నెల కొల్పగల నాథుడుగాని లేకపోవుటచే బహమనీ రాజ్యమున నరాజకస్థితి యేర్పడినది. పగ తీర్చు కొనుట కిమ్మడి హరిహరరాయలకు మంచి సమ యము దొరికినది; ఉత్తరకర్ణాట కొంకణ దేశ ములను జయించుట కంతకంటె మంచి యవసను దొరకదని నిశ్చయించి దళముల నిచ్చి తన సేనాధిపతులను దండయాత్రకంపెను. ఈ దండ యాత్ర చరిత్రను సూక్ష్మదృష్టిని పరిశీలించి కను గొనుటకు దగిన సాక్ష్యమింకను లభించలేదు. కాని యది జయవంతముగ గొనసాగెననియు దత్ఫలితముగ నుత్తరకర్ణాట కొంకణ దేశములు రెండును హరిహరరాయలకు గైవసమాయె ననియు దృఢముగ జెప్పవచ్చును. ఈ దండ యాత్రయందు రాయరాణువకు జేకూడిన విజ యములు కొన్ని యప్పటి శాసనముల వలన దెలియవచ్చుచున్నవి. వాని నిచట బేర్కొనుట యుక్తము. క్రీ. శ. ౧౩౮౦ వ సం॥ వైవె కొంకణముల పాలకుడైన హడపద నాగణ్ణొడ యలు, రాయలపై దిరుగబడి యుండిన నగరికేశవ దేవుని జయించి మరల నాప్రాంతమున రాయల యధికారము నెలకొల్పెను. ఆ సమయమునసే బనవాసి రాజ్యపాలకుడైన మాధవమంత్రి తురు ష్కులను జయించి వారికడనుండి గోవా రేవు పట్టణమును గైవసము జేసికొని సప్తకొంకణము లను సాధించెను. పాశ్చాత్య మహమ్మదీయ జన పదములనుండి దక్షిణ భారత భూమియందు వాణిజ్యము కొఱకు వచ్చు మహమ్మదీయ వర్తకుల కెల్ల నప్పుడు కొంకణదేశము చెంకి. మొదటి హరిహరరాయల కాలమున నతని సామంతుడగు జమాల్-ఉద్దీన్ అను నరబీ మహమ్మదీయుడు హొన్నావురరాజ్యమున కధిపతియై యుండెను. మలబారు తీరమునందలి కరపట్టణము లనేకము లితని యధికారముక్రింద నుండినవి. క్రీ. శ. ౧౩౯౯ వ సం॥ న బహమనీ రాజ్యస్థాపకుడైన అల్లావుద్దీన్ హసన్‌గంగూ పశ్చిమసముద్రతీరముపై నెత్తిపోయినపు డతడు గోవాపట్టణమును జయించి స్వాధీనము జేసికొనినట్లున్నది. కావున మాధవ మంత్రిచే బరాజితులై గోవాపట్టణమును గోలు పోయిన తురుష్కులు బహమనీ సుల్తాను యను చరులై యుండవలయును. మాధవమంత్రి దిగ్విజయయాత్రయందే అతని పుత్రుడగు బాచరసు ఘోండాకు దక్షిణమందుండిన రంగిని (రంగాణ) యను గిరిదుర్గమును సాధించెను. సప్తకొంకణము లను జయించినప్పుడే ఉత్తర కొంకణతీర దేశ మందలి చావలు, దాబులను ముఖ్య రేవుపట్టణ ములు రెండును హరిహరరాయలకు వశపడినవి. ఇట్లు గోవా మున్నగు ముఖ్యపట్టణములన్నియు హస్తగతము లగుటవలన పశ్చిమ సముద్రతీరమం తయు నిమ్మడి హరిహరరాయల యధికారము క్రిందికి వచ్చెను.

రాయలు-రెండు :

ప్రతికూల పరిస్థితులు మారిపోయినవి. విప్లవకారులు నిర్మూలమైరి. సామ్రాజ్యముపై నెత్తివచ్చిన తురుష్కులు పరాజితులై పాటి పోయిరి; వారి యధికారము క్రిందనుండిన ఉత్తర కర్ణాట సప్తకొంకణములు రాయరాజ్యమున గలిసి పోయినవి. ఇమ్మడి హరిహరరాయలు వజ్రసింహాస నము పై సుప్రతిష్ఠితుడాయెను; కాని యంతట నతడు తృప్తి జెంది యుండలేదు. రాజ్యము విరభోజ్యమని కదా దండనీతి బోధించుచున్నది. పశ్చిమ సముద్రతీర దేశమునుబోలి తీరాంధ్రభూమి నంతటిని సాధించి పూర్వ సముద్రాధీశ్వరు డను బిరుదును సార్థకము జేసికొనవలయునను నాస యతని హృదయసీమ నంకురించినది. కాని యతని

మనోరథము నెఱవేరుటకు ఘనమైన నిరోధ మొకటి యడ్డు పడుచుండెను. నెల్లూరు మండలము లోని కందుకూరు సీమ మొదలు కళింగ దేశ పర్యంతము వ్యాప్తమైన తీరాంధ్రదేశమంతయు గొండవీటి రెడ్డిరాజుల యేలుబడి క్రిందనుండినది. రెడ్లను జయించి వారి యధికారమును గూల ద్రోసిన గాని తీరాంధ్ర భూమిని స్వాధీనపఱచు కొనుటకు సాధ్యముగాదు; కావున రెడ్డిరాజ్య ముపై దండెత్తుట యవశ్యమాయెను. ఇంతకు పూర్వమే ఉభయరాజ్యములకును ఘర్షణ కలిగి యుండినది. క్రీ. శ. ౧౩౬౫-౧౩౭౦ వ సంవత్సర ముల మధ్య పెదబుక్కరాయలు పూర్వ దిగ్విజయ యాత్రవెడలివచ్చి కొండవీటిరాజ్యమునకు జెందిన సీమలను గొన్నిటి నాక్రమించుకొనెను. కాని బుక్కరాయలకు రెడ్డిరాజ్యమును నిర్మూలింప వలయునను యుద్దేశ ముండి నట్లగపడదు. క్రీ.శ.౧౩౭౦వ సంవత్సరమునుండి కొండవీడు విజయ నగర రాజ్యముల పరస్పరసంబంధమునందొక నూతన యుగము ప్రారంభమాయెను. ఆ సంవత్సరమున హరిహరరాయల పుత్రులలో శక్తిసామర్థ్య సంపన్నుడైన దేవరాయలు ఉదయగిరి దుర్గాధి పత్యమును బడసి యచటికి వచ్చెను. మొదటి నుండియు రెడ్డిరాజ్యమును జయించి రాయ సామ్రాజ్యమున గలుపుకొనవలయునని యతని దృఢసంకల్పము. అతడచట దుర్గాధిపత్యము వహించిన ముప్పదియాఱేండ్లును నిరంతరము రెడ్లను నిర్మూలము సేయు మార్గములను వెదుకుచు గొంచెకొంచెముగ వారి రాష్ట్రమునాక్రమించు కొనుచుండెను. క్రీ. శ. ౧౩౮౩ వ సం॥ న అనవేమారెడ్డి మరణానంతరము కొండవీటి రాజ్యమున గలిగిన యంతఃకలహముల కారణ మున రాయలకు రెడ్డిరాజ్యముపై దండు వెడలు టకు మంచి సమయము దొరకినది. రాయల పక్షమున దేవరాయ లుదయగిరినుండి బయలుదేరి విజయనగర గడిదేశమునందుండిన యద్దంకి శ్రీశైలభూములను రెంటిని యాక్రమించుకొనెను.

రాయలు-వెలమరాజులు :

కుటుంబకలహ నిమగ్నులై యుండిన రెడ్డి రాజులు తమరాష్ట్రమును సంరక్షించుకొనుట కెట్టి ప్రయత్నమును జేసిన ట్లగపడదు; కాని శ్రీశైలభూమి నాక్రమించుకొనుట వలన రాయ లకు రాచకొండ వెలమరాజులతో ఘర్షణ కలిగినది. కొండవీటి యనపోతారెడ్డి గతించిన పిమ్మట రాచకొండ వెలమవారు శ్రీశైలమును దత్పరిసర ప్రదేశముల నాక్రమించుకొనిరి. వారి ప్రభువు మొదటి యనపోతానాయకుడు శ్రీశైలమునకు సోపానములు గట్టెననికూడ చెప్పుదురు. అనవేమా రెడ్డి కొండవీటి సింహాసనము నధిష్ఠించిన పిమ్మట రాచకొండ వెలమలపై దండువెడలి శ్రీశైల భూమిని సర్వమును స్వాధీనపఱచుకొనుటయేకాక కృష్ణా ముసీసంగమ ప్రాంతదేశము నంతటిని జయించి తన రాజ్యమున గలుపుకొనెను. కావున అనవేమారెడ్డి యనంతరము గలతచెందియుండిన రెడ్డిరాజ్యముపై బడి శ్రీశైలరాష్ట్రమును మరల స్వాధీనపఱచుకొనవలయునని వెలమరాజులకు దలపు గలుగుట సహజము; చేత నెత్తి నోట వేసికొన బోవుచున్న కబళము హరించినట్లు దేవరాయ లాదేశము నాక్రమించుకొనుట వలన వెలమ వారికి రాయలపై ద్వేషము గలిగినది.

వెలమలు శూరులే కాని సర్వదక్షిణభారత భూమికి నొడయడైన రాయలతో డీకొను శక్తి వారికెక్కడిది? అయినను వారికి మంచి మిత్ర బలము గలదు. విజయనగర రాయలకు సహజ శత్రుడగు బహమనీ సుల్తాను వారికి పరమమిత్రుడు. కావున రాయలను బ్రతిఘటించి యత డాక్రమించు కొన్న శ్రీశైలసీమను వశపఱచుకొనుట కొఱకు వెలమరాజు అనపోతానాయకుడు బహమనీ సుల్తాను మొదటి మహమ్మూదుశాహు (ఇతడు క్రీ. శ. ౧౩౫౮ మొదలు ౧౩౭౬ వఱకును కలుబరిగె రాజ్యమును పాలించిన ముహమ్మదుశాహుకంటె భిన్నుడు) నాశ్రయించెను. ఇట్లు వెలమలతోడి వైరము బహమనీసుల్తానుతో యుద్ధముగ పరిణ మించినది.

అనపోతానాయకునితోడి యుద్ధమునకు దేవరాయల క్రింది దళములు చాలవని తలచియే మొ హరిహరరాయ లతనికిదోడు మఱియొక గొప్ప దండును దన కుమారుడును యువరాజును నగు నిమ్మడి బుక్కరాయల యాధిపత్యము క్రింద వెలమరాజ్యము మీది కంపెను. అతనితో గూడ పూర్వము బహమనీ సుల్తానులతోడి యుద్ధమునం ద్వితీయ పరాక్రమ ప్రదర్శనమువలన ప్రఖ్యాతి బొందియుండిన గుండయదండనాయకుడు, సాళువ రామదేవుడు మున్నగు శూరులు యుద్ధమునకు నడచిరి. ఇమ్మడి బుక్కరాయలు తెలింగాణమును ప్రవేశించి ప్రఖ్యా తాంధ్రనగరమైన యోరుగంటి వఱకును దండు నడపుకొనుచు బోయెను. ఆ ప్రాంతమున కొత్తకొండ దుర్గమున గాపుండిన తురుష్కులతో ఘోరసంగరము గలిగినది. ఈ యుద్ధమున సాళువ రామదేవుడు శత్రువులను బొడిచి స్వర్గమున కేగెను. యువరాజు ఇమ్మడి బుక్కరాయలు ఓరుగంటిని ముట్టడించినా డేమొ తెలియదు. అనపోతానాయకుడు దండనాయక గుండని జయించినటు వెలుగోటివారి వంశావళి యందు చెప్పియున్నను, రాయలకడనుండి శ్రీశైలభూమి నతడు మరల కైకొనజాలడాయె.

వెలమలంతట శ్రీశైలముపై నాసను వదలు కొనలేదు. పదియేండ్లు గడచిన పిమ్మట అనపోత నాయకుని కుమారుడు సర్వజ్ఞసింగ భూపతి కాలమున గావలయును మఱియొక ప్రయత్న మును గావించిరి. వారిపక్షమున క్రీ. శ. ౧౩౯౦-౯౧ వ సంవత్సరమున దేవరాయల యేలుబడియం దుండిన యుదయగిరి రాజ్యముమీ బహమనీ సుల్తాను మొగటి మహమూదు శాహు దండు వెళ్లెను. ఈ దండయాత్ర వృత్తాంతము పరచూరి తామ్రశాసనమున సంగ్రహముగ వర్ణింపబడి యున్నది. ఇమ్మడి హరిహరరాయల యాజ్ఞాను సారము దేవరాయలు పడ్వీధబలములతో గూడ బయలు వెడలి తుంగభద్రానది యుత్తర తట మునసుండు అలంపురమును బోయి చేరెను. ఈ దండయాత్ర గమ్యస్థానము బహమనీరాజ్యము; వెలమవారికి సహాయము వచ్చిన బహమనీ సైన్య మును గ్రమ్మఱచుటయే దాని ముఖ్యోద్దేశము; కాని యది యెట్లు పర్యవసాన మందెనో, యుద్దిష్టకార్యము సమకూరెనో లేదో చెప్పుటకు సాధ్యము గాదు. దేవరాయ లిట్లు బహమనీరాజ్య ముపై దండయాత్ర నడుపుచుండగా, బహమనీ ఫౌజులతోగూడ వెలమవా రుదయగిరి రాజ్య ముపై నెత్తిపచ్చిరి; కాని తండ్రి పక్షమున రాజ్య పరిపాలనా కార్యములను నిర్వహించు చుండిన దేవరాయల కుమారుడు రామచంద్ర రాయలు వారి నెదుర్కొని యోడించి తఱుమ గొట్టెను. తుద కెట్లో యుద్ధము ముగిసెనో తెలి యదు; కాని దానివలన వెలమరాజుల కోరిక యీడేరనులేదు; బహమనీసుల్తాను సైన్య మెచ్చ టను విజయ మందనులేదు. దీని బట్టి చూడగా నీయుద్ధమున చిట్టచివర విజయలక్ష్మి రాయ రాణువనె వరించెనని తోచుచున్నది.

ఇమ్మడి హరిహరరాయలు—ఫిరోజుశాహు :

ఇమ్మడి హరిహరరాయలకు క్రీ. శ. ౧౩౯౮ వ సం॥న మఱియొక తడవ వెలమల తోడను వారి మిత్రుఁడగు బహమనీ సుల్తాను తోడను పోరు పొసఁగెను. మహమ్మదీయ చరిత్ర కారులును, హిందూ గ్రంథకర్తలును, ఈ యుద్ధమున సంభవించిన విషయములను బెక్కింటిని తెల్పియున్నారు. మహమ్మదీయ చరిత్రకారుల బడి యీయుద్ధము జరిగిన సమరాంగణము కృష్ణా తుంగభద్రల మధ్యదేశము; కృష్ణ యుత్తర తట మందలి సగర పట్టణమునుండి తుంగభద్రాదక్షిణ తీర మందుండు విజయనగరము వఱకును వ్యాపించి నది. మహమ్మదీయ చరిత్రకారులు వెలమ లీ యుద్ధమున పాల్గొని నట్లయిన చెప్పరు; మఱియు సుల్తానుకు గల్గిన పరాజయముల మాట యెత్తరు. కాని రెండవ హరిహరరాయల శాసనములు కొన్నిటియందును సమకాలిక గ్రంథములు గొన్నిటి యందును ఈ యుద్ధ వృత్తాంతము కొంత కలదు.

కావున ఉభయపార్శ్వముల సాధ్యమును బోల్చి పరిశీలించి చూచిన సత్య మేర్పడగలదు.

క్రీ. శ. ౧౩౯౨ వ సంవత్సరము నవంబరు మాసమున గుల్బర్గ రాచనగరు నందొక విప్లవము సంభవించినది. అప్పుడు బహమనీరాజ్యము నేలు చుండిన సుల్తానును బందీకృతుని గావించి యతని దాయాది ఫీరూజు ఖా ననునతడు సింహాసనము నాక్రమించి, ఫీరూజుశాహను రాజనామమును వహించి రాజ్యపాలన సేయగడగెను. ఈ విప్లవము వలన గలిగిన కళవళమును సందు చేసికొని ఇమ్మడి హరిహరరాయలు బహమనీ రాజ్యముపై దండు వెట్టినట్లున్నది. నగరుముట్టడితో యుద్ధమున కంకురార్పణ యైనది. విజయనగర సైన్యము కృష్ణను దాటిపోయి నగరు నరికట్టి స్వాధీనము జేసికొనెను. ఆ వార్త తెలియగనే ఫీరూజు శాహు, వెలమబలగము తోడునడువ, గొప్ప సేనతో గదలిపోయి నగరు సమీపమున విజయ నగరబలములను యుద్ధమున నోడించి తఱుమగొట్టి పట్టణమును మరల స్వాధీనము జేసికొనెను. అచటినుండి రాయలపై బగ తీర్చుకొనుటకు విజయ నగర రాజ్యముపై దండువెడలు నుద్దేశముతో కృష్ణవైపు కూచిచేసెను. కృష్ణ నిండుకొని ప్రవ హించుచుండినది; రేవు లన్నిటికడను దేవరాయల సైన్యములు జతనముతో గాపుండినవి. నదిని దాటుట దుస్సాధ్యముగ గాన్పించినది. కాని సుల్తాను కొలువునం దుండిన కాజియొకడు నట్టువునివలె మారువేషము వేసికొని నదినిదాటి నర్తక నర్తకీ జనముతో మైత్రిసల్పి వారితో గూడ రాయల శిబిరమును ప్రవేశించెను. రాత్రి దీపికా సహస్రముల వెలుగున శిబిరము పట్టపగటివలె దేదీప్యమానమై ప్రకాశించుచుండినది; దేవరాయల కుమారుడు నిండుకొలువున గూర్చుండి నాట్య ప్రదర్శనమును జూచుచుండెను. కాజీ నాట్యవిద్యా ప్రవీణుడు. ఆరాత్రి యతడు దన నేర్పంతయు దెల్లమగునట్లు నర్తనము సేయగడగెను. అందరి దృష్టియు నతనియందే లగ్నమై యుండినది. అభినయము జూపుచు మెల్లగ మెల్లగ రాజకుమా రుని సమీపించి యకస్మాత్తుగ దన యుడుపునందు దాచియుంచిన చిక్కుకారితో నతని బొడిచి చంపెను. శిబిరమంతటను హాహాకారధ్వనులు రేగినవి; కళవళముచే జనులు విభ్రాంతులైరి. సందు చూచుకొని శిబిరమునుండి కాజీ సన్నసన్నగ జాఱుకొనెను. విజయనగర శిబిరమునుండి వినవచ్చు నార్తధ్వనులవలన కాజీ తన కార్యమును నెఱ వేర్చినాడని యెఱిగి ఫీరూజుశాహు కృష్ణను దాటివచ్చి రాయల స్కంధావారముపై బడెను. దుఃఖపీడితుడై దేవరాయలు తనకుమారుని శవము నెత్తించుకొని విజయనగరమునకు బాఱిపోయి కోటయందు జొచ్చి దర్వాజాల నన్నింటి బంధింప నాజ్ఞ యొసగెను. జనశూన్యమై విసర్జింపబడి యుండిన రాయస్కంధావారమును ఫీరోజుశాహు కొల్లగొట్టి యందుండు సర్వమును హరించెను.

తరువాత ఫీరోజు శాహు విజయనగరముపై గూచిచేసి యాపట్టణమును ముట్టడించెను. పట్టణ మును గైవసము జేసికొనజాలక పోయెను, పరి సర ప్రదేశములను నాశనముగావించి దేవరాయ లను సంధి కొడంబడజేసెను; అపారధన మిచ్చి ఫీరోజు శాహును సంతృప్తునిజేసి దేవరాయలు సంధిని నిలిపెను. అంతట ఫీరోజుశాహు వెనుదిరిగి నిజరాజ్యమునకు బోయెను.

ఇది సంగ్రహముగ ఫెరిష్తా వర్ణించిన యుద్ధ వృత్తాంతము. సందేహాస్పదములైన విషయము లిందు పెక్కు గలవు. ఈ యుద్ధకాలమున దేవ రాయలు విజయనగరమును పాలించుచుండినట్లు ఫెరిష్తా చెప్పుచున్నాడుగదా. ఇది సరికాదు. క్రీ. శ. ౧౪౦౪ వఱకును నిమ్మడి హరిహరరాయల యేలుబడి సాగినది. కావున ఫీరోజుశాహు విజ యనగరముపై దండెత్తి వచ్చినపుడచట రాజ్యము సేయు చుండిన రాజిమ్మడి హరిహరరాయలు కాని దేవరాయలు కాడు. ఇందువల్ల ఫెరిష్తాకు పై దండయాత్ర వృత్తాంతము నిశ్చయముగ దెలియదనియు, దెలియని తావులందు కల్పనజేసి నాడనియు దత్కారణమున నాతని ప్రాత యంత విశ్వాసపాత్రము గాదనియు దెల్లమగుచున్నది.

ఇంకొకచిత్రము. సింహాసనము నధిష్ఠించినదిమొదలు పరరాష్ట్రముల నాక్రమించి నిజరాజ్య వైశాల్యమును బెంపొందింపవలయునని దృఢసంకల్పము గల ఫిరోజుశాహు రాయలను యుద్ధమున నోడించియు గొంతధనమును మాత్రము గైకొని రెండురాజ్యముల యెల్లలును యథాపూర్వము వలె నుండుట కంగీకరించి సంధి కొడబడెనట! ఫిరోజుశాహు కంతటియౌదార్యమేల కలిగెనో! విజయనగరమునుండి మరలి నిజరాజధానియగు కలుబరిగెకు బోవునపుడు ఫిరోజుశాహు ఫూలాదు ఖాను డను సర్దారును కృష్ణా తుంగభద్రల మధ్య దేశమునకు బాలకునిగ నియమించిపోయినట్లు ఫెరిష్తా వ్రాసి యున్నాడు. ఇదియు సంశయాత్మకమే. ఏలన ఫిరోజుశాహు కృష్ణాతుంగభద్రల మధ్య దేశముపై దండువెడలెనని కాని విజయనగరమును ముట్టడించెనని కాని రుజువు సేయగల సాధనము లన్యము లెవ్వియు గానరావు. ఫెరిష్తా కంటె బూర్వికుడైన తబకాత్-ఇ-అక్బరీ రచయిత యగు నిజామ్-ఉ-'ద్దీన్ అహమదు కృష్ణాతటమున విజయనగర స్కంధావారముపైబడి దాని దోచుకొనిన పిమ్మట ఫిరోజుశాహు వెనుదిరిగి నిజరాజధానికి బోయెనని వ్రాసియున్నాడు. బుర్హాన్-ఇ-మఆసిర్ గ్రంథకర్తయగు సయ్యద్ ఆలీ బిన్ అజీజ్-ఉ-'ల్లా తబా తబ ఈ యంశమును దృఢపఱచుచున్నాడు. అశేషధనమును సమర్పించి ప్రతి వర్షమును గప్పము కట్టుట కియ్యకొని దేవరాయలు ఫిరోజుశాహుతో సంధి గావించుకొనెనని యతడు చెప్పినను, సుల్తాను కృష్ణా తుంగభద్రల యంతర్వేదిపై దండువెడలెనని కాని విజయనగరమును ముట్టడించెనని కాని చెప్పలేదు. ఇవి కేవలము డాబు సరిమాటలు. వాస్తవ దూరములు. ఫిరోజుశాహు రాజ్యారంభమువఱకు కృష్ణా తుంగభద్రల యంతర్వేది బహమనీ రాజ్యముక్రింద నుండలేదు. అతని పూర్వికులు దాని జయించుటకు పలుమారు తలపెట్టిరి; కాని వారి కడక నెఱవేఱలేదు. ప్రప్రథమమున నంతర్వేదిని స్వాధీనము జేసికొనుటకు ప్రయత్నముజేసి నాతడు మొదటి ముహమ్మదుశాహు బహమనీ. బుక్కరాయలతో సరిపోరజాలక రెండు రాజ్యములకును మధ్య కృష్ణానదియే యెల్లయని యాత డొప్పుకొని సంధి జేసికొన్న విషయ మీపట్టున స్మరింపదగి యున్నది. అతని వెనుక బహమనీ సింహాసనము నెక్కిన యతని కుమారుడు ముజాహిదుశాహు పై సంధి షరత్తులను దన కనుకూలముగ మార్ప వలయునని ప్రయత్నమొనర్చెను; కాని యతడు దండయాత్రయందు ఘనపరాభవ మందుటయేకాక హంతలచే నసువుల గోల్పోయెను. కావున రెండు రాజ్యముల మధ్య సరిహద్దు మాఱుపాటులేక పూర్వమున్నట్లే యుండెను* ఫిరోజుశాహు సింహాసనము నధిష్ఠించినప్పుడు కృష్ణా తుంగభద్రల యంతర్వేది బహమనీ రాజ్యాంతర్గతము గాదు. మఱియు నిజామ్-ఉ-'ద్దీన్ అహమదుగాని, సయ్యద్ అలీ బిన్ అజీజ్-ఉ-'ల్లా తబాతబా కాని ఫిరూజుశాహు కృష్ణా తుంగభద్రల యంతర్వేది నాక్రమించుకొనినట్లు చెప్పలేదు. తరువాత కొన్ని యేండ్లు గడచిన పిమ్మట క్రీ. శ. ౧౪౧౭ వ సంవత్సరమున అంతర్వేది యుత్తరపుటంచున కృష్ణాతటమందలి మహళ్ళను గొన్నిటిని వశపఱచుకొనుటకు సుల్తాను

---

* క్రీ. శ. ౧౪౨౮ మే నెల ౧౯ వ తేదినాడు మొదటి మహమ్మదుశాహు గద్దె నెక్కెనను వార్త చెవిసోకగనే, యప్పుడు రాయచూరు దుర్గమును ముట్టడించి యుండిన విజయనగరరాయలు ముట్టడి లేవదీసుకొని యంతకుపూర్వము మొదటి ముహమ్మదుశాహుకు దాను కట్టుచుండిన కప్పము నతనికి గట్టెదనని యొప్పుకొనెనని ఫెరిష్తా వ్రాసియున్నాడు. ఇది పొల్లు. విశ్వాస పాత్రముగాదు. యుద్ధమున గెలువజాలక కృష్ణానదియే ఉభయరాజ్యములకు సరిహద్దని యొప్పుకొని బుక్కరాయలతో సంధిజేసికొన్న మొదటి ముహమ్మదుశాహు కతనిపై గప్పమును విధింపగల సామర్థ్య మెచటి నుండి వచ్చినది? మఱియు ముజాహిదు నోడించి తఱుమగొట్టి కృష్ణా తుంగభద్రల యంతర్వేదిని జయించుచుండిన (ఇమ్మడి హరిహర) రాయలు ఊరుపేరులేని మహమ్మదుశాహును యువకుడు కలుబరిగె గద్దె నెక్కె నన్నమాట వినగనే రాయచూరు ముట్టడి నేల విసర్జించును? కప్పము గట్ట నేల యొడబడును? వట్టిమాట.

రాయలతో ఘోరయుద్ధము సేయవలసివచ్చెను. వాస్తవస్థితి యిట్లుండ ఫీరోజు శాహునకు క్రీ. శ. ౧౩౯౭ వ సం॥న అంతర్వేది యంతయు నెట్లు స్వాధీనమై యుండగలదు? పై బేర్కొనిన విషయముల నన్నిటిని విచారించి చూడగా ఫీరోజు శాహు యొక్క ప్రథమ విజయనగర దండయాత్ర కృష్ణా గఱిణతటమున నాగిపోయెననియు రాయల స్కంధావారమును లూటీకొట్టుటతో పృప్తినంది యతడు వెనుదిరిగి పోయెననియు వచ్చుట యుక్తము

ఫెరిష్తా కథ విశ్వాసపాత్రము గానిలచుటకు మఱియొక ముఖ్య కారణము గలదు. ఫెరిష్తా చరిత్ర ప్రకారము ఫీరోజుశాహు విజయనగరమున సంధి షరత్తులకు రాయల నొప్పించుచుండిన సమయమునందె ఇమ్మడి హరిహరరాయలు వెలమరాజులతోడను వారికిఖాసటయైనిలిచియుండిన బహమనీ సుల్తాను తోడను యుద్ధము సలుపుటకు శకాబ్దము ౧౩౧౯ వ సం॥నకు సరియైన ఈశ్వర వర్షసభస్య (క్రీ శ. ౧౩౯౭ వ ఆగస్టు-సెప్టెంబరు) మాసమున దక్షిమారుడగు యువరాజ ఇమ్మడి బుక్కరాయల నాయకత్వము క్రింద పెక్కండ్రు సుప్రసిద్ధ శూరకరులతో గూడ నొక గొప్ప సేనను తెలింగాణముమీదికి దండయాత్ర యంపెను. ఈ దండయాత్ర వెలమరాజ్యముయొక్క గర్భమును భేదించుకొని చొచ్చినది. నల్లగొండ మండలములోని పానుగల్లు దుర్గమును సమీపించు సరికి నచ్చట విడిసియుండిన బహమనీ సైన్యముతో సంఘట్టన ఏర్పడినది. భయంకర యుద్ధము సంప్రాప్తమాయె. మహమ్మదీయు లోడిపోయి కోటను రాయ రాణువకు వశపఱచిరి. ఈ విజయమును బ్రకటించు శాసన మిప్పటికి నచట గలదు. ఇమ్మడి బుక్కరాయల ప్రాణాచార్యుడైన భిషగ్వల్లభ లక్ష్మణ బండితుడు వైద్యరాజ వల్లభమను దన వైద్యగ్రంథ పీఠికయందీ దండయాత్రను విపులముగ వర్ణించి యున్నాడు. మనుష్యరూపము గందిన రాతుసులగు తురుష్కుల దళములు పంచ బంగాళమై పాఱిపోయిన పిమ్మట తురుష్క ప్రభువు పూరిగఱచెనట; ఆంధ్ర (వెలమ) నృపాలుడు ఇమ్మడి బుక్కరాయల పాదపద్మములను గడు సంతసముతో శిరమునపై నిడుకొని తనధనము నంతటి సమర్పించెనట.

ఫెరిష్తా చెప్పునట్లు విజయనగర రాయలు ఫీరోజు శాహుచే బరాజితుడై తన రాజధానిని పరిసరదేశమును సంరక్షించు కొనజాలక సంధి చేసుకొన్నది వాస్తవ మగునేని, యట్టిదుస్థితి యందలడు తెలింగాణముపై దండయాత్రనంపి యచట సుల్తానుసైన్యమునేకాక, యతని మిత్రులైన వెలమరాజులనుసైత మోడించుట ఎట్లు సాధ్యమగును? ఈయంశములన్నిటిని పరికించి చూడగా ఫీరోజు శాహుతని ప్రథమ విజయనగర దండయాత్రయందు నిజయుడాయెనని నమ్మ్మటకు వీలులేకున్నది. ఇంతవఱకు లభ్యమైన సాక్ష్యమును బట్టి చూడగా ఫీరూజుశాహీ సంగ్రామ ప్రారంభ సమయందు విజయనగరసైన్యముల నోడించి కృష్ణానది దక్షిణతటమున గొంతరాష్ట్రమును జయించి యుండినను, తుదకు రాయలే విజయు డాయెనని దృఢముగ జెప్పవచ్చును.

ఇమ్మడి హరిహరరాయల కడపటి దినములలో సామ్రాజ్యమున నెట్టికలవరము లేక శాంతి నెలకొనియుండెను. అంతఃకలహములు గాని వైదేశిక దండయాత్రలు గాని లేవు. క్రీ. శ. ౧౪౦౩ వ సంవత్సరాంతమున హరిహరరాయల కారోగ్యము చెడి వ్యాధిగ్రస్తుడై పెక్కునెలలు శయ్యాగతుడై యుండెను. రాయలు బ్రతుకడను తల పెల్లవారికి గలిగినది. అతని యనంతరము రాజ్యాధిపత్య మెవ్వరి దను సమస్య యందరి మనస్సును బీడింపగడగినది. యువరాజగు నిమ్మడి బుక్కరాయలు సామ్రాజ్య పదమునకు నిర్దిష్టుడై యుండినను తండ్రియనంతర మతడు నిరాటంకముగ సింహాసనము నెక్కగలడను నిశ్చయములేదు. అతని సోదరులలో ముఖ్యముగ విరూపణ్ణయు దేవరాయలును అతనియభ్యుదయమును సహించువారుగాదు. గడిదేటిన దండనాయకులగుటయేగాక గొప్ప మండలాధిపతు లగుటచేతను, వారి ప్రతిరోధము దుర్లంఘనీయమే. తండ్రి వ్యాధిపీడితుడై

పడక బడియున్నాడను సమాచారము దెలియగనే తమ పక్షమును బలపఱుచుకొనుట కొఱకు వారిరువురును తమస్థానములను విడిచి విజయనగరమును వచ్చి చేరిరి. రోగముచే నవసినవసి యిమ్మడి హరిహరరాయ లిరువదియెనిమిదేండ్లు ప్రజాపాలనముజేసిన పిమ్మట, క్రీ. శ. ౧౪౦౪ వ సంవత్సరము ఆగస్టు ౧౬ వ తేదీనాడు తనువు వ్యజించి కైలాసవాసి యాయెను.

విజయనగరమును పాలించిన రాజులలో నిమ్మడి హరిహర రాయల స్థాన మత్యున్నతమైనది. అతడు రాజ్యభారమును వహించిన యిరువదియెనిమిదేండ్ల కాలములో విజయనగరరాష్ట్రమన్నిదిశల విస్తరిల్లి మహాసామ్రాజ్యమై పరిణామమందినది. బహమనీ సుల్తానుల నోడించి కృష్ణా తుంగభద్రల మధ్యదేశమును జయించెను; ఉత్తర కర్ణాటమును సప్తకొంకణములను సాధించి రాయ రాజ్యమున గలుపుకొనెను. రెడ్డిరాజుల నోడించి యద్దంకి శ్రీశైల భూములను నాచికొనెను. హరిహరరాయల ఘనకార్యము రాజ్యవిస్తారణ మొక్కటియే కాదు. అతని యేలుబడిక్రింద రాజ్యసంపద తామరతంపరగ నభివృద్ధినందినది. పశ్చిమ సముద్ర తీరమంతయు స్వాధీనమగుటచేత, నందలి రేవుపట్టణములన్నియు రాయల యేలుబడిక్రిందికి వచ్చినవి. వీనిమూలమున విజయనగర సామ్రాజ్యమునకు ద్వీపాంతరములతో రాకపోక లతిశయించి విదేశవ్యాపారము పెచ్చుపెరిగినది. ఐరోపా పశ్చిమాసియాలనుండియు పూర్వ సముద్రద్వీపములనుండియు ధనవాహిని యవిచ్ఛిన్నముగ రాయరాజ్యమునకు ప్రవహింపసాగినది. ఇక నది సర్వసంపదల కాకరమగుటయందబ్బర మేమి కలదు.

ఇమ్మడి హరిహరరాయలు శూరుడే; కాని తన తండ్రివలెను సోదరులవలెను సుప్రసిద్ధ దళనాయకుడు గాదు; కాని యతని పుత్రులలో నిమ్మడి బుక్క, విరూపాక్ష, దేవరాయలు మువ్వురును నారితేఱిన యోధులు. నేర్పరులైన సైన్యాధిపతులు. దళములను గూర్చుటయందును, విచ్చుటయందును, నడపుటయందును, వ్యూహరచనయందును వారిప్రజ్ఞ యద్వితీయము. సోదరుడైన మల్లప్పయు నతని పుత్రుడైన చెన్నప్పయు వీరికి సరియుద్దులు. మాధవమంత్రి కీర్తి ప్రతాపములు మొదటి హరిహరరాయల కాలమునుండియు వాసికెక్కినవే. వీరు కాక గుండదండనాథుడు, ఇరుగపదండనాథుడు మున్నగు పరాక్రమశాలులగు సేనాధిపతు లెందరో హరిహరరాయల ఖడ్గమునకు గర్తలై శత్రుభయంకరులై యుండిరి. కావుననే యతడు రణకర్కశులైన తురుష్కులమీదను, దుస్సహపరాక్రమ తేజులగు వెలమరెడ్డి రాజుల మీదను జయవంతముగ దండయాత్రలు సలుపగల్గినది.

సామ్రాజ్య పరిపాలనయందు విశేషమగు మార్పు లెవ్వియు గానరావు. బుక్కరాయల కట్టుదిట్టముల ననుసరించియే పరిపాలన సాగుచు వచ్చినది. మంగుళూరు, బారకూరు, గోవారాజ్యముల వంటి పశ్చిమసముద్రతీర మండలముల యేలుబడిని సామంతుల కప్పజెప్పినను, తక్కిన సామ్రాజ్యముపై నిమ్మడి హరిహరరాయలు దన కుమారులనే మండలాధిపతులుగ నియమించెను. విరూపణ్ణ ఉడయలు దన పితృవ్యుడైన కుమార కంపణవలె ద్రావిడ దేశమున కంతటికిని రాయ ప్రతినిధి యాయెను. యువరాజగు నిమ్మడి బుక్క రాయలు ఆరగహొయ్సల రాజ్యములు రెంటికి నధిపతి యాయెను. దేవరాయలు రాయ సామ్రాజ్యమున మొదటి దుర్గమైన యుదయగిరి దుర్గాధ్యక్షుడై దక్షిణాంధ్రమునకు పాలకుడాయెను. హరిహరరాయలు సజీవుడై యుండినంతకాలమును ఈ యేర్పాటులు వ్యతిక్రమము లేక చక్కగ నడచినవి; కాని యతని మరణానంతరము సామ్రాజ్య విచ్ఛేదమునకు కీలకములైనవి. సమానరాజ్యబలసంపత్తిగల రాజకుమారులు సరి వారి యభ్యుదయమును సైతురా? కావున ఇమ్మడి హరిహరరాయల పుత్రులు మువ్వురును తండ్రి యూపిరి పోవగనే సామ్రాజ్యాధిపత్యమునకై యొండొరులతో బోట్లాడ గడగిరి.

ఇమ్మడి హరిహరరాయలు గొప్ప విద్వాంసుడు. ఇతనికి రాజవాల్మీకి రాజవ్యాసేత్యాది బిరుదములు గలవు. వీనిబట్టిచూడ నితడు కవిత్వము జెప్పనేర్చిన ప్రభువని తోచుచున్నది. మఱియు నితడు హిందూధర్మ ప్రవర్తకుడు. తండ్రివలె నితడును వేదమార్గప్రతిష్ఠాపకు డను బిరుదును వహించి, మాధవవిద్యారణ్యసాయణాది పండిత వర్గముచే దండి కాలమున ప్రారంభమైన వేద భాష్యమును సంపూర్తి జేయించెను. వేదమార్గము నాచరణకు దెచ్చుటకు, వేదవేదాంగ పారగులగు బ్రాహ్మణుల నాస్థానమునకు రప్పించి సత్కరించి వారిచే యజ్ఞాదివైదికకర్మలను జేయించెను. స్వాధ్యాయము సేయుటకును, శిష్యుల కధ్యయనము సెప్పుటకును వారి కగ్రహారాదుల నొసగి తగువసతుల గల్పించెను. హరిహరరాయల వలె నతని పుత్రులును విద్యావంతులు. విరూపాక్షుడు స్వయముగ కవి. నారాయణీవిలాసోన్మత్తరాఘవములను రెండు సంస్కృత నాటకములను రచించెను. ఇమ్మడి బుక్కరాయలును దేవరాయలును సంస్కృతాంధ్ర కవుల కనేకుల కాశ్రయమొసగి వారి నుత్తమ గ్రంథరచనకు బురికొల్పిరి.

ఇమ్మడి హరిహరరాయల కాలమున విజయనగర మాంధ్రదేశమందలి ముఖ్యవిద్యాపీఠములలో నొక్కటియై కొండవీడు రాచకొండలతో సరితూగ నారంభించెను. శ్రీనాథాది మహాకవులెందరో విజయనగరమునకు బోయి రాయలను మెప్పించి సన్మాన మందిరి. దేవరాయ లాంధ్ర భాషాభిమాని. ఆంధ్రకవులను బోషించి నూతన కావ్యములను వారిచే రచియింపించెను.

ఇమ్మడి హరిహరరాయల పుత్రులు

(క్రీ. శ. ౧౪౦౪-౧౪౦౬)

ఇమ్మడి హరిహరరాయ లసువులు విసర్జింపగనే సామ్రాజ్యాధిపత్యమున కై యతని పుత్రులకు పోరాట ప్రారంభమైనది. ప్రథమ విరూపాక్ష, ద్వితీయబుక్క, ప్రథమ దేవరాయలు మువ్వురును సామ్రాజ్యపదము తమదేయని ప్రకటించి సింహాసనమును దౌర్జన్యముతో నాక్రమించుకొనవలయునని ప్రయత్నము సేయ గడగిరి ఈ యన్నదమ్ముల పోరాటము రెండేండ్లపర్యంతము సాగినను, దాని వృత్తాంతమునుగూర్చి తెలియవచ్చు విషయము స్వల్పమే. తండ్రి మృతినందిన వెంటనే ప్రథమవిరూపాక్ష రాయలు రాజ్యాభిషేకము జేసికొని యొక సంవత్సరకాలము ప్రజాపాలన మొనర్చెను. అతని దొలగ్రోసి యటుపిమ్మట ఇమ్మడి బుక్కరాయలు సింహాసనము నధిష్ఠించి కొంతకాలము రాజ్యము జేసెను. తరువాత మొదటి దేవరాయలు సింహాసనము నాక్రమించుకొని క్రీ. శ. ౧౪౦౬ మొదలు ౧౪౩౭ వఱకు బదునాఱేండ్లు విజయనగరసామ్రాజ్యమును మహావైభవముతో బరిపాలించెను.

మొదటి దేవరాయలు

(క్రీ. శ. ౧౪౦౬-౧౪౩౭)

అన్నదమ్ముల యుద్ధమున తుదకు విజయుడై మొదటిదేవరాయలు వ్రజసింహాసనమునెగూర్చుండి క్రీ. శ. ౧౪౦౬ వ సంవత్సరము నవంబరునెల ౭ వ తేదినాడు పట్టాభిషేకము గావించుకొనెను. ఇతని శాసనముల నితడు ప్రతాపదేవరాయ లనియు గాదాచిత్కముగ ప్రౌఢదేవరాయ లనియు బేర్కొన బడియున్నాడు. ఇతడు విజయనగర సామ్రాజ్యమును బాలించిన పదునాఱేండ్లును నిరంతరము శత్రువులతో బోరాడనలసి వచ్చెను. బహమనీసుల్తాను తోడనో, యతని మిత్రులగు తెలింగాణపు వెలమల తోడనో, కొండపీటి రెడ్లతోడనో, యే కారణమువల్లనైననేమి, యుద్ధము తప్పినదికాదు. ఎందఱు బలాధికులైన శత్రువులు పైకొనివచ్చినను బీఱు వోవక మాఱొడ్డి వారితో సరిపోరుచు దేవరాయలు దన పరువు ప్రతిష్ఠలను నిలుపుకొనుటయేకాక పరరాష్ట్రములను సాధించి నిజరాజ్యమున గలుపుకొని సామ్రాజ్య వైశాల్యమును బెంపొందించెను.

రాజ్యాభిషేకమైన వెంటనే దేవరాయలు సంగ్రామమునకు నడువవలసి వచ్చెను. సింహాసనము

నధిష్ఠించెనో లేదో యంతటనె వార్త వచ్చినది, బహమనీసుల్తాను ఫిరోజుశాహు మహాప్రచండ సైన్య ముతో విజయనగరముపై నెత్తివచ్చుచున్నాడని. సుల్తాను దండయాత్ర నిర్ణీతము గాదు; ఎదురు చూచుచుండినదే. ఇంతదనుక రాకపోవుటయే చిత్రము. ఇమ్మడి హరిహరరాయలు గతించిన పిమ్మట యంతఃకలహాముల మూలమున విజయనగరసామ్రాజ్యము సంక్షుభితమై పరరాజు లెత్తివచ్చుట కనుకూలముగా నుండినది. రాయలపై నెల్లప్పుడు కయ్యమునకు గాలు ద్రవ్వుచుండిన ఫిరోజుశాహు అట్టి యనుకూల తరుణమున నెత్తిరాక దేవరాయల పట్టాభిషేకమగు వఱకు నేల వేచియుండెనో తెలియదు.

ఈ దండయాత్రయొక్క కారణమును మహమ్మదీయ చరిత్రకారులు పలునిధముల వర్ణించి యున్నారు.తబకాత్-ఇ-అక్బరీయందు నిజామ్-ఉద్-దీన్ అహమదిట్లు వ్రాసియున్నాడు. దేవరాయలు బధోలు (ముధోలు) ప్రాంతమున నివసించుచుండిన సౌందర్యవతియగు నొక విలాసినిపై మరులుగొని దాని దోడి తెచ్చుటకు ఫౌజుల నంపెను. బధోలు బహమనీ రాజ్యాంతర్గత మగుటచేత దనరాష్ట్రము లోనికి ఫౌజుల నంపినందుకు దేవరాయలపై గోపించి యతని శిక్షించుటకు ఫిరోజుశాహు గొప్పసైన్య ముతో గూడ విజయనగరముపైకి నెత్తివచ్చెనట. కథారచనయం దద్భుతప్రజ్ఞగలవాడగు ఫెరిష్తా పైకథను పెంచి శాఖోపశాఖలు గల్పించిహృదయంగ మముగ వర్ణించియున్నాడు. దీనితోపాటు ఫిరోజు శాహు దండయాత్రకు ఫెరిష్తా మఱియొక కార ణముగూడ తెల్పుచున్నాడు. దేవరాయలు గుజ రాతు మాళవదేశపు సుల్తానులతో జెలిమి చేసికొని ఫిరోజుశాహును సరకుసేయక, అంతకు పూర్వమత నితో జేసికొనియుండిన యొడంబడిక ప్రకారమతనికి జెందవలసిన కప్పమును నాలుగేండ్లు వఱకు గట్టక నిరాకరించెననియు, దత్కారణమున సుల్తాను దండు వెడలెననియు వ్రాసియున్నాడు. బుర్హాన్-ఇ-మ అసీరు రచయిత యగు సైయ్యదు అలీ బిన్ అజీజ్-ఉల్-ల్లా తబాతబకు పైదెల్పిన రెండు కారణము లును దెలియవు. బధోలు సుందరాంగిపై దేవరాయ లకు గల్గిన మోహమును గాని గుజరాతు మాళవ సుల్తానులతోడి దేవరాయల చెలిమిని గాని యత డెఱుగడు. విజయనగర సామ్రాజ్య వాస్తవ్యులైన కాఫిరులపై జిహాదు సేయుటయే ఫిరోజుశాహు యొక్క ప్రధానోద్దేశమని యతడు తెల్పియున్నాడు. మహమ్మదీయ చరిత్రకారు లిట్లు ఫిరోజుశాహు దండ యాత్రకు గారణము నొకతీరునగాక పలువిధముల వివరించుచున్నారు. దేవరాయలు సింహాసనము నెక్కియు నెక్కకముందే బహమనీ సుల్తాను రాజ్యమునందు నివసించుచుండిన యౌవనవతిపై మరులుకొని దాని తోడితెచ్చుటకు బహమనీరాష్ట్రము లోనికి దళములనంపి ఫిరోజుశాహుతో దగవును తెచ్చిపెట్టుకొనెనని నమ్ముటకు వీలులేదు. అప్పటి కింకను దేవరాయలు సామ్రాజ్యమున సుప్రతిష్ఠితుడు గాలేదు. ప్రచ్ఛన్నశత్రువు లతని బరివేష్టించి యతని యసువులు గొన తటి వేచియుండిరి.* ఈ విషమావస్థయం దలఁడు బహమనీ సుల్తాను బోరికి జీరినాడనుట నమ్మదగని విషయము. మహమ్మదీయ చరిత్రకారుల వ్రాతలలోని సత్యాసత్యము లెట్లు న్నను, ఫిరోజుశాహు దండయాత్రకు వాస్తవమైన కారణము బహమనీ సుల్తానులకును విజయనగర రాయలకును దరతరములనుండి వచ్చుచుండిన వైరమే.

---

* దేవరాయల రాజ్యప్రారంభ దశయందు హంతకులు కొందఱు అతని వధించుటకు ప్రయత్నము సల్పిరి. కొందఱు దుష్టులు ఖడ్గహస్తులై నగరి పెద్ద దర్వాజాను ముట్టడించి దేవరాయలను వధింపగడగి రనియు, ప్రధానులలో నొక్కడగు లక్కణ దండనాయకుడు హంతకులను జంపి రాయదేవుని రక్షించె ననియు, క్రీ. శ. ౧౪౧౦ నాటి యొక హంపి శిలాశాసనమున జెప్పియున్నది. పై జెప్పిన హత్యాప్రయ త్నము శాసనకాలమునకు అనగా క్రీ. శ. ౧౪౧౦ వ సంవత్సరమునకు బూర్వము ప్రాయశ: రాజ్యారంభ ముననె జరిగియుండవలయును.

ఈ యుద్ధవృత్తాంతము మహమ్మదీయ చరిత్రలయందు వర్ణింపబడి యున్నను నదియంతయు సత్యమని నమ్ముటకువీలులేదు. మతపక్షపాతకారణమున తురకల యాధిక్యమును, హిందువుల సత్వహీనతను ప్రకటించుటయె వాని ముఖ్యోద్దేశము. అందు సత్యదూరములైన యంశములు పెక్కుగలవు. కావున నందు వర్ణింపబడిన విషయములన్నియు వాస్తవమని నమ్ముటకు వలనుపడదు.

మహమ్మదీయ చరిత్రల ననుసరించి యుద్ధరంగము కృష్ణా తుంగభద్రల మధ్యదేశమని చెప్పవలసియున్నది. లభ్యమైన చరిత్రాధారములను బరిశీలించి చూడగా నదియంతకంటె విస్తృతమైనదని తెలియ వచ్చుచున్నది. యుద్ధము నడచినదొక కృష్ణాతుంగభద్రల మధ్యసీమయందు మాత్రమే కాదు. రాజుకొండ, కొండవీడు రాజ్యములును, విజయనగర సామ్రాజ్యాంతర్గత యుదయగిరి రాజ్యమును యుద్ధరంగమున జేరినవే. హిందువుల సహాయము వలన ఫిరోజుశాహు కీ దండయాత్రయందు జయము గలిగెనని చెప్పుట కిష్టపడక రాచకొండ కొండవీటి రాజ్యములను మహమ్మదీయ చరిత్రకారులీ సందర్భమున స్మరింపక విడిచిపెట్టి పోరాటమంతయు బహమనీ సుల్తానుకును విజయనగరరాయలకును కృష్ణాతుంగభద్రల నడిమిదేశమునందే నడచినట్లనియు, యన్యసహాయము లేక తురకలే జయమందిరనియు వ్రాసిరి.

దేవరాయలు బలాధికుడనియు, నన్య సహాయములేక యతని రాజ్యముపై దండయాత్రను జయప్రదముగ సాగించుట సాధ్యము గాదనియు ఫిరోజుశాహు చక్కగ నెఱుగును. కావున తనపక్షమును బలపఱచుకొనుటకతడు రాయల పగవారితో సఖ్యము జేసికొని వారి సహాయమును బడసెను. బహమనీ వంశజులకు బరంపరగ హితులైన వెలమలు ఫిరోజుశాహుకు దోడ్పడుట యందు వింత లేదు. కుమారగిరిరెడ్డి నిర్యాణానంతరముకొండవీటి రాజ్యమున కధిపతియైన పెదకోమటివేమారెడ్డి రాయలయెడ ద్వేషభావము గలవాడగుటను గ్రహించి యతనితో జెలిమి వాటించి సాయమర్థించెను. పెదకోమటి వేమారెడ్డికి విజయనగరరాయలపై బగ కలుగుటకు ప్రబలమైన కారణములు గలవు. రాయలు సమయ మనుకూలపడినపు డెల్ల కొండవీటిరాష్ట్రము నాక్రమించుకొనుటయేకాక యతని విద్వేషియు రాజమహేంద్రవర రాజ్యాపహర్తయునగు కాటయ వేమారెడ్డితో నిమ్మడి హరిహరరాయలు, దేవరాయల సలహాప్రకారము, మైత్రిసల్పి ప్రాపై నిలచుటయు నతని చిత్తము నెరియించుచుండెను. రాయలపై బగతీర్చుకొనుటకతని కప్పుడు మంచి సమయము చిక్కినది. కావున ఫిరోజుశాహు ప్రార్థన నంగీకరించి యాతడు కోరినట్లు విజయనగర దండయాత్ర యంచు తోడ్పడుటకు పెదకోమటి వేమారెడ్డి యొప్పుకొనెను. వెలమ రెడ్డిరాజుల సాయమువలన రాయలపై దనకు విజయము చేకూరగలదను నమ్మకము ఫిరోజుశాహు హృదయమున దృఢముగ బాదుకొన్నది. ధైర్యముతో నతడు యుద్ధప్రయత్నములు సేయ నారంభించెను. విజయనగర రాజ్యముపై రెండువైపుల నుండి యేకకాలమున దండువెట్టిన, రాయల సైన్యము విభక్తమై యతని బలము సన్నగిల్లునని యోచించి, తాను కృష్ణా తుంగభద్రల యంతర్వేదిపై దండువెడలి నప్పుడె తన పంపుతో గూడ వెలమరెడ్డి దళములు విజయనగర సామ్రాజ్యాంతర్గత తీరాంధ్ర భూమిపై నడువవలెనని తీర్మానించెను. ఈ సంవిధానము యుక్తియుక్తమే; సమరవిద్యాకోవిదులు పన్నదగినదే. అందువల్ల ఫిరోజుశాహు మనోరథము సంపూర్ణముగ గాకపోయినను గొంతవఱకైనను సిద్ధించినది. సుల్తాను ఉద్దేశమును దేవరాయలు చక్కగా గ్రహించెను; అతడనుకొనినట్లు రాయలు తనదళములను విభజింపలేదు. తీరాంధ్రదేశము శత్రువుల వశమైన నగుకాక; తన బలముల నన్నింటిని కృష్ణా తుంగభద్రల యంతర్వేది యందు కూర్చి యొక్కమ్మడి సుల్తాను నెదుర్కొనుటయె శ్రేయస్కరమని నిశ్చయించి యట్లొనర్చి యుద్ధమునకు సంసిద్ధుడాయెను.

ఈ దండయాత్రయందు ఫిరోజుశాహు సంపూర్ణ విజయమును బొందెనని మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసియున్నారు. తక్కినవారికంటె

ఫెరిష్తా యుద్ధచరిత్రను విపులతరముగ వర్ణించి యున్నాడు. అతడు వర్ణించిన యుద్ధ విశేషముల సంగ్రహపఱచి చెప్పవచ్చును. నిర్ణిరోధముగ ఫీరోజు శాహు దండుతో గూడ కూచి చేసి వచ్చి విజయ నగరముకడ విడిసి కోటను దొమ్మిచేసి లగ్గలువట్ట బ్రయత్నము జేసెను; కాని యతనికడక నెరవేఱ లేదు; దుర్గసంరక్షక దళములచే విదళితుడై గాయ పడి పరాఙ్ముఖుడై పోవలసివచ్చెను; కాని దండ యాత్రను విరమించుకొనలేదు. కోటచెంత తస్సా వేసి కూర్చుండి పరిసరప్రాంతములను చూఱగొనుచు దేవాలయములను పాడు సేయుచు, పట్టణ గ్రామాది జన నివాసస్థలములను దగులపెట్టుచు, బ్రజలను నానావిధముల హింసింపగడగెను. అతడు పెట్టు బాధల కోర్చుకొనజాలక మంత్రి సామంతాది నియోగివర్గమును తపోధనులగు బ్రాహ్మణులును రాయలవారి దర్శనము జేసికొని రాష్ట్రజనము పడు కష్టములను వివరించి చెప్పి సుల్తానుతో సంధిజేసి కొనుట శ్రేయస్కరమని విన్నవించిరి. దేవరాయలు వారి విన్నపము నంగీకరించి సుల్తాను శిబిరమునకు రాయబారులనంపి సంధిని ప్రసాదింపవలయునని వేడ్కొనెను. అపారధనము నొసగి, రాయల కుమార్తె నిచ్చి తన కుద్వాహ మొనర్చి, బంకాపుర దుర్గమును వశపఱచినగాని సంధికొడబడనని ఫీరోజుశాహు జవాబు చెప్పెను. అందుకు సమ్మతించి, దేవరాయలు దన కుమార్తెను సుల్తానుకిచ్చి పెండ్లిచేసి సంధిచేసికొనెను; విజయుడై సుల్తాను తన రాజధానికి మరలిపోయెను.

నిజామ్-ఉ-'ద్దీన్ అహమదుగూడ ఫెరిష్తా చెప్పిన కథనే చెప్పియున్నాడు. కాని వారిరువు రికిని ఒక ముఖ్య భేదము గలదు. రాయల కూతురి వివాహ ప్రస్తావము నిజామ్-ఉ-'ద్దీన్ గ్రంథమందు లేదు. రాయల కూతు నిచ్చి తన కుద్వాహ మొనర్చినగాని సంధి కొడబడనని ఫీరోజుశాహు పట్టుబట్టె నని కాని, యందుకు సమ్మతించి దేవరాయలు దన పుత్రికను సుల్తానుకిచ్చి పెండ్లి చేసెనని కాని యతడు చెప్పలేదు. విషయ మల్పమైనది కాదు. మహమ్మ దీయ ప్రపంచమునకు ప్రతిస్పర్థియై సరిపోరుచుండిన రాయల కుమార్తెను మహమ్మదీయ ప్రభువు విజయ లక్ష్మితోగూడ కరగ్రహణము సల్పుట యసాధారణ విషయము. ఏ మహమ్మదీయ చరిత్రకారుడును విస్మరింప నొల్లనిది. ఈ వివాహము వాస్తవముగ జరిగియేయుండిన నిజామ్-ఉ-'ద్దీన్ దీని నేల స్మరింపక విడిచిపెట్టెనో! ఇక బుర్హాన్-ఇ-మఅసీరు రచయిత సయ్యదు అలీ వర్ణించిన యుద్ధ వృత్తాంతము నారాయుదము. దానితీరే వేఱు. అతడు ఫీరోజు శాహు విజయనగర సమీపమునకు వచ్చినట్లుకూడ చెప్పడు. సుల్తాను సైన్యము విజయనగరరాష్ట్రమును ప్రవేశించినంతటనె కొలసేయుటకును కొల్లగొట్టుట కును ప్రారంభించెను; ప్రజలను శిక్షించుటకొఱకు వారి యునికిపట్లను బరశురామప్రీతి గావించెను. ఫనూరు మూసల్కులకు జెందిన సీమలను గొన్నింటిని బాహు పరాక్రమముచే సాధించి వశపఱచుకొనెను. నిర్ణీతమైన కప్పము మొత్తము ముప్పది మూడులక్షల ధనమును రాబట్టుకొని కొల్లగొన్న విపుల వస్తుచయముతో గూడ ఫీరోజుశాహు మరలి నిజరాజధానికి బోయి చేరెను. సయ్యదు అలీ వచించు యుద్ధ వృత్తాంతమును బట్టిచూడగా ఫీరోజుశాహు దండయాత్ర ఫనూరు మూసల్కులు ప్రాంతములతో నాగిపోయినట్లు చెప్పవలసి యున్నది. ఈ రెండు ప్రదేశములును రాయచూరు జిల్లా పశ్చిమోత్తర భాగమున నుండు దేవదుర్గ తాలూకాయందుకృష్ణానదీ దక్షిణతటమునందున్నవి. అచటి సీమలను గొన్నింటిని జయించి ఫీరోజుశాహు నిజ రాజధానికి వెనుదిరిగి పోయియుండినచో నతడు విజయనగరమునకు రానేలేదని చెప్పవలసి యున్నది. మఱియు సయ్యదు అలీ కూడ రాయల కూతు వివాహ వృత్తాంతము నెఱుగడు. సుల్తాను దేవరాయల నెదుర్కొనినట్లు కాని, యుద్ధమున నతని నోడించి సంధి కొడబఱచినట్లు కాని చెప్పడు. ఇట్లు పరస్పర విరుద్ధములైన మహమ్మదీయ చరిత్రకారుల రచనల నాధారపఱచుకొని, యీ దండయాత్రయందు జరిగిన సంగతుల సత్యాసత్యములను నిశ్చయించి చెప్పుటకు వీలుకాదు. కాని చింతనీయాంశముల గొన్నిటి నిచట విపరించుట సరి. ఫీరోజుశాహు ఎత్తివచ్చుచున్నాడని యెఱిగియు నతని కడ్డపడు ప్రయత్నమును దలపెట్టక యతనిరాక నెదురుచూచుచు దేవరాయలు మిన్నక

విజయనగరమున గూర్చుని చనుండెననుట విశ్వసనీయము గాదు ; మఱియు కోట లగ్గలువట్ట సుల్తాను గావించిన యత్నము భగ్నముజేసి యతని దూరము దఱుమగొట్టిన దేవరాయలు ఫీరోజు శాహుకు దన కూతు నిచ్చి వివాహముజేసి యవ మానకరమగు సంధి కొడబడె ననుటయు సంశయ గ్రస్తమే. నిజామ్-ఉ-'ద్దీన్ అహమదుకాని సయ్యదు అలీ కాని యీ వివాహము మాట యెత్తకపోవుట వలన నిది సత్యము కాదని తోచుచున్నది. ఫెరిష్తా కథను యథార్థమని రుజువుసేయగల సాధనాంతరము లభించువఱకును దేవరాయలు తన కుమారితను ఫీరోజుశాహు కిచ్చి పెండ్లిచేసి సంధి విలిచెనని యొప్పుకొనుటకు వీలుపడదు.

తూర్పుదేశమున జరిగిన యుద్ధమునుగూర్చి విశ్వాసపాత్రమైన సాక్ష్యము లభ్యపడియున్నది. వెలమరెడ్డి దళములతోగూడ సుల్తాను ఫౌజులు ఉదయగిరి రాజ్యముపై దిగువాటినవి. ఈ సమయమునసే కాబోలు దండయాత్రికుల మార్గము నరికట్టి వెలుగోడు తెలుగు చోళ ప్రభువు, తిప్పరాజు, కొచ్చెర్లకోట కడ యుద్ధము జేసినది. వెలమరెడ్డి తురక దళములు కడప మండలములోని బండి కనుమదాక నడచినవి. రాయరాణువ కనుమనాక్రమించి మార్గమునరికట్టెను. ఇరువాగులకు యుద్ధము జరిగెను. దేవరకొండ వెలమదొర, పెదవేదగిరి నాయనిపుత్రుడు రామచంద్రనాయడు, ఘోరముగా బోరి విజయనగర బలముల బాఱదోలి కనుమ మార్గమును నిర్నిరోధము గావించి ఫీరోజుశాహు మన్ననకు పాత్రుడాయెను. తత్పరిసరసీమలయం దమరమాగాణముల ననుభవించుచుండిన సంబెటసరి పల్లి రాజులను వెలమవా కోడించిన దీ దండయాత్ర యం దైయుండవచ్చును. పొడచేడు దుర్గాధిపతియు, సుప్రసిద్ధశూరశిఖామణియునగు పోలేపల్లి బుక్క రాజు వెలమవారి చేజిక్కిన దీ సనుయమునసే మొ. ఈ దండయాత్రకు ఫలితముగ ఉదయగిరి రాజ్యమున జాలభాగము రాయసామ్రాజ్యమునుండి విడివోయి శత్రుహస్తగతమైనది. కడపమండలమున కీశాన్యభాగమున నుండు పొత్తపి, పులుగుల నాడులు రెండును రెడ్లకు సైవసమాయెను. క్రీ. శ. ౧౪౧౩-౧౪౫ సంవత్సరము వఱకును ఏడేండ్లపర్యంతము రెడ్ల ప్రభుత్వ మిచట సాగెను. రాయసామ్రాజ్యముచే బరివృతమైన దూర భూములపై రెడ్లింతకాలమెట్లు దొరతనము సేయగల్గిరో వివరించి చెప్పుటకు సాధ్యముగాదు.

సమరాంగణమున రాయరాణువను బలుతావుల నిర్జించి విస్తారమైన రాష్ట్రము నాక్రమించుకొన్నను మిత్రమండలి విజయము సంపూర్ణమైనదని యెంచుటకు వీలులేదు. పలన, వెలమ రాజ్యమునకు బొడ్డనదగు పానుగంటి దుర్గమునుండి దేవరాయలను వెడలదోలుటకు వారికి శక్తి చాలదాయె. ఈ దండయాత్రయొక్క కడపటి దశయందేమి సంభవించెనో తుదకది యెట్లు పర్యవసానమందెనో తెలియదు. సుల్తానుకు రాయలతో సంధి కుదిరిన వెంటనే యిచటను యుద్ధమాగిపోయి యుండవచ్చును. దండయాత్ర యెట్లు పర్యవసాన మందియుండినను, దాని మూలమున రాయరాజ్యమున గొప్ప కలవరము గలిగినది. అమరనాయకులు గొందఱు రాయల యోటమికి గారణ మాతని బలక్షయమకాదలచి స్వతంత్రులగుటకు ప్రయత్నమొనర్చిరి. కడప మండలమందలి పుష్పగిరి ప్రాంతమున మల్ల రాజులని ప్రతీతి నందిన యాంధ్రచోళక్షత్రియులు రాజ్యమేలు చుండిరి. వీరియందు అప్రతి మల్లగంగయ దేవచోడమహారాజును, నతని పుత్రుడప్రతిమల్ల అహోబలదేవ చోడమహారాజును ముఖ్యులు. పైబేర్కొన్న యవాంతరమును సందు చేసికొని వీరు రాయలపై దిరుగబడిరి. క్రీ. శ. ౧౪౧౩-౧౪౪ వ సంవత్సరమున దేవరాయలు దన పుత్రుని విజయరాయలను గొప్పసైన్యముతో గూడ వారిమీదికంపెను. విజయరాయలు వారితో హోరాహోరిగ బోరి వారిని నిర్మూలము గావించి రాయల యధికారము నా ప్రాంతముల యథాపూర్వము నెలకొల్పుటయే కాక రెడ్లను వెడలగొట్టి పొత్తపి పులుగుల నాడులతో గూడ యుదయగిరి రాజ్యమును సర్వమును స్వాధీనపఱచుకొనెను.

వైదేశిక దండయాత్రలచే కలగుండు పడియుండిన నిజ సామ్రాజ్యమున క్షుద్రోపద్రవముల

నణచి శాంతిని నెలకొలుపుచున్న సమయమునసె దేవరాయలు రాజమహేంద్రవర రెడ్డిరాజ్య వ్యవహారములందు ప్రవేశము గలిగించుకొనవలసివచ్చెను. విషయము సుబోధమగుట కొఱకు అప్పటి రెడ్డి రాజ్యచరిత్ర నిచట సంగ్రహముగ వివరింపబడవలసి యున్నది. క్రీ. శ. ౧౪౦౨ వ సంవత్సరమున కొండవీటి రెడ్డిరాజు, కుమారగిరి యస్తంగతు డాయెను. అతని యేకపుత్రు డతని కంటె ముందె లోకాంతరగతు డగుటచేత, అతని యనంతరము రెడ్డిరాజ్యమున కతనిజ్ఞాతి పెదకోమటి వేమారెడ్డి బాధ్యస్థుడాయె ; కాని రెడ్డిరాజ్యమంతయు నత నికి వశపడలేదు. కుమారగిరిరెడ్డి తన బావయు బ్రధానియునగుకాటయవేమారెడ్డినితాను సజీవు డై యుండగనె రాజమహేంద్రవర రాజ్యమున కధిపతిగ నియమించి యుండుటవలన, తూర్పుదేశము నంతటిని అతడు వశపఱచుకొని రాజమహేంద్ర వరము రాజధానిగ పాలింపగడ గెను. మిగిలియుండిన కృష్ణ దక్షిణ రాష్ట్రమునకు మాత్రము పెద కోమటి వేమారెడ్డి యధిపతియై తన పూర్వికులవలె కొండవీటినుండి పాలింపదొడ గెను. రెడ్డిరాజ్యమిట్లు రెండు స్వతంత్ర సంస్థానములుగ జీలిపోయినది. ఆద్యమునుండియు నీ రెండు సంస్థానములకు బొందు కుదురలేదు. రాజమహేంద్రవరరాజ్యమేలు టకు గాటయవేముడు బాధ్యుడని పెదకోమటి వేమారెడ్డి యొప్పుకొనలేదు. కావున వారికి వైరము గలిగెను. మఱియు రాజుకొండ వెలమవా రతనియెడ ద్వేషము వహించి యతని రాజ్యము నం దల్లరుల రేప నారంభించిరి. రాజ్యచ్యుతు డై పరదేశముల బ్రవాసముండిన తెన్గుచోళ రాకుమా రుని, యన్న దేవచోళుని, బురికొల్పి రాజమహేంద్ర వర రాజ్యమున సంక్షోభము గల్గించు నుద్దేశముతో నచటి కంపిరి. అన్న దేవచోడుడు చోడభక్తి రాజ కుమారులలో నొక్కడు ; భీమలింగమను జేశ్వరుని ద్వైమాతురుడు. రెడ్డిరాజులకును వీరికిని సంబంధ బాంధవ్యములు గలవు. రెడ్డిరాజులు భీమలింగని పక్షము వహించి పితృపైతామహమైన రాజ్యము నతనికిచ్చి యన్న దేవుని దేశకాకిని చేసిరి. ఈ కార ణమున నతనికి రెడ్లయెడ వైరము గలిగెను. రెడ్లకు ప్రకృత్య మిత్రులైన వెలమవారి కడకేగి వారి నాశ్రయించి కొంతకాలము వారి సంస్థానము నందుండెను. ఈ కాలమునసె విజయనగరదేవ రాయలు జయించిన సగరుకోటను మరల స్వాధీనము జేసికొనుట కెత్తిపోవుచుండిన ఫీరోజుశాహునకు దోడై చని కర్ణాటకుల తోడి యుద్ధమున దన పరా క్రమమునుజూపి యతని మన్ననకు పాత్రుడాయెను. కులక్రమాగతమైన రాజ్యమును స్వాధీనపఱచుకొన వలయునని దృఢసంకల్పము గల సుప్రసిద్ధ వీరుని రాజమహేంద్రవర రాజ్యముపై కంపిన కాటయ వేమని కతడు ప్రక్కలోని బల్లెము కాగలడని వెలమదొరల నమ్మకము. అన్న దేవుడు దన వెలమ మిత్రుల నమ్మకమును వమ్ము సేయలేదు. వారుద్దే శించినట్లు కాటయవేముని రాజ్యమున గొప్ప యల్లరిని రేపెను. కృష్ణా గోదావరుల మధ్య తీర దేశము నాక్రమించుకొనెను. రాజమహేంద్రవర పట్టణమును గైవసము గావించుకొని దన యధి కారము నచట నెలకొల్పెను. అన్న దేవు డిట్లు కృష్ణా గోదావరుల మధ్యదేశము నాక్రమించుకొనుచుండిన సమయమునసె దేవరకొండ వెలమరాజు, పెదవేమ గిరినాయడు, గోదావరిలోయగుండ తీరదేశము జొచ్చి, దక్షిణ కళింగ మందలి రెడ్డి రాష్ట్రముపై బడెను. ఉభయపార్శ్వముల శత్రుల మధ్యబడిన కాటయవేముని స్థితి యడకొత్తులోని వక్కగతి యాయెను. పడమట రాజధానితోగూడ దేశమం తయు నన్న దేవుని చేజిక్కెను ; తూర్పున కళింగ రాష్ట్రము నంతటిని వెలమవారాక్రమించుకొనిరి. మిగిలిన పిఠాపుర పెద్దాపుర ప్రాంతభూములు మాత్ర మతని యధీనమందుండిన వేమె. అతడు నిస్సహాయుడు ; వెలుపలినుండి తోడుపచ్చునన్న యాశ కెడములేదు. విజయనగర చక్రవర్తి ప్రథమ దేవరాయలు దనకు మిత్రుడును సంబంధికుడును నగుట నిక్కమే. కాని యతడు ఫీరోజుశాహుతో యుద్ధము సేయుచున్నంతకాలమును అతనివలన దనకు సహాయము గలుగునని యెంచుటకు వీలు లేదు; కావున కాటయ వేము డాయుద్ధ మెన్నడు తుదముట్టునా యని ప్రతీక్షించుచు వేచియుండ వలసి వచ్చెను. దేవరాయలు శత్రువులనెల్ల రాయ సామ్రాజ్యమునుండి పోదోలి తన యధికారమును దృఢముగ బాదుకొల్పిన పిమ్మట కాటయవేముడు

రాజ్యమును మరల సంపాదించుట కనుకూల సమయము వచ్చినదని యెఱిగి, క్రీ. శ. ౧౪౧౦-వ సంవత్సరమున విజయనగరమునకు బోయి రాయల సహాయము నర్థించెను. గోదావరితీరమందలి రెడ్డి రాజ్యముయొక్క స్వాతంత్ర్యమును గాపాడుట యత్యంతావశ్యకమని దేవరాయలు గ్రహించెను. బహమనీసుల్తాను తోడను నతని మిత్రులతోడను జరుగుచుండిన యుద్ధము తాత్కాలికముగ నాగిపోయినమాట వాస్తవమే; కాని, వారతనికి సహజశత్రులగుటవలన మరల వారితో గలహము గలుగకపోదని యాత డెఱుగును. అట్టి యుద్ధమే సంభవించిన భవిష్యత్కాలముగ రాజమహేంద్రవర రెడ్డి రాజ్యము వసకు వెనుదాపై యుండునని తలచి కాటయవేముని ప్రార్థన సంగీకరించి యతనికిదోడు వచ్చెదనని వాగ్దానము జేసి, మాట చొప్పున దన సైన్యములకు గోదావరీ తీరముపై వెంటనె కూచిసేయ ముదలవెట్టెను.

సరియైన తరుణమునకు గోదావరి తటమునకు బోయి చేరినది విజయనగర సైన్యము. అచటి స్థితిగతు లప్పటికె విషమదశకు వచ్చియుండినవి. రాజమహేంద్రవర రాజ్యమును స్వాధీనపఱచుకొనవలయునను నుద్దేశముతో బెదకోమటి వేమా రెడ్డి దండువెడలిపోయి గోదావరిని దాటి నదీ పూర్వతటమున నిప్పటి రాజోలు తాలూకాలోని రామేశ్వరము కడ విడిసెను. బహమనీ సుల్తాను ఫీరోజుశాహు దన మిత్రులకు దోడు వచ్చుచున్నాడని యెల్లరు నెదురు చూచుచుండిరి. గోదావరితీర దేశమును బ్రవేశింపగనె విజయనగర సైన్య మిప్పటి తణుకు తాలూకాలోని యత్తిలి దుర్గమును వశపఱచుకొని దానిని నెలవీడు జేసికొని నదీ పశ్చిమ తట భూముల నాక్రమించుకొన గడగెను; రాయరాణువరాగను గాంచి ధైర్యము వహించి కాటయవేముడు రణరంగము జొచ్చి రామేశ్వరముచెంత ఘోరసంగ్రామమున పెద కోమటి వేమునోడించి పాఱదోలెను. అన్నదేవ చోడుని యడ్డపాటువలన పెదకోమటి వేముని దళములు కాటయవేముని ప్రతాపాగ్నియందు పూర్ణాహుతి గాక తప్పించుకొనెను. రెడ్డిరాజు లిరువురును రామేశ్వర రణక్షేత్రమున దార్కొనుచుండిన సమయమునన బహమనీ సుల్తాను ఫీరూజుశాహు దండుతో గూడ వచ్చి చేరెను. సుల్తాను రాకవలన ప్రవృద్ధబలుడై యన్నదేవుడు విజృంభించి విజయనగర సైన్యములను దాకి నిర్మూలము గావించెను. సుల్తాన్ ఫీరోజుశాహు తెలింగాణమును జయించు నుద్దేశముతో దండు వెడలి రాజమండ్రి వఱకును సైన్యము నడపుకొని పోయెననియు, బెక్కు దుర్గములను సీమలను సాధించి వాని పాలించుటకు దన యనుచరులను నియమించి మరలి తన రాజధానికి వచ్చి చేరె ననియు బుర్హాన్-ఇ-మఅసీరు నందు చెప్పియున్నది. సమకాలిక శాసనము లిది యదార్థమని రుజువు సేయుచున్నవి. క్రీ. శ. ౧౪౧౬ వ సంవత్సరమునకో మరుసటి యేటనో ఉల్లేఖింపబడిన యన్నదేవచోడని రాజమండ్రి మ్యూజియం తామ్రపట్టికయందు అన్నదేవుడు దనకు సూఱొడ్డిన దాక్షిణాత్య నృపాలుర నత్తిలి గడిసీమ యందోడించి, యా పట్టణమందు తలదాచుకొని యుండిన దశసహస్ర సంఖ్యాక శత్రుబలముల కభయప్రధాన మొనర్చె ననియు; తన మరది యగు పిన్నుండి రాజసహాయ ముచే గౌతమీ తటమందలి కాకరపర్తి రణక్షేత్ర మున విజయనగర సైన్యమును నిర్మూల మొనర్చె ననియు; రామేశ్వర రణక్షేత్రమున నిర్జితుడై పాఱిపోవుచుండిన మిత్రుని పెదకోమటి వేముని సంరక్షించె ననియు జెప్పియున్నది. ఈ సంవ ర్భమున నెచటనో యజ్ఞాత రణరంగమున గాటయ వేముడు నిహతుడైనట్లున్నది; అతని కుటుంబము కాకరపర్తి యుద్ధమైన తరువాత అన్నదేవుని చేజిక్కెను. కాని యతని విజయము చిర స్థాయిగ నిలువలేదు, తాత్కాలికమే. శత్రువులు విజితులైనను వినాశ మందలేదు. కాకరపర్తి రణ క్షేత్రమున గర్ణాటక బలము నిధ్వంస మాయెనను

వార్త పచ్చిచేరగనే, దేవరాయలు గ్రొత్త దండును రెడ్లకు దోడంపెను; దాని గాంచి ధైర్యము దెచ్చుకొని కాటయ వేముని సేనాధ్యక్షుడు దొడ్డయ అల్లాడరెడ్డి చెదరియుండిన రెడ్డిబలముల నెల్ల మరల కూర్చి యన్నదేవుని తారసిల్లెను. తరువాతియుద్ధవర్తమానము దెలియరాక పోయినను, అల్లాడరెడ్డి విజయు డాయెననుట నిశ్చయము. అన్నదేవుడును నతని కుమారుడగు వీరభద్రుడును యుద్ధమున మడసిరి. వారి సహాయులు గూడ నిర్జితులై వెనుదిరిగిపోయిరి.

రాజమహేంద్రవర రెడ్డి రాజ్యమంతట నిష్కంటకమైనది. కాటయవేముడు నిహతుడైనను అల్లాడరెడ్డి రాజ్యమును స్వాధీనపఱచుకొని రాజమహేంద్రవరసింహాసనమువై నతని సంతును నిలిపి వారి పక్షమున రాజ్యపాలన సేయదొడగెను. రెడ్డిరాజ్యమిట్లు శత్రునిర్మూక్తమైనను యుద్ధ మాగలేదు. రణరంగము మాఱినది, అంతే. గోదావరీ తటమును విడిచి యుభయ పక్షములవారును పశ్చిమమున గృష్ణాతీరమందలి వెలమరాజ్యమును యుద్ధభూమిగ జేసికొనిరి. దీని మూలమున రణోద్యుక్తపక్షద్వయ మందును గొంతమార్పు గలిగినది. ముందు చెఱియొకప్రక్క సహాయులై నిలిచి యుద్ధము సేయుచుండిన విజయనగర బహమనీ రాజులిప్పుడు ప్రధానులైరి. ముందు బహమనీ సుల్తానుకు బానటయైయుండిన వెలమవారిప్పుడు రాయలకు మిత్రులై తమ పూర్వ స్నేహమును మఱచి మహమ్మదీయులతో బ్రతిఘటించిరి. విజయనగర బలముల సహాయము వలన విజయు డైనను నల్లాడరెడ్డికాని యతనిదండుగాని వెలమ రాజ్యమున నడచిన యుద్ధమున పాల్గొనలేదు. పోరాటమంతయు నల్లగొండ చేరువనున్న పానుగంటి దుర్గము చుట్టును జరిగినది. అది శత్రు దుర్జయగిరిదుర్గమని పేరెన్నిక కెక్కినది. క్రీ శ. ౧౩౯౮ వ సంవత్సరమున ఇమ్మడి బుక్క రాయలు జయించి నప్పటినుండియు బానుగల్లు విజయనగరరాయల స్వాధీన మందె యుండినది. కొండవీడు రాచకొండ రాజ్యముల మధ్యనుండు గడిసీమ సమీపను నందుండి నందువలన విజయనగరమునుండి కృష్ణాగోదావరుల మధ్య తీర దేశమునకు బోవుదండుదారిని సంరక్షించు నాయక స్థానమై యుండెను. ఈ దుర్గము దేవరాయల స్వాధీనమునం దుండకపోయిన రాజమహేంద్ర వర రెడ్డిరాజులకు సత్వరముగ బలసహాయ మంపు టకు సాధ్యమై యుండెడిది కాదు. ఫీరోజుశాహీ దుర్గముయొక్క ప్రాముఖ్యతను గుర్తింపక పోలేదు. పూర్వాంధ్ర విజయమున కది యత్యంత సహాయకారి కాగలదని యతడెఱుగును; కావున రాయలకడనుండి యా దుర్గమును నాచికొన నిశ్చయించి, క్రీ. శ. ౧౪౧౭ వ సంవత్సరమున దానిని సాధించుటకు దన సైన్యము నంపెను; వారి మార్గము నరికట్ట దేవరాయలు ప్రయత్నము జేసెను; కాని బహమనీ ఫౌజులచే నిర్జితుడై పాఱిపోవలసివచ్చెను. ఫీరోజుశాహు దుర్గమునకు ముట్టడివేసెను. రెండేండ్లకాలము సాగిన దా ముట్టడి; దాని లగ్గలువట్ట నతడొనర్చిన ప్రయత్నము లన్నియు విఫలములై పోయినవి; ముట్టడించు తురకల కష్టము మర్కటమాయెను. తినుట కాహారపదార్థములు దుర్లభమాయెను. స్కంధావారములో గఅవు తలచూపినది. అంటు రోగములు ప్రబలినవి. ఇంతటనె దేవరాయలు మరల దండును గూర్చుకొని, రాచకొండ దేవర కొండ వెలమల సహాయమును వడసి కోట నరికట్టి యుండిన మహమ్మదీయుల జుట్టుకొనెను; రెండు సంవత్సరముల నుండియు మహాధైర్యముతో గోటను గాపాడుచుండిన దుర్గసంరక్షక బలము రాయలు గొప్ప సైన్యముతో గూడ దమకు ప్రాపు వచ్చుటను గని సంతోషముతో నుప్పొంగి దుర్గద్వారములను దెఱచుకొని వెలువడి యిడు మలపాలై యీతిబాధలు బడుచుండిన తురకలపై బడిరి. ముందు గోయి వెనుక నూయి యన్నట్లయి నది వారి స్థితి. రెండు హిందూ వాహినుల మధ్య దగుల్కొని కడిదండలుగ నఱుకుడు వడిరి తురక లానాఁడు. తన వారిని శత్రుల గవయ బురి కొల్పుచుండిన సుల్తాను గాయపడి బ్రదుకుజీవుడా యని పాఱిపోయెను.

పానుగల్లు దుర్గముచెంత ఫీరోజుశాహు తిన్న దెబ్బ సామాన్యమైనది కాదు. అతని సైన్యము సర్వము నాశనమైనది. జయోద్రిక్తులై యెత్తి వచ్చుచుండిన శత్రువుల బారి బడనీయక నిజరాజ్యమును గాపాడుకొనగల శక్తి యతనికి లేదాయె. రాజ్య ప్రారంభదశయందు కార్య ఖడ్గములు రెంటికిని కర్తయై చేదోడు వాదోడై యుండిన తమ్ముడు ఖానెఖాను అహమదుడు రాజ్యాభిలాషియై ద్రోహమును దలపెట్టి సింహాసనమునాక్రమించుకొనుటకు రహస్యముగ నుపాయములు వెదకుచుండెను ఈ దుస్థితియందు గత్యంతరము నెఱుంగక ఫీరోజుశాహు గుజరాతుపాలకుడగు సుల్తాన్ అహమదుయొక్క సహాయము నర్థించెను; కాని యాతడు ఫీరోజుశాహు వేడికోలును జెవిని బెట్టలేదు. దేవరాయలు సుల్తాను దుస్థితి నెఱిగి కృష్ణా తుంగభద్రల మధ్యదేశము నాక్రమించుకొనుటయే కాక బహమనీ రాజ్యమును జొచ్చి దేశమును ధ్వంసముజేసెను.*

దేవరాయలు-గజపతి :

రాజమహేంద్రవర రాజ్య వ్యవహారములలో ప్రవేశము గలిగించుకొనుటవలన దేవరాయలకు కళింగ గజపతులతో వైరము పొడమెను. ఏ కారణమువల్లనో కళింగ గజపతి, నాల్గవ భానుదేవుడు, రాజమహేంద్రవర రెడ్డిరాజ్యముపై నెత్తివచ్చెను. అతని బావబోలి తన మిత్రుని సంరక్షించుట కొఱకు దేవరాయలు మరల గోదావరీ తీరమునకు దండు నంపవలసి వచ్చెను. రాయ గజపతి సైన్యములు రెండుమ యుద్ధమునకు సంసిద్ధములైనవి; కాని యల్లాడ రెడ్డి యుద్ధమువలన దన దేశము పాడగునని యెంచి యెత్తివచ్చిన గజపతికిని దనకు తోడువచ్చిన రాయలకును సంధి గావించి యెవ్వరి రాజ్యమునకు వారి నంపెను. ఇట్లు విజయనగర కళింగ రాజ్యముల కొండొంటితో యుద్ధము దప్పిపోయినను, ఇది విస్మరింపదగిన విషయము గాదు. రాయరాజ్యవైదేశిక వ్యవహారములలో నిటనుండియు నొక నూతన యుగము ప్రారంభమగుచున్నది. దాదాపొక శతమాన కాలము తీరాంధ్ర భూమిని సంక్షోభ పెట్టిన కరాటోత్కల ప్రతిస్పర్ధకిది యంకురార్పణము. ఇప్పటినుండియు దాదాపు క్రీ. శ. ౧౬ వ శతాబ్ది మధ్యకాలము వఱకును వజ్రసింహాసనము నధిష్ఠించిన రాయల కంటికి గజపతులతో పోరాటు తప్పినది కాదు.

దేవరాయల యంతిను రాజ్య వర్షములందు రాయ సామ్రాజ్యమున యుద్ధములు లేక శాంతి నెలకొని యుండినది. రాజకార్యములను దన పుత్రులకును మంత్రులకును నొప్పజెప్పి విద్యా వ్యాసంగమున కాలము గడపినట్లున్నది. సైన్య నిర్మాణమున దేవరాయలు గడునేర్పరి. రాష్ట్ర పరిపాలన మొనర్చిన యేబదియేండ్లకాలమునను, (క్రీ. శ. ౧౪౭౯–౧౪౭౯) నతడు సైన్యమును బలపఱచుట కెడతెగక కృషి సల్పుచుండెను. విజయనగర చక్రవర్తులతో సైన్యమునం దశ్వదళ ప్రాముఖ్యతను గుర్తించినవా డతడే ధనవ్యయమును సరకు సేయక అరబీ పార్శీ దేశములనుండి ఉత్తమజాత్యశ్వములను రప్పించి, వానికి దగు వాహకుల నేర్పాటుజేసి యశ్వదళమును బలపఱచెను. మఱియు జాతి మతభేదముల నెంచక ధనుర్విద్యా విశారదులైన తురక విలుకాండ్ర నతిశయ వేతనము లిచ్చి దనకొలువున జేర్చుకొని కాల్బలముల నభివృద్ధి యొనర్చెను. ఇట్లు ప్రోది చేసి క్రమక్రమముగ నభివృద్ధి చేసిన సైన్యము శత్రుభీకరమై విజయసాధకమైనది; ఫీరోజుశాహు తోడి దీర్ఘయుద్ధమున దేవరాయల కూతగఱ్ఱయై జయము చేకూర్చినది.

---

* సుల్తాను తమ్ముడగు ఖానెఖానుడు విజయనగర సేనలతో నేక యుద్ధములలో బోట్లాడి వారిని బావబోలెనని ఫెరిష్తా వ్రాసియున్నాడు; కాని ఇది సంశయాస్పదము. ఏలనగా, నితర మహమ్మదీయ చరిత్రకారు లీవిషయమును జెప్పలేదు; మఱియు గీఱుదరాజు ఢిల్లినుండి గుల్బర్గకు వచ్చినప్పటినుండియు నన్న దమ్ములకు వైమనస్యము గలిగి దినదిన ప్రవర్ధమాన మగుచుండినది; సింహాసనము నాక్రమించుకొన ప్రయత్నము సేయుచుండిన ఖానెఖానుకు సుల్తానుకు సహాయపడుట యసంభవము.

మతముచే మొదటి దేవరాయలు శైవుడు; హంపిక్షేత్రాధి దేవత యగు పంపాదేవి యతని కిష్టదైవము. వాస్తునిర్మాణమునం దతని కాసక్తి మెండు. నిరంతరము యుద్ధకార్యనిమగ్నుడై యుండినను, విజయనగరమున పెక్కు దేవాలయముల గట్టించెను; శిథిలావస్థయం దున్నను, కొన్ని యింకను నిలిచి యున్నవి. దేవరాయలు విద్వత్ప్రభువు. శాస్త్రవేత్తలను, తత్వజ్ఞులను, కవులను, గాయకపాఠకాది కళోపాసకులను దన యాస్థానమునకు రప్పించి సత్కరించి పోషించు వాడు. ఖ్యాత కవిపండితగాయకాది విద్వజ్జనుల ముత్యాల శాలయందు బంగారు గద్దియపై గూర్చుండబెట్టి కనకాభిషేకము జేయించువాడు. దేవరాయ లాంధ్రభాషాభిమాని; ఆంధ్రకవులను సత్కరించి వారిని కావ్యరచనకు బురికొలుపు వాడు. శ్రీనాథునికి ముత్యాలశాలయందు కనకాభిషేకము జేసిన దీ దేవరాయమహారాయలే. ఇతని విద్యాభిమానమువలన విద్యానగరము సార్థకనామధేయమై దక్షిణ భారత మంచంతటను ముఖ్య విద్యాపీఠమై కీర్తికాములగు విద్వాంసులకు గమ్యస్థానమై విరాజిల్లెను.

మొదటి దేవరాయల పుత్రులు

మొదటి దేవరాయల కనేకులు పుత్రులు పుట్టిరి. వారియం దీచరిత్రలో బేరొక్కన దగినవారిద్దరే.

రామచంద్రరాయలు (క్రీ. శ. ౧౪౨౨):—వీరియందు ప్రథముడు రామచంద్రరాయలు. క్రీ. శ. ౧౪౯౦-౯౧ నుండియు నితడుదయగిరి రాజ్యపాలనయందు తండ్రికి సహాయుడై యుండెను. దేవరాయ లితని యౌవన రాజ్యాభిషిక్తుని గావించి యుదయగిరి దుర్గాధీశునిగ నియమించెను; రామచంద్రరాయలు గడిదేటిన యోధుడు; మహమ్మదీయులతోడను వెలమలతోడను బలుమారు పోరి కీర్తివహించెను. దేవరాయలు గతించిన పిమ్మట రామచంద్రరాయలు వజ్రసింహాసనము నధిష్ఠించి యాఱుమాసముల కాలము విజయనగర సామ్రాజ్యమును పాలించెను; ఇతని గూర్చి యింతకంటె జెప్పదగిన విషయము లెవ్వియు లేవు.

మొదటి విజయరాయలు: (క్రీ. శ. ౧౪౨౨-౧౪౩౦):— రామచంద్రరాయలు గతించిన తరువాత నతని భ్రాత మొదటి విజయరాయలు, రాజ్యాభిషిక్తుడాయెను. ఇతనికి విజయభూపతి, విజయబుక్క-, వీరబుక్క యను నామాంతరము లుండినట్లు శాసనములవల్ల దెలియుచున్నది. ఇతని యేలుబడి యెన్ని యేండ్ల వఱకు సాగినదో నిష్కర్షించి చెప్పుటకు సాధ్యము గాదు. ఈ విషయమును గూర్చి చరిత్రపరిశోధకులు భిన్నాభిప్రాయములను వెలిపుచ్చియున్నారు. న్యూనిజు గ్రంథస్థము గావించిన ప్రాచీ నేతిహాసమునందు విజయరాయలా ఱేండ్లు రాజ్యపరిపాలన మొనర్చెనని చెప్పియున్నది. కాని యాధునిక పరిశోధకు లితని రాజ్యకాల మింకను హ్రస్వతరమైనదని యభిప్రాయపడుచున్నారు. ఆఱు నెలలని కొందఱు; రెండేండ్లని మఱి కొందఱు.* కాని. విజయరాయల శాసనములనన్నిటిని బరికించి

---

* విజయరాయ లాఱు నెలల కాలము పాలించెనని గోపినాథరావుగారు నిర్ణయించినారు; వీరి యభిప్రాయముతో నేకీభవించినారు వెంకోబరావుగారు; కాదు, అతని యేలుబడి రెండేండ్ల పర్యంతము సాగెనని చెప్పినారు హయవదనరావుగారు. తన యభిప్రాయమె సరియైనదని, విజయరాయలు క్రీ. శ. ౧౪౨౩-౪ వ సంవత్సరమున శివసాయుజ్య మందె ననియు, నిరూపించుటకొఱకు ఇమ్మడి దేవరాయల శాసనము నొకదాని (ఎపి. కర్ణా. సం ౮. తీర్థ. ౧౬౩) నుదహరించినారు. కాని ఈ శాసనమున విజయరాయల శివసాయుజ్య ప్రస్తాపము లేదు. శాసనమును నిలిపినాత డిమ్మడి దేవరాయలు గాడు; అతని యమరనాయకులలో నొక్కఁడైన విఠప్పదండనాయకునిక్రింది యధికారియొక్క డతని తండ్రి శివసాయుజ్యము బొందగా నాతని పుణ్య లోకావ్యాప్తికొఱకు బ్రాహ్మణులకు భూదానము జేసి యా విషయమును ప్రకటించుటకొఱకి శిలాశాసనమును నిల్పినాఁడు, ఇంతే.

చూడఁగా నతఁడు క్రీ. శ. ౧౪౨౨ మొదలు ౧౪౩౦ వఱ కెనిమిదేండ్ల కాలము ప్రజాపాలన మొనర్చినట్లు తేలుచున్నది.

విజయరాయలు సత్వహీనుఁడు. అతనికి నిర్వాహకత చాలదు. అతఁడు పృథ్వీ పరిపాలన మొనర్చిన యెనిమిదేండ్లకాలమునను రాజ్య వ్యవహారములలో నొక్కసారియేనియు నాసక్తి చూపినట్లగపడదు; రాజకార్యములన్నియు నత నితో గూడ ప్రజాపాలనము సల్పుచుండిన అతని జ్యేష్ఠపుత్రుఁడగు నిమ్మడి దేవరాయల ముఖాం గరముగనే జరుగుచుండినవి; కావున దేశమునం దలజిల్లులేక జాతీయ జీవనము నిరాఁటంకముగ సాగు చుండినది. కాని విజయరాయల యేలుబడియందు విశేషచరిత్రాంశము లెవ్వియు సంభవింపలేదని యనుకొనరాదు. బహమనీ సుల్తానుతోడను, కళింగగజపతి తోడను రెండు యుద్ధములు జరిగి నవి; కాని వాని ప్రశంస ఇచ్చట సరికాదు; రెండు యుద్ధములును ఇమ్మడి దేవరాయల యాజమాన్యముక్రింద నడచుటచే, వాని విషయ మతని చరిత్రమందు వర్ణించుట యుక్తము.

ఇమ్మడి దేవరాయలు

(క్రీ. శ. ౧౪౨౨-౧౪౪౬)

ఇమ్మడి దేవరాయలు తన తండ్రి విజయ రాయలతో గూడ సామ్రాజ్యాధిపత్యము వహించి క్రీ. శ. ౧౪౨౨-వ సంవత్సరమునుండి పృథ్వీపరి పాలన సేయదొడగెను. కాని, యొకానొక దక్షిణ కన్నడ మండల శిలాశాసనమున శకాబ్దము ౧౩౪౩ నకు సరియైన శార్వరివర్ష గ్రీష్మ మాసమున [క్రీ. శ. ౧౪౨౧ మార్చి] నిమ్మడి దేవరాయల యేలుబడి ప్రారంభమా యెనని చెప్పియున్నది. కాని, యందు చెప్పినవిధ ఇమ్మడి దేవరాయల రాజ్యారంభకాలముగాదు. ఏలనగా నీ శాసనము వ్రాయించినప్పుడింకను ఇమ్మడి దేవరాయల తాత మొదటిదేవరాయలు సజీవుఁడై రాజ్యపాలనము సేయుచుండెను; అతని పెదతండ్రి రామచంద్ర రాయలకుగాని తండ్రి విజయరాయలకుగాని పట్టాభిషేకము గాలేదు. అతడు శాసనములందు తనతండ్రి సింహాసనమును దా నధిష్ఠించినట్లు చెప్పు కొని యుండుటవలన, విజయరాయల యనంతరమె యుఁడు రాజ్యాభిషిక్తు డాయెనని యెంచుట సమం జసము. ప్రాయశః పైశాసనమున జెప్పినది ఇమ్మడి దేవరాయలు తుళురాజ్య మండలాధిపత్యము సేయ నారంభించిన కాలమై యుండవచ్చును. అతని పట్టాభిషేకము విజయరాయలు దివంగతుఁడైన పిమ్మటనే జరిగియుండవలయును.

తన పూర్వికు లందరివలెను ఇమ్మడి దేవరా యలు బహమనీ సుల్తానులతో పలుమారు యుద్ధము సేయవలసి వచ్చెను. విజయరాయలు సింహాసనము నధిష్ఠించిన వెంటనే మొదటి యుద్ధము ప్రారంభ మైనది. అహమదు ఖాన్ ఖానెఖానుడు దన యన్నయు, రాజునగు ఫీరోజుశాహును వధించి, క్రీ. శ. ౧౪౨౨ నెప్టెంబరు ౩౫ వ తేదినాడు గుల్బర్గ తఖ్తుపై గూర్చుని రాజ్యాభిషేకము గావించుకొనెను; తరువాత ఫీరోజుశాహు రాజ్య కాలమున మొదటి దేవరాయలు బహమనీ రాజ్య ముపై నెత్తివచ్చి దేశమున గలిగించిన సంక్షోభము నకు ప్రతీకారము సేయ నిశ్చయించి తన రాజ్యాభి షేకమునకు పిమ్మట వచ్చిన మొదటి నౌరోజు (క్రీ. శ. ౧౪౨౨ డిసెంబరు ౧౫ వ తేది) నాడు విజయనగరముపై దండు వెడలెను. కాని యీ దండయాత్ర యందేమి సంభవించెనో, తుదకది యెట్లు ముగిసెనో నిశ్చయించి చెప్పుటకు సాధ్యము గాదు. దీనికి ముఖ్యకారణము మహమ్మదీయ చరి త్రలయందు గానవచ్చు విపర్యాసము. మహమ్మ దీయ చరిత్రకారు లొకరు చెప్పిన దానిని మఱి యొకరు చెప్పరు. నిజామ్-ఉద్-దీన్ అహమదు, సయ్యదు అలీ లిరువురును యుద్ధవృత్తాంతము నత్యంత సంగ్రహముగ గొద్ది మాటలలో ముగించి యున్నారు. అహమదుశాహు విజయనగరముపై నెత్తిపోయి దేశమును చూఱగొని పాడుచేసెనని వారిద్దఱు నైక్యకంఠ్యముగ బలుకుచున్నారు. తరు వాత, దేవరాయ లహమదుశాహుకు లొంగి యత

నితో సంధి గావించుకొనెనని నిజామ్-ఉద్-దీన్ వ్రాసియున్నను, సయ్యదు అలీ సంధి మాట యెత్తడు. వీరిద్దఱు చెప్పు వృత్తాంతమున కంటె ఫెరిష్తా కథనము భిన్నమైనది; విపులమైనది; అపూర్వ సంఘటనలతో నలరారుచున్నది. చదువుట కెంత హృదయంగమముగ నున్నను చారిత్రక దృష్టితో బరిశీలించిన నది నిర్దుష్టమైనదని యొప్పు కొనుటకు వలనుపడదు. సంగ్రహముగ ఫెరిష్తా చెప్పు వర్తమాన మిది: దేవరాయలకు బలసంపన్నులగు మిత్రులనేకు లుండిరి. గుజరాతు దేశపు సుల్తాను అహమదుషా హోకడు; మాలవదేశపు సుల్తాను మఱి యొక్కడు; తెలింగాణము నేలు వెలమరాజింకొకడు. కావున మాళవ గుజరాతు దేశముల నుండి శత్రువుల దన రాష్ట్రమును జొరనీక యడ్డ పెట్టుట కహమదుషా ఒక గొప్పసైన్యము నుత్తర సరిహద్దు కడ నిలిపి, మఱియొక సేనతో గదలి విజయనగరముపై గూచి చేసెను. ఆ సమాచారము దెలియవచ్చి నంతటనె ఇమ్మడి దేవరాయలు తెలింగాణ ప్రభువునకు దనకు బాసటయై యుద్ధమునకు రమ్మని సందేశమంపి నిజ బలముల గూర్చు కొని బహమనీ సుల్తాను నెదుర్చుట కొఱకు తుంగ భద్రపైపు నడచెను. ఉభయ బలములకు నచటనచట చిల్లర కయ్యములు సంభవించినవి. ఒకానొక రణ క్షేత్రమునం దిరు తెగల వారును సరిపోరుచుండగా, నున్నటులుండి తెలింగాణ ప్రభువు నట్టేట బుట్టి ముంచి రాయలను దిగనిడిచి నిజరాజ్యమునకు బోయెను. రాయల కపజయము గలిగినది; అత డంతట విజయనగరమునకు బోయి కోటయందు తలదాచుకొనెను. అహమదుషా హతని వెన్నంటి పోయి విజయనగరమును ముట్టడించెను; నిలుపోపక దేవరాయలు కొన్ని యేండ్లనుండియు నిలువయుం డిన కప్పమును జెల్లించి సంధి చేసికొనెను. ఇంత వట్టు ఫెరిష్తా వివరించిన యుద్ధకథన సారాంశము. అతడు చెప్పిన దంతయు సత్యమని యొప్పుకొనుటకు వలనుపడదు. ఫెరిష్తా దేవరాయల మహమ్మదీయ మిత్రవర్గమును బేరొక్కన్నను, వా రీ సంగ్రామమున బాల్గొన్నట్లు చెప్పలేదు. యుద్ధమంతయు దేవ రాయ లొక్కనితోడ నే జరిగినట్లు వ్రాసియున్నాడు. మాళవ గుజరాతు సుల్తానుల ప్రసక్తి లేదు; కాని వాస్తవ మిదికాదు. ఇంతవఱకు లభించిన సాక్ష్య మును బరికించి చూడగా నప్పుడు పెక్కండ్రు శత్రువు లేకమై యహమదుషాహుతో బ్రతిఘటించి నట్లు తెలియుచున్నది. ఫెరిష్తా పేర్కొన్న గుజరాతు మాళవ తెలింగాణ ప్రభువులే కాక గొండ్వనరాజు కూడ దేవరాయలకు బ్రాపుగ నహమదుషాహుతో యుద్ధమునకు గడగెను. మిత్రు లెవ్వరును లేక యహమదు షా హోంటరియై విడివడెను. స్థితిగతు లిట్లు ప్రతికూలమై యుండగా ఫెరిష్తా చెప్పినట్లహ మదుషాహు దేవరాయలపై సంపూర్ణ విజయమును బొంద వలనుపడి యుండదు. మఱియు, నీ యుద్ధ వర్ణనయందు ప్రత్యేకత గానరాదు. పాతపాటనే పాడినాడు ఫెరిష్తా. బహమనీ విజయనగర సంగ్రా మము లన్నిటివలె నిదియు విజయనగర రాష్ట్రముపై దురకల దాడితో ప్రారంభమగుచున్నది. రాయల ప్రతి ఘటనము; అటువెనుక రాయల యోటమి; పిమ్మట తురకలచే విజయనగరపు ముట్టడి; తరువాత పరిసరప్రదేశ విధ్వంసము. రాయల యశక్తత; సంధి సంప్రార్థన; కడపట సుల్తానుతో ప్రతిష్ఠా భంజకమగు సంధి యొడంబడిక, ఇవి ఫెరిష్తాచరిత్ర యందు వర్ణింపబడి యుండు ప్రతి సంగ్రామ వృత్తాంతమునను మామూలుగ గానవచ్చు యుద్ధాం శములు. చర్వితచర్వణముగ గానవచ్చు నీ యంశ ములయందేని వాస్తవములో నిశ్చయింప సాధ్యము గాదు; కొన్ని సంభవించియుండవచ్చును; కాని వీని యాదార్థ్యమును స్థిరపఱుపఁగలుగు సాధనాంత రములు లభించువఱకును, వీని నంగీకరించుట యుక్తము గాదు. ఫెరిష్తా కథయందలి సత్యాసత్య ములను గూర్చి పరిశోధకు లెట్లభిప్రాయపడినను, సంగ్రామ ప్రారంభదశయందు విజయనగర సైన్యము బహమనీ రాజ్యమును జొచ్చి గుల్బర్గ మంచలము లోని యేతగిరి దుర్గము వఱకును గూచిచేసి పోయె ననుటకు శంకింప బనిలేదు. వెలుగోటి వారి వంశావళి యందీ తరపు వెలమరాజులు తొరగల్లు బాదామి పట్టణములను బట్టుకొనిరనియు నేతగిరి దుర్గమును జయించిరనియు జెప్పియున్నది; తెలింగాణ ప్రభువు ఇమ్మడి దేవరాయలకు వత్తాసిగవచ్చి పోఁజేసినట్లు ఫెరిష్తా చెప్పియుండుటచేత పై బేరొక్కనిన వెలమ

వారి విజయము లన్నియు నీ సంగ్రామమునసనే సంప్రాప్తమై యుండవలయును. కాని యటు పిమ్మట విజయనగర సైన్య మపజయము బొందినది. దీనికి కారణము ఫెరిష్తా చెప్పినట్లు యుద్ధమున దెలింగాణ ప్రభువు రాయలను దిగనాడి వెడలిపోవుటయె కావచ్చును. మఱియు గళింగాధిపతి నాల్గవ భానుదేవుడు తీరాంధ్రదేశముపై దండు వెడలి కొండవీటి రెడ్డిరాజ్యమును స్వాధీనపఱచుకొనెను. సందర్భమిట్లనుకూలపడగా నహమదుశాహు సందిచూచుకొని ఫెరిష్తా వచించిన రీతిని రాయసామ్రాజ్యముపై దండయాత్ర సాగించి యుండవచ్చును; కాని విజయనగరమును ముట్టడించి ఇమ్మడి దేవరాయలను సంధికి నొడబడ జేసెననుటయె సంశయాస్పదము. విషయమింకను పరిశోధనీయము.

చరిత్రకారు లెల్లరును గమనింపక విడిచి పెట్టిన ముఖ్యాంశము నొకదాని నీపట్టున బేర్కొన వలసియున్నది. అహమదుశాహు విజయనగరముతో నింకను యుద్ధము సేయుచుండునప్పుడె తన రాజధానిని గుల్బర్గనుండి బీదరుకు మార్చుకొనెను.* విజయనగరమునకు సమీపమున నుండు గుల్బర్గనుండి దూరమున నుండు బీదరుకు బహమనీ సుల్తాను దన రాజధానిని మార్చుకొనుటకు గారణము లేక పోలేదు. ప్రాయశః అహమదుశాహు విజయనగర దండయాత్ర, మహమ్మదీయ చరిత్రకారులు చెప్పునట్లు, జయప్రదముగ ముగిసినట్లు కన్పట్టదు. ఏతగిరి పఱుకును దేవరాయల దండయాత్ర సాగెనని వెలుగోటివారి వంశావళివలన విదితమగుచున్నది. చరిత్రయం దుక్తము గాకపోయినను ఈ ధాటి గుల్బర్గను చాకియుండవచ్చును; సుల్తాను దన రాజధాని విజయనగర గడిదేశమున కంతసమీపమున నుండుట మేలుగాదని యెంచి దూరమున నుండు బీదరుకు మార్చుకొని యుండవచ్చును. బహమనీ రాజధాని మార్పునకు వాస్తవమైన కారణ మెద్దియైనను, అహమదుశాహున కీ దండయాత్రయందు సంపూర్ణ విజయము జేకుఱలేదనుటకు గొంత శాసనాధారము గలదు. క్రీ. శ. ౧౪౨౯-౩౦ వ సంవత్సరమున వ్రాయించిన యొక దక్షిణకన్నడమండల శాసనమున నిమ్మడి దేవరాయలు తురకయశ్వపళములను నిర్జించెనని చెప్పియున్నది. ఇందు పేర్కొన్న తురక బహమనీ సుల్తానే కాని యన్యుడు గాడు. క్రీ. శ. ౧౪౨౨-౧౪౩౦ ప సంవత్సరముల నడుమ విజయ

---

* అహమదుశాహు తన రాజధానిని 'తన రాజ్యద్వితీయవర్షము రజాబు మాసమున (క్రీ. శ. ౧౪౨౩, జూన్) గుల్బర్గ నుండి బీదరుకు మార్చెనని బుర్హాన్-ఇ-మఅసీరు నందు చెప్పియున్నది. (ఇండి. ఆంటి. సం. ౨౦. పుట.౨౧౦) రఫి-ఉద్-దీన్ షిరాజీ తన తజ్‌కిరత్-ఉల్- ములూకను చరిత్రయందు అహమదుశాహు హి. ౮౩౦ వ సంవత్సరమున రాజ్యాభిషిక్తు డాయెననియు, నా యేట నె తననూతన రాజధానియగు ముహమ్మదాబాదు బీదరుకు అస్తిభారము వేసెననియు వ్రాసియున్నాడు (ఇండి. ఆంటి. సం. ౨౦. పుట. ౨౧౮). కాని అహమ్మదుశాహు రాజ్యాభిషిక్తుడైనది హి.శ.౮౩౫ (క్రీ. శ. ౧౪౨౨-౨౩) న కాని హి. ౮౩౦ వ సంవత్సరమున కాదు; కావున అహమదుశాహు రాజ్యముసేయ నారంభించిన సంవత్సరమునకె ముహమ్మదాబాదు బీదరుకు పునాది వేసినది వాస్తవమైనచో నది జరిగినది హి. ౮౩౫ (క్రీ. శ. ౧౪౨౨-౨౩) వ సంవత్సరము నందై యుండవలయును. కాని, ఫెరిష్తా హి. ౮౩౦ వ సంవత్సరమునం దహమదుశాహు కెహార్లా నుండి మరలి వచ్చినప్పుడు బీదరుకు పునాది వేసెననియు, హి. ౮౩౬ వ సంవత్సరమున దాని నిర్మాణము సంపూర్ణ మాయెననియు వ్రాసియున్నాడు. (బ్రిగ్స్ ఫెరిష్తా. సం. ౨, పుటలు. ౪౧౧, ౪౧౫). నిజామ్-ఉద్-దీన్ అహమదు ఫెరిష్తా వలె నహమదుశాహు కెహార్లా నుండి మరలి వచ్చినప్పుడు అస్తిభారము వేసినట్లు చెప్పినను, నది హి. ౮౩౭ (క్రీ. శ. ౧౪౩౮-౩౯) లో జరిగె ననుచున్నాడు (తబ. అక్బ. ఆంగ్ల. అను. సం. ౩. పు. ౫౧-౫౩). ఇట్లు బీదరు నిర్మాణమును గురించి లభించిన సాక్ష్యము పొందికలేక యున్నది. కాని బుర్హాన్-ఇ-మఅసీరు కాలానుక్రమణిక ఫెరిష్తా కంటె విశ్వాసపాత్ర మగుటవలన, క్రీ. శ. ౧౪౨౩ వ సంవత్సరమే వాస్తవముగ బీదరుకు శంకుస్థాపన జేసిన కాలమని తోచుచున్నది.

నగర బహమనీ రాజ్యముల కొక్కపర్యాయమే యుద్ధము జరిగియున్నందున శాసనోక్త విజయము నహమదుశాహు దండయాత్రయందే ఇమ్మడి దేవ రాయలు పొందియుండవలయును.

రాజ్యప్రారంభ దశలో నిమ్మడిదేవరాయల నెదిర్చిపోరిన శత్రువు అహమదుశాహు బహమనీ యొక్కడేకాడు. గజపతియు వెలమవారును మాఱొడ్డి నిలిచిరి. పై నుదహరింపబడిన దక్షిణ కన్నడమండల శాసనమున, 'మతంగరాజ సింధుర వరకోటి మర్దన మృగేశ్వర నంధ్ర నరేంద్ర సైన్య సాగరకళశోద్భవం విజయరాయ తనూభవ దేవ భూవరం' అని యిమ్మడి దేవరాయలు బ్రశంసింప బడియున్నాడు. ఇందు బేర్కొనబడిన మతంగరాజు కళింగదేశాధీశ్వరుడు గజపతినాల్మడి భానుదేవుడు; ఆంధ్ర నరేంద్రుడు రాచకొండ వెలమరాజు ముమ్మడి సింగ భూపాలుడు. రాయలకు వీరితో వైరముగలుగుటకు ముఖ్యకారణము రాజులకెల్ల సహజమైన భూకాంక్షయే. ఉత్సన్నమై పోయిన కొండవీటిరాజ్యము కొఱకు వీరి కొండొరులతో బోరాటము గల్గినది.

కొండవీటి కడపటి రెడ్డిరాజు రాచవేమస క్రీ. శ. ౧౪౨౪ వ సంవత్సరమున హంతకుని ఖడ్గ మున కెరయయ్యెను; అంతట కొండవీటిరెడ్డిరాజ్య మంతరించినది. చిరకాలమునుండియు రెడ్డిరాజ్య ముపై గనువేసియుండిన రాయలు వెంటనే కొండ వీటి దేశము నాక్రమించుకొని రాయ సామ్రాజ్య మున గలుపుకొనెను. ఇది వెలమవారికిని గజపతికిని కనుకుట్టినట్లయినది. మఱియు రెడ్లకును గజపతుల కును గళింగాధిపత్యముకొఱకు గలిగిన స్పర్ధ తీక్ష్ణ తరమై దుస్సహమాయెను. ప్రోలయ వేమారెడ్డి కాలమునుండియు రెడ్డిరాజులు కళింగమును గబళింప బ్రయత్నము సల్పుచుండిరి. రానురాను వారి యాటోపము హెచ్చుచు వచ్చినది. కుమారగిరిరెడ్డి పతమున గాటయ వేమారెడ్డి రాజమహేంద్రవరము నకు పాలకుడై వచ్చినప్పటినుండియు వారియుద్ధతి యతిశయమై భరింప శక్యముగాకపోయెను. క్రమ క్రమముగ వారి తూర్పు సరిహద్దు సింహాద్రిని దాటినది; దక్షిణమధ్యకళింగములను మీటినది; చిలక సముద్రమును దాకినది. కాటయవేమారెడ్డి నిహతుడైనను నతని సేనాధిపతి దొడ్డయ యల్లాడ నిర్వాహకుడై రాయల ప్రాపువడసి శత్రునిర్మూలము గావించి రెడ్ల యధికారమును నిలబెట్టెను; మొదట గజపతి భానుదేవునితో సంధిచేసికొనవలసి వచ్చినను, దరువాత కాటయవేముని మార్గమననుసరించి కళిం గమును మరల సాధించెను. కాని యతడు చిర కాలము ప్రజాపాలన సేయలేదు. క్రీ. శ. ౧౪౨౩ వ సంవత్సరమున నతడు దివంగతుడాయెను; అతని యనంతర మతని పుత్రులు వేమవీరభద్రులు రాజ్యాధి పతులైరి. వా రింకను రాజ్యమున గుదురుకొనక మునుపే, రాయలు వారికి సహాయమంప శక్యము గాని సమయమందే, వారి యధికారమును గూల ద్రోసి రాజమహేంద్ర రాజ్యమును గైవసము జేసి కొనుట మేలు. కాని రెడ్లు సామాన్య శత్రులు గారు; బలసంపన్నులు. అల్లాడ మృతినందిననేమి? అతని పుత్రు లారితేఱిన యోధులు. అందును అల్లయవేముని పరాక్రమము లోకవిఖ్యాతము. కావున రెడ్డిరాజ్యముపై దండువెట్టుటకు ముందు స్వపక్షమును బలపఱచుకొని జయోపలబ్ధిని సునిశ్చ యము జేసికొనుట తగవు. కావున గజపతి భాను దేవుడు దాను తలపెట్టిన కార్యమున దనకు దోడ్పడగల మిత్రుని సంపాదింపగోరి రాచకొండ వెలమ రాజు ముమ్మడి సింగభూపాలుని సాయమపేక్షించెను.

సింగభూపాలు డప్పుడు రాయలతో మైత్రి నెఱపియుండెను. వెలమ సైన్యము దేవరాయల పక్షమున నహమదు శాహుతో గుల్బర్గ ప్రాంతమున యుద్ధము సేయుచుండెను. కాని రాయలతోడిమైత్రి తాత్కాలికమైనది; స్థిరమైనదికాదు. సర్వాంధ్రదేశ మును గబళింప దొరకొనియుండు రాయలతో నత నికి పొందు కుదురదు. గజపతితో వెలమవారికి జుట్ట రికముగలదు. రాజకీయ వ్యవహారములలో బంధు త్వము గణ్యము గాకపోయినను, రెడ్లకును వెలమ వారికిని తరతరములుగ బెరిగి వచ్చుచుండు వైరము గజపతితో సఖ్యము సేయ నతని బురికొల్పుచుండెను; మఱియు నూతనరాజ్య సంపాదనేచ్ఛయు నా వైపే

యీడ్వగడగినది. కావున సింగభూపాలుడు గజపతితో సఖ్యమున కీయకొని యుద్ధ సన్నద్ధుడాయెను. ఈ యొడంబడికకు ప్రథమఫలము మిత్రద్రోహము. రాయలకు ప్రాపుగ బోయి బహమనీ సుల్తానుతో యుద్ధము సేయుచుండిన వెలమపూకను సింగభూపాలుడు మరలిరా నాజ్ఞాపించెను. యుద్ధమధ్యమున దన్నువిడనాడి వెలమవా రేగుటవలన రాయలకు బరాజయము గలిగినది.

తనపక్షమునకు బలమెక్కినది దీనితోపాటు శత్రుపక్షమునకు బలక్షయము గలిగినదనకు జయము గలుగుట ధ్రువము కావున భానుదేవుఁడువేమ వీరభద్రుల దాయాదులకు గొండజికి రాజమహేంద్రరాజ్యము నిచ్చెదనని యాసచూపి వారిని రాజద్రోహమునకు బురికొల్పెను వారు వేమ వీరభద్రులను ధిక్కరించి రాజ్యము నాక్రమించుకొనఁ డగిరి.

తీరాంధ్రదేశముపై భానుదేవునిదండయాత్ర యందు రెండు ఘట్టములు గానవచ్చుచున్నవి. ప్రప్రథమమున నతనికి తీరాంధ్రమంతటిని జయించు నుద్దేశమున్నట్లగపడదు. రాజమహేంద్రవర రెడ్ల సంరంభము నుడిగించుటయే యాతని ప్రధానాభిప్రాయము. తూర్పునుండి గజపతి సేనయు బశ్చిమమునుండి వెలమదండును రాజమహేంద్రవరరాజ్యమును బ్రజేశించినవి. ఉభయ పార్శ్వములనుండియు శత్రువు లొక్కుమ్మడి పై కొనుటవలన వేమ వీరభద్రులకు వారినోర్వ శక్యము గాకపోయెను. దేవరకొండ వెలమదొర మాకయలింగమ నాయఁ డల్లయవేముని మఁగని తమ్ముని వీరభద్రుని జయించి రాజమహేంద్ర దుర్గములను గొనెనేనియు, వారతనికి పాదాక్రాంతులై రాజ్యమును నిల్పుకొనిరనియు, వెలుగోటి వారి వంశావళి యందు చెప్పియున్నది. ఈ విజయమంతయు నొక్క లింగమ నాయని పరాక్రమమువల్లనే చేకుఱెనని యందున్నను, గజపతి బలములతోడు లేక వెలమవారికి రాజమహేంద్రదుర్గములను జయించుటకు సాధ్యమైయుండదు. అల్లయవేముడును వీరభద్రుడును పాదాక్రాంతులైనది లింగమ నాయనికి గాదు. గజపతిభానుదేవునికి. అతని ప్రసాదమువడసియే వారు తమ రాజ్యమును నిల్పుకొన్నది.

రాజమహేంద్రవర రాజ్యము మొదలైన పిమ్మట తీరాంధ్రమంతటిని జయింపవలయునని భానుదేవుని కాశపుట్టినది. కొండవీటి రాజ్యమున్నమైన వెనుక కృష్ణానదికి దక్షిణమండలి యాంధ్రదేశమంతయు రాయలకు వశమైయుండినది. కాని, యతని యధికార మప్పటికింకను నచట సుస్థిరముగ నెలకొనలేదు.

బహమనీ సైన్యములను నిగ్రహించుటకొఱకిమ్మడి దేవరాయలు దన యావచ్ఛక్తిని వినియోగింపవలసి వచ్చినందున కొండవీటిరాజ్యమున దన యధికారమును బలపఱచుకొనుట కవకాశము గలుగలేదు. రాయరాణువ యంతయు దురకలతోడి పోరాటమున డవులుకొని యుండుటవలన దేశసంరక్షణకు వలసిన దళముల నచట నిలుపుటకు వీలుపడకపోయెను. ఈ స్థితిగతులను దెలిసికొని భానుదేవుడు వెలనుదండుతోగూడ కృష్ణనుదాటెను; విజయనగర సైన్యమొకటి వారి మార్గము నరికట్ట ప్రయత్న మొనర్చెను; గాని యందువలన లాభము గలుగదాయెను; కృష్ణకడ జరిగిన యుద్ధమున లింగమనాయని పరాక్రమముచే నోటువడి యథాయథలై పారిపోయెను. అంతట భానుదేవుడు కొండవీటి రాజ్యమును వశపరచుకొని తన యధికారుల నచట దేశపరిపాలనకు నియమించెను కొండవీటిసీమ గ్రామ క్రోఫీయతులలో గజపతి దండయాత్ర ప్రస్తావము గలదు. ప్రౌఢదేవరాయలు దేశము నాక్రమించుకొనుటకు ముందు 'లాంగూల గజపతి జమీయతు చేసుకొని కటకము మొదలుకొని ఉదయగిరి పర్యంతము ఉన్న గిరిమర్గ స్థలదుర్గములు ఆక్రమించి శా. ౧౩౪౨ శకము లగాయతు శా. ౧౩౫౩ శకము వఱకు ౧౨ సంవత్సరములు ప్రభుత్వము' జేసెనని యొకదానియందును 'శా. ౧౩౪౦ శకం లగాయతు శా. ౧౩౬౪ శకం వఱకు ౨౫ సంవత్సరములు రాజ్యము జేసె' నని మఱియొక దానియందును గలదు. లాంగూల గజపతి యెవ్వరో తెలియదు;

శా. ౧౩౪౦ ప్రాంతమున గజపతి సింహాసనము నధిష్ఠించి యుండిన రాజు నాల్గవ భానుదేవు డగుటచే 'లాంగూల గజపతి' యతనికి నామాంతరమైయుండవచ్చును.* మఱియు భానుదేవుఁడు కైఫియతులందు జెప్పినట్లు ౧౨, లేక ౨౫ సంవత్సరముల కాలముకొండవీటి సీమ నేలలేదు. అని యేలుబడి క్రింద నుండినదంతయు నైదేండ్ల కాలమే.

బహమనీ దండయాత్ర వెనుదిరిగి పోయిన వెంటనె ఇమ్మడి దేవరాయలు తీరాంధ్రదేశము నుండి గజపతిని వెలమవారిని బాఱద్రోలుటకు ప్రయత్న మొనర్చెను. రాయరాణువ యుదయగిరి నుండి బయలువెడలి తీరదేశముగుండ కూచిచేసి సింహాద్రిపర్యంతము నడచెను. ఈ యుద్ధయాత్ర విషయమై మఱకేమియు దెలియదు. ఇమ్మడి దేవరాయల సామంతులలో నొకడగు సాంపరాయని తెలుంగరాయలు క్రీ. శ. ౧౪౨౮ వ సంవత్సరమున సింహాద్రి నరసింహస్వామి గుడియందు నిలిపిన శాసన మొకటి కలదు. ఇందువలన చరిత్రాంశము లెవ్వియు దెలియరాకపోయినను, తెలుంగరాయ లుదయగిరి రాజ్యమునకు జెందిన పొదిలెసీమకు పాలకుడగుట చేత, విజయనగర సైన్యమొకటి క్రీ. శ. ౧౪౨౮ వ సంవత్సరముననో తత్పూర్వమో ఉదయగిరి నుండి బయలువెడలి సింహాచలముదాక నుండు తీరాంధ్ర దేశమును జయించెనని చరిత్రకారు లూహించిరి. ఈ యూహ సరియైనదని పైనుదహరింపబడిన దక్షిణ కన్నడ మండలశాసనము రుజువు సేయుచున్నది. ఈ పట్టున స్మరింపదగిన ముఖ్యాంశ మింకొక్కటి కలదు. అల్లయవేమ పీరభద్రులు క్రీ. శ. ౧౪౨౩ న రాజమహేంద్రవర రాజ్యమును పాలించుచుండినట్లు శాసనసాక్ష్యమువలన దెలియుచున్నది. ౧౪౨౪-౧౪౨౮ సంవత్సరముల మధ్యకాలమున భానునికి ఉత్తరతెలింగాణమండలి రామగిరి వారి శాసన మొక్కటియేనియు గానరాదు. మాహూరు కల్లము దుర్గములను బేరారు దేశములు క్రీ. శ. ౧౪౨౮ మొదలు ౧౪౪౪ వఱకు ములో గొంత భాగముతో గూడ నిచ్చెను. వారి శాసనములు వరుసగ గానవచ్చుచున్నవి. కావున క్రీ. శ. ౧౪౨౪-౧౪౨౮ ల మధ్య రాజమహేంద్రవరమున రెడ్లయధికారము దొలగిపోయినదనియు, క్రీ. శ. ౧౪౨౮ వ సంవత్సరమున విజయనగర సైన్యములు వచ్చి రాజమహేంద్రవర రాజ్యమున వారి యధికారమును మరల ప్రతిష్ఠించెననియు నిశ్చయమగుచున్నది.

కళింగయుద్ధము సమాప్తమైన పిమ్మట ఆఱేడేండ్ల కాలము వైదేశిక దండయాత్రలుగాని తద్రోపద్రవములుగాని లేక రాయసామ్రాజ్యమున శాంతి నెలకొనియుండినది. తరువాత మరల యుద్ధము యథాపూర్వ మారంభమైనది. బహమనీ సుల్తాను అహమదుశాహు క్రీ. శ. ౧౪౩౫ వ సంవత్సరమున పరలోకగతుఁడాయెను. ఇతనికి పుత్రులు నలువు రుండిరి. పెద్దవాడు అల్లావుద్దీను; రెండవవాడు మహమూదు భానుఁడు; మూడవవాడు దావూదు; కడగొట్టువాడు ముహమ్మదు. తన జీవితకాలముననె తన కుమారులకు రాజ్యమును బంచియిచ్చుట యుక్తమని యెంచి యహమదు శాహు క్రీ శ. ౧౪౩౫ వ సంవత్సరమున దనయేలు బడిక్రింది రాష్ట్రము నిట్లు విభజించెను; జ్యేష్ఠుని యల్లావుద్దీనును యౌవరాజ్యాభిషిక్తునిజేసి రాజ్యమునందన్ని విషయముల మీదను పారుపత్యము నతని కొప్పజెప్పెను; కడగొట్టు కొడుకు ముహమ్మదుభాను, పసివాడగుటచే రాజతంత్రవిధానము నలవఱచుకొనుట కతని నల్లావుద్దీనునికి సహాయునిగ జేసెను — రెండవవాడగు మహమూదు

---

* 'లాంగుల్య' గజపతియని యుండవలయును. లాంగూల యనునది భ్రష్టరూపము. కళింగదేశమున లాంగుల్య యనునది యొకటి గలదు. ఆ నదీతటమున బుట్టినవాడగుటచేతనో, గజపతి పదమునకు రాకమును పచట రాజ్యమును సేయుచుండినందువల్లనో భానుదేవుని కాపేరు వచ్చియుండవచ్చును.

మూడవవాడగు దావూదుఖానునికి తెలింగాణము లోని రాయాచలదుర్గము నొసగి పెక్కండ్రు అమీరులతో నతని నా దేశమున కంపెను. ఈ యేర్పాటు ననుసరించి యహమదుశాహు మృతి నంగగనె అతని జ్యేష్ఠపుత్రు డల్లావుద్దీను రాజ్యాధిపతియై సఖ్తుకెక్కెను. అల్లావుద్దీను రణప్రియుడు. ఇతడు తన రాజ్యకాలమున రెండుమారులు రాయసామ్రాజ్యముపై నెత్తిపోయినట్లు మహమ్మదీయ చరిత్రకారులు చెప్పుదురు. ఈ రెండు యుద్ధములును గడచిన రణక్షేత్ర మొక్కటియే; కృష్ణా తుంగభద్రల మధ్యదేశమున రాయచూరు ముదుగల్లు దుర్గముల చుట్టుపట్లయందే రెండుదండ యాత్రలలోను పోట్లాటయంతయు సాగినది. మొదటిదండయాత్ర క్రీ. శ. ౧౪౩౫ వ సంవత్సరమున ప్రారంభమైనది. ఈ యుద్ధవృత్తాంతమును మహమ్మదీయ చరిత్రకారు లొక్కొక్క రొక విధముగ వర్ణించి యున్నారు. ఒక్కొక్కరు చెప్పు విషయమును మొదట సంగ్రహముగ బొందుపఱచి తరువాత వానికి గల భేదములను విపరించి విమర్శించుట యొప్పును. అందటికంటె ప్రాచీనుడైన నిజామ్-ఉద్-దీన్ అహమదు ఇట్లు చెప్పుచున్నాడు:

సుల్తాను నిమ్మడి యల్లావుద్దీను దన తమ్ముడగు ముహమ్మదుఖాను నొక గొప్ప సైన్యముతో గూడ విజయనగర సామ్రాజ్యమును జయించుట కొఱకంపెను. అతడు కృష్ణాతీరమును జేరగనే, అంతకు పూర్వమే యచటికి బోయి యుండిన ఇమాద్-ఉద్-దీన్ ఘోరీ యాతని ప్రత్యుద్గమనార్థమేగి కృష్ణాతీరమున నతని గలిసికొనెను అంతట ముహమ్మదుఖానుడు ఘోరీని వధించి సుల్తానుపై దిరుగబడెను అతని దండించుటకొఱకు సుల్తాను అల్లావుద్దీను స్వయముగ దండు నడుపుకొని పోయి యుద్ధమున నతని నిర్జించెను ముహమ్మదుఖానుడు భయకంపిత చేతస్కుడై పాటి పోయెను. అంతట నల్లావుద్దీను భ్రాతృస్నేహము వలన నతని నేరమును క్షమించి తెలింగాణమండలి రాయాచల దుర్గమున కధిపతిని గావించెను.

సయ్యదు అలీ చెప్పు వృత్తాంతమున గొంత వ్యత్యాసము గానవచ్చుచున్నది. దాని నిట్లు సంగ్రహము జేసి చెప్పవచ్చును:

క్రీ. శ. ౧౪౩౫ వ సంవత్సరమున సుల్తాను తమ్ముడు ముహమ్మదుఖానుడు స్వామిద్రోహము బలపెట్టి కిన్ నదీతీరమున నిమాద్-ఉల్-ముల్కు ఘోరీని వధించి, రాజచ్ఛత్రమును ధరించి, సుల్తానుపై తిరుగుబాటు చేసెను. సుల్తాను కీవర్తమానము దెలియపచ్చినంతనే గొప్ప సైన్యమును గూర్చుకొని తమ్ముని దండించుటకు బయలు వెడలెను. ఉభయపక్షములును ఒండొరుల దారసిల్లెను; ఘోరయుద్ధము సంప్రాప్తమైనది. ముహమ్మదుఖా నోడి పాఱిపోయెను. సుల్తా నతని తప్పును క్షమించి తెలింగాణములోని రాయాచల సీమను జాగీరుగ నిచ్చి యచటికంపెను.

ముహమ్మదుఖానుని వానడిల్ల గలిగిన రాజ్యసంక్షోభమును సందు చూచుకొని విజయనగర కాఫరులు మహమ్మదీయ రాష్ట్రముపై దండెత్తి వచ్చి ముదుగల్లు దుర్గమును స్వాధీనము జేసికొని దేశమును చూఱగొనిరి. సుల్తాను అల్లావుద్దీను దళములను గూర్చుకొని వచ్చి ముదుగల్లును ముట్టడించెను. కొంతకాలము పోరుజరిగినది. కాఫరు లంత సంధికి వచ్చిరి. కప్పము కట్టుటకును సుల్తాను ఖజానాకు విస్తారధనమును జెల్లించుటకును సమ్మతించుటయే కాక, సుల్తాను ప్రజలకు వారివలన గలిగిన నష్టమును గట్టి యిచ్చుటకు గూడ నొప్పుకొనిరి. మఱియు సుల్తాను రాష్ట్రముపై నెప్పుడును ఎత్తి రామనియు మాటనిచ్చిరి.

ఫెరిష్తా చరిత్ర ప్రకార మీ యుద్ధవృత్తాంతమును ముక్తసరిగ నిట్లు చెప్పవచ్చును:

సింహాసనము నెక్కినవెంటనె ఇమ్మడి యల్లావుద్దీను శాహు విజయనగరముపై దండయాత్ర వెడల నిశ్చయించెను. పూర్వమైదేండ్లనుండియు రాయలు కప్పము గట్టలేదు; కట్టవలసినదని యప్పు డడిగిన నిరాకరించెను. కావున దన చిన్న

తమ్ముడు మహమ్మదుఖానుని కొక గొప్ప సేన నిచ్చి వజీరు ఖ్వాజా-ఇ-జహాన్ అస్త్రబాదీ, యమీర్-ఉల్-ఉమ్రా ఇమాద్-ఉల్-ముల్క్-ఘోరీ లను సహాయులుగా నొసగి రాయ సామ్రాజ్యముమీదికి దండయాత్ర యంపెను దండయాత్ర జయప్రదముగ సాగినది. విస్తారము ధనమును, మదగజముల నిరువదింటిని, సంగీతనాట్య విద్యా విశారదములగు విలాసినులను నిన్నూర్వరిని సుల్తానుకును, విలువగల యులుఫాలను బెక్కింటిని మహమ్మదుఖానుకును సమర్పించి రాయలు సంధిచేసికొనెను.

దండు వెనుదిరిగెను. ముదుగల్లు సమీపమును చేరగనె మహమ్మదుఖాను స్వామి ద్రోహమును దలపెట్టి ఖ్వాజా-ఇ-జహాన్ అస్త్రబాదీ, ఇమాద్-ఉల్-ముల్క్-ఘోరీల సహాయమును నర్థించెను; వారందు కీంపుకొనలేదు; ఆ కారణమువలన మహమ్మదుఖాను వారిపై గోపించి వారినిద్దరిని జంపించెను; తరువాత తనకుసహాయముగ విజయనగర రాయలకడనుండి దళముల రప్పించుకొని, ముదుగల్లు రాయచూరు షోలాపూరు బిజాపూరు నల్దుర్గ మున్నగు దుర్గముల నాక్రమించుకొనెను.

ఈ సంగతి తెలియవచ్చినంతటనె యల్లావుద్దీను శాహు సేనల గూర్చుకొని విప్లవకారులను శిక్షించుటకు బయలువెడలెను. భీకరయుద్ధము నడచెను. మహమ్మదుఖాను పరాజితుడై పారిపోయెను. సుల్తాను తమ్ముని తుమించి, తెలింగాణ మండలాధిపతియగు దావూదుఖానుని మరణము వలన ఖాళీపడియుండిన దుర్గాధిపత్యము నొగి యని సచటి కంపెను.

మహమ్మదీయ చరిత్రకారుల వ్రాత లిట్లు పొందికలేక పరస్పర విరుద్ధముగ నున్నను వారందరు నొక్క విషయమం దేకీభవించుచున్నారు; తఖ్తునెక్కినవెంటనె ఇమ్మడి యల్లావుద్దీనుశాహు రాయరాజ్యముపై దండు వెడలెనని యైక్యకంఠముగ బల్కుచున్నారు. కావున, నిది వాస్తవ చరిత్రాంశమని యొప్పుకొనవచ్చును; కాని దీని పూర్వాపరములు సందిగ్ధములై యున్నవి. మహమ్మదుఖాను తిరుగుబాటునకుముందు విజయనగర దండయాత్ర నడచినట్లు నిజామ్-ఉద్-దీన్, ఫెరిష్తాలు చెప్పినను, సయ్యదు అలీ వీని క్రమమును దారుమారు సేయుటయేకాక వీని కొండొంటితో సంబంధ మున్నట్లు సూచింపనైన సూచింపడు. మహమ్మదుఖానుని తిరుగుబాటును దుదుచేసికొని విజయనగర కాఫరులు మహమ్మదీయ రాష్ట్రముపై నెత్తివచ్చిరని తెల్పుచున్నాడు. ఇది సాధ్యమే; కాని ఇతర చరిత్రకారుల సాక్ష్యము దీనికి విరుద్ధముగనున్నది. దీనిని బలపఱచగల సాధనాంతరము లభించువఱకును యదార్థమును నిశ్చయించుటకు వీలుగాదు. మఱియు ఫెరిష్తా, విజయనగరదండయాత్రకు సుల్తాను తన చిన్నతమ్ముడగు మహమ్మదుఖానుతోగూడ ఖ్వాజా-ఇ-జహాన్, ఇమాద్-ఉల్-ముల్క్ ఘోరీలను నాయకులనుగ నియమించి వారినందఱి నొక్కట రాయరాజ్యముపై యుద్ధమున కంపెననియు, వారు యుద్ధయాత్రను జయప్రదముగ గొనసాగించి, రాయలను సంధి కొడబఱచి యతనిచే గప్పముగొని మిగిడివచ్చునప్పుడు ముదుగల్లు కడ మహమ్మదుఖానుడు స్వామిద్రోహమును జింతించి తోడి దండనాయకుల నిద్దరిని వధించి సుల్తానుపై దిరుగుబాటుచేసె ననికదా వ్రాసియున్నాడు. ఇది యంతయు సత్యమని యంగీకరించుటకు పలను పడదు. ఏలనగా, ఫెరిష్తా కంటె నించుక పెద్దవాడును భూర్వరచయితయుగు నిజామ్-ఉద్-దీన్ అహమదు, సుల్తాన్ అల్లావుద్దీన్ శాహు మొట్టమొదట విజయనగరముపై నిమాద్-ఉల్-ముల్క్‌ను యుద్ధమున కంపెననియు, తరువాత నతనికి ప్రాపుగ దన చిన్న తమ్ముడగు మహమ్మదుఖానుని సైన్యముతోగూడ నంపెననియు, మహమ్మదుఖానుడు దన్నెదుర్కొనుటకు కృష్ణా తీరమునకు వచ్చిన నిమాద్-ఉద్-దీనును వధించి సుల్తానుపై దిరుగబడెననియు, వక్కాణించి

యున్నాడు. ఇమాద్-ఉల్-ముల్కు లేక ఇమాద్-ఉద్-దీను, ముహమ్మదు ఖానునిచే వధింపబడినది కృష్ణాతీరము నందెయని నయ్యది అలీ దృఢపఱచు చున్నాడు.* కావున ఫెరిష్తా యొక్క నిజామ్-ఉద్-దీనే విశ్వాసపాత్రుడని తోచుచున్నది. అగునేని అల్లావుద్దీను శాహు విజయనగరము మీదికి ఖ్వాజా-ఇ-జహాన్ ఇమాద్-ఉల్-ముల్కు ముహమ్మదు ఖానులనందటి నొక్కట యుద్ధమున కంప లేదనియు, మొట్ట మొదట నిమాద్-ఉల్-ముల్కు నంపెననియు, నతనికి జయముగలుగకపోగా నత నికి తోడ్పడుటకు ముహమ్మదు ఖానుని సైన్య ముతోగూడ నంపెననియు, తనకు సహాయుడై వచ్చుచుండిన ముహమ్మదుఖాను వెదురొక్కన నిమాద్-ఉల్-ముల్కు కృష్ణాతీరమునకు రాగా ముహమ్మదుఖాను డతని వధించి సుల్తాను పై దిరుగబడెనియు, నంతట విజయనగరదండయాత్ర యాగిపోయెనని యు నపగాహనము జేసికొనుటకు యున్నది.

ఫెరిష్తా చెప్పెడి యుద్ధవృత్తాంతమునం దిం గత విషయములు మఱికొన్ని కారణముచూపుచున్నవి. ముహమ్మదఖాను సుల్తానుపై దిరుగబడి ది విజయనగరదండయాత్రను జయప్రదముగ కొనసా గించి మరల్వ్యదేశమునకు బోవునప్పుడని ఫెరిష్తా చెప్పుచున్నాడు; కావున పై దండయాత్ర సాగుచున్నప్పుడే యతని హృదయమున స్వామి ద్రోహబీజ మంకురించియుండును. ఈ స్థితియం దాతడు రాయలతో సఖ్యముజేసికొనక యతనితో సుల్తాను కొఱకు బోట్లాడుట యసంభవము. ఏలన రాయలు సుల్తానుకు ప్రబలశత్రుడు; అతని కలిమి బలములకు మితిలేదు. అతనితో జెలిమి కలిగిన దన పూనిక నెఱవేరుటకు సంశయ ముండదు; కావున, తాను దలపెట్టిన కార్యమును గొనసా గించుటకు నన కెంతయు దోడ్పడగల రాయ లతో సఖ్యము జేసికొనక యతనితో యుద్ధముజేసి సుల్తాను పక్షమును బలపఱచుట యసంభవము. ఫెరిష్తా చెప్పినట్లు ముహమ్మదుఖానుడు సుల్తాను పక్షమున రాయలతో పోరి యతని నోడించి సంధి కొడబఱచెనని యొప్పుకొన్నను, సుల్తాను దరువాతి ప్రవర్తన దురవగాహమై యున్నది. తన యధి కారమును కూలద్రోయ గడగిన తమ్ముని, నా తమ్మునికి దోడై వచ్చిన నిజ సహాజ శత్రుడగు రాయలను రణాంగమున బరాజితుల గావించియు, వారియం దొని యతని స్వామిద్రోహమును విస్మరించి రాజాచల రాజ్యాధిపత్యము నొగ టయు, మఱియొకని సమయఘాత కతను సైచి వానిపై నెట్టి చర్యను జలపెట్టక మిన్నకుండుటయు జిత్రము. వాస్తవముగ సుల్తాను విజయము నందియే యుండిన నతడేల రాజాచల రాజ్యమును ముహ మ్మదుఖానున కిచ్చియుండును? ద్రోహియైన తమ్మునికి దోడ్పడిన రాయలను దగినరీతిని శాస్తిచేయక యేల వదలిపెట్టియుండును? ఈ యంశముల నన్నిటిని పరిశీలించి చూడగా విజయ నగరముపై సల్లావుద్దీను శాహంపిన మొట్ట దండయాత్ర భంగపడెనియు, రెండవ పర్యా యము సేనాధ్యక్షుడైన ముహమ్మదుఖానుడు సుల్తానుపై దిరుగబడి రాయలతో మైత్రి గావించు కొనుట పలన యుద్ధమాగిపోయెనని యు, వారిని శిక్షించుటకొఱకు సుల్తాను స్వయము దండు నడపుకొనుచు వచ్చియు జయమును బొందజాలక ముహమ్మదుఖానుపక రాజు కొండరాజ్యము నిచ్చి రాజీ పడెనని యు దోచుచున్నది.

సుల్తాను అల్లావుద్దీనుశాహు ద్వితీయ విజయ నగర దండయాత్ర క్రీ. శ. ౧౪౪౩-౪ వ సంవత్స రమున నడచినది. ఈ దండయాత్రయొక్క కార ణము నిట్లు ఫెరిష్తా వివరించియున్నాడు.

క్రీ. శ. ౧౪౩౨ వ సంవత్సరమునం దిమ్మడి దేవరాయలు బహమనీ సుల్తానులతోడి యుద్ధము నందడుగడుగునకు ఓనకుపరాజయ మేల కలుగు

* 'దర్ కినారె ఆబెకిన్ (లేక) కన్' అని బుర్హాన్-ఇ-మఅసీరు వ్రాతప్రతులందు కలదు. 'ఆబెకిన్' అను నదియె సరియైన యుచ్చారణ. వ్రాయస కాండ్ర ప్రమాదమువల్లగాని యజ్ఞానము వల్ల గాని 'కిషన్' 'కిన్' శబ్దముగ మారియుండవలయును.

చున్నదో కనుగొనుటకు విచారణను ప్రారంభించెను. ఈ విచారణవలన దన కపజయము రెండు కారణములనల్ల గలుగుచున్నట్లు తేలినది. (౧) కర్ణాటాశ్వములకంటె దురక గుఱ్ఱము లధిక దేహ దార్ఢ్యము గలవగుట (౨) బహమనీ సేన యందు ధనుర్విద్యయం దారితేఱిన విలుకాండ్ర బలగమొకటి యుండుట. ఈ కారణముల మూలమున దన కపజయము గలుగుచున్నదని తెలియగనే ఇమ్మడి దేవరాయలు తన సేనయందలి లోపములను దొలగించి దాని పోటరితనము జెంపదించుటకొఱకు తగు నేర్పాటుల గావించెను. తురక విలుకాండ్రకు దన కొలువునం దుద్యోగము లిచ్చి వారిచే దన భటులను ధనుర్విద్యయందు శిక్షితుల గావించెను అచిరకాలమునసే యతని సేనయందు విలుకాండ్రసంఖ్య యధికమాయెను. తురకలసంఖ్య రెండువేలు, హిందువు లఱువది వేవురు. అశ్లే యాశ్విక పదాతుల సంఖ్యయు హెచ్చినది రౌతు లెనుబదివేలమంది; కాల్వుర గణుతి రెండు లక్షలు. ఇంతటి గొప్ప సైన్యము దన పతాకపు ఛాయీడయందు జేరగనే, ఇమ్మడి దేవరాయలు బహమనీ రాజ్యమును జయింప సమకట్టి దండు వెడలెను.

ఇంత విపులముగ యుద్ధకారణమును ఘోష్టా విశదపఱచినను ఇది సత్యముగాదు. తన సైన్య మందలి లోపముల గనుగొనుట కిమ్మడి దేవ రాయ లప్పుడు ప్రొత్తగ విచారణ సాగింపవలసిన యావశ్యకత లేదు. ఆద్యమునుండి కాకపోయినను మొదటి దేవరాయల కాలమునుండియు రాయ రాణువయందు తురకపటలములుండినవి. క్రీ. శ. ౧౩౩౦ వ సంవత్సరమున సుల్తాను అల్లావుద్దీను సింహాసనము నధిష్ఠించుట కాజ్రేండ్లనుండు ఇమ్మడి దేవరాయల సైన్యమునం దాఱువేల తురుష్క భటులుండిరని శాసన నిదర్శనమువల్ల దెలియు చున్నది. యుద్ధమునకు వాస్తవమైన కారణ మిమ్మడి దేవరాయలు బహమనీ రాజ్యమును జయింప దలకొనుటకాదు; అతని కపుడు సంప్రాప్త మైన విపత్తు నాస్కారము జేసికొని సుల్తానల్లావుద్దీ నతని బెదరించి యపారధనమును నాచికొన గడగుటయే. సమకాలిక మహమ్మదీయ రచనలు దీని యాథార్థ్యమును రుజువు సేయుచున్నవి. ఈ యుద్ధ ప్రారంభసమయమున పారశీక దేశమునుండి వచ్చిన రాయబారి యబ్దుర్ రజాకనుగతడు విజయనగరమందు నివసించుచుండెను అప్పుడచట జరిగిన విషయముల నన్నిటిని అతడు విరచించిన ముత్లవు'-సఅదీ నను గ్రంథమున వర్ణించి యున్నాడు:

క్రీ. శ. ౧౪౪౩ వ సంవత్సరమున అబ్దుల్ రజాకు విజయనగరమునకు వచ్చుచు పశ్చిమ సముద్రతీరమున కళ్ళికోట యందు కొంతకాల ముండెను. అప్పుడు విజయనగరమం దొక వైపరీత్యము సంభవించినది. ఇమ్మడి దేవరాయల సోదరు డొకడు నూతన సౌధమును నిర్మించు కొనెను. గృహప్రవేశ మహోత్సవమును దన యంతస్తునకు దగిన రీతిని గడువైభవముతో జేయనిశ్చయించి యా సమయమున విందారగించుటకు రాయలను రాజకుమారులను సామంత మండలాధ్యక్షాది నియోగి వర్గములను దొరలను నాయకులను రాజధానియందు ముఖ్య జనుల నెల్లర నాహ్వానించెను; అందఱును వచ్చిరి; కాని రుగ్మతవలన రాయలొక్కడు మాత్రము రాడాయె. రాయలు రాకపోవుట వలన దన యత్నమంతయు విఫలమాయెనని వ్యథ నొందెను. అతని మనోవ్యథకు ప్రబల కారణము గాదు. గృహప్రవేశ మహోత్సవము సేయదలపెట్టుట యందతనియుద్దేశము దన విభవిని చూపి సరివారి మెప్పు వడయవలయునని కాదు. రాయలను రాజ్యమున బేరెన్నిక కెక్కినవారి నందఱిని కపటోపాయము వలన నొక్కమారు వధించి రాజ్యము నాక్రమించుకొనవలయు ననియే. పర్వఱుచుకొన్న పథకము ననుసరించి యతడు వచ్చినవారిని వచ్చినట్లు సౌధాంతర్భాగమునకు గొంపోయి రహస్య విధమున భటులచే జంపించెను. పట్టణము నందుండిన రాజకుమారులు మండలాధిపతులు దొరలు మున్నగువా రొక్కరైన మిగులక యందఱు నొక్క సమయమున నకాలమృత్యువు నోటబడిరి. రాయలొక్కడే

విజయనగరమున జరిగిన వర్తమానమంతయు బీదరుకు వెంటనే తెలియవచ్చినది. సుల్తాను అల్లావుద్దీను రాయలను జయింప నదియ తరియని నిశ్చయించి యేడులక్షల వరహాలను దనకు బంప వలయునని యు లేనియెడల దండువెడలి వచ్చు చున్నాడనియు బెదరింపుచు దూతల నంపెను; దేవరాయ లందు కీయకొనలేదు; తత్కారణమున యుద్ధము ప్రారంభమైనది

యుద్ధమునకు వాస్తవమైన కారణము నిట్లు అబ్దుర్ రజాకు వర్ణించుచున్నాడు. అబ్దుర్ రజాకు సమకాలికుడు; పై జెప్పిన మారణకర్మ జరిగిన పిమ్మట నెలదినముల కతడు విజయనగరమునకు వచ్చెను; అచట పై యుద్ధము సంచరుపుడు నివసించుచుండెను. యుద్ధరంగమునకు బోయి కర్మమును గనులార గాంచకపోయినను యుద్ధ మున బాల్గొనిన లక్కణ దండనాయకాది యోధు లతనికి పరిచితులు; వారిని విచారించి వాస్తవ స్థితి నరయుట కతనికి మంచి యవకాశముండెను; మీదు మిక్కిలి యతడు మతముచే మహమ్మదీయుడు; పై దేశికుడు. కావున నతడు విపరించిన యుద్ధకారణమె సత్యమనియు, ఫెరిష్తా చెప్పిన దంతయు కేవల కైతవకల్పన యనియు మనము నిశ్చయింపవచ్చును.

యుద్ధకారణము నింత సత్యముగ విపరించిన ఫెరిష్తా, యుద్ధవృత్తాంతమును మఱియెంత సత్య ముగ వర్ణించియున్నాడో కనుగొనుటకు శక్యము గాదు. అబద్ధపురాణమున నెద్ది వాస్తవమో, యెద్ది కల్పనయో, విశ్వాసపాత్రములగు నన్యా ధారములు లేనప్పుడు, నిర్ణయించుట యెట్లు? ఎంతటి కైతవకల్పనయైనను, సత్యాన్వేషణార్థము సంగ్రహముగనైనను ఫెరిష్తా యుద్ధవృత్తాంతము నిచట పొందుపఱచుట సరి. ఫెరిష్తాచరిత్రం బడి యిమ్మడిదేవరాయలు కృష్ణాతుంగభద్రల మధ్య దేశముపై దండువెళ్లెను. ముదుగల్లు దుర్గమును ముఖ్యస్కంధావారమును జేసికొని యిమ్మడి దేవరాయ లచట విడిసి తన పుత్రులిరువురిలో నొక్కని రాయచూరు దుర్గమును, మఱియొక్కని మిగిలియుండెను. రాయలు జీవించియుండిన నింతయత్నము బూడిదయందు చేసిన హోమము వలె వ్యర్థమగును గదా. తన రాజ్యమును నెఱ వేరుటకు రాయల నెట్లయిన నెలయించి తోడ్కొని వచ్చి రూపుమాపుట యావశ్యకము. కావున నతడు రాయలను స్వయముగ బోయి తోడ్కొని వచ్చు నెపమున తాంబూల పేటిక నెత్తికొని బయలువెడలెను. హజారమున నుండు వాకిటి వారిని బూటకపు మాటలచే లాలించి బేలించి విందుగుడువ నందఱిని దన మందిరమున కంపెను. రాచనగరికి కావెవ్వరును లేకపోయిరి. పిమ్మట నా దురాత్ముడు రాయల సమ్ముఖమునకు బోయి వినయవిధేయతలతో బతిమాలుచున్నట్లు నటింపుచు, దటాలున దాంబూల పేటికయందు గుప్తముజేసి యుంచిన కటారిని దీసి రాయల దేహముపై బెక్కుతావుల బొడిచెను. సొమ్మసిలి పృథి నందినవానివలె రాయలు క్రిందబడెను. ఆ ద్రోహ వాస్తవముగనే మరణమందెనని భ్రమించి రాజ మందిర ముఖమంట పోపరితలమునకు బోయి యచట నిలిచి రాజమార్గమున సంచరించుచుండిన జనులతో దాను రాయలను వధించితినని చాటి చెప్పి యటుపై రాజ్యమునకంతటికిని దానె రాయలనని ప్రకటించుచుండెను. దేవరాయల కంతటనె స్మారకము వచ్చినది; సోదరుని ద్రోహ ప్రయత్నము విఫలపడినది. ఎట్లో కష్టముతో శరీరము తేర్చికొనుచు దానును ముఖమంట పోపరితలమునకు బోయి, తాను జీవముతో నున్నాడనియు నాహంతకుని బంధింపవలసిన దనియు సుద్ఘోషించెను. రాయల యెలుగును విని జనులు రాజమందిర ప్రకోష్ఠమున గుమికూడి యా ద్రోహినిబట్టి వధించిరి. అంతట దేవరాయలు సింహళగడిప్రాంతములకు బోయియుండిన మంత్రిని మహా ప్రధాన లక్కణ దండనాయకుని రాజధానికి రప్పించి జరిగిన వృత్తాంతము నాతని కెఱుక పరచెను. స్వామి ద్రోహమును దలపెట్టిన సోదరునికి సహాయభూతులై యటని దుర్వ్యాపారమును గొనసాగింపగడిగిన దుర్మార్గుల నందరిని బంధించి తగినరీతిని వారిని శిక్షించెను.

బంకాపురమును సాధింపనియమించి, నగర బిజాపురముల పర్యంతముగల బహమనీ రాష్ట్రమును చూఱలాడి పాడుగావించెను. సుల్తాను అల్లావుద్దీను శాహు ౫౦,౦౦౦ గుఱ్ఱమును ౬౦,౦౦౦ కాల్వారును గొల్వ పచ్చి ముదుగల్లునకు పండ్రెండుమైళ్ళ దూరమున విడిసి, మల్లిక్-ఉత్-తుజ్జారును రాయని పుత్రులపై కంపెను. మల్లిక్-ఉత్-తుజ్జారు మొట్ట మొదట రాయచూరికడ రాయల పెద్ద కుమారు నోడించెను; అంతట నత డచటినుండి పాఱిపోయి బంకాపురమును ముట్టడించి యుండిన తమ్ముని గలిసికొనెను; ఇరువురను బంకాపురి ముట్టడిని విసర్జించి యచటు వాసిపోయిరి. ఆ లోపల నట ముదుగల్లు పరిసరముల మూడు భయంకర యుద్ధములు నడచినవి. మొదటి యుద్ధమున జయము రాయలకే చేకూడినది; సుల్తాను పక్షమున విశేష జనక్షయము గలిగినది. రెండవ యుద్ధమున సుల్తాను జయమందెను; కాని దీని వివరములు దెలియరావు; మూడవ యుద్ధమున జయము మరల సుల్తానుకే కలిగెను. రాయచూరు బంకాపురమునుండి పాఱి వచ్చిన దేవరాయల జ్యేష్ఠపుత్రు డీ రణక్షేత్రమున వీరస్వర్గమును జూఱగొనెను. రాజకుమారుని మరణముచే భయకంపిత చేతస్కులై విజయనగర సైనికులు యుద్ధము జాలించి ముద్గలు కోటలోనికి పాఱిపోయిరి. వారిని వెన్నంటి తఱుముచు బోయిన బహమనీ సర్దారులిద్దఱు వారిచే జిక్కి బందీకృతులైరి. ఆ సర్దారులిద్దఱును సుల్తానున కభిమాన పాత్రులు. కావున నతడు వారిని విడువ కున్న, దానికి ప్రతీకారముగ రెండులక్షల హిందువులను వధించెదనని బెదరుమాటల రాయలకు సందేశమంపెను. ఆ సందేశమును వినగనే, దేవ రాయలు జడిసి సంధి ననుగ్రహింపవలయునని సుల్తానును వేడుకొనెను. తఱుణమె సుల్తాను సంధి కొప్పుకొనెను. ఈ యొడంబడిక ప్రకారము దేవ రాయ లటుమీద సుల్తాను రాష్ట్రముపై దండు వెడలనని యు, ప్రతివర్షము నిర్ణితమైన కప్పమును జెల్లించెదనని యు నొప్పుకొని పై బేర్కొన్న సర్దారుల నిరువురిని విడిచిపెట్టెను.

ఫెరిష్తా వర్ణించిన యుద్ధవృత్తాంతము నాధునిక చరిత్రకారు లనేకులు సత్యాత్మకమని యొప్పు కొన్నను, అది విశ్వాసపాత్రము గాదని స్ఫోసి పుచ్చుటకు కారణములు లేకపోలేదు. సుల్తాను బెదిరింపులకు జడిసి యిమ్మడి దేవరాయలు సంధిని ప్రసాదింప గోరెనుట నమ్మదగినది కాదు అంత దృఢముగ ఫెరిష్తా యొత్తిచెప్పెడి బహమనీ సుల్తానుల దిట్టతనము దేవరాయ లెఱుగనిది కాదు: వానివలన నపుడంతగ భయపడవలసిన కారణమును గానరాదు. విజయనగరచక్రవర్తులు నిజబాహుబల ముచే సామ్రాజ్యనిర్మాణము గావించి పృథ్వీపాలన మొనర్చిరి, కాని బహమనీ సుల్తానుల యనుగ్రహమును సంపాదించి కాదు. మహమ్మదీయుల యాటలే సాగియుండిన, రాయరాజ్య మొక్కపూటయైన జరిగియుండదు. ఈ పట్టున విచారింపదగిన ముఖ్యాంశ మింకొక్కటి కలదు. అది ముదుగల్లు దుర్గమును బహమనీ సుల్తాను సాధింప జాలకపోవుటయే. సంధిషరత్తుల నంత విపులముగ బెంచి వ్రాసిన మహమ్మదీయ చరిత్రకారు లీ సందర్భమున ముదుగల్లు మాట యెత్తరు. కృష్ణా తుంగభద్రల మధ్య దేశమందలి యాయపట్టు స్థలములలో ముదుగల్లు దుర్గము ముఖ్యమైనది. ఈ యుద్ధప్రారంభ దశయం దిమ్మడి దేవరాయలు బహమనీ సుల్తాను చేతినుండి ఈ దుర్గమును నాచి కొనెనని ఫెరిష్తా వ్రాసియున్నాడు సంధి జేసికొనిన పిమ్మట, ఈ కోట దేవరాయల స్వాధీనమందే యుండినచో, మహమ్మదీయ చరిత్రకారు లెంత బడాయి కొట్టినను, బహమనీ సుల్తాను దానిని మరల స్వాధీనము జేసికొనజాలకపోయె ననుట నిశ్చయము. ఇచ్చట స్మరింపదగిన చరిత్రాంశ మొకటి యున్నది. ఇమ్మడి దేవరాయలు బహమనీ సుల్తానును సంధిని ప్రసాదింప వేడినాడని చెప్పు సమయముననే, రాయసైన్యమొకటి తీరాంధ్రముపై దండువెడలి బలసంపన్నులైన కళింగ గజపతిని రణరంగమున నోడించి జయము గొనెను జయోజ్జృంభితమైన సైన్యమొకటి దన పంపుసేయ సంసిద్ధమైయుండగ సుల్తాను బెదిరింపులకు జంకి ఇమ్మడి దేవరాయలు సంధిని వేడెననుట హాస్యాస్పదము. కృష్ణా తుంగభద్రల మధ్యదేశమునందు

సుల్తానల్లావుద్దీను నధికారము జెల్లలేదనుటకు గొంత శాసనాధారము గలదు. బిజాపురజిల్లా ఇండి తాలూకాకు జెందిన హల్సంగి గ్రామమున గాన వచ్చు నాలుగు శాసనశిలలపై 'హద్-ఎ-అలా-ఉద్-దౌలవత్ అహమద్ షాః సుల్తాన్' అను పార్శీ శాసనములు గలవు. ఇందుపల్ల నిమ్మడి అల్లావుద్దీన్ శాహు రాజ్యపు దక్షిణపు పొలిమేర యందు హల్సంగిగ్రామ ముండెనని నిశ్చయమగు చున్నది; కావున కృష్ణా తుంగభద్రల మధ్య రాష్ట్రము ఇమ్మడి అల్లావుద్దీన్ శాహు కాలమున బహమనీ రాజ్యాంతర్గతము గాదని విదితమగు చున్నది. పైజెప్పిన యంశముల సన్నిటిని అవలో కనముజేసి చూడగా, ఫెరిష్తా చరిత్రయందు గాన వచ్చు యుద్ధవృత్తాంతము నిష్పక్షపాతము గాద నియు, సత్యదూరమనియు దోచుచున్నది; కావున విజయనగర చరిత్ర పునర్నిర్మాణమునకు గడగు నాధునిక పరిశోధకు లాతని చరిత్రయందు గాన వచ్చు విషయములను వినియోగించుకొనునప్పుడు, కడు జాగరూకతతో బరామర్శించి గ్రహించుట యుక్తము.

ఇమ్మడి దేవరాయల సమర వ్యాపారమం తయు బహమనీ యుద్ధములతో ముగిసిపోలేదు. కొంచె మించుమించు అల్లావుద్దీన్ శాహుతో బెనగులాడుచుండినసమయమునసె, యతడు పర రాజ్యములపై రెండు దండయాత్ర లంపియుం డెను. అందు మొదటిది సింహళ ద్వీపముపై సడచిన నౌకాయుద్ధయాత్ర. క్రీ. శ. ౧౪౪౨ వ సం॥ నవంబరు మాసమున పారశీకరాయబారి అబ్దుర్ రజాకు దక్షిణహిందూదేశమునకు వచ్చియుండి నప్పు డిమ్మడి దేవరాయల ప్రధానమంత్రియు, సేనాధ్యక్షుడును నగు లక్కణ దండనాయకుడు నావికాదళమును గొని సింహళముపై యుద్ధ యాత్ర జేయబోయి యుండెనని వ్రాసియున్నాడు. ఈ నావికాదళయాత్ర అంతకు మూడు నాలుగు సంవత్సరములకు బూర్వమె ప్రారంభమాయెనని శాసన సాక్ష్యమువలన దెలియవచ్చుచున్నది. ఇమ్మడి దేవరాయ లేల సింహళముపై దన నావికాబలముల నంపవలసివచ్చెనో తెలియదు. దక్షిణ సముద్రాధి పత్యముకొఱ కుభయ రాజ్యములకును ఘర్షణ కలిగియుండవచ్చును; సింహళాధిపతికి బుద్ధిచెప్పు టకై ఇమ్మడి దేవరాయలు నౌకాదళముతో గూడ లక్కణ దండనాయకు నంపిన సంపియుండవచ్చును. ఏ కారణమువలన నైన నేమి? నౌకాదళయాత్ర మాత్రము జయప్రదముగ గొనసాగినది. సింహళా ధిపు డపజయమంది రాయలకు గప్పముగట్ట నొప్పు కొనవలసి వచ్చెను; లక్కణ దండనాయకుడు దక్షిణ సముద్రముపై రాయల యాధిపత్యమును నెలకొల్పెను ఈ నౌకావిజయ ప్రసక్తి యప్పటి శాసనములందు గలదు; లక్కణ దండనాయకుడందు దక్షిణ సముద్రాధిపతి యని ప్రశంసింపబడి యున్నాడు; కొన్నిటియం దిమ్మడి దేవరాయ 'లిలంతి రైకొండ' (అనగా సింహళమునుండి కప్పముగొన్నవాడని) కలదు. కావున నీ నౌకా దళయాత్రవలన సింహళము రాయసామ్రాజ్యము క్రిందికి వచ్చెనని మన మూహించవచ్చును.

బహమనీసంగ్రామము ముమ్మరముగ సాగు చుండునప్పుడె ఇమ్మడి దేవరాయలు రాజమ హేంద్రవర రెడ్డిరాజ్య వ్యవహారములలో చొరవ గలిగించుకొనవలసివచ్చినది. రెడ్లకును కళింగ గజపతులకును గలహము మరల సంప్రాప్తమైనది. అల్లయవేముడును వీరభద్రుడును కళింగమును మరల నాక్రమింపగడగిరేమో; కాని కళింగ మున రాజకీయ వాతావరణము మారినది. నాల్మడిభానుదేవుడు క్రీ. శ. ౧౪౩౪ వ సంవత్స రమున గతించెను. అతనిస్థానమున సూర్యవంశ క్షత్రియుడు, కపిలేశ్వర గజపతి, కళింగాధిపత్యము వహించెను; కపిలేశ్వరుడు శూరాగ్రణి. సరి వారిలో నతనిమించిన పరాక్రమశాలియు దళ నాయకుడును మఱియొకడు గానరాడు. రెడ్ల దౌర్జన్యము నాతడు సహింపజాలకపోయెను. ఎట్లయిన వారిని మట్టుపెట్టుటయె శ్రేయస్కర మని యాతడు నిశ్చయించెను. కావున రెడ్లకు బ్రకృతిచే నమిత్రులైన వెలమవారితో బూర్వికుల మార్గముబడి చెలిమినెఱపి, రాయ బహమనీ సుదీర్ఘ సంగ్రామమును సందుచేసికొని రాజ మహేంద్రవరముపై దండువెడలెను. ఇమ్మడి

దేవరాయలు దన మిత్రులను చెయి విడువలేదు; ప్రచండసైన్యమును మల్లప్ప ఉడయుల యాధిపత్యముక్రింద గోదావరీతీరమున కంపెను. యుద్ధమెట్లు నడచెనో తెలియదు; కాని దాని పర్యవసానమునుగూర్చి సంశయమే లేదు; కపిలేశ్వరుడు పరాజితుడై నిజరాజ్యమునకు పాఱిపోయెను. మల్లప్ప ఉడయులు కొంతకాలము రాజమహేంద్రవరమున నిలిచి రాయల యాజ్ఞమేరకు, రెడ్డిరాజ్యమును మరల ప్రతిష్ఠ గావించెను.*

ఇమ్మడి దేవరాయల రాజ్యకాలమునందు జరిగిన యుద్ధములలో నతని ద్వితీయకళింగదండయాత్ర కడపటిది. తరువాత నతడు రెండేండ్ల పర్యంతము రాజ్యపాలన మొనర్చినను, రాజ్యమున నెచ్చటను యుద్ధవార్త వినరాలేదు. శాంతి యవిచ్ఛిన్నముగ వర్ధిల్లినది ఇరువది యైదేండ్లు కడు వైభవముతో పృథ్వీపరిపాలన మొనరించి, క్రీ. శ. ౧౪౪౬ వ సంవత్సరము మే ౩౪ వ తేది మంగళవారమునా డిమ్మడి దేవరాయలు దేహము చాలించి లోకాంతరగతుడాయెను.

ఇమ్మడిదేవరాయలు శక్తిసంపన్నుడైన చక్రవర్తి. రాజ్యవిస్తారమున భారతావనియందప్పు డతనితో సరితూగగల నరపాలుడు లేడు. కృష్ణానది మొదలు సింహళము వఱకును, అరేబియాసముద్రము నుండి బంగాళాఖాత పర్యంతమును గల దక్షిణ భారతభూమి యంతయు నతని యేలుబడిక్రింద నుండినది. అతని వరుంబడికి మితిలేదు. రాష్ట్రము నుండి పసూలగు పన్నులే గాక, యసంఖ్యాకములగు రేవు పట్టణములనుండి శుల్కరూపమున నపారధనము ప్రతి వర్షమును జమ యయ్యెడిది. చతుస్సముద్రాధిపతి యగు నతని యుద్ధనావలడ్డమాకలేక సాగరమును దరించిపోయి కొల్లము, సింహళము, పెగు, దనాసరి దేశముల నుండి కప్పము గొనివచ్చెడివి. అతని గజసాహమున వేయేనుగులు గలవు. పదాతుల సంఖ్య పదునొకండు లక్షలు.

సరాసరి రాజ్యమేలిన ఇరువది యైదేండ్లకాలమును ఇమ్మడి దేవరాయలు శత్రువులతో నిరంతరము పోరాడవలసి వచ్చినను, ప్రజాపరిపాలన వ్యవహారములను శ్రద్ధతో నిర్వహించువాడు. అతని యేలుబడిక్రింద యప్పటి కాలమానముల చొప్పున రాజ్యసంపద చక్కగ నభివృద్ధి నందినది; జనులు సుఖము, కాలము గడపుచుండిరి.

ఇమ్మడిదేవరాయలు విద్వత్ప్రభువు. అతడు స్వయముగ విద్వాంసుడు. గ్రంథకర్త యనుటకాధారము గలదు. బ్రహ్మసూత్ర భాష్యమొకటి యాతని పేరట గలదు; మహానాటక సుధానిధియను పేర రామాయణ కథను చంపుకావ్యముగ రచించెను. దేవరాయలు కవిజన కల్పభూజను.

---

* గంగాదాస ప్రతాపవిలాసములో (సోర్సస్, ౩౫), నిమ్మడి ప్రతాపదేవరాయల మరణానంతరము, తరుణవయస్కుడగు మల్లికార్జున రాయలు సింహాసనము నధిష్ఠింపగనే, దేవరాయలచే మున్ను పరాజితుడైన దక్షిణసురత్రాణుడును గజపతియు నిద్దఱు నేకమై యెత్తివచ్చి విజయనగరమునకు ముట్టడివేసిరని చెప్పియున్నది. ఇమ్మడిదేవరాయల మరణానంతరము దక్షిణ సురత్రాణునితోగూడ విజయనగరముపై నెత్తివచ్చినది గజపతి కపిలేశ్వరుడు. అతడు క్రీ. శ. ౧౪౩౫ వ సంవత్సరమున సింహాసనము నధిష్ఠించియుండుటవలన, నతడు దేవరాయలచే బరాజయమందినది క్రీ. శ. ౧౪౪౩-౪౪ వ సంవత్సరమున నడచిన మల్లప్ప ఉడయుల దండయాత్రయందై యుండవలయును. క్రీ శ. ౧౪౪౩-౪౪ నాటి ద్రాక్షారామ శిలాశాసనమువలన విజయనగర సైన్యము లప్పుడు గోదావరీతీరమున యుద్ధము సేయుచుండెనని తెలియవచ్చుచున్నది. ఈ శాసనమున మల్లప్ప ఉడయులకు మేలుకలుగుట కొఱకు అల్లయవేమ వీరభద్రుల యాజ్ఞాసారము వీరబణజిగశ్రేణి జేసిన దానము వర్ణింపబడి యుండుటవలన మల్లప్ప ఉడయులు వేమ వీరభద్రులకు సహాయము సేయుట కొఱకే యచటికి వచ్చెనని విదితమగుచున్నది.

గీర్వాణాంధ్రకర్ణాటక కవులనేకులితని యాస్థాన మున వెలసిరి. ఇతని యోలగము నలంకరించిన కవిసత్తములలో డిండిమ కవిసార్వభౌముడు సుప్రసిద్ధుడు. ఇతడు పెక్కు కావ్యములను సంస్కృతమున రచించెను. ఆంధ్ర కవిసార్వభౌ ముడు, శ్రీనాథుడు, కనకాభిషేకగౌరవ మందిన దిమ్మడిదేవరాయల యాస్థానమునందే యని యాంధ్ర వాఙ్మయ పరిశోధకులయందనేకుల యభిప్రాయము. కాని ఇది సంశయాస్పదము. కర్ణాట కవు లనేకులు దేవరాయల యాదరణకు పాత్రులైరి. విద్వత్సభలను గూర్చి, పండితులతో శాస్త్రవాదముజేయించి వారి నుచిత రీతిని సంభా వించుట ఇమ్మడి దేవరాయలకు గరము ప్రియమైన వినోదము. మతముచే నిమ్మడిదేవరాయలు శైవుడు; పీర శైవుడని కొందఅందురుగాని యది విశ్వాసార్హముగాదు. అతనికి నచ్చిన మతము శైవమైనను, సామాన్యముగ హిందూప్రభువు లండటిపలెనే యన్యమత ద్వేషము నెఱుగడు. తన యేలుబడిక్రింది ప్రజల భక్తివిశ్వాసములకు గుటే యైన మతముల నన్నిటిని యతడాదరించి గౌర వించెను; పాన్సుపారి బజారునందత డొక జినాలయ మును నిర్మించెను. విఠలస్వామి యాలయ మంతయు గాకపోయినను గొంతయేనియు నతనికాలమున గట్టబడెను; లలితకళ లతని పాలనక్రింద జక్కగ వర్ధిల్లినవి.

ఇమ్మడి దేవరాయలకు పెక్కు బిరుదు లున్నట్లు శాసనములవల్లను సమకాలిక వాఙ్మ యమువల్లను దెలియవచ్చుచున్నది. అందు ముఖ్యమైనవి ప్రతాప, ప్రౌఢ, ప్రౌఢప్రతాప, గజబేటకార మొదలగునవి. 'ప్రతాప' యను బిరుదు విజయనగర రాయలయందనేకులకు గలదు. ఇమ్మడిదేవరాయ లనేక శాసనములలో ప్రతాప దేవరాయలని పేర్కొనబడియున్నాడు; ఈ పేరిటి వాడే యితని తమ్ముడొకడు గలడు. ఈ నామ సాదృశ్యము భ్రమ ప్రమాదముల కాకరమై పరిశోధకులకు వెక్కసము గలిగించుచున్నది. 'ప్రౌఢ' యను బిరుదు ఇమ్మడి దేవరాయల కొక్కనికే కలదని పరిశోధకుల యభిప్రాయము; కావున 'ప్రౌఢ దేవరాయ' లన్న, నిమ్మడి దేవ రాయలే కాని యన్యులు గారని వాదించువారును గలరు. ఇది కేవలము పొరబాటు. ఇమ్మడి దేవ రాయలు గొన్ని శాసనములలో ప్రౌఢదేవ రాయలని పేర్కొనబడి యున్నను, ఆ పేరుగల రాజులలో నతడు ద్వితీయుడే కాని ప్రథముడు గాడు. ఈ విషయము అతని పుత్రుడగు మల్లి కార్జునరాయల శాసనముల వల్ల విదితమగుచున్నది. అందితడు తన పేరు నుమ్మడి ప్రౌఢదేవరాయ లనియు, దన తండ్రి యిమ్మడి ప్రౌఢదేవరాయ లనియు జెప్పియున్నాడు. ఇందువలన మొదటి ప్రౌఢదేవరాయ లొక డుండెనని తెల్లమగు చున్నది. మొదటి దేవరాయలు శాసనములలో గాదాచిత్కముగ ప్రౌఢదేవరాయలని పేర్కొ బడి యున్నాడు. కావున నతడే మొదటి ప్రౌఢ దేవరాయలని మనము నిశ్చయింపవచ్చును. 'ప్రౌఢ ప్రతాప' యనునది ప్రత్యేకమైన బిరుదు గాదు. మొదటి రెండు బిరుదుల కూటమివలన నది యేర్పడినది. కావున దానిని వివరింపవలసిన యావశ్యకత లేదు. 'గజబేటకార' యను బిరుదును ప్రథమమున వాడుకకు దెచ్చిన వా డిమ్మడిదేవ రాయలే. కావున గజబేటకార దేవరాయలన్న నిమ్మడి దేవరాయ లనుటకు సంశయమంద బనిలేదు. గజబేటకార యను మాటకు ఏనుగ వేటకాడని యర్థము. ఇమ్మడి దేవరాయల యనంతరము ప్రజ సింహాసనము నెక్కిన రాయలు కొంద ఱీ బిరుదును వహించియున్నారు; కాని యది ప్రత్యేక మిమ్మడి దేవరాయల బిరుదుగనే గ్రహింపబడుచున్నది.

ఇమ్మడివిజయరాయలు

(క్రీ. శ. ౧౪౪౬-౪౭)

ఇమ్మడిదేవరాయలు స్వర్గస్థుడైన వెంటనె విద్యానగరమున నేమి నడచెనో స్పష్టముగ దెలి యదు. చరిత్రకారులందఱును అతని యనంతర మతని కుమారుడు మల్లికార్జున రాయలు సింహా సనము నారోహించెనని యభిప్రాయ పడు చున్నారు. ఇది సరికాదు. ఇమ్మడిదేవరాయల

పిమ్మట నతని తమ్ము డిమ్మడివిజయ నామాం తరుడగు ప్రతాపదేవరాయలు సింహాసనము నాక్రమించుకొని స్వల్పకాలము సామ్రాజ్యమును పాలించెనని శాసన సాక్ష్యము వలన దెలియవచ్చు చున్నది. * కాని యతడెట్లు సింహాసనము నెక్కగలైనో తెలియదు. మల్లి కార్జునరాయలు పసివాడైన కారణమున నాతని పక్షమున నితడు రాజ్యకార్యములను నిర్వహించుచుండిన నుండవచ్చును. లేక, రాజ్యవ్యామోహముచే భ్రాతృజుని దొలగద్రోసి సింహాసనము నాక్రమించుకొని యుండిన నుండవచ్చును. ఇందు మొదటి యభిప్రాయమున కంటె రెండవదే సరియైనదని తోచుచున్నది. ఏలనగా, విద్యారణ్య కాలజ్ఞానమునందు రత్నసింహాసనము నెక్కిన సంగమ వంశజులగు పదమువ్వురిలో, 'దే మ' సంజ్ఞకులైన రాజుల మధ్య 'వి' పేర్కొనబడి యున్నాడు. § మఱియు నిమ్మడి విజయరాయలు దన శాసనములలో దానే స్వయము చక్రవర్తియై విజయనగర రాజధానినుండి సామ్రాజ్యమును పరిపాలించుచున్నట్లు చెప్పుకొని యున్నాడు. ఉపరి, విజయరాయలు రాజ్యము సేయుచుండిన కాలము ననే మల్లి కార్జునరాయలుగూడ విజయనగరమున సామ్రాజ్యము పీఠము నధిష్ఠించి పృథ్వీపాలనసేయు చుండినట్లతనిశాసనము లుద్ఘోషించుచున్నవి. ఇమ్మడి విజయరాయలును మల్లి కార్జునరాయలును ఇద్దఱును గూడి పొత్తున రాజ్యపాలన సేయుచుండిరని యెంచుట కాధారములేను. కావున ఇమ్మడి విజయరాయలు దన సోదరుని మరణానంతర మతని పుత్రుని బాల్యము నవకాశపఱచుకొని సింహాసనము నాక్రమించుకొనె ననియు, జిర కాలము నిజాధికారమును నిలుపుకొనుటకు శక్తి లేకపోవుటవలన నతడు మల్లి కార్జున రాయలతో సంధిజేసికొని తన పూర్వాధికార స్థానమైన పెనుగొండకు బోయి యచట

---

* ఈ క్రింది శాసనములు, 23 of 1905, 476 of 1921, 161 of 1906, Ec. III. i. Srirang. 107 ఇమ్మడి విజయరాయల రాజ్యకాలమున క్రీ. శ. ౧౪౪౬-౪౭ వ సంవత్సరమున వ్రాయించినవి. ఇమ్మడి దేవరాయల కాలపు శాసనములందును నితడు పేర్కొనబడి యున్నాడు. క్రీ. శ. ౧౪౪౧ లో నితడు కొండవీటి రాజ్యములో నధికారము సేయుచుండెను (420 of 1915); అంతకుముందు పెనుగొండ రాజధానిగ రాయదుర్గ రాజ్యమును పాలించుచుండెను. క్రీ. శ. ౧౪౩౫ వ సం. నందు లక్ష్మీధరార్యు డను వైష్ణవ విద్వాంసుల కిత డొసగిన దాన శాసనమున దా నిమ్మడిదేవరాయల తమ్ముడననియు, దన పేరు గూడ దేవరాయలనియు, దన రాజధాని నగరము ఘనశైల (పెనుగొండ) మనియు జెప్పుకొని యున్నాడు. మఱియు, దానోద్దిష్ట గ్రామమునకు ప్రతాపదేవరాయపుర మని క్రొత్తపేరు పెట్టుటవలన నిమ్మడి దేవరాయలకు ప్రతాపదేవరాయలను నామాంతర ముండెనని నిశ్చయమగుచున్నది. (M A R. 1921 Para 62). ఈ సందర్భమున నిమ్మడి విరూపాక్షరాయల శ్రీశైల తామ్రపట్టికను జ్ఞప్తికి దెచ్చుకొనవలసి యున్నది. అందు విరూపాక్షరాయలు దన తండ్రి ప్రతాపరాయలనియు, నత డిమ్మడి దేవరాయల తమ్ముడనియు, నతడు దన యన్నయగు నిమ్మడి దేవరాయల వలన ఘనాద్రి (పెనుగొండ) రాజ్యమును బొందెననియు దెల్పి యున్నాడు. (Sources, No. 26). కావున, విజయనామాంతరుడగు ప్రతాపదేవరాయలును నిమ్మడి విరూపాక్షుని తండ్రి యగు ప్రతాప దేవరాయలును భిన్నవ్యక్తులు గారనియు నొక్క పురుషుడే ననియు నత ఇమ్మడి దేవరాయల తమ్ముడనియు స్థిరపడుచున్నది.

---

§ 'హబుహవిబుదేరావిదేవి మరావి సంజ్ఞకాః' అని—

౧. హ = హరిహర
౨. బు = బుక్క
౩. హ = హరిహర
౪. వి = విరూపాక్ష
౫. బు = బుక్క
౬. దే = దేవరాయ
౭. రా = రామచంద్ర
౮. వి = విజయ
౯. దే = దేవరాయ
౧౦. వి = విజయ
౧౧. మ = మల్లి కార్జున
౧౨. రా = రాజశేఖర
౧౩. వి = విరూపాక్ష

క్రీ. శ. ౧౪౫౫ పర్యంతము రాష్ట్రపాలన మొనర్చి చుండెననియు నూహింపవలసి యున్నది.

ఇమ్మడివిజయరాయలు రాజ్యము జేసిన కాలము స్వల్పమైనను, రాష్ట్రపాలకుల దుర్వ్యవహారముల నణచుట కతడు గట్టి ప్రయత్నము జేసెను. రాయమంత్రులు ప్రజలకడనుండి కానికెలను, కులసిద్ధాయములను బలాత్కారముగ గ్రహించెడివారు. విజయరాయలీ దురాచారమును రూపుమాప ప్రయత్నమొనర్చెను; గాని యత్నము సఫలము గాలేదు; మంత్రుల రాబడి నది కొంచె పఱచుటవలన రాయల సంస్కారోద్యోగము వారికి గిట్టలేదు; కావున రాయలను దృప్తి పెట్టుట కతని యాజ్ఞ నాచరణకు దెచ్చినట్లు వారు నటించినను, దమ దురాచారమును మానరైరి. రాయలు మరల నిరూపణుల నంపవలసివచ్చెను. వాని వలన ఇది: 'ఈ రాజ్యమునందు ప్రతి రాజ్యారంభ సమయమున మంత్రులు కుడియెడమ చేతుల రైతులందఱ కడనుండియు బలాత్కారముగ గానుకలను గ్రహించుచున్నారు; తత్కారణమున బాధ పడజాలక రైతులు పరదేశములకు పాఱిపోయిరి. దేవాలయములందు పూజా పురస్కారములును, ఉత్సవములును నిలిచిపోయినవి; దేశమున జీడ పీడలు ప్రబలినవి. పాఱిపోక నిలిచియుండిన జనులు మృత్యువు వాతబడిరి; కాదేని హింసల పాలైరి.' కావున రాయలవారీ బలాత్కార కరగ్రహణము నిషేధింప ననుగ్రహించిరి. ఈ నిరూప మన్నప్ప ఉడయుల నుద్దేశించి వ్రాయబడినది. అతడు దానిని కొన్నిస్థలములందు మాత్రమే జాల జెక్కించి శాసనముల నిలిపెను; నాగరసు దేశ మంతటను జెక్కించెను. ఈ నిరూపము నంపిన తరువాత స్వల్పకాలమునకె ఇమ్మడివిజయరాయల యేలుబడి సమాప్తమగుటవలన నతడొనర్చిన సంస్కారప్రయత్నము వ్యర్థమైపోయెను; దాని వలన పాలనా విధానమున స్థిరమైన మార్పెద్దియు గలుగలేదు.

మల్లికార్జునరాయలు

(క్రీ. శ. ౧౪౪౬-౧౪౬౫)

మల్లికార్జునరాయలు తన తండ్రి మరణకాల మున పసివాఁడు; పితృవ్యుడగు నిమ్మడి విజయ రాయలతో బోట్లాడి సామ్రాజ్యమున కంతటి కేకాధిపతి యాయెను. ఇతని కిమ్మడి లేక ముమ్మడి ప్రౌఢదేవరాయలనియు. ముమ్మడి దేవరాయ లనియు నామాంతరములు గలవు *

మల్లికార్జునరాయలు దుర్బలుడు; కావున నితనికాలమున సంగమవంశ నృపాలుర బలము సన్నగిల నారంభించినది. రాయలకును గజపతులకును గల ద్వేషము హెచ్చినది. ద్వేషకారణము రెడ్డి రాజుల యేలుబడికి లోనైయుండిన తీరాంధ్ర దేశము. ఒకప్రక్క విజయనగరరాయలును మఱి యొక ప్రక్క కళింగగజపతులును తీరాంధ్రదేశము దమకు దమకని పోట్లాడ గడగిరి. బహమనీసుల్తాను దోసిరాజుకాడు; అతడును ముందుకు వచ్చి వీరితో బెనగులాడ నారంభించెను. అంతట ప్రారంభమైనది మూడు సింహాసనముల దొరలకును పోరాట. శ్రీనాథకవిసార్వభౌముడీ యంశమును జక్కగ విశదపఱచియున్నాడు.

'పరిపంథిరాజన్య బలముల బంధించు
కొమరుమించినబోడు కొండవీడు
మురుగురాజులకును మోహంబు పుట్టించు
గుఱ్ఱమైన యుటీప్రాడు కొండవీడు'

---

* మొదటి దేవరాయలు గాదాచిత్కముగ ప్రౌఢదేవరాయలని పేర్కొనబడి యుండుటవలన, నితడు కొన్నిసమయముల ముమ్మడి ప్రౌఢదేవరాయలని చెప్పుకొనియున్నాడు; కాని యా పేరు సర్వ సామాన్యముగ నితని తండ్రి ఇమ్మడి దేవరాయలకు శాసనములందు కానవచ్చుటవలన నిత డిమ్మడి ప్రౌఢ దేవరాయలను పేరునుగూడ వహించినట్లున్నది.

అని రాయ రాజధానియందు చాటి చెప్పినాడు. ఈ వైరము ముగ్గురు రాజులతో నాగిపోలేదు. ప్రజలయందు సైతము ప్రాకినది : వీరిలో నెవరికంటె నెవ్వ రధికులని వాదులాడువారు ; ఉద్రేకము హెచ్చగా జేతులు కలుపువారు.

'రయమున పృష్టికై యొదిగి రచ్చలపై విధియింతు రుగ్రతఁ। హాయపతిమీద దంతిపతి నాతనిపై నరపతిన్ గజాది నిర్ణయముల మొత్తులాడుదురు....' *

అని కృష్ణదేవరాయలు వీరి చర్యను వర్ణించి యున్నాడు.

నరపతి గజపతి యశ్వపతుల కొండొరులతో తీరాంధ్ర భూమికై పోరాటము మొదటి దేవరాయల కాలమునసే యారంభమాయె. కాటయ వేమునకు సహాయుడై దేవరాయలు గోదావరీ తీరమునకు బోవుట నెఱిగి, యతడు దన యధికారము నచట నెలకొల్పునని సంశయపడి బహమనీ సుల్తాను ఫీరూజుశాహు అన్న దేవచోడునికి ప్రాపై తానును సైన్యములతోగూడ నచటికే పోయి కర్ణాటక సైన్యములతో బోట్లాడెను; కాని యతడు నిర్వహించుకొనజాలక వెనుదిరిగి పోవలసివచ్చెను; అతని మిత్రు డన్న దేవచోడడు యుద్ధమున నిహతుడాయెను. కర్ణాటక విజయమును సహింపక గజపతి నాల్మడి భానుదేవుడు రాజమహేంద్ర రాజ్యముపై దండెత్తివచ్చెను. అల్లాడరెడ్డి మధ్యవర్తియై వారిని సఖ్యపఱచి నిజరాజ్యములకు వారి నంపివేసెను. ఇది తీరాంధ్రదేశము కొఱకు నరపతి గజపతి యశ్వపతుల మధ్య నడచిన ప్రథమ యుద్ధము. తరువాత మొదటి విజయరాయల కాలమున రాయలు బహమనీ యుద్ధమున నిమగ్నుడై యుండుటను గని గజపతి నాల్మడి భానుదేవుడు తీరాంధ్రదేశముపై దండు వెడలిపచ్చి రాజమహేంద్రవర కొండవీటి రెడ్డి రాజ్యముల రెంటి నాక్రమించుకొని నాల్గేండ్లు కాలము పాలించెను ; కాని క్రీ. శ. ౧౪౨౮ వ సంవత్సరమున నిమ్మడి దేవరాయలు తీరాంధ్రముపై దండువెట్టి గజపతిని వెడలనడచి, కొండవీటి రాజ్యమును స్వాధీనము జేసికొని రాజమహేంద్ర రాజ్యమున నల్లయవేమ వీరభద్రులను పునఃప్రతిష్ఠించెను. ఇది నరపతి గజపతుల మధ్య జరిగిన రెండవ యుద్ధము.

క్రీ. శ. ౧౪౩౪ సంవత్సరమున నాల్మడి భానుదేవుడు స్వర్గస్థుడాయెను. అంతట పూర్వ గాంగరాజవంశమంతరించినది. సూర్య వంశజుడగు కపిలేశ్వరుడు గజపతి యాయె. క్రీ. శ. ౧౪౪౪-వ సంవత్సరమున గపిలేశ్వర గజపతి రాజమహేంద్ర రెడ్డిరాజ్యముపై నెత్తివచ్చెను; కాని మల్లప్ప ఉడయుల నాయకత్వమున నిమ్మడి దేవరాయలొక సైన్యము నంపి యాతని దిశాపట్టుని గావించెను. ఇది కళింగ రాయసామ్రాజ్యముల మధ్య నడచిన మూడవ యుద్ధము.

కపిలేశ్వరుని రాజ్యాభిషేకముతో రాయగజపతుల పరస్పరస్పర్ధ యుత్కటమై హద్దు మీఱినది. ఉభయరాజ్యముల వారికిని తత్కారణమున సంభవించిన ద్వంద్వయుద్ధమున యుద్ధకారణ భూతమైన రెడ్డిరాజ్యము మాత్రమే కాక తీరాంధ్రము సర్వమును రాయల చేతినుండి దుసికిలిపోయినది. ఆ గంగాపినాకినీ మధ్యస్థిత తీరభూమి యంతయు గజపతుల యేలుబడి క్రిందికి వచ్చినది.

మల్లికార్జునరాయలు గద్దెనెక్కిన వెంటనే కపిలేశ్వరుడు బహమనీసుల్తాను అల్లావుద్దీనుశాహుతో మైత్రి జేసికొని రాయసామ్రాజ్యమును సాధించుటకు మరల ప్రయత్న మొనర్చెను. సమకాలిక సంస్కృత

---

* హాయపతి యనగా బహమనీ సుల్తాను, అశ్వబల మధికముగ గలవాడగుటచే నతని కా పేరు వచ్చినది; దంతపతి యనగా కళింగదేశాధిపతి, గజబలాధిక్యుడగుటవల్ల నతడు గజపతినా బరగెను; నరపతి యనగా విజయనగర రాయలు. అతని బలము ముఖ్యముగ కాల్వుర పై నాధారపడి యుండినందున నతనికి నరపతి యని బిరుదు కలిగెను.

నాటకకర్త గంగాదాసుని గంగాదాస ప్రతాప విలాస ప్రస్తావనయం దీ దండయాత్ర ప్రసక్తికొంత కలదు. 'విజయనగర పురందరుడు శ్రీమల్ప్రతాప దేవరాయలు మహేంద్రసభ నలంకరించిసంతటనే అతని పుత్రుడు మల్లికార్జునరాయలు సామ్రాజ్య సింహాసనము నధిష్ఠించెను; దానిని విని పూర్వము పరాభూతులైన దక్షిణసురత్రాణ గజపతు లిరువు రును మితిలేని హయగజపదాతులతో గూడ నెత్తి వచ్చిరి. విజయనగరమును చుట్టుకొని యుండిన అంతటి యసహమానమైన గజబలమును గిరికంది రమునుండి సింహపు పిల్లవలె విజయనగరి నుండి శ్రీ మల్లికార్జునరాయలు వెలువడి తన వాడికత్తి వాదర యనెడు నీటివెల్లువ వల్ల బుట్టిన యేటినరద యండు హయపతి గజపతి సైన్యముల నంతటిని ముంచివేసెను. స్వదేహమాత్రావశేషుడైన గజపతి పలాయితుడాయెను ; యవనాధిపతియు బాటి పోయెను.' ఇందువల్ల గజపతియు బహమనీ సుల్తా నుడును మల్లికార్జునరాయలు సింహాసనము నధిష్ఠిం చిన వెంటనే దండెత్తి వచ్చి విజయనగరమునకు ముట్టడివేసినట్లు తెలియుచున్నను, అది వాస్తవమని నమ్మటకు వీలులేదు. అంత శీఘ్రముగ హయపతి గజపతుల దండయాత్ర సాగినట్లు తెల్పు సూచన లెవ్వియు గానరావు. గంగాదాసు వర్ణించిన విజయ నగర సమావృతి ప్రాయశః క్రీ. శ. ౧౪౫౦వ సంవత్స రమున జరిగి యుండవలయును. ఫలనగా మల్లి కార్జునరాయ లా సంవత్సరమున మహమ్మదీయు లపై విజయమును బొందినట్లు శాసనములందు జెప్పి యున్నది ; ఆ సంవత్సరమందే రాజమహేంద్రరాజ్య పూర్వసీమయందు కపిలేశ్వర గజపతి యాగమన మీ యూహకు దోహద మిచ్చుచున్నది. కృష్ణా గోదావరుల మధ్యదేశము నత డింకను జయించి స్వాధీనము జేసికొనజాలక పోయినను, మిత్రులగు వెలమవారి యేలుబడి క్రింది తెలింగాణముమీద సైన్యమును నడపుకొని విజయనగరముపై నెత్తి పోయి యుండవచ్చును. తత్కారణమున నేమొ యతడు వెలమవారి కధిరాజగు బహమనీ సుల్తానుతో మైత్రి సల్పినది. ఈ దండయాత్రయందు కపిలేశ్వ రాదులకు సంపూర్ణవిజయము జేకూడినట్లు తోచదు. ప్రతాపరుద్ర గజపతి తన పితామహుడైన కపిలేశ్వ రుడు రాయల నోడించి యతని కడనుండి యింటి పోడవును ధనరాసిని కప్పము గొనెనని చెప్పి యున్నను, అతని మాటల నంతగ పాటింపదగదు; ఏలనగా నటుతరువాత నాలుగైదేండ్లవఱకును ఆంధ్రదేశ మందెచ్చటను గజపతివారి పొడకాన రాదు. కొండవీటి రాజ్యముపై మల్లికార్జునరాయల యాధిపత్యము క్రీ. శ. ౧౪౪౯-౫ పర్యంతము జెల్లుచువచ్చినది. ఈ ముట్టడి ప్రస్తావము మహమ్మ దీయ చరిత్రలందు కానరాదు; దీనికినోడు పైజెప్పి నట్లు శాసనములు క్రీ. శ. ౧౪౫౦ వ సంవత్సరప్రాంత మున మల్లికార్జునరాయలు మహమ్మదీయులనోడించి నట్లు సాక్ష్యము బల్కుచున్నవి. బహమనీ చరిత్ర కారుల మౌనమును శాసనోక్త రాయవిజయమును విచారించి చూడగా, గంగాదాస ప్రతాపవిలాసమున జెప్పినట్లు, మల్లికార్జున రాయలు దన రాజధానికి ముట్టడివేసిన వైదేశిక దండయాత్రికుల నోడించి తఱుమగొట్టుటయే కాక సామ్రాజ్యమున సర్వత్ర తన యధికారమును నెగ్గించుకొన జాలెనని యు దోచుచున్నది.

రాయసామ్రాజ్యముపై గజపతిదండయాత్ర క్రీ. శ. ౧౪౫౪ సంవత్సరమునుండి పట్టుదలతో ప్రారంభమైనది. క్రీ. శ. ౧౪౫౦-౧౪౫౪ సం॥ ల మధ్య కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవరరెడ్డి రాజ్యమును సాధించెను; మఱియు దన జ్ఞాతియగు గణదేవుని యాధిపత్యము క్రింద నొక గొప్ప సైన్యమును గృష్ణకు దక్షిణమున విజయనగర సామ్రాజ్యాంతర్గతమై యుండిన కొండవీటి రాజ్య మును జయించి స్వాధీనపఱచుకొనుట కొఱకంపెను. గణదేవుని యుద్ధయాత్ర జయప్రదముగ గొనసాగి నది. రాయసైన్యము లొడ్డెవారిధాటి కాగజాలక కొండవీటి సీమను పరిత్యజించి పాఱిపోయెను. కొండవీడు, వినికొండ, అద్దంకి మొదలైన ముఖ్య దుర్గములును దక్షాంత రాష్ట్రమును గపిలేశ్వరునికి హస్తగతమాయెను. తరువాత నాలుగేండ్లవఱకు విశేషాంశములు మఱియెవ్వియు సంభవించినట్లగ పడదు. గణదేవుని స్థానమున కపిలేశ్వరుడు దన పుత్రుని, కుమారహంవీరమహాపాత్రుని, కొండవీటి దండపాట కధిపతిగ నియమించి, విజయనగర

సామ్రాజ్యముపై దండువెడలి జయింప నాజ్ఞా పించెను.

హంవీర మహాపాత్రుడు గొప్ప యోధుడు; నేర్పరియగు దళనాయకుడు; అతని యాధిపత్యము క్రింద గజపతి దళములు దాక్షిణాత్య శత్రువుల నెల్ల నిర్జించి యశస్సును గడించినవి. దక్షిణదేశ ముపై నొక గొప్ప దండయాత్రను నేర్పుతో గొనసాగించి, యొడ్డె సామ్రాజ్య వైశాల్యమును విశేషముగ బెంపందించి హంవీరుడు వన్నెకు వాసి కెక్కెను.

ప్రప్రథమమున హంవీరుడు దేవరకొండ వెలమవారికి సహాయముగ తెలింగాణముపై దండు వెడలెను. వెలమవారిపై దురకల యొత్తుడు రాను రాను దుర్భరము గాజొచ్చినది. వారి స్వయంకృతాప రాధమున కిది ఫలము. కాపయనాయకునితో నిగ్ర హించి వెలమనాయకులు బహమనీ సుల్తానుయొక్క సహాయము నపేక్షించిరి. తెలింగాణము నెట్లయిన దమ యేలుబడి క్రిందికి దెచ్చుకొనవలయునని ప్రయ త్నము సల్పుచుండిన బహమనీసుల్తాను లందులకు సంతసించి కాపయనాయకుని యధికారమును గూల ద్రోయుటకు వెలమవారికి దోడ్పడిరి. తదనంతరము తెలింగాణమందు జాలభాగము వెలమవారి యధి కారము క్రిందికి వచ్చినను, స్వాతంత్ర్యము వారికి దక్కినదికాదు. బహమనీసుల్తానులకు వారు కప్పము గట్టుచుండినట్లు మహమ్మదీయ చరిత్రకారులు చెప్పు దురు; కాని ఇది యెంత సత్యమో తెలియదు. హిందూ ప్రభువు లెంతటి పరాక్రమాతిశయముగల వారైనను దురకల కరిగాపులై యుండిరని ప్రాయేణ వారికలవాటు; కావున వారి మాట లంతగ పాటింపదగినవి కావు. కాని విజయనగర బహమనీ యుద్ధములందు వెలమవారు ప్రాయిక ముగ సుల్తాను పక్షమునసె పోరుటను జూడగా; వారు కప్పముగట్టినను గట్టకపోయినను వైదేశిక వ్యవహారములందు మాత్రము స్వేచ్ఛావర్తులుగాక సుల్తానుల మార్గము ననుసరించి యుండిరని తెల్ల మగుచున్నది. వెలమవారిట్లు బహమనీ సుల్తానులకు వశవర్తులై యుండినను దమ ప్రభుత్వమును నిలుపు కొనజాలకపోయిరి. తురకలకు కాఫరులయెడ విశ్వాస మెక్కడిది? ఎంతటి సాధువగు మహమ్మ దీయుడైనను సమయము జిక్కినప్పుడు కాఫరుల కుత్తుకలు గోయుటకు వెనుదీయరు. రాజ్యాపహరణే పీడితులైన బహమనీ సుల్తానుల మాట చెప్పవల యునా? వెలమల యధికారమును గూలద్రోసి తెలింగాణమును బహమనీరాజ్యమున గలుపుకొను ప్రయత్న మహమదుశాహు కాలమున ప్రారంభ మైనది. క్రీ. శ. ౧౪౨౪-౫ వ సంవత్సరమునం దహమదుశాహు తెలింగాణముపై దండెత్తిపోయి దక్షిణమున వెలమల నోడించి యోరుగల్లు భువన గిరి రాజాచల దుర్గములను, నుత్తరమున మాహుర ప్రభువు నోడించి మాహుర రామగిర్యాది దుర్గము లను, కల్లము వజ్రపు గనులను స్వాధీనము జేసి కొనెను. క్రీ. శ. ౧౪౨౯ వ సంవత్సరమున సుల్తాను దన కుమారులకు రాజ్యము బంచియిచ్చునప్పుడు దన రెండవకుమారుడగు మహమూదుఖానునకు రామగిర్యాది దుర్గములతో గూడ నుత్తర తెలిం గాణమును, మూడవ కొడుకగు దావూదుఖానునకు రాజాచలాది దుర్గములతో గూడ దక్షిణ తెలింగా ణమును విభజించి యిచ్చెను. దేవరకొండ యొక్క టియె తురకలకు వశపడక మిగిలియుండినది. తండ్రి ప్రారంభించిన కార్యము ముగించుట కిమ్మడి యల్లావుద్దీను పలుమారులు ప్రయత్నము గావించెను; కాని యుత్తర తెలింగాణమున దురకసర్దారుల తిరుగుబాటువలన యతని కోరిక నెఱవేరినది కాదు. దేవరకొండ వెలమలు గజపతి కపిలేశ్వరునితో సఖ్యము గావించుకొని సుల్తాను అధికారమును ధిక్కరించిరి. ఇమ్మడి అల్లావుద్దీన్ శాహు క్రీ. శ. ౧౪౩౭ వ సంవత్సరమున కాలధర్మము నందెను; అతని తరువాత బీదరు సింహాసనము నధిష్ఠించిన యతని జ్యేష్ఠ పుత్రుడగు హుమాయూను వెలమ లను నిర్మూలము గావింప నిశ్చయించి గొప్పసైన్య మును దేవరకొండపైకంపెను. బహమనీసైన్యములు వచ్చి కోటను ముట్టుకొన్నవి. వెలమవారికి తల ప్రాణము తోకకు వచ్చినది. 'త్రాహిత్రాహి'యని గజపతికి సందేశ మంపుకొనిరి. వారిని సంరక్షించుట కొఱకే తండ్రి యాజ్ఞ చొప్పున హంవీరుడు దేవర కొండపై నడచినది. ఒడ్డెదండు సమీపమునకు వచ్చి

చేరువఱకును దురకల కా సంగతి తెలియదు; కావున వారు అడకొత్తులోని పోకలవలె శత్రువులమధ్య దగుల్కొనిరి. వెనుక ఒడ్డెలు, ముందు వెలమలు. హంవీరుని దళములు పొడచూపినంతటనే, వెలమలు కోట దర్వాజాలను దెఱచుకొని బహమనీ ఫౌజుపై బడిరి. వెనుకనుండి హంవీరుని దండు తాకినది. ఆనాడు దేవరకొండ రణక్షేత్రమున దురకలు చవాసలమున బడిన మిడుతలవలె క్రమందిరి. హతశేషు లూపిరి యున్న నుప్పుగల్లమ్ముకొని బ్రతుకుదమని పాటిపోయిరి. దేవరకొండ నుండి హంపీరు డోరుగంటికి బోయి యాపట్టణమును క్రైవసము గావించుకొనెను; ఓరుగంటి తరువాత మాహూరు; అటువెనుక క్రీ. శ. ౧౪౬౦ వ సం॥ న తెలింగాణమంతయు స్వాధీనపడినది. తురకలు పటాపంచలై యడపొడగానరాక పోయిరి. ఈ విజయములకు సూచకముగ కపిలేశ్వరుడు 'నవకోటి కర్ణాటక కలుబరిగేశ్వర' యను శిరుదును వహించెను.

తెలింగాణము నిట్లు జయించి స్వాధీనపఱచుకొన్న పిమ్మట, హంవీరుడు దక్షిణమున విజయనగర సామ్రాజ్యముపై నెత్తిపోవ సమకట్టెను; సన్నాహమంతయు సంపూర్ణమైన పిదప క్రీ. శ. ౧౪౬౦ సం॥ న దండు కొండవీటినుండి బయలువెడలి విజయనగరముపై బోవలయునని యేమెు శ్రీశైలము వఱకు పశ్చిమముఖముగ నడచినది; కాని యటు మీద దండయాత్ర సాగలేదు; శత్రువులచే బరాజయమందెనేమెు హంవీరు డంతట నా యుద్యమమును జాలించుకొనెను; మఱి మూడు సంవత్సరములదాక యుద్ధవార్త లేదు. క్రీ. శ. ౧౪౬౩ వ సంవత్సరమున నతడు మఱియొక సైన్యమును సమకూర్చి తన పుత్రుడగు కుమార కపిలేశ్వర మహాపాత్రుని యాధిపత్యము క్రింద దక్షిణ దిగ్విజయార్థమంపెను. విజయనగర దండయాత్రవలె గాక నిది యవ్యాహతముగ కొనసాగినది; కుమార కపిలేశ్వరుని ధాటికి మార్గమున నెచ్చటను నిరోధము గల్గినట్లు కాన్పించదు; పూర్వ సముద్రతీర దేశమందలి ముఖ్య దుర్గముల నన్నిటిని జయించెను. ఉదయగిరి, చంద్రగిరి, పడైవీడు, కంచి, వలుదలంపట్టి, తిరువారూరు, తిరుచినాపల్లి మొదలగు దుర్గములన్నియు నతని కొకదాని వెనుక నొక్కటి క్రైవపమైనవి. దక్షిణ సముద్రమున రక్తసిక్తమైన దన కరవాలమును కుమార కపిలేశ్వరుడు గడిగి పరిశుద్ధము గావించెనని గజపతుల శాసనములందు జెప్పియున్నను, నతడు కావేరిని దాటిన ట్లగపడదు. ఏకారణమువల్లనో తెలియదుగాని, యత డెంత వేగిరముగ దండు నడుపుకొనిపోయెనో యంతకంటె సత్వరముగ వెను దిరిగి పోవలసివచ్చెను; అతడు ద్రావిడ దేశమున జయించిన దుర్గములును రాష్ట్రమును వెంటనే రాయలకు స్వాధీనపడినవి. ఉదయగిరి దుర్గము మాత్రము గజపతుల యాధీనమున నిలిచిపోయినది. కుమార కపిలేశ్వరపాత్రుని దక్షిణ దండయాత్ర వల్ల తుండీర చోళమండలములందు జాల యలజడి కలిగినది; కాని రాజకీయార్థిక పరిస్థితులు మారలేదు. తీరాంధ్రమునం దాయపట్టు స్థానములగు నుదయగిరి కొండవీడు దుర్గములును దదాశ్రయరాష్ట్రమును నష్టమైపోవుటవలన, సామ్రాజ్యమునకు బలిమిచెడెను; ఒడ్డెవారిని ప్రతిఘటించి మరల్పజాలకపోవుటవలన రాయల పరువు ప్రతిష్ఠలకు లోటు వాటిల్లెను.

కుమారకపిలేశ్వరుని దండయాత్ర ముగిసిన పిమ్మట మల్లికార్జునరాయలు చాలకాలము జీవించి యుండలేదు. క్రీ. శ. ౧౪౬౫ వ సంవత్సరమునం దతడు మృతినందిన ట్లున్నది. మల్లికార్జునరాయలు బలాత్కారముచే మృతిబొందెనని ఎంచుట కవకాశము గలదు. ప్రపన్నామృత మను వైష్ణవమత గ్రంథమునందు మల్లికార్జునరాయలను నిద్రితుడై యుండగా నతని పితృవ్య పుత్రుడగు నిమ్మడి విరూపాక్షరాయలు వధించి సింహాసనము నాక్రమించుకొనెనని యొక యైతిహ్యము గలదు. ఇది యసంగతము గాదు. ఏలనగా, రాజశేఖరు డను పుత్రుడొకడు మల్లికార్జునరాయల కుండగా నాతని గాదని ఇమ్మడి విరూపాక్షరాయలు సింహాసనము నాక్రమించుకొనుటయు, విరూపాక్షునికి బద్ధశత్రువైన సాళువ నరసింగరాజును రాజశేఖరరాయలాశ్రయించుటయు హేయూహకు ప్రోద్బలముగ నున్నవి; మల్లికార్జునరాయలకు బుత్రు డుండునప్పు డతని జ్ఞాతియగు నిమ్మడి విరూపాక్షునికి సింహాసనమునెక్కనెట్టి హక్కును గలిగియుండదు. కావున, నిమ్మడి

ఇమ్మడి విరూపాక్షరాయలు

(క్రీ. శ. ౧౪౬౫-౧౪౭౫)

మల్లికార్జునరాయలను వధించి, యతని పిన తండ్రి ప్రతాపదేవరాయల కుమారుడిమ్మడి విరూపాక్షరాయలు సింహాసనము నాక్రమించుకొనెనని పూర్వప్రకరణమున వివరింపబడియున్నది. అతనికీ కార్య మెట్లు సానుకూలపడెనో స్పష్టముగ దెలియదు. గజపతి సామంతులతో నతనికి గొంత మైత్రి యుండినట్లు శాసనములందు సూచనలు గానవచ్చుచున్నవి. ఒకవేళ నతడు గజపతి కపిలేశ్వరు నాశ్రయించి యాతని సహాయమును బొంది, ప్రపన్నామృతమున జెప్పిన విధమున రాయలను వధించి రాజ్యము నాక్రమించుకొని యుండిన నుండవచ్చును. ఇది వట్టి యూహ కాదు. ఇమ్మడి విరూపాక్షుడు శక్తిసామర్థ్యములు గల ప్రభువు గాదు; అయినను, ఇతని రాజ్యకాలమున మొదటి యైదేండ్ల యందును-అనగా, గజపతి కపిలేశ్వరుడు సజీవుడై యున్నంత కాలమును-శత్రుభయము లేకపోవుటయు, నటు పిమ్మట నొక్కుమ్మడి సర్వత్ర యరి పీడ యతిశయించుటయు జూడగా నిమ్మడి విరూపాక్షుడు గజపతి యాశ్రయము సంపాదించి, యతనిచే సంరక్షితుడై యతని గొడుగు క్రీనీడను రాజ్యమేల గల్గెనని తోచకపోదు. కావున ఇమ్మడి విరూపాక్షుడు గజపతుల సాయమువల్ల సింహాసనము నాక్రమించుకొన గల్గెనను నభిప్రాయము యుక్తమైనదే.

ఇమ్మడి విరూపాక్షరాయ లిట్లు సింహాసనము నాక్రమించుకొన్నను, సామ్రాజ్య మంతయు నతనికి స్వాధీనపడలేదు. సామంతులనేకులు రాయలను లక్ష్యపెట్టక రాష్ట్రపాలన సేయదొడగిరి. వీరిలో ముఖ్యముగ బేర్కొనదగినవారు సాళువ వంశజులు. గుండ్లకమ్మ మొదలు కావేరీతటము వఱకు గల సముద్రతీర దేశమందు చాల భాగము వీరి యధికారమునకు లోబడి యుండినది; మఱియు, దక్షిణ కర్ణాటమున గొంత భాగముగూడ వీరి పాలనయందే యుండినది. నామకార్థము సాళువరాజులు రాయల విరూపాక్షరాయలు ప్రపన్నామృతమున జెప్పిన విధమున మల్లికార్జునరాయలను వధించియున్నను, సింహాసనమును బలాత్కారముగ నాచికొని సామ్రాజ్యము నాక్రమించ లేనెననుటకు సంశయమంద బనిలేదు.

రాజశేఖర రాయలు

(క్రీ. శ. ౧౪౭౮-౧౪)

విద్యారణ్య కాలజ్ఞానమందు 'ప' సంజ్ఞని యనంతరము 'రా. ఎ' సంజ్ఞ: పవజ్ర సింహాసనాధిపతియైనట్లు చెప్పియున్నది 'రా. ఎ' సంజ్ఞకుడు రాజశేఖరరాయలు విద్యారణ్య కాలజ్ఞానమున జెప్పినట్లు వాస్తవముగ రాజశేఖర రాయలు సామ్రాజ్యమును పాలించినట్లు శాసనములు నిరూపించుచున్నవి. రాజశేఖరరాయలు మల్లికార్జునరాయల పుత్రుడు. ఇతడు సామ్రాజ్యాధిపతియైనట్లు శాసనములం దున్నను విద్యానగరమునుండి రాజ్యపాలన మొనర్చినట్లగపడదు. దక్షిణ ఆర్కాటుమండలమున గానవచ్చు సాళువ నరసింగరాయల శాసనములయందే రాజశేఖర రాయలపే రగపడుటవల్లను, సాళువ నరసింగరాయ లిమ్మడి విరూపాక్షరాయలకు బద్ధ శత్రువగుట వల్లను దన తండ్రిని వధించి యిమ్మడి విరూపాక్షుడు రాజధాని నాక్రమించుకొనిన పిమ్మట రాజశేఖరుడు విద్యానగరమునుండి పాఱిపోయి సాళువ నరసింగ రాయల యండజేరినట్లును, నత డిట్లు వచ్చిన రాజకుమారుని కాశ్రయ మొసగి యతనిని చక్రవర్తిగ ప్రకటించినట్లును, దోచుచున్నది. రాజశేఖరరాయల చరిత్రను గూర్చి యింతకంటె విశేషాంశము లెవ్వియు దెలియరాకపోయినను, నతడు పుత్రవంతుడై కొంతకాలము కావేరీ తీరమున నుండెనని యచట గానవచ్చు నితని సంతతివారి శాసనములనుబట్టి యూహించుట కవకాశము గలదు.

యధికారము నంగీకరించిన**ను**, దమ యేలుబడిక్రింది రాష్ట్రమును స్వతంత్ర ప్రభువులవలె ఇచ్చవచ్చినట్లు పాలింపగడగిరి. రాజశేఖర రాయలును నతని సంతతివారు**ను** మధుర, తంజావుర, తిరుచినాపల్లి, కోయంబత్తూరు, సేలము జిల్లాలలో జాలభాగమును స్వతంత్రముగ నేల నారంభించిరి. అట్లే తుళువ కొంకణ సామంతులు రాయలను సరకు సేయక పశ్చిమ సముద్రతీర భూములయందు యథేచ్ఛగ ప్రవర్తింప గడగిరి. మిగిలియుండినది కడుసంకుచితమైన రాష్ట్రము. అందిమిడియుండిన కర్ణాట పశ్చిమాంధ్రములందు మాత్రము విరూపాక్షరాయల యధికారము జెల్లుచుండినది.

ఇమ్మడి విరూపాక్షరాయల రాజ్యకాలము రెండసమభాగములుగ విభక్తమగుచున్నది. క్రీ. శ. ౧౪౬౫ మొదలు ౧౪౭౦ వఱకు గడచిన మొదటి యైదేండ్లలోపల విశేషించి చెప్పదగిన చరిత్రాంశము లేవ్వియు గానరావు. ఈ కాలమున ప్రాయబడిన శాసనములను బరిశీలించిచూడగా సామ్రాజ్యమంతఃకలహములచేగాని వైదేశికదండయాత్రల వల్లగాని కలతనందక శాంతముగ నుండెననియు, రాష్ట్రపాలన యథాపూర్వము నిరాటంకముగ సాగుచుండెననియు దెలియవచ్చుచున్నది. కాని యటువెనుక వైదేశికదండయాత్రల వల్లను సామంతుల యుద్రేకమువల్లను శాంతిచెడి దేశము సంక్షుభితమై తుఫాను తాకుడుచే గలగుండువడ్డ సాగరమువలె నల్లకల్లోలమై యుండెను.

క్రీ. శ. ౧౪౭౦ వ సంవత్సరమున గపిలేశ్వరుడు మృతినందినతోడుతనె దక్కను రాజ్యమంతయు రాజకీయ వాతావరణము సత్వరముగ మార నారంభించినది. బహమనీ సుల్తానుల యుద్రేకము హెచ్చినది; వారి రాష్ట్రము బహుళముగ విస్తరించి పూర్వ పశ్చిమ సముద్రములను దాకినది; ప్రప్రథమముగ వారిదృష్టి పశ్చిమ సముద్రతీర దేశముపై బడినది; గోవా మొదలగు ధనసంపన్నములగు రేవుపట్టణముల నాక్రమించుకొన వలయునని చిరకాలమునుండి వారు యత్నములు సల్పుచుండిరి; కాని కపిలేశ్వరుడు జీవించియున్నంత కాలమును బహమనీసుల్తానునకు విజయనగర సామ్రాజ్యముపై నెత్తిపోవ ధైర్యము లేకపోయెను. అతని మరణవార్త చెవిసోకగనే భయవిముక్తుడై కొంకణ దేశముపై దండువెడలెను. దండువెడలుటకు బహమనీ సుల్తాను కొక చక్కని సాకు దొరకినది పశ్చిమతీర సముద్ర తీరమండలి ముఖ్యకరపట్టణములలో నొకటి యగు భట్కలుపురమున నశ్వవ్యాపారమే ప్రధానవృత్తిగ జీవనము సల్పు మహమ్మదీయ వర్తకులనేకులు నివసించుచుండిరి. వీరు విజయనగర సామ్రాజ్యమునకు జెందిన రేవు పట్టణమునుండి వ్యాపారమును జరుపుచున్నను, దా మన్య దేశములనుండి దిగుమతిసేయు గుఱ్ఱములను రాయల కమ్మక మతాభిమాన కారణమున బహమనీసుల్తానునకును నతని సర్దారులకును విక్రయించువారు. వీరి ప్రవర్తనను సహింపక విరూపాక్షరాయలు పలుమారు వీరిని మందలించెను; కాని వారు తమ బుద్ధిని మానరైరి. అందుమీద విరూపాక్షరాయల కలుక పొడమినది. కావున నతడు తన సామంతుడును నగరి హొన్నావుర రాజ్యపాలకుడును నగు మహామండలేశ్వర భైరవదేవ ఉడయల కొర్క తురకపురుగును మిగులనీయక సంహరింపవలసినదని నిరూప మంపెను. భైరవదేవుడు ముందువెనుక లాలోచింపక రాయనిరూపమును అమలుసకు దెచ్చెను; పదివేలమంది మహమ్మదీయులు ప్రాణముల గోల్పోయిరి. తక్కినవారు గోవాకరపట్టణమునకు బాటిపోయి యచట స్థిరనివాసము లేర్పఱచుకొనిరి.

స్వమతస్థులనంతరిని చంపించినందులకు రాయలపై గసితీర్చుకొనుటకొఱకు మల్లిక్-ఉత్-తుజరు ఖ్వాజా-ఇ-జహాను మహామూదు గావానుని ప్రోత్సాహముమీద రెండవ మహమ్మదుశాహు బహమనీ కొంకణమును జయింప నొకగొప్ప సైన్యము నంపెను మహమ్మదీయ దళముల మొదటి తాకునకు ఖేల్నాప్రభువు శంకరరాయలు గుటియాయెను; ఖేల్నాదుర్గము శత్రుదుర్జయమైన వనదుర్గము. దండయాత్రను స్వయముగ నడపుచుండిన మహామూదు గావానా దుర్గమును వశపఱచుకొనుటకు చన యరణభరణ శక్తిని వినియోగించి

రెండు సంవత్సరములకాలము పోఁజెను; తుదకు బలముచే సాధ్యముగాని కార్యమును ధనముచే సాధించెను; విస్తారధనమును దగువారికి లంచము లిచ్చి ఖేల్నాను గైవసముగావించుకొన్న పిమ్మట గావాను గోవాపై నెత్తిపోయెను. విరూపాక్ష రాయలు గోవాదుర్గసంరక్షకులకుదోడు సైన్యము నంపుచున్నాడని వార్తవచ్చినది. ఆదండు వచ్చి చేరినపిమ్మట గోవాను సాధించుట సులభమైన కార్యము గాదు; కావున గావాను సత్వరముగ భూనావికాదళములగూర్చుకొని కూచిచేసిపోయి యేకకాలమున నేలనుండియు నీటినుండియు దాఁకొనెను; అతని కడక సంపూర్ణముగ నెఱ వేరెను. ఇరు పార్శ్వములనుండియు నొక్కుమ్మడి పైబడిన తురకల ప్రతాపమున కాగజాలక యచట గాపుండిన రాణ్యము గోవాను తురకలకు వశపఱచిరి.

గోవా శత్రువులకు వశపడుటవలన విజయ నగరమునకు చెప్పరాని నష్టము గలిగినది. పశ్చిమ సముద్రతీరమందలి కరపట్టణములలో నెల్ల నది ముఖ్యతమమైనది. వర్తక నావల రాకపోకల కది చాల సానుకూల మగుటవలన యూర పాఖ్రికా పశ్చిమాసియాలనుండి వచ్చు సరకు లన్నియు నచటికే వచ్చెడివి. మఱియు, దక్షిణ భారతమునుండి పశ్చిమదేశముల కెగుమతియగు వస్తుసామగ్రి యంతయు నా రేవు పట్టణము నుండియే యెగుమతి యయ్యెడివి; ఎగుమతి దిగు మతి వ్యాపారములవల్ల నపారధనము రాయ భండారమునకు జమయయ్యెడిది. గోవా శత్రు హస్తగతమగుటవలన రాయ సంస్థానమునకు వచ్చు వరుంబడి తరుగుటయే కాక, రాయరాణువకు వలసిన గుఱ్ఱములుగూడ లభ్యపడక పోయినవి. తత్కారణమున రాయసైన్యబలము సన్నగిలెను.

ఇమ్మడి విరూపాక్షరాయలు గోవాను, గోల్ప డుట కియ్యకొనలేదు; దానిని మరల స్వాధీనము జేసికొనుటకు రెండుమారులు ప్రయత్న మొన ర్చెను. తురకలు గోవాను జయించిన తరువాత రెండేండ్ల కతని యాజ్ఞమీద బెగ్గాము దుర్గాధిపతి యగు వీర కన్నరాయడు, బంకాపుర ప్రభువు తోడు నడువగా, గోవాపై నెత్తిపోయెను; అంతట నిమ్మడి ముహమ్మదుశాహు మహమూదుగావాను మున్నగు సర్దారులు గొలువ గొప్ప సేనతో గదలివచ్చి బెల్గామును ముట్టడించెను. వీర కన్నరాయడు యావచ్ఛక్తిని వినియోగించి తన కోటను గాపాడు కొన ప్రయత్నించినను, తుద కతడు సుల్తాను బలము నకు లొంగి బహమనీ సామంత మండలిలో జేరవలసి వచ్చెను. వీర కన్నరాయని యోటమితో గోవా దండయాత్ర భగ్నమైపోయినది; బహమనీ సుల్తానుని యధికారము మునుపటికంటె నచట దృఢతర మాయెను. కాని విరూపాక్షరాయలు దన యత్నము సంతట మానుకొనలేదు. క్రీ. శ. ౧౪౭౧ వ సంవత్సర మున సుల్తాను, మహమూదు గావానునకు మరణ దండన విధించిన పిమ్మట, బహమనీ రాజ్యమున గొంత సంక్షోభము గలిగినది. సమయ మనుకూల పడునని తలచినాడేమొ విరూపాక్షరాయలు గోవాను జయించుటకు పునఃప్రయత్నము గావిం చెను. అప్పుడు, సుల్తానిమ్మడి ముహమ్మదుశాహు బెల్గాము దుర్గమున విడిసియుండి, తన ముఖ్య సర్దారులలో నొక్కడైన యూసూఫు ఆదిల్ ఖానుని గోవా సంరక్షణార్థము నియోగించెను. ఆదిల్ ఖానుడు గోవాను సంరక్షించుట కేమిచేసెనో తెలుప గల సాధనము లెవ్వియు లభ్యపడలేదు; కాని శత్రువుల నిర్జించి యాదిల్ ఖానుడు గోవాను గాపాడెననుటకు సంశయము లేదు. ఫలన, బహమనీ ఫౌజు లటుపిమ్మట విజయనగర సామ్రాజ్యాంతర్గత మైన తులువరాజ్యమును జయించుటకు ప్రయత్న మొనర్చినట్లు శాసనములవల్ల దెలియవచ్చుచున్నది. బహమనీ సామంతులలో నొక్కడగు ఖిదిరెసుల్తాను, గోప్రదానకేసరి (? గో ఫరీదూన్ ఖైసరుఖాను) తన సేనాధిపతి యగు నిజాముద్దీను మలుకను సైన్యముతో గూడ తులువ రాజ్యములోని నగిరె హొన్నావుర సంస్థానమును జయించుట కంపెను. ఈ యుద్ధయాత్ర యెట్లు పర్యవసానమునందెనో తెలియదు; నగిరె హొన్నావుర ప్రభువులు మహమ్మ దీయుల నోడించి తఱుమగొట్టినట్లున్నది. కాని

మహమూదు గావానుని సమరకృత్యముల మూల మున పశ్చిమ తీరమంచలి కొంకణము మాత్రమే కాక యుత్తరకర్ణాటములో జాలభాగము రాయల చేతినుండి దుసికిలిపోయినది ; మరల మహారాష్ట్రమున శివాజీ యవతారమెత్తువఱకును మరల నీదేశము హిందువుల యేలుబడి క్రిందికి రాలేదు.

కపిలేశ్వరగజపతి గతించిన పిమ్మట, గజపతి రాజ్యమున సంభవించిన యంతఃకలహముల మూల మున తీరాంధ్రదేశమున గొప్ప సంక్షోభము గలిగెను. అతని పుత్రులలో నంబీర నామాంత రుడగు హంవీరునకును, పురుషోత్తమునకును రాజ్యాధిపత్యము కొఱకు కలహము సంప్రాప్త మైనది హంవీరుడు సుప్రసిద్ధ దళనాయకుడు ; అతని కృషిమూలముననే గజపతి సామ్రాజ్య మాంధ్ర దేశమున విస్తరించినది ; కపిలేశ్వరుడు పురుషోత్త ముని దనవెనుక రాజ్యాధిపతిగ నియమించి, క్రీ. శ. ౧౪౬౪ నుండియు రాజ్యవ్యవహారముల నన్నిటిని నతని ముఖాంతరముగనే జరుపుచుండెను. అన్న దమ్ము లిద్దఱి పోఱు తీక్ష్ణముగ సాగినది ; ఈ కారణమువల్ల నాంధ్రదేశమున గజపతుల యధికార పటుత్వము గడలిసది. అందువల్ల రాయలకు గజపతి విజయముల మూలమున పూర్వము నష్టమైపోయిన రాష్ట్రమును మరల సాధించుటకు మంచి యవకాశము గల్గినది ; కాని విరూపాక్షరాయ లాజ్ఞోలి యెత్తుకొనలేదు.

దైవికముగ నిట్లు సంప్రాప్తమైన యవకాశమును సందుచేసికొని నష్టమైపోయిన రాయ సంస్థానము యొక్క పరువు ప్రతిష్ఠను పునరుద్ధరించుటకుగాని తన్మూలమున ప్రజానురాగమును బడయుటకుగాని యతడు ప్రయత్నము సేయలేదు. విరూపాక్షరాయల యౌదాసీన్యము సాళువ నరసింగ రాజాభ్యుదయమునకు గారణభూతమాయెను ; అతడు రాయసామంతులలో ప్రముఖుడు ; రాయల యొల్లమి నాస్కారము జేసికొని యతడు రాయ సామ్రాజ్య సంరక్షణపటుడై ప్రబలెను.

సాళువ నరసింహరాజు చంద్రగిరి దుర్గాధిపతియగు సాళువ గుండరాజుయొక్క జ్యేష్ఠ పుత్రుడు ; క్రీ. శ. ౧౪౫౬ వ సంవత్సరమున గద్దె నెక్కినట్లున్నది. అతడు సింహాసనము నధిష్ఠించినపుడు పితృపైతామహమైన చంద్రగిరి దుర్గమును దక్షిణ ఆర్కాటు మండలములోని నగరప్రాంతమును మాత్రమే యతని యేలుబడియందుండినను నతని యధికారమంత గొప్పదికాదు ; కాని యప్పటి రాజకీయ స్థితిగతు లతని యభివృద్ధికి దోడ్పడినవి అతడు గద్దె నెక్కుట కించుమించు ముందు గణదేవుని సుల్లికార్జునరాయలు పరాభూతుడై కొండపీటి రాజ్యమును గోల్పోయెను ; ఈ యపజయము వల్లను రాజ్య నష్టమువల్లను కేంద్ర ప్రభుత్వము యొక్క పటుత్వము చెడి బలము క్షీణింప నారంభించినది. సమయ మిట్లనుకూలపడగా సాళువ నరసింహరాజు ఇరుగుపొరుగు సామంతులను జయించి వారిపై దన యధికారము నెలకొల్పసాగెను ; దిన దిన ప్రవర్ధమానమై పెంపందుచుండిన నరసింహుని రాజ్యపరాక్రమమును గని శంకించి క్రీ. శ. ౧౪౫౯ వ సంవత్సరమున మల్లికార్జునరాయలును మహాప్రధాన తిమ్మణ్ణ దండనాయకుడును రాజధాని నుండిపోయి నరసింగరాజు రాజ్యవ్యవహారములను విచారించుచు గొంతకాలము పెనుగొండయందు నివసించుచుండిరి ; కాని యంతమాత్రమున నాతని యాటోపము దగ్గినదికాదు. పెనుగొండయందు నిజమహాప్రధానితోగూడ రాయల నివాసమువలన నేమి ప్రయోజనము కలిగెనో చెప్పుటకు సాధ్యము గాదు. సామ్రాజ్యముపై దరతరముగ నెత్తు దెంచు గజపతి దండయాత్రలవలన జాల యలజడి కలిగి శాంతికి భంగము గలిగెను. క్రీ. శ. ౧౪౬౭ వ సంవత్సరమున వచ్చిన హంవీరుని దండయాత్ర కొనసాగకపోయినను, నటుపిమ్మట రెండేండ్లకు క్రీ. శ. ౧౪౬౯ వ సంవత్సరమున నెత్తివచ్చిన కుమారకపిలేశ్వర మహాపాత్రుని ధాటి జయప్రద ముగ నడచెను. ఈ యుద్ధయాత్రలవల్ల నప్పటికే సత్వహీనమైయుండిన కేంద్రప్రభుత్వము మఱియు దుర్బలస్థితికి వచ్చినది. మల్లికార్జున రాయలవధయు, నొడ్డివారి సహాయముతో విరూపాక్షరాయల రాజ్య సమాక్రమణమును సామ్రాజ్య విచ్ఛిత్తికి దోహద

ప్రాయమైనవి. నాయకులును దొరలును నామ కార్థము రాయలయధికారము నంగీకరించుచు వచ్చిరను, ఎవ్వరి కిష్టమువచ్చినట్లు వారు ప్రవర్తింప గడగిరి. దేశమున నిట్లరాజకస్థితులు ప్రబలియుండిన సమయమున సాళువ నరసింహరాజు తన యధికారమునకు దృఢమగు పునాదును నిర్మించుకొనెను. విరూపాక్ష రాయలు సింహాసనము నధిష్ఠించు నప్పటికి యతడు చిత్తూరార్కాటు ద్వయకోలారు మండలముపై దనయధికారమును నెలకొల్పెను. గొప్ప బలమును గూర్చుకొని రాయలకు ప్రతిద్వంద్వియై వర్ధిల్లెను. అతని మార్కొన్న జాలిన బలశాలి రాయసామ్రాజ్యమున లేడాయె; కావునసే యతడు విరూపాక్షుని ధిక్కరించి మల్లికార్జునరాయల పుత్రుడగు రాజశేఖరరాయలను జేరదీసి తన యాస్థానమున నాశ్రయ మొసగగల్గెను.

ఈ యుద్ధములందు సాళువ నరసింహునిచేతను నీశ్వరనాయకునిచేతను బరాజితులైన దొరలలో ననేకులు సన్నగాండ్రు; పూర్వ దక్షిణ మైసూరు సీమలందును, కొంగు పశ్చి మాంధ్రదేశములందును జిన్నచిన్న సంస్థానముల నేలుచుండిరి. వారిత్వ మల్పము; వారిని గురించి విస్తరించి చెప్పదగిన యంశము లెవ్వియు లేవు. పై బేర్కొనినవారుగాక సాళువ నరసింహునిచే విజితులైన శత్రువులు బల సంపన్నులు మరికొందరు గలరు. వీరియం దగ్ర గణ్యులు ఉమ్మత్తూరు పాళెగాండ్రు. వీరు స్వతంత్ర రాజ్య స్థాపనకొరకు సాళువ నరసింహునితోడను నతనివెనుక రాయ సామ్రాజ్యమును పాలించిన తుళువ చక్రవర్తులతోడను హోరాహోరిగ బోరిరి. వీరి విషయ మిచ్చట నొకింత విస్తరించి చెప్పుట యుక్తము. కావేరీవాహినీ మధ్యస్థితములైన శివ సముద్ర శ్రీరంగపట్టణము లను ప్రఖ్యాతజలదుర్గ ములు రెండు వీరి యధీనమున ముండుండెను. వి కావేరి యుభయతటములను వ్యాప్తమైన దక్షిణ కర్ణాటసీమలలో బెక్కు వీరి యేలుబడిక్రింద నుండి నవి. క్రీ. శ. ౧౫౫౬ వ శతాబ్దాపరార్థమున నీ ప్రాంత మును పాలించుచుండిన దేవణఉడయ నంజరాజ వీరసోమరాయ లెవ్వరి యాధిపత్యము నంగీకరింపక స్వతంత్రులై తమ పేరిటనె శాసనాదికములను ప్రవాయించుకొనువారు. కావేరీతీర కన్నడభూము లను దన యధికారము క్రిందికి దెచ్చుకొనుటకొరకు సాళువ నరసింహు డుమ్మత్తూరు పాళెగాండ్రతో యుద్ధము జేసి వారిని జిదుగగొట్టవలసివచ్చెను బెంగు ళూరు నాగమంగల శ్రీరంగ పట్టణముల నీశ్వర నాయకుడు సాధించిన దీ సందర్భముసందే సాళువ నరసింహుడు జయించిన ప్రబల శత్రులలో మజీ యొకడు తురుష్కుడు. ఇతడు పిక్కళ్లను బోయ దొరతో నేకమై యెత్తివచ్చి పెనుగొండను ముట్ట డించెను. ఈ తురుష్కు డెవ్వడో యానవాలు పట్టు టకు దగు సాధనము లేకపోయినను, నతడు బహమనీ సుల్తా నులటకు సంశయమంచబనిలేదు. కందు కూరునుండి ఇమ్మడి ముహమ్మదుశాహు సాళువ నరసింహునిమీదికి యూసుపు ఆదిల్‌ఖాన్ ఫక్రుల్ ముల్కుల యాధిపత్యము క్రింద నంపిన దండ యాత్ర నిచట స్మరణకు దెచ్చుకొనవలయును. పిక్కళ్లెవ్వడో యత డేల తురుష్కులతోగూడి పెనుగొండను ముట్టడించెనో తెలియదు; కాని యుద్ధమున దురుష్కులోడి పాటిపోయిరి. పిక్కళ్లు హతుడాయెను

పై విజయములవల్ల సాళువ నరసింహుడు విజయనగర సామ్రాజ్యమునకు వాస్తవమైన యొడయుడాయెను అతని విజృంభణము నాపుట కిమ్మడి విరూపాక్షరాయ లెట్టి ప్రయత్నముల నొన ర్చెనో తెలియదు పోర్చుగీసు చరిత్రకుడు న్యూనిజు క్రీ. శ. ౧౬ వ శతాబ్ద పూర్వార్థమున విరచించిన విజయనగర చరిత్రయం దితని నతి తీవ్రముగ ఖండించియున్నాడు ఇమ్మడి విరూపాక్షుని గూర్చి యత డొక మంచి మాటనైన వ్రాయలేదు. అతడు దుశ్చరిత్రు డనియు పాపకర్ము డనియు నిందించి యున్నాడు. మల్లికార్జునరాయలను హత్య చేసి యాక్రమించుకొన్న విశాల విజయనగర సామ్రాజ్య మతని యేలుబడిక్రింద విచ్ఛిన్నమై పోగడగినది. అతని దుష్కృత్యముల కోర్చుకొన

జాలక యతని జ్యేష్ఠ కుమారు డతని వధించెను ; కాని యతడు సామ్రాజ్యాధిపత్యము వహింపలేదు. పితృహంత వజ్ర సింహాసనము నెక్క నర్హుడుగాడని తలచి యతడు తన తమ్ముడు ప్రౌఢరాయలను సింహాసనము నెక్కించెను

అన్న యనుగ్రహమువలన రాజ్యమును బొందిన ప్రౌఢదేవరాయ డన్న ప్రాణమునకె కంటకుడాయెను తండ్రిని చంపినవాడు దమ్ముని జంపుటకు వెనుదీయడని తలచి యన్నను వధించెను. క్రీ. శ. ౧౪౨౫ వ సంగ ప్రౌఢరాయలు సామ్రాజ్యాధిపతియైనను, క్రీ. శ. ౧౪౧౭ వ సంవత్సరము నుండియు నతడు సామ్రాజ్యపాలనమున బాల్గొనుచుండెనని శాసనములవల్ల దెలియవచ్చుచున్నది ; కాని యతడు హీనసత్వుడు ; తండ్రివలె దుశ్చరిత్రుడు ; వజ్రసింహాసనమ్మున్నె గూర్చుండ నర్హుడు గాడు ; సామ్రాజ్యపాలనయం దతని కభిరుచి లేక పోవుటవల్ల రాజకీయ కార్యములయెడ సంపూర్ణముగ విముఖుడాయెను ; అత డుదాసీనుడుగాక రాజకార్యములందు చొరగలవాడై యున్నను, సాళువ నరసింహునివంటి బలసంపన్ననకు మాజొడ్డి యుండజాలడు ; ప్రౌఢదేవరాయల యవగుణముల వలన సాళువ నరసింహునకు సామ్రాజ్యాధిపత్యము నాక్రమించుటకు మంచి సాకు దొరకినది. సమయ మతని యత్నమునకు జాలగ ననుకూలించెను ; ముఖ్య రాయసామంతులెల్ల నతనిచే బరాజితులై వశవర్తులైరి. వెలుపలినుండి ప్రౌఢదేవరాయలకు దోడు రాగల పరరాజు లెవ్వరును లేరు. సుల్తాను ఇమ్మడి మహమ్మదుషాహు మరణానంతరము బహమనీ రాజ్యమునందరాజకము ప్రబలస్థితిగతులు తారుమారగుచుండినవి ఇమ్మడిమహమ్మదుషాహు పుత్రుడగు నిమ్మడి మహమూదుషాహు తరుణ వయస్కుడగుటవలన బహమనీ సర్దారులెల్ల యెవ్వరిని సరకుసేయక స్వతంత్రరాజ్యములకు బునాదులు వేయగడగిరి; గజపతి నిజ రాజ్యవిషయములందు నిమగ్నుడై యుండెను; రాజ్యమందు ప్రబలియుండిన యంతఃకలహ మప్పటికి తుదముట్టి పురుషోత్తముడు గజపతి సామ్రాజ్యమున కంతటికి నధిపతియైనను బహమనీ సుల్తానుతో యుద్ధము సేయుచుండెను; బహమనీ సుల్తానాక్రమించుకొని యుండిన తెలింగాణ తీరాంధ్రభూములను స్వాధీన పఱచుకొనుటకు ముందు కర్ణాట రాజ్యవిషయములయం దతడు ప్రవేశము గల్గించుకొనుటకు వలనుపడదాయె. కావున సాళువ నరసింహుడు వజ్రసింహాసనము నాక్రమించుకొనుటకది మంచి తరి యని నిశ్చయించెను : ప్రప్రథమమున ముఖ్య సామంతుల కుడుగరను గానుకలను బంపి వారిని వశపఱచుకొనెను ; వారి ప్రాపును బడసిన పిమ్మట తన సేనాధిపతియు నీశ్వర నాయకుని పుత్రుడునగు నరసానాయకుని కొక గొప్ప దండిచ్చి విజయనగరమునకు బోయి ప్రౌఢ దేవరాయలను వెడల నడచి తనపేర రాజ్యమును సింహాసనము నాక్రమించుకొనవలసినదని యుత్తరువిచ్చి పంపెను. నరసానాయకున కెవ్వ రడ్డుపడలేదు; అతడు విజయనగరమును ప్రవేశింపగనే ప్రౌఢదేవరాయ లచటినుండి పరారియై పరరాష్ట్రము నందు తలదాచుకొనెను. అంగటితో సంగమరాయల వంశ మంతరించినది. నరసానాయకుడు విజయనగరమును స్వాధీనము జేసికొన్నంతటనే సాళువ నరసింహుడు రాజధానికి వచ్చిచేరి, క్రీ. శ. ౧౪౮౫ వ సంవత్సరాంతమున సామ్రాజ్య పట్టాభిషేకము గావించుకొనెను.

సాళువ నరసింహరాజు దేశాభిమానము గలదొర. ఒడ్డెవారియెడ నతనికి చెప్పరాని యేవగింపు ; మాతృభూమిని యొడ్డెలదాస్యమునుండి యెట్లయిన విడిపింపవలయునని మొదటినుండియు పట్టుబట్టెను; కాని కపిలేశ్వరుడు సజీవుడై యున్నంతకాలమును నతని కడక నెత్తివేరినదికాదు. క్రీ. శ. ౧౪౬౭ వ సంవత్సరము నందావృద్ధ యుత్కళ భూపాలుడస్వస్థుడై స్వర్గస్థుడాయెను ; అంతట చిరకాలమునుండి యతడు ప్రతీక్షించుచుండిన సమయము తటస్థపడినది ; సాళువ నరసింహరాయల దండయాత్ర కపిలేశ్వరుని మరణమున కొక్కింత పూర్వము

ప్రారంభమైనట్లున్నది. తీరాంధ్రభూమికి దక్షిణ ద్వారమనదగు నుదయాద్రి తొలుదొల్త నతనిధాటికి గుటియైనది ; తన్నెదిరింప వచ్చిన యొడ్డెదళములను సంగ్రామమున నిర్జించి యుదయగిరి కోటను లగ్గలు వట్టెను; కాని దండయాత్ర యటుపై సాగినదికాదు; దీనికి కారణము పాండ్యుల వెనుకపోటు. సాళువ నరసింహుని సైన్యము లుదయగిరిని ముట్టడించి యుండగా దక్షిణమునుండి పాండ్యభూపాలుడు, భువనైక వీర సమరకోలాహలుడు, చెవులపోతులతో గూడ వచ్చి తిగుళభూములను చెంకులు గావించు కొనెను * కావున సాళువ నరసింహుడు తీరాంధ్ర దేశము మీది దండయాత్రను సాలించుకొని వెను దిరిగి ద్రావిడ దేశమునకు బోవలసి వచ్చెను. నర సింహుడు వచ్చుచున్నాడనివిని, సమరకోలాహలు డతని నెదుర్కొన సాహసింపక సత్వరముగ నిజ రాష్ట్రమునకు బాటిపోయెను; కాని సాళువనరసింహు డాతని వదలిపెట్టలేదు ; సమర కోలాహలుని వెన్నంటి తఱుముచుబోయి పాండ్యమండలమును బ్రవేశించి తామ్రపర్ణితీరమును జేరెను. అంతదనుక శత్రు నిరోధము మార్గమునందెచ్చటను నతనికి గలుగలేదు ; తెంకాశి పాండ్యరాజు దళములను గూర్చుకొనివచ్చి యచట నరసింహుని కడ్డపడెను; కాని నరసింహుని బలాతిశయమునకు జంకి మలయ పర్వత శిఖరమునకు బాటిపోయెను; అంతట నతడు సైన్యమును మరల్చుకొని ముఖ్య స్కంధావారమైన మధురకుబోయి యచటినుండి, మరల రామేశ్వరము వఱకు దండును నడపుకొనుచు బోయెను; అచట సింహళ ద్వీపాధిపతి యంపిన కానుకలను గ్రహించి యచటినుండి నైరృత్యముగ నడచి యనంతశయన మునకు బోయి యా ప్రాంతమందెచటనో నివసించు చుండిన గురుకర్ణ (లంబకర్ణ) ల మీద యుద్ధము నడపుచు నచట కొంతకాల మాగెను.

సాళువ నరసింహుని దక్షిణ దండయాత్ర జయప్రదముగ నెఱవేరెను. దక్షిణ దేశమందలి యల్లరు లన్నియు నణగిపోయినవి; పాండ్యరాజునకు దగినట్లు శాస్తియైనది. లంబకర్ణుల గర్వము సమసి నది. దక్షిణ దేశమున శాంతిని నెలకొల్పి రాజకీయ వ్యవహారములు యథాపూర్వము జరుగుటకు దగిన యేర్పాటులను గావించి, యుత్తరమున నొడ్డెవారిపై దండయాత్రను గొనసాగించు నుద్దేశముతో నరసింహుడు తీరాంధ్రమునకు మరలి వచ్చెను. దక్షిణదేశమున నతడు యుద్ధమును నడపుచుండినపుడు, తీరాంధ్ర దేశమున గొప్ప మార్పులు సంభవించినవి. రాజ్యాధిపత్యముకొఱకు కపిలేశ్వరుని పుత్రులకు గలిగిన సంగ్రామమునందు హంవీరుడు పరాజితుడాయెను. విజయుడైన నిజసోదరుని యధికారము నంగీకరింప నొల్లక యతడుబహమనీసుల్తాను రెండవముహమ్మదుశాహు సహాయము నపేక్షించెను. క్రొత్త రాజ్యములను సంపాదింప నాతురపడు వాడగుటవలన ముహ మ్మదుశా హతని వేడికో లంగీకరించి తన ఫౌజులను నిజసామంతులలో బ్రధానుడగు మల్లికు నిజామ్-ఉల్-ముల్కు భైరీ యాధిపత్యముక్రింద తీరాంధ్ర మున కంపెను. నిజామ్-ఉల్-ముల్కు భైరీ సుల్తాను నాజ్ఞ చొప్పున దండు నడపుకొనిపోయి హంవీరుని

---

* అని సమకాలికాంధ్రకవి పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు చెప్పుచున్నాడు. ఆంధ్ర నిఘంటువు లన్నియు —అధునాతనమైన సూర్యరాయాంధ్ర నిఘంటువుతోగూడ — 'చెవులుపోతు = శశము, కుందేలు' అనియే యర్థనిర్ణయము గావించి యున్నవి. పినవీర సాళువ నరసింహుని యుద్ధక్రీడలను డేగ వేటగ వర్ణించినాడు; కావున నతని వర్ణన శ్లేషభూయిష్ఠమై నరసింహుని పక్షమున నొక యర్థమును డేగ పక్షమున మఱియొక యర్థమును గలిగియున్నది. 'చెవులపోతు'నకు డేగ పక్షమున కుందేలను నర్థము జెల్లును; కాని నరసింహుని పక్షమున జెల్లదు. కావున నరసింహుడు జయించిన 'చెవులపోతు' లెవ్వరో తెలిసికొనవలసి యున్నది. కొన్ని ప్రాచీన అరవ శాసనములందు పాండ్యదేశ వాస్తవ్యులు, 'లంబకర్ణ' జాతి ప్రజలుగ బేర్కొనబడి యున్నారు. 'లంబకర్ణ' యను మాటకు ప్రేలాడు చెవులని యర్థము. ఈ మాటకు అరవ 'తొళ్ళకాదు' సమానార్థకము తొళ్ళకాదువారి జన్మభూమి నెట్టినాడు. కావున చెవులపోతులన నెట్టినాటి జనులని యర్థము.

గలిసికొని పురుషోత్తమునిపై యుద్ధమునకు దర లెను. ఉభయ బలములును సంగరాంగణమున దారసిల్లినవి. గొప్పయుద్ధము వాటిలినది. తురకల సహాయముగల్గిన హంవీరునికి జయము గల్గినది. పురుషోత్తముడు పరాభూతుడై పాటిపోయెను. అంతట క్రీ. శ. ౧౪౨౧ వ సంవత్సరమున హంవీరుడుగళింగాధిపత్యము వహించితనకుదోడ్పడి నందు కొడంబడిన ప్రకారము బహమనీసుల్తానుకు దెలింగాణము మాత్రమే కాక తీరాంధ్రమును సర్వ మును సమర్పించెను.

హంవీరుని త్యాగమువలన తీరాంధ్రమున కంతయు బహమనీ సుల్తానధిపతి యాయెను; తత్కారణమున సాళువ నరసింహుని రాజ్యపు టుత్తరపు పొలిమేర బహమనీరాజ్యమును దాకినది. కావున స్వరాష్ట్ర సంరక్షణకొఱకలడప్రమత్తుడై ప్రవర్తింపవలసివచ్చినది. మఱియు గణదేవుని దండ యాత్రకు ముందు విజయనగర సామ్రాజ్యాంతర్గ తమై యుండిన కొండవీటి రాజ్యమును మరల సాధింపవలసినపని యప్పటి కింకను నెఱవేఱకుండెను. కావున నరసింహరాజు సైన్యములను గదల్చుకొని బహమనీ గడిదేశముపైపు కూచిచేసి పోయెను; సరిహద్దు ప్రాంతమును జేరగనే నరసింహరాజు బహమనీ సుల్తాను కరిగాపులై యుండిన జమీందారు లతో సఖ్యము గావించుకొని సుల్తానుపై దిరుగుబాటుసేయ వారిని బురికొల్పెనని మహమ్మ దీయ చరిత్రకారులు చెప్పుచున్నారు. అతని సలహా ననుసరించియె కాబోలు గొండపల్లిదుర్గాధిపతి సుల్తాను నాధిపత్యమును నిరసించి హంవీరుని రాజమహేంద్రవరముపై నెత్తిరా నాహ్వానించినది.

తనకు జేసిన సహాయమునకు భృతిగ హంవీరుడు సుల్తానుకు దెలింగాణ తీరాంధ్రములను సమర్పించినను, వానిమీది యాశ యడని విడువలేదు; కొండపల్లి దుర్గాధిపు డంపిన వర్తమాన మందగనె యతడు దండుతో గదలివచ్చి రాజమహేంద్రవర మును ముట్టడించెను. అంతట కొండపల్లి దుర్గాధి పతియు సాళువ నరసింహరాజును దమ తమ దళ ములతో గదలి హంవీరునికి బ్రాపుగబోయి రాజమహేంద్రవర సమీపమున గోదావరికివలి యొడ్డున విడిసిరి. మహమ్మదుశాహు పక్షమున రాజమహేంద్రవర దుర్గమును బాలించుచుండిన నిజామ్-ఉల్-ములుక్ భైరీ శత్రువులకు మాఱొడ్డి నిలువజాలక పరాజితుడైపోయి తెలింగాణమందలి యోడపలి-వజీరాబాదునతల దాచుకొనెను; నాయకు డిట్లుకాలిబుద్ధిచెప్పగా, జేయునదిలేక రాజమహేంద్ర దుర్గమునకు గావుండిన సైన్యము హంవీరుని శరణువేడి కోట నతని కొప్పజెప్పిరి.

తీరాంధ్ర వృత్తాంతము దెలియవచ్చినంతట సుల్తా నిమ్మడి మహమ్మదుశాహు ఫౌజులను దరల్చు కొని, ముఖ్యమంత్రి మహామూదుగావానును సర్దా రులు నాయకులును గొల్వ సత్వరముగ గూచిచేసి పూర్వదేశమునకు వచ్చిచేరెను. అత డచటికి వచ్చు నప్పటికి హంవీర సాళువనరసింహుల సేనలు గోదా వరీ పూర్వ పశ్చిమ తీరములందు విడిసి యుండినవి. కాని యుద్ధము జరుగలేదు. బహమనీసుల్తాను సైన్య ముతో బొడచూపగనే, యుద్ధముసేయజంకి హంవీరుడు స్కంధావారము లేవనెత్తికొని కళింగ మునకు మరలిపోయెను; సాళువనరసింహుడు తన రాజ్యముపైపుతరలిపోయెను. శత్రువులిట్లుతమంతట దామె విరిసిపోగా ముహమ్మదుశాహు రాజమహేంద్రనగరమును సులభముగ స్వాధీనము జేసికొని తత్ప్రాంతదేశమును జయింపదొడగెను.

బహమనీసుల్తానునకు బోటుచూపక సాళువ నరసింహుడు రాజమహేంద్రవర పరిసరములనుండి దండు నేల తరల్చుకొనిపోయెనో తెలియదు; కాని యటుపిమ్మట నతడూరకుండలేదు. బహమనీ సుల్తాను కళింగ గండయాత్రయందు నిమగ్నుడై యుండుటను గని కొండవీటిరాజ్యము నాక్రమించుట కదియె మంచి తరుణమని గ్రహించి యచటి పట్టణములను దుర్గములను స్వాధీనపఱచుకొన నారంభించెను. క్రీ. శ. ౧౪౨౨ సం॥ ప్రారంభ మగునప్పటికి కృష్ణానదికి దక్షిణమున నుండు తీరాంధ్రమంతయు గొండవీడు మొదలగు దుర్గముల తోడను మచిలీపట్టణము మున్నగు కరపట్టణముల తోడను నతని యేలుబడి క్రిందికి వచ్చినది. ఈ విజయముల

మూలమున సాళువ నరసింహరాజు విజయనగర బహమనీ రాజ్యములకు మధ్యనుండిన పూర్వ సముద్రతీరదేశమున కంటటికిని యధిపతియాయెను; తెలింగాణమునగాని రాయసామ్రాజ్యమునగాని యతనికంటె బలాధికుడగు ప్రభువెవ్వడును గాన రాడాయె.

కొండవీటిదుర్గము నాక్రమించుకొనుటవలన సాళువ నరసింహునికి బహమనీ సుల్తానుతో యుద్ధము సంప్రాప్తమైనది. తత్పూర్వము కొన్ని యేండ్లనుండి వారికి వైరము పెరుగుచు వచ్చినది. యుద్ధమున సాయము జేసినందులకు హంవీరుడు తీరాంధ్రమును బహమనీ సుల్తానున కిచ్చివేసినప్పటి నుండియు కొండవీడు రాజ్యమున కత డధిపతి యాయెను; కాని నరసింహుడు సుల్తాను నధికారమును గూల ద్రోయుట కెడతెగక ప్రయత్నము సేయుచు గడి దేశపు జమీందారుల నతనిపై దిరుగుబాటుసేయ బురికొల్ప గడగెను. అంతట నిలువక గొండపల్లి దుర్గాధ్యక్షునితో గూడ నేకీభవించి యతని వెంబడి సైన్యమును గదల్చుకొని రాజమహేంద్రవరమునకు బోయి యా పట్టణమును సాధించుటకు హంవీరునకు దోడ్పడెను. తుదకు కొండవీటి దుర్గమును జయించి తదాశ్రయ రాష్ట్రమును వశపఱచుకొనెను; కొండవీటి యాక్రమణ మొంటెవీపును విఱుచు గడ్డిపోచయైనది. కావున సుల్తా నిమ్మడి ముహమ్మదుశాహు సాళువ నరసింహరాజును దగిన రీతిని దండించి యత డాక్రమించుకొని యుండిన దుర్గములను రాష్ట్రములను మరల సాధించుటకు నిశ్చయించెను.

కొండవీటి దుర్గమును సాళువ నరసింహరా జాక్రమించుకొన్నప్పుడు రెండవ ముహమ్మదు శాహు రాజమహేంద్రవరమున వసించి యుండెను. ఆవార్త తెలియవచ్చి నంతటనే బలములను సత్వర ముగ గదల్చుకొని వచ్చికొండవీటికి ముట్టడివేసెను. అపు డచట సాళువ నరసింహరాజు లేడు; ఏ కారణము చేతనో తెలియదుకాని యతడా ముట్టడిని మాన్ప ప్రయత్నము సేయలేదు. తూర్పుతీరమునకు జాలదూరమున నెచటనో యతడు యుద్ధయాత్ర సేయుచున్నట్లు తోచుచున్నది. కొండవీడు సుల్తానునకు సులువుగ వశపడుట జూడగా సాళువనరసింహు డాంధ్రాంతమున లేడను సమాచారమును దెలిసియే యత డెత్తివచ్చినట్లున్నది. మఱియు గొండవీటి విజయముతో దృప్తిపొందక సుదూరమున నుండు కాంచీపురమును జూఱగొనుటకు సాహసించి పోవుటయు నీ యభిప్రాయమునే బలపఱచుచున్నది.

కొండవీటినుండి బహమనీ సైన్యము క్రీ. శ. ౧౪౮౧ వ సం॥ మార్చిమాస ప్రారంభమున బయలు వెడలినది; పదిదినములు కూచిమీద కూచిచేసి నడచినది; నెల్లూరు జేరగనే సుల్తాను ముహమ్మదుశాహు సైన్యమందు చాలభాగమును దన కుమారుడు మహమూదు ఖానునితోడను ప్రధానమంత్రి మహమూదు గావానునితోడను నచట నిలిపి కొంచెపాటి గుఱ్ఱపు దళముతో బయలువెడలి రాత్రియనక పగలనక యెకాయెకి ప్రయాణముజేసి కంచిని సమీపించెను. మార్గమునం దెచ్చటను శత్రువు లడ్డపడ లేదు; హఠాత్తుగ వచ్చి పైబడుటపలన గాంచీపుర జనులు ముహమ్మదుశాహు నెదిర్చి తమ పట్టణమును గాపాడుకొనజాలక పోయిరి. దేవాలయములను సంరక్షించుటకొఱ కావరబావరగ పోగైన కొలది జనులను ముహమ్మదుశాహు సులభముగ దఱుమ గొట్టి దేవాలయములను బట్టణమును జూఱలాడి యెంతత్వరగ గంచిపై నడచెనో నంతకంటె వేగముగ నెల్లూరునందలి స్కంధావారముపైపు వెను దిరిగి చనెను.

కాంచీపురమును జూఱగొనుటవలన ముహమ్మదుశాహునకు దోపుడు ధనము విస్తారము చేజిక్కినది; కాని దాని నంతయు నతడు భద్రముగ గొని పోజాలక పోయెను. మహమూదు గావానుని చారిత్రము నిర్మలమైనదనియు నతడు నిరపరాధియనియు నిరూపించుటకొఱకు మహమ్మదీయ చరిత్రకారులు, కృత్రిమ లేఖగాథ నొకదానిని గల్పించి, యీ యుద్ధయాత్ర యొక్క వాస్తవ వృత్తాంతమును గప్పిపుచ్చిరి. సమకాలిక అరబీ మహమ్మదీయ గ్రంథకర్తయగు సఖావీ, గావానుని మరణ వృత్తాంతమును క్రీ. శ. ౧౪౮౧-౧౪౯౨ సం॥ల మధ్య గ్రంథస్థము గావించెను. మహమ్మదీయ చరిత్రకారులు

జెప్పు కృత్రిమలేఖ సమాచారము నత డెఱుగడు. గావానుని మరణము నతడు వేఱునిధముగ వర్ణించి యున్నాడు.

'మహామూదు గావా నెల్లప్పుడును ధనమును వ్యర్థముగ వెచ్చబెట్టనిచ్చువాడుగాడు; అల్పులు సుల్తానుగారి వదాన్యతకును గౌరవమునకును పాత్రులుగారని మందలించి యడ్డపడువాడు; సుల్తాను పెద్దవాడైన పిదప యథేచ్ఛగ దన్ను ప్రవర్తింపనీయక ఖ్వాజాగా రిట్లడ్డపడుట యాతనికి నచ్చినదికాదు. కావున గురువుగారి కెట్లయిన స్వస్తి చెప్పవలయునని నిశ్చయించి సుల్తా ననుకూల సమయముకొఱకు వేచియుండెను. ఇట్లుండగా నరసింగ దేశమునకు సుల్తాను బోవుట తటస్థించెను; పదునేడు దినములు ఖ్వాజా సుల్తానును నెడబాసియుండెను; ఆ యెడబాటును సందుచేసికొని యతని శత్రువు లతని నడపడిక సరియైనది కాదని దోషారోపణ సేయగడగిరి. సుల్తానున కాంతరంగికులగు మంత్రుల మూలమున సుల్తా నంపినట్లు అంతకాల మెడబాటు గల్గినందులకు జింతించుచున్నాడననియు; నరసింగుని సైన్యము రాత్రియందు పైబడబోవుచున్నదనియు; గావున తగురీతిని కట్టుబాట్లను గావించి యతని నెదుర్చుటకు సంసిద్ధుడైయుండవలసినదనియు హెచ్చరింపుచు వర్తమానమంపిరి. మహామూదు గావాను డీ హెచ్చరిక వాస్తవము కాదలచి, యది నిశ్చయముగ సుల్తాను కడనుండియే వచ్చెనని విశ్వసించి, యతని కావిషయమై యేమియు దెలియరాకపోయినను, దనక్రిందనున్న ఫౌజులకు వడుణమ యుద్ధసన్నద్ధులు గావలయునని యాజ్ఞాపించెను. అటు తరువాత నతని ప్రతిపత్తులు వేగిరముగ సుల్తాను చెంత కేగ మహామూదు గావాను సమయము జిక్కగనె సుల్తాను స్కంధావారము పైబడ సంసిద్ధుడై యున్నాడనియు; తమ మాటలను విశ్వసింపక పోయిన సుల్తానుగా రెవ్వరినేని బంపిన వారు వాస్తవము గనులార జూచి రాగలరనియు నివేదించిరి. సుల్తా నొక వేగులవాని నంపెను; వాడు పోయి వచ్చి గావానుడు యుద్ధ ప్రయత్నములు జేయుచుంట సత్యమేయని చెప్పెను. మరుసటిరోజు మద్యపానముచే మత్తుడై సుల్తాను గావానుని సముఖము నకు రప్పించెను; తన యెడ శత్రువులు సేయబడ పెట్టిన ద్రోహ మత డావంతయేనియు నెఱుగడు. అతడు ప్రవేశింపగనే సుల్తాను బానిసలలో నొకడు ఖడ్గముతో, నతడు మృతుడగువఱకును, ప్రహరింపగడగెను; ఇది లాట సఫరుఖ తేదినాడు జరిగినది. అసదుఖానుడుగూడ నాదినమునసే వధింపబడెను. నేను మెక్కాలో నుండగ నీ దుర్వార్త యచటికి వచ్చిచేరినది. అచట దీని విన్నవారందఱును గడు దుఃఖితులైరి.'

సభాపర్వసయందు కృత్రిమలేఖమాటలేదు; కాని యప్పటినుండి కత్యంతాప్తుడైయుండి గావానుని, యతనిపైని యారోపణల సత్యాసత్యమును జక్కగనైన విచారింపక, సుల్తా నేల జంపించెనో తెల్లమగుటలేదు. దీని రహస్యము సమకాలికాంధ్రరచనలవలన వెల్లడి యగుచున్నది. గావానుని శత్రువులు రాత్రి యతని స్కంధావారముపై నరసింగరాజుపడనుద్యమించుచున్నాడని చెప్పిపంపిన వర్తమానము కేవల మబద్ధముగాదు; అందు చాల సత్యము గలదు. వారుజ్ఞాయించినట్లు నరసింగరాజు బహమనీ స్కంధావారముపై నెల్లూరికడ బడలేదు; ఇంక కొంచె ముత్తరమందుండు కందుకూరికడ వారిని దాకెను.

క్రీ. శ. గళగగ వ సంగసకు పూర్వముదైన యాంధ్ర వరాహపురాణ పీఠికయందు నరసింగ క్షితిపాలుని యాజ్ఞ చొప్పున నరసానాయకుని తండ్రియగు నీశ్వరనాయకుడు కందుకూరికడ బెడదకోట యవనాశ్వ సైన్యమును నిర్మూలము గావించి వారి శిబిరములను జూఱలాడెనని చెప్పియున్నది ; ఈ యంశమునేనందితిమ్మన తన పారిజాతాపహరణపీఠిక యందు చెప్పియున్నాడు. మహామూదుగావానుని యుద్ధ ప్రయత్నములను సాళువ నరసింహుని కవిదలను బరామర్శించి చూడగా సుల్తాను ముహమ్మదుశాహునకు దన మంత్రియు శత్రువును దన యధికారమును గూలద్రోయ నేకీభవించినారను నమ్మకము గల్గించియుండును. కావుననే యతడు తక్షణము గావానుని వధింప నాజ్ఞాపించెను; కాని యుద్ధమునం దీశ్వరనాయకునిచే బరాజితుడగుట

వలన గాంచీపురమును లూటికొట్టి తెచ్చిన దోపిడి నంతటి నాపనికి సమర్పింపవలసి వచ్చినది.

కాఫరులచే గలిగిన పరాభవమువలన సుల్తాను మహమ్మదుశాహు పరువు ప్రతిష్ఠలకు జాల లోటు వాటిల్లినది. కావున సాళువ నరసింహుని పై గసితీర్చు కొని నష్టమైన కీర్తిని మరల నార్జింపవలయునని నిశ్చయించి యతనిమీదికి యూసుపు ఆదిల్ ఖాను, ఫక్రుల్ ముల్కు లను సర్దారులను బంపి సైన్యము గడల్చుకొని కందుకూరినుండి తరలి మచిలీపట్టణ మును దత్పరిసరభూములను జయించుటకు బోయెను సుల్తాను కడక సంపూర్ణముగ నెఱవేఱినది. మచిలీ పట్టణమును సదాశ్రయ రాష్ట్రమును ముహమ్మదు శాహునకు హస్తగతమైనవి; కాని యూసుపు ఆదిల్ ఖాను, ఫక్రుల్ ముల్కులు పరాజితులై వెనుదిరిగి పోవలసివచ్చెను.

సాళువ నరసింహుని సేనాధిపతియగు నీశ్వర నాయకుడు జయించిన స్థలములు బెక్కువరాహ పురాణ పీఠికయందు పేర్కొనబడి యున్నవి. అందు ఉదయాద్రి, నెల్లూరు, ఆమూరు, కోవెల, కుందాణి, శ్రీరంగపట్టణము, నాగమంగలము, బెంగుళూరు, పెనుగొండ, గండికోటలు ముఖ్యమైనవి. ఇవిగాక జైమిని భారతమున బోనగిరి, చెంజి, కొంగుధారా పురములను సాళువ నరసింహరాజు జయించినట్లు చెప్పియున్నది. ఈ స్థలము లెప్పు డేసందర్భమున నీశ్వరనాయకునిచేగాని సాళువ నరసింహునిచేగాని జయింపబడెనో దృఢముగ నెప్పుటకు వీలులేదు. ఉదయాద్రియు నెల్లూరును క్రీ. శ. ౧౪౬౯-౭౦ వ సంవత్సరమున నడచిన యొడ్డెదండయాత్రయందు స్వాధీన పడి యుండవచ్చును; ఆమూరు (చెంగల్పట్టు జి.) బోనగిరి చెంజి దుర్గములును (ఉ. ద. ఆర్కాటు జి.), కోవెల (శ్రీరంగము, తిరుచినాపల్లి జి.)యు, క్రీ. శ. ౧౪౭౦ వ సంవత్సరమున నడచిన దక్షిణ దిగ్విజయ యాత్రయందు వశమై యుండవలయును కొంగు ధారాపురము (కోయంబుత్తూరు జి.), కుందాణి (సేలము జి.), నాగమంగల బెంగుళూరు శ్రీరంగ పట్టణములు (మైసూరు సం.), పెనుగొండ (అనంత పురం జి.), గండికోట (కడప జి.) లు క్రీ. శ. ౧౪౭౧-౧౪౭౪ సంవత్సరముల మధ్య సాళువ నరసింహుడు దన యధికారము నంగీకరింపక ధిక్కరించిన దొర లను శిక్షింప నెత్తిపోయినపుడు స్వాధీనమై యుండ వలయును. బాగూరు పంచగ్రామముల నీశ్వర నాయకుడు పాడుచేసిన దీ సందర్భమునసే కావచ్చును.

సాళువ వంశము

సాళువ నరసింహరాయలు

(క్రీ. శ. ౧౪౫౫-౧౪౯౦)

సంగమ రాజవంశమును దుదముట్టించి సాళువ నరసింహరాయలు పట్టాభిషిక్తు డైనపిమ్మట చిరకాలము సామ్రాజ్యము నేలలేదు; అతడు పరిపాలించిన కాలము స్వల్పము. కాలజ్ఞానములం దత డేలినది మూడేండ్ల కాలమని చెప్పియున్నది. శాసన సాక్ష్యమునుబట్టి చూడగా గొంచె మించు మించుగ నీకాలము సరియైనదేయని తెలియవచ్చు చున్నది. ప్రౌఢదేవరాయలను బాఱుదోలి యతడు సామ్రాజ్య పట్టాభిషేకము గావించుకొన్నది క్రీ. శ. ౧౪౫౫ వ సంవత్సరము కడపట; క్రీ. శ. ౧౪౯౦ వ సంవత్సరాంతమునకో మరుసటియేటి ప్రారంభము నకో అతడు కాలధర్మము నందెను. అతడు వజ్రసింహ సన్యాసినుడై పృథ్వీసామ్రాజ్యము నేలిన మూడు నాల్గేండ్లను బహిరంతర శత్రువర్గముతో నెడతెగక పోరవలసి వచ్చెను. కావున నిజాధికారమును సుస్థిర ముగ స్థాపించి నిరుపద్రవమైన రాజ్యమును దన పుత్రులకు గైవసముజేసి చనుట కతనికి వ్యవధిలేక పోయెను; రాజ్యాక్రమణ మధికారనిర్వహణము కంటెసులభతరమైన కార్యమనియతనికెఱుకపడినది; రాజ్యాక్రమణ కార్యమున నతనికి దోడ్పడిన సామం తులును నాయకులును అతనియాధిపత్యము నంగీక రింపక విముఖులైరి; కావున నతడు దన పూర్వ సాహాయ్యు లనేకులతో బోట్లాడవలసి వచ్చెను.

సాళువ నరసింహరాయల యాధిపత్యము నంగీకరింపక బ్రతిఘటించిన వారిలో గండికోట

సీమలోని పెరనిపాడు నివాసస్థలముగా గల సంబెటవారును, హొయ్సల రాజ్యమునం దుమ్మత్తూరు తలకాడులను పాలించుచుండిన పాలెగాండ్రును ముఖ్యులు. సంబెట శివరాజు విజయనగర రాజధానియందు సంభవించిన విప్లవమును సందుచేసికొని తాను రాయల కీయవలసిన కప్పమును చెల్లింపకపోవుటయే కాక రాయల యధికారమును ధిక్కరించి చుట్టుపట్ల నుండిన సీమలనుండి పన్ను పర్యాయములను వసూలుచేసి వెచ్చపెట్టుకొనగడగెను; అతని జ్ఞాతియగు సంబెట వీరనరసింహుడు తిరుగుబాటు చేసి, పరిసర ప్రదేశములను భారామార్గమున సరకులను గొనిపోవు పర్తకులను దోచుకొన నారంభించెను. సాళువ నరసింహరాయలు వారిమీదికి సైన్యముతోగూడ వంకరకుమార బసివినాయని బంపెను. శివరాజతనినెదిర్చి పోటుజూపెను; కాని నిర్వహించుకొనజాలకపోయెను; బసివినాయని ఫిరంగిగుండ్లు తాకునకాగజాలక శివరాజున కాటపట్టయిన మద్దిగుండాల దుర్గము నేలమట్టమునకు జదునాయెను; శివరాజు సంస్థానము రాయలకు హస్తగతమాయెను.

మైసూరు తులు దేశములను పాలించుచుండిన యుమ్మత్తూరు సంగీతపుర పాలెగాండ్రు గూడ సాళువ నరసింహుని యాధిపత్యము నొప్పుకొనక ధిక్కరించిరి; వీరిని జయించుట కతడెట్టి ప్రయత్నముల నొనర్చెనో తెలియదు; ఎట్లో సంగీతపుర మతని కడపటి యేండ్లలో స్వాధీనపడినను, నతని మరణకాలము వఱకు నుమ్మత్తూరు దుర్జయమై రాయల యేలుబడి క్రిందికి రాకయుండెను.

సాళువ నరసింహరాయలు సామ్రాజ్యాధిపత్యమును వహించిన పిమ్మట నడచిన చరిత్రాంశములలో నుదయగిరిపై వచ్చిన యుత్కళ దండయాత్ర ప్రధానమైనది. క్రీ. శ. ౧౪౭౦ వ సంవత్సరమున కపిలేశ్వర గజపతి నోడించి స్వాధీనము జేసికొని నప్పటినుండియు నుదయగిరి సాళువ నరసింగరాయల స్వాధీనమం దుండెను. క్రీ. శ. ౧౪౭౯ వ సం॥నం దిమ్మడి మహమ్మదుశాహు మరణానంతరము తెలింగాణమున బహమనీ సుల్తానుల యధికారము క్షీణించెను; విజయనగర సింహాస నాక్రమణోద్యోగమున సాళువ నరసింహుడు నిమగ్నుడై యుండెను; ఈ కారణముల వలన ఒడ్డివారి కడ్డపడజాలినవా రెవ్వరును లేకపోయిరి. పురుషోత్తమ గజపతి సమయమును కూలమై యుండుటను జక్కగ గుర్తించి, క్రీ. శ. ౧౪౭౯-౮౫ వ సంవత్సరమున వినుకొండ పర్యంతము వ్యాప్తమై యుండిన తీరాంధ్రభూమిని జయించి వశపఱచుకొనెను; కాని తీరాంధ్రమునకు దక్షిణద్వార మనదగు నుదయగిరి కైవసమగువఱకు నతని యధికార మచట స్థిరమై నిలుచునను నమ్మక మతనికి గలుగలేదు; కావున కొండవీటి రాజ్యమంతయు స్వాధీనపడిన పిమ్మట పురుషోత్తమ గజపతి దండెత్తివచ్చి యుదయగిరి కోటను ముట్టడించెను. పురుషోత్తము డుదయగిరి నెప్పుడు ముట్టడించెనో నిశ్చయించి చెప్పుటకు వీలుపడక పోయినను, నది క్రీ. శ. ౧౪౭౯ వ సం॥నకు పూర్వము జరిగియుండదు; ఏలనగా సరస్వతీ విలాసములోను, అనంతర తామ్రపట్టికలయందును పురుషోత్తమ గజపతి యుదయగిరిని ముట్టడించినపుడు సాళువ నరసింహుడు కర్ణాటాధిపతి యని చెప్పియున్నది. క్రీ. శ. ౧౪౭౫ వ సం॥ కట్టకడపట సాళువ నరసింహుడు కర్ణాట సింహాసనము నాక్రమించుకొని రాజ్యాభిషేకము జేసికొని యుండుటవలన, పురుషోత్తమ గజపతి యుదయగిరిని ముట్టడించినది క్రీ. శ. ౧౪౭౮ వ సం॥ననో తదనంతరముననో కావలయును గాని తత్పూర్వము గాజాలదు. ఉదయగిరి ముట్టడి జయప్రదముగ కొనసాగినది; ముట్టడికాలమున దుర్గమును సంరక్షించుటకొఱకు వచ్చియుండిన సాళువ నరసింహరాయలు పురుషోత్తమునిచేజిక్కి బందీకృతుడాయెనట; ఉదయగిరి దుర్గమును పురుషోత్తమునికి సమర్పించి విడుమర నందెనట. దీని సత్యాసత్యములను రుజువు సేయగల సాధనాంతరము లింకను లభ్యపడలేదు; సాళువ నరసింహుడు గజపతిచే వాస్తవముగ బందీకృతుడైనను గాకపోయినను, ఉదయగిరి కోలుపోకనుగూర్చి సంశయమున కెడము

లేదు; సాళువ నరసింహుని యనంతర మీ దుర్గము గజపతుల యధీనమందుంటయే దీనికి నిదర్శనము; మఱియు, బోర్బుగీసైతిహాసికుడగు న్యూనిజు సాక్ష్య మీ యభిప్రాయమును బలపఱచుచున్నది. మరణ కాల మాసన్నమగుటచే దనకు రాచూరు, కొండవీడు, ఉదయగిరి దుర్గములను శత్రువులనుండి మరల జయించుటకు సాధ్యము గాకపోయె ననియు, దన యనంతరము రాయసింహాసనము నధిష్ఠించువా రీ మూడుదుర్గముల నెట్లయిన సాధింప వలసిన దనియు, సాళువ నరసింహుడు దన మరణ శాసనమునం దాజ్ఞాపించెనని న్యూనిజు తెలియజేయు చున్నాడు. పురుషోత్తముని యుదయగిరి విజయ మునకు విజయనగర సామ్రాజ్యాంతర్గత రాజకీయ సంక్షోభమే ముఖ్యకారణము.

క్రీ. శ. ౧౪౯౦ వ సంవత్సర ప్రారంభమున సాళువ నరసింహరాయలు దేహము చాలించెను; అతనిపుత్రు లిరువురును స్వయముగ రాజకార్యముల నిర్వహింపజాలని యర్భకులగుటవలన, దన మరణ కాలమున మంత్రియగు నరసానాయకుని బిలిపించి యతనిని వారికి బోషకునిగను సామ్రాజ్య సంరక్షకునిగను నియమించి, పెద్దవారైన పిమ్మట వారిలో నెవ్వడు రాజ్యార్హుడో వానిని గద్దె నెక్కింపవలసిన దని యాజ్ఞాపించి ప్రాణములను విసర్జించెను. సాళువ నరసింహరాయలు విజయనగర సామ్రాజ్య మునకు జేసిన సేవను దగురీతిని ప్రశంసించి పల్కుట సులభసాధ్యముగాదు. స్వామిద్రోహము గావించి సింహాసనమును బలాత్కారముగ గైకొనలేదా యని విచికిత్సాపరులు ప్రశ్న వేయవచ్చును. సాళువ నరసింహుడు సంగమ వంశజులను వెడలనడచి సామ్రాజ్యము నాక్రమించుకొన్న మాట వాస్తవమే; కాని సామ్రాజ్యైక్యమును జెడనీయక నిలబెట్టుటకును, హిందూధర్మ సంరక్షణ నిమిత్త మును దుశ్చరిత్రులైన కడపటి సంగమ వంశజులను వెడలనడచి సింహాసనము నాక్రమించుకొనుట యత్యంతావశ్యక మాయెను. అచట నచట బొడవడు సామ్రాజ్య విచ్ఛేద చిహ్నముల కంటెను, గజపతి బలముకంటెను దరతరముగ ఝుంఝూనిల తరంగములవలె బెల్లుగ బైగొనివచ్చు తురకతండము లతని కెక్కుడు భయంకరములుగ గానవచ్చినవి. కావున, సనాతనధర్మోద్ధారణకొఱకును, గోబ్రాహ్మణ సంరక్షణార్థమును సంస్థాపితమైన రాయ సామ్రాజ్యమును వారిని జేరనీయక తఱుమగొట్టుటయే తనరాజరికమునకు బరమావధియని యతడు నిశ్చయించెను. ఈ కార్యము నెరవేర్చుటకొఱకే సత్వహీనులైన సంగమ వంశజులను వెడలనడచినది. ప్రజసింహాసనము నధిష్ఠించిన పిమ్మట నతడు రాజ్యస్థితియందు గొప్ప మార్పును గలిగించెను. అరబీవర్తకులతో సఖ్యముసెరపి యుత్తమాశ్వ ములను వారియొద్ద విలిచి, యశ్వసైన్యమును జక్కగ నభివృద్ధి గావించెను; అతని వెనుక సామ్రాజ్యపదమునకు వచ్చిన విజయనగర చక్రవర్తుల దైత్రయాత్రలను విజయవంతములుగ గొన సాగించుట కీయశ్వసేన జాల సహకారియైనది. మఱియు శాంతవృత్తిని జీవయాత్రను సాగించు చుండిన జనులను, రణలాలసత గల్గించి శూరుల గావించి మహమ్మదీయుల తోడను నొడ్డెలతోడను రణరంగమున సరిపోరునట్లు, తీర్చెను. సాళువ నరసింహుని కృషికి ఫలితముగ దార్ఢ్యము జెడి శిథిలావస్థ యందుండిన రాజ్యాంగములు సత్వ వంతములైనవి; విచ్ఛిన్నమై పోవుచుండిన రాయ సామ్రాజ్యము పునరుజ్జీవితమైనది.

సాళువ నరసింహుని పుత్రులు

(క్రీ. శ. ౧౪౯౦-౧౫౦౬)

సాళువ నరసింహుని పుత్రు లిరువురు గలరని పూర్వప్రకరణమున జెప్పియున్నది. వారియందు జ్యేష్ఠుడు తిమ్మరాజు; తండ్రికాలమున నితడు యౌవరాజ్యమునకు బట్టాభిషిక్తుడాయెను. కనిష్ఠుని పేరు నరసింహుడు; వజ్రసింహాసనాసీనులైన నరసింహ నామధేయులలో రెండవ వాడగుటచే నితని కిమ్మడి నరసింహు డను పేరు వచ్చినది. మఱియు నితనికి తమ్మ లేక దమ్మరాయ డను నామాంతర్ము గూడ కలదు.

సాళువ నరసింహుడు పరమపదమును బొందినపిమ్మట నతనిచే రాజ్యసంరక్షకుడుగ నియమింపబడిన నరసానాయకుడు రాజపుత్రులలో పెద్దవాడైన తిమ్మరాజును సింహాసనాధిష్ఠితుని గావించి, యతడు స్వయముగ రాజ్యపాలన సేయ నేరని పసిబాలు డగుటచేత రాయలకు బ్రాపై యతని పక్షమున దానే సామ్రాజ్యమును నేలగడ గెను. తిమ్మరాజు రాజ్యకాల మత్యల్పము. సింహాసనము నధిష్ఠించిన పిమ్మట కొన్నిదినములలో నతడు దన ప్రాణము గోల్పోయెను. తిమ్మరాజు మరణ విషయమై చరిత్రకారులందు గొంత యభి ప్రాయభేదము గానవచ్చుచున్నది. పోర్చుగీసు చరిత్రకారుడగు న్యూని జిట్లు వ్రాయుచున్నాడు: "(సాళువ నరసింహ) రాయల మరణానంతరము నరసానాయకుడు రాజ్యమునకు బాలకుడై సత్వరమ రాజకుమారుని సామ్రాజ్య పట్టాభిషిక్తుని గావించెను; కాని భండారమును రాష్ట్రమునుండి చేకూడు నాయమును సమస్తమును దన యధీన మందే యుంచుకొనెను. అప్పుడు నరసానాయ కునికి విద్వేషియగు దండనాయకు డొకడు రాయ లను జంపుటకు నిశ్చయించెను; రాజ్య సంరక్ష కుడుగ నియమింపబడిన నరసానాయకుని యాజ్ఞ చే దానా హత్యను గావించితి నని ప్రకటించిన, రాజ ద్రోహ మొనర్చినందులకై నరసానాయకునికి మరణ దండన కలుగునని యతడు దలచెను. కావున నతడు రాచయూడిగపు వాని కొకనికి లంచమిచ్చి యొకనాటి రాత్రి వాడు రాయలను జంపున ట్లేర్పాటుగావించెను; ఊడిగపువా డాయేర్పాటు ప్రకారము రాయలను కత్తితో నటుకి చంపెను." కాని మహమ్మదీయ చరిత్రకారు డగు ఫెరిష్తా తిమ్మరాజు మరణమును మఱియొక విధముగ వర్ణించియున్నాడు; క్రీ. శ. ౧౬౯౩ వ సంవత్స రమున తిమ్మరాజు (నరసానాయకుడు) ను యూసుఫు ఆదిల్ ఖానుడును యుద్ధమునకు దార సిల్లిరి. యుద్ధ ప్రారంభదశయందె యూసుఫు ఆదిల్ ఖానుని ఫౌజులో దాదాపైదువందలమంది రణక్షేత్రమునకు బలియగుటచే దక్కిన వారు యథాయథలై పాఱిపోయిరి. అప్పుడు నరసా నాయకుని చేజిక్కిన తురకసిపాయి యొకడు తప్పించుకొనిపోయి శత్రువు చూఅయందాసక్తుడై యూదమరచి యున్నాడనియు, నప్పుడతనిపైబడిన జయము కలుగగలదనియు నాదిల్ ఖానునికి దెల్పెను. అంతట యూసుఫు ఆదిల్ ఖానుడు తన సైన్యము లను మరల గూర్చుకొనిపోయి యుద్ధము సేయ గడగెను. తిమ్మరాజు (నరసానాయకు) నకు దన సైన్యముల నన్నిటిని గూర్చుకొనుట కవకాశము లేకపోయినది. కావున నతడేడువేల గుఱ్ఱమును, మూడువందల యేనుగులను, కాల్బల నసల్ప సంఖ్యాకులను రణక్షేత్రమున బారుచేసి పోటు చూపెను; యూసుఫు ఆదిల్ ఖాను డీసైన్యముపై రౌద్రోద్రిక్తుడై పడుటవలన నతని ధాటి కాగజాలక తిమ్మరాజు (నరసానాయకుడు) పాఱిపోయెను. రెండువందల యేనుగులును, వేయి గుఱ్ఱములును, నఱువదిలక్షల హొన్నులును విజయుడైన యాదిలు ఖానునికి హస్తగతమైనవి. యువకుడగు రాయలతో గూడ తిమ్మరాజు (నరసానాయకుడు) విజయ నగరమునకు పాఱిపోయెను; యుద్ధమున దగిలిన గాయముల వల్ల రాయలు మార్గమధ్యమున మృతి నందెను.*

ఈ కథలయందేది సత్యమో తెలియదు; కాని న్యూనిజు ఫెరిష్తా కంటె బూర్వికుడు. నరసా నాయకుని పుత్రుల కాలమున నతడు విజయ నగరమునకు వచ్చి దన చరిత్ర రచనకు వలసిన సాధన సామగ్రిని సేకరించుకొనెను. కావున ఫెరిష్తా వృత్తాంతము కంటె నతని చరిత్రయే ఇచట విశ్వాసపాత్రమని తోచుచున్నది.

---

* దస్తూరుదీనారు ఈ వృత్తాంతమును వేఱొక తీరుగ వర్ణించుచున్నాడు. యూసుఫు ఆదిల్ ఖానుడు యుద్ధమున నోడి సంధి జేసికొనవలయునని నరసానాయకుని ప్రార్థించెను. తాను రాయలకు సామంతుడై కప్పముగట్ట సిద్ధముగ నున్నాడని విన్నవించెను. సంధిషరత్తులను నిశ్చయించుకొనుటకు యుద్ధరంగమున నిరు వాగుల దొరలును సమావేశమైరి. పసివాడగు రాయలును నరసానాయకుడును, నాలుగువందల పరివార మును సమావేశమునకు బోయిరి. ఆకస్మికముగ యూసుఫు ఆదిల్ ఖానుడు వారిపైబడెను; డెబ్బది మంది రాయసామంతులు మడిసిరి. తక్కినవారు చెల్లాచెదరై పాఱిపోయిరి.

ఇమ్మడి నరసింహరాయలు-నరసానాయకుడు

తిమ్మరాజు మృతినందెను; నరసానాయకుని ప్రతిపత్తియొక్క కోరిక ఈడేరలేదు; రాయలు వధింపబడెనను వార్త చెవిసోకగనె నరసానాయకుడు దన శత్రుని యెత్తుగడను గ్రహించి సాళువ నరసింహరాయల ద్వితీయ పుత్రుడగు నిమ్మడి నరసింహుని సింహాసనము నెక్కించి యతని పేర రాజకార్యములను నడుపనారంభించెను. ఇమ్మడి నరసింహరాయల యేలుబడి పదునైదేండ్లు సాగినది; కాని యా పదునైదేండ్లయందును నతని యధికారమొక్కనాడైనను జరుగలేదు; పేరునకుమాత్రమతడు రాయలు; సామ్రాజ్యమునకు వాస్తవమైన యధిపతి రాజ్యసంరక్షకుడైన నరసానాయకుడు; అతడు గతించిన వెనుకగూడ సర్వాధికారమును నతని పుత్రుడిమ్మడి నరసానాయకునికి సంక్రమించినది; సామ్రాజ్యపట్టాభిషిక్తుడైనందుకు ఫలము చిరకాలము కారాగారనివాసము; చివరకు దుర్మరణము. అంతే. కావున సాళువ వంశజుల సామ్రాజ్యాధిపత్యము సాళువ నరసింహరాయల యేలుబడితోడనే తుదముట్టినదని చెప్పవచ్చును.

నరసానాయకుడు వహించిన రాజ్యభార మల్పమైనదికాదు. సాళువ నరసింహరాయలు తాదలపెట్టిన కార్యమును సంపూర్ణముగ నెఱవేర్చి తన వంశజులను సుస్థిరముగ రాజ్యపదమున నెలకొల్పుటకు ముందె కాలగతి నందెను; సామంతులును నాయకులును అతనికి లోబడి వశీకృతులై వర్తించినను, నతని పుత్రుల యాధిపత్యము సంగీకరించి వారికి సంరక్షకుడైన నరసానాయకుని యధికారమునకు లోబడరైరి. మటియు రాయసామ్రాజ్యమందు గడిప్రాంత సీమలను జయించి యచట స్థిరముగ నెలకొనియున్న గజపతి బహమనీ సుల్తానులను దఱుమగొట్టి, కడపటి సంగమవంశజులకాలమున గోల్పోయినరాష్ట్రములను మరల సాధించి స్వాధీనపఱచుకొనవలసి యుండినది. నరసానాయకుడు సామ్రాజ్యమును సంరక్షించిన పదమూడేండ్లయం దతనిచే బరాజితులైన శత్రువు లతని సంతతివారి శాసనములన్నిటి యందును బేర్కొనబడియున్నారు; నరసానాయకుడు గుంతలాధిపతి జిక్కుపడునట్లు విద్యాపురమును గొనెను; చోళుని చేరని పాండ్యుని, మధురావల్లభుడగు మానభూషుని, గజపతిని, కోనేటిరాజును జయించెను; కావేరి కడ్డముగ సేతువునుగట్టి దానిమీదుగ నదిని దాటిపోయి, హొయ్సల భూపాలు నోడించి శ్రీరంగపట్టణమును సాధించెను; మానవ దుర్గమునకు ముట్టడివేసి యాదిల్‌ఖానుని చెఱబట్టెను.

నరసానాయకునిచే నిట్లు నిర్జితులైన శత్రువులు బహిరంతరులను రెండు వర్గములుగ విభక్తులగుచున్నారు. మొదటి వర్గమునకు జెందినవారిద్దరు: (౧) ఆదిల్‌ఖానుడు (౨) గజపతి.

నరసానాయకుని కాదిల్‌ఖానునితో గలిగిన కలహవృత్తాంతమును సంగ్రహముగ నిట్లు చెప్పవచ్చును; బహమనీసుల్తాను ప్రధాన సామంతులలో యాసుఫు ఆదిల్‌ఖాను డొక్కడు; సుల్తాను నాధిపత్యమును నిరాకరించి యతడు క్రీ. శ. ౧౪౮౯ వ సంవత్సరమున స్వాతంత్ర్యమును బ్రకటించి, విజాపురము రాజధానిగ నొక నూతన రాజ్యమును నిర్మించుకొన నారంభించెను; బహమనీ సుల్తాను ప్రధాన మంత్రియగు కాసిం బరీదు తురక యాదిల్‌ఖానుని యభివృద్ధిని గాంచి యెూర్వజాలక కొంకణ దేశపాలకుడైన బహాదూరు గీలానితోడను నరసానాయకునితోడను సఖ్యముగావించుకొని వారి నేకకాలమున నాతని రాజ్యముపైబడి ధ్వంసము సేయ బురికొల్పెను. బహాదూరు గీలాని పశ్చిమమునుండి యాదిల్‌ఖానుని రాజ్యముపై నెత్తివచ్చెను; నరసానాయకుడు దక్షిణమునుండి సైన్యముతో గూడ కృష్ణాతుంగభద్రల యంతర్వేదిని ప్రవేశించి రాయచూరు ముద్గలు దుర్గములను రెంటిని స్వాధీనముజేసికొనెను. ఇరుపార్శ్వములనుండియు నేకకాలమున శత్రువు లెత్తివచ్చి పైబడుటవలన, నాదిల్‌ఖానుడు దన రాజ్యమును సంరక్షించుకొన జాలకపోయెను; కావున కృష్ణా తుంగభద్రల

మధ్యదేశమును నరసానాయకునికిచ్చి యతనితో సంధిజేసికొనెను. నరసానాయకునితో నొడంబడిక కుదిరినపిమ్మట, యూసుఫు ఆదిల్‌ఖానుడు దన దళములన్నిటి నేకముజేసికొని, క్రీ. శ. ౧౪౯౦-౯౧ వ సంవత్సరమున బహదూరు గీలానీనెదిర్చి యుద్ధమున నోడించి తన రాష్ట్రమునుండి వెడల నడచెను; కాలవైపరీత్యమువల్ల గృష్ణాతుంగభద్రల మధ్యదేశమును నరసానాయకునికిచ్చి సంధిజేసి కొనవలసివచ్చినను, యూసుఫు ఆదిల్‌ఖానుడు దానిపైని యాసను విసర్జించుకొనలేదు; సంధి తాత్కాలికమే; అప్పటికష్టము దరించిగట్టెక్కుట కొఱకవలంబించిన సాధనమాత్రమే; కావున నతడు సమయము గనిపెట్టియుండి విజయనగరమునందంతఃకలహములు పొడసూపగనె, యుద్ధము ప్రకటించి సైన్యముతో గూడ కృష్ణాతుంగభద్రల యంతర్వేదిని ప్రవేశించెను; కాని నరసానాయకు డంతలోపల రాజధానియందలి కలహములను సమాధానపెట్టుకొని యాదిల్‌ఖాను నెదుర్చుటకు బలములతో గూడ సత్వరముగ గూచి చేసిపోయెను. ఈ యుద్ధయాత్రయందు జరిగిన సంగరములలో నొకదానియం దాదిల్‌ఖానుడు సంపూర్ణ పరాజయమును బొంది మానువ దుర్గమునకు బాఱిపోయి యచట తల దాచుకొనెను; నరసానాయకు డలసి వెన్నంటి తఱుముచు బోయి యా దుర్గమును ముట్టడించి లోపలివారిని వెలుపలికిని వెలుపలివారిని లోపలికిని బోనీయక యరికట్టెను; ఆదిల్‌ఖానుడు నిజదౌర్బల్యమును శత్రువుయొక్క సలాధికతను గ్రహించి, యుక్తిచేతగాని నతని బాఱదోలుటకు సాధ్యము గాదని నిశ్చయించి, యిమ్మడి నరసింహరాయలకు దాను సామంతుడనై కప్పము గట్టెద ననియు సంధి షరతులను గుదుర్చుకొనుట కొఱకు వన్ను గలిసికొన వలయు ననియు ప్రార్థించెను. అది నిజమకాదలచి నరసానాయకుడు, ఇమ్మడి నరసింహరాయలను దోడ్కొని మూడు నాలుగు పందల దొరలతో గూడ సంధి సమావేశమునకు బోయెను; ఆదిల్‌ఖానుడు సైన్యముతో గూడ నకస్మాత్తుగ వారిపైబడి సఱుక నారంభించెను; గొప్ప దొరలును సామంతులును మడిసిరి; వారి మరణమును విన్నంతనె వారి సైన్యము చెల్లాచెదరై పాఱిపోయినది. నరసానాయకు డిమ్మడి నరసింహరాయలతో గూడ తప్పించుకొని విజయనగరమునకు బోయి చేరెను.* ఆదిల్‌ఖానుడు కృష్ణాతుంగభద్రల మధ్యరాష్ట్రమును సావధానముగ జయించి స్వాధీనపఱచుకొనెను.

(౨) నరసానాయకు డోడించిన గజపతి యెవ్వరో తెలియదు. అతడు సామ్రాజ్యమును సంరక్షించిన పదమూడేండ్లలో (క్రీ. శ. ౧౪౯౦-౧౫౦౩) కళింగరాజ్యముపై నిద్దరు గజపతుల యేలుబడి సాగినది. క్రీ. శ. ౧౪౯౬ పర్యంతము పురుషోత్తమ గజపతి పృథ్వీపరిపాలన సేయుచుండెను. అతడు పరమపదమును బొందిన పిమ్మట నతని పుత్రుడు ప్రతాపరుద్ర గజపతి రాజ్యాభిషిక్తుడై క్రీ. శ. ౧౫౩౯ వఱకును రాజ్యము సేయుచుండెను; కావున పురుషోత్తమ గజపతి రాజ్య చరమదశయందును ప్రతాపరుద్ర గజపతి రాజ్యారంభవర్షములందును నరసానాయకుడు విజయసామ్రాజ్యమునకు రక్షణకర్తయై యుండెను. ఉదయగిరిని లగ్గలువట్టి వశపఱచుకొన్నవెనుక పురుషోత్తమ గజపతి విజయనగరరాయలతో మరల యుద్ధము జేసినట్లగపడదు; కావున నరసానాయకునిచేనోడిపోయిన గజపతియతడై యుండజాలడు. దక్షిణదేశపు రాజులపై ప్రతాపరుద్ర గజపతి దనరాజ్య

---

* (యుద్ధమున గాయపడి రాయలు విజయనగరమునకు బోవుచు మార్గమధ్యమున మృతిగాందెనని ఫెరిష్తా వ్రాసియున్నాడు. ఇది కల్లయనుటకు బలబల కారణములు గలవు. దస్తూరు దీనారు గాని యర్వాచీన మహమ్మదీయ చరిత్రకారులు గాని రాయలు మార్గమధ్యమున గాని మఱియెచ్చట గాని మృతిగాందినట్లు చెప్పరు; మఱియు నీ యంశము క్రీ. శ. ౧౬౫౩ వ సంవున జరిగినట్లు ఫెరిష్తా చెప్పియున్నాడు; ఇది యసంభవము; ఏలన క్రీ. శ. ౧౬౫౩ వ సంవు నుండి ౧౫౦౬ వఱకును ఇమ్మడి నరసింహరాయలు రాజ్యము సేయుచుండినట్లు శాసన సాక్ష్యమువలన రుజువగుచున్నది; గావున ౧౬౫౩ వ సంవున రాయలు మృతుడాయెననుట కల్ల.)

ప్రారంభవర్షములందొక యుద్ధయాత్ర సాగించి నట్లు తెలియుచున్నది. తెలింగాణమునపై దండువెట్టి ప్రాచీన కాకతీయ రాజధానియగు నోరుగల్లు మున్నగు ముఖ్యదుర్గములను మహమ్మదీయులకడ నుండి జయించి వశపఱచుకొనెను. క్రీ. శ. ౧౩౧౦ వ సంవత్సరమున విజయనగరమునపై దండెత్తి గృష్ణాతీరమున విడిసియుండెను. ఈ దండయాత్రనుగూర్చి మఱి యేమియు దెలియరాదు. తుళువరాయల తామ్ర పట్టికలన్నిటియందును నరసానాయకుడు గజపతిని జయించినట్లు చెప్పియుండుటవలన ప్రతాపరుద్రుడే విజయనగరసామ్రాజ్యమునపై నెత్తిపోయి పరాభూతుడై నిజరాజ్యమునకు మరలిపోయెనని తోచుచున్నది.

నరసానాయకునికి పరభూమీశ్వరుల యుపద్రవముకంటె సామ్రాజ్యాంతర్గత వైరివర్గమును నిగ్రహించుటయె కష్టతరముగ దోచెను; వారి సంఖ్య బహుళము: తన స్వామియగు రాయలు మొదలు మంత్రిసామంత దండనాయకులు ఱెక్కండ్రు సామ్రాజ్యమునం దెల్ల యెడలను బర్వుకొని యుండిరి. వీరియందు తిమ్మరసనుమంత్రి ప్రధానుడు. తిమ్మరాజు నూడిగపు వానిచే జంపించి; తానాకార్యమును నరసానాయకుని యాజ్ఞానుసారము జేసితినని ప్రకటించి రాజద్రోహ నేరము నాతనిపై మోప దలపెట్టిన మంత్రియే యీ తిమ్మరుసు; కాని యిమ్మడి నరసింహరాయని గద్దె నెక్కించి నరసానాయకుడా యపనిందను బాపుకొనెనని పూర్వ ప్రకరణమున జెప్పియున్నది. ఇమ్మడి నరసింహరాయలు దన్ను సామ్రాజ్యాభిషిక్తుని జేసినందులకు నరసానాయకునియెడ గృతజ్ఞతను జూపుటకు మారతని ప్రతిస్పర్థియగు తిమ్మరుసునిపై ననుగ్రహము జూపి చేరదీసెను; ఫలన, తనకు రాజ్యము వచ్చుటకు ముఖ్యకారణము తిమ్మరుసుమూలమున నడచిన రాజహత్యయేయని యతని యభిప్రాయము. తత్కారణమువల్ల నరసానాయకునికి విజయనగరముననుండుట శ్రేయస్కరము గాగని తోచెను; కావున నత డొకనాడు వేట మిషమీద రాజధానిని వెలువడి పెనుగొండకు బోయి, దండును గూర్చుకొనివచ్చి విజయనగరమును ముట్టడించెను; ఇమ్మడి నరసింహరాయలు బాలుడు, సత్వహీనుడు; బలసంపన్నుడైన నరసానాయకునె ల్లెదుర్చగలడు? కావున నతడు సంధిని ప్రసాదింప గోరుచు నరసానాయకుని కడకు రాయబారుల నంపెను; తిమ్మరసుని తలగొట్టి పంపిన సంధి కొడబడెదనని నరసానాయకుడు ప్రత్యుత్తర మంపెను. ఇమ్మడి నరసింహు డల్లె తిమ్మరసుని తల దరిగించి యంపెను; నరసానాయకుడు దృప్తినంది మహోత్సాహముతో రాజధానిని ప్రవేశించి యథాపూర్వము రాయలకు పోషణకర్తయు సామ్రాజ్యమునకు రక్షణకర్తయు నాయెను. ఈయుపాఖ్యాన మింతటితో ముగియ లేదు; ఇమ్మడి నరసింహరాయల కవకాశము లభించిన దనకు మరల ముప్పు దేగలడని నరసానాయకుడు గ్రహించి, విజయనగరమున నతని నుండనిచ్చుట మేలుగాదని యెంచి, యతని పెనుగొండ కంపి దుర్గమున బంధించి సామ్రాజ్యమునకు దానె నిజమైన యధిపతియైనట్లు ప్రవర్తింప గడగెను. తరువాత నరసానాయకుడు, దక్షిణ దేశమును పాలించుచుండిన సామంతులను, నమర నాయకులను, దొరలను, దన కాజ్ఞాబద్ధులను గావించుకొనుటకొఱకు దండయాత్ర వెడలవలసి వచ్చినది. సాళువ నరసింహరాయల మరణానంతరము చోళ పాండ్య చేరదేశములను పాలించుచుండిన మండలాధిపతులు స్వతంత్రులైరి. మానభూషుడను చోళవంశజు డొక్కడు మధురయందు దన యధికారమును నెలకొల్పెను; కోనేటి రాజను దొర యొక్కడు కావేరీతీర ద్రావిడదేశము నాక్రమించుకొనెను; అట్లే యుమ్మత్తూరు పాళెగాండ్రానది యుభయతటముల నుండు కన్నడ దేశమును స్వాధీనపఱచుకొనిరి. కావున వీరిని జయించి దన యధికారము క్రిందికి దెచ్చుకొనుట నరసానాయకునికి ముఖ్యకర్తవ్యమాయెను.

నరసానాయకుడు విజయనగరము నుండి దండుతోగూడ తరలెను. మొదట తూర్పుముఖముగ ప్రయాణముజేసి పూర్వ సముద్రతీరమునకు బోయి యచట శత్రువు నోడించెను. ఆ శత్రువు వెవ్వడో యెచటను జెప్పలేదు. గజపతిప్రతాపరుద్రుడైయుండ

వచ్చును. దక్షిణ దిగ్విజయార్థము బయలువెడలి యతడు క్రీ. శ. ౧౩౧౦ సంవత్సరమున కృష్ణాతీరమున విడిసియుండెకదా. ఒకవేళ నతడు తూర్పుతీరమండలి రాయరాష్ట్రము నాక్రమించుటకు ప్రయత్నము సేయగా సరసానాయకు డతని నెదిర్చి పాఱ దోలియుండవచ్చును. తరువాత దక్షిణముఖముగ దిరిగి తీరప్రాంతమున గూచిచేసిపోయి ద్రావిడదేశమును ప్రవేశించెను. కావేరీ తటదేశమును జేరువఱకును నతనికి శత్రువు లడ్డపడలేదు; అచట కోనేటి రాజుతో ఘర్షణగలిగి యుద్ధము పొసగినది; నరసానాయకు డతని రణక్షేత్రమున జిదుగబొడిచెను; అత డేలుచుండిన సీమలను జయించి వశపఱచుకొని విశ్వాసపాత్రులగు ననుచరులను పాలకులుగ నియమించి కావేరిని దాటెను. అచట రాజ్యముసేయుచుండిన ప్రభువు, మరవకుల సంభూతుడు, సరసానాయకుని మార్గము నరికట్టెను; ఘోరయుద్ధము సంప్రాప్తమైనది; రణమున నిహతుడై మరువరాజు సురవధూ మధురాధరములను జూఱగొన మహేంద్రలోకమునకు బోయెను; తరువాత పాండ్యదేశము పై నడచి మధురాపురమును పాలించుచుండిన చోళవంశజుడగు మానభూషు నోడించి యా పట్టణమును స్వాధీనము జేసికొనెను. అటుపిమ్మట రామేశ్వరయాత్ర. ఈ యాత్ర కేగుచుండినపుడేమొ పాండ్యచేర భూపతులను నరసానాయకు డోడించినది. పై బేర్కొనిన విజయముల మూలమున నరసానాయకునికి ద్రావిడ దేశము సర్వమును సంపూర్ణముగ వశపడినది; అతని యధికారము నిర్వక్రముగ సాగ నారంభించినది.

దక్షిణ దిగ్విజయమును జయప్రదముగ తుదముట్టించి నరసానాయకుడు వెనుదిరిగెను; కాని రాజధానికి బోలేదు; దక్షిణ కర్ణాటకమున బలగర్వితులై విజృంభించుచుండిన యుమ్మత్తూరు తలకాడు పాళెగాండ్రను శిక్షించుట యవసరమాయెను; కావున కావేరీ తీరమును జేరినంతటనె పశ్చిమదిశాభిముఖుడై దక్షిణ కర్ణాటముపై గూచివేసెను. ఉమ్మత్తూరు పాళెగాండ్ర బలమంతయు గావేరీ మధ్యస్థములైన జలదుర్గములపై నాధారపడి యుండుట వలన సైన్యమును నదీ తటమున నడపుకొనుచు బోయి శ్రీరంగపట్టణమును జేరెను. వర్షాకాలము; నది యుభయతటములను దాకి యత్యంత వేగముగ ప్రవహించుచుండినది; నదిని దాటి కోటను సమీపించుట దుస్సాధ్యమైన కార్యము; కాని నరసానాయకుడు నిస్పృహుడవలేదు; నది కడ్డముగ సేతువును గట్టించి దానిమీదుగ నేనుగుఱ్ఱములు పాద్యళములను దాటించుకొనిపోయి కోటను ముట్టడించెను. దుర్గాధిపతి హొయ్సలుడు పోటు-మూపెను; కాని లాభము గలుగలేదు; నరసానాయకు డాతని జీవగ్రాహముగ బట్టుకొని బంధించెను. శ్రీరంగపట్టణపతసముతో గర్ణాటక విప్లవకారుల వెన్నెముక విఱిగినది. రాయల యాధిపత్యమున కొప్పుకొని కప్పము గట్ట నీయకొనిరి. అంతట నరసానాయకుడు వారి సీమలయందు వారిని నిలబెట్టి జయోత్సాహమతిశయింపగా విజయనగరమునకు మరలిపోయెను.

సాళువ నరసింహరాయల పుత్రులు పేరునకు మాత్రమే సామ్రాజ్యాధిపతులని యింతకుముందు చెప్పియున్నది; సామ్రాజ్యమున కంతటికిని వాస్తవమైన యధిపతి నరసానాయకుడే. అతడు సామ్రాజ్యమునకు రక్షణకర్త : రాయల సర్వ సేనాధిపతి, మహాప్రధాని, కార్యకర్త. ఇన్ని పదవు లాతనియందొక్కనియందె లగ్నమైనవి; సామ్రాజ్యపాలనయంతయు నాతని యాజ్ఞానుసారమె సడచుచుండినది; కావుననె యతడు దనయజమానులను సరకు సేయక రాజబిరుదములను గ్రహించి వ్రజసింహాసనము నారోహించెను; రాయలను చెఱయం దుంచి సర్వాధికారముల నాక్రమించుకొని సామ్రాజ్యమున కంతటికిని తానె యొడయని వలె పాలింప గడగెను; రాయలను బోలి ప్రజలచే 'స్వామి' యనిపించుకొనెను; కాని బూటకమును సంపూర్ణముగ ద్యజించి, రాయలను దొలగించి యతని పద మాక్రమించుకొనలేదు. సాళువ నరసింహుని బోలి నరసానాయకుడును రాజకీయ పరిస్థితులను బట్టి యధికారము నాక్రమించుకొనుట యావశ్యకమైనది : సాళువ నరసింహు డసంపూర్తిగ జేసియున్న కార్యమును నరసానాయకుడు కొనసాగించెను. దాదాపుగ సామ్రాజ్యము యొక్క పూర్వ సరిహద్దుల వఱకును గల రాష్ట్రమును మరల జయించి స్వాధీనముజేసికొనెను; సంగమ రాజవంశ మంతరించిన పిమ్మట రాయల

యధికారమును ధిక్కరించి స్వతంత్రులైయుండిన సామంతులను జయించి వశంవదులుగ జేసికొనెను; అరాజకజాడ్య వినిర్ముక్తమై రెక్కొనుచుండిన రాయ సంస్థానము నారోగ్యవంతము గావించి, రాజ్యాంగములకు బుష్టినొసగి సామ్రాజ్యమునకు నవయౌవనమును బ్రసాదించెను. నరసానాయకుడు క్రీ. శ. ౧౪౦౩ వ సంవత్సరమున రాయలను సామ్రాజ్యమును దన జ్యేష్ఠ పుత్రుడగు నిమ్మడి నరసానాయకుని కప్పజెప్పి శివసాయుజ్యము నందెను.

ఇమ్మడి నరసింహరాయలు — వీరనరసింహరాయలు (క్రీ. శ. ౧౪౦౩-౧౪౦౬)

నరసానాయకుడు మృతిజెందిన వెనుక నతని పెద్ద కుమారు డిమ్మడి నరసానాయకుడు రాయల కును రాజ్యమునకు రక్షణకర్త యాయెను. ఇమ్మడి నరసింహరాయ లప్పటికి బెద్దవాడై, రాజ కార్యములను స్వయముగ నిర్వహించుకొన శక్తి గలవాడైనను, నూతన రక్షణకర్త తన పదమును విడిచి యజమానుని కతని యధికారముల నొప్ప జెప్పి తన తండ్రిదైన సేనాధిపత్యముతో దృప్తిపడి యుండు సూచన లెవ్వియు గానరావాయె; అట్లు సేయకపోవుటయెకాక, యిమ్మడి నరసింహరాయ లను దొలగద్రోసి రాజ పీఠము దానె యాక్ర మించుకొన నిశ్చయించెను. ఇమ్మడి నరసింహ రాయలు సజీవుడై యుండిన దన యుద్యమము నిరాటంకముగ గొనసాగదని తలచి, స్వామిద్రోహ ముసకు జంకక పెనుగొండ కోటలో నతని జంపించి, వీరనరసింహరాయలను నామము వహించి తానె సామ్రాజ్యమునకు జక్రవర్తి నని ప్రకటించుకొనెను.

ఇమ్మడి నరసింహరాయ లదృష్టహీనుడు; దైవదుర్విపాకము వలన నతడు చిన్ననాటినుండియు గడగండ్ల పాలై తుదకు దుర్మరణము నందవలసి వచ్చెను. తండ్రియు నన్నయు నతడు రాజ్యభారము వహింప సామర్థ్యము జాలని తరుణ వయస్సునందే మృతులగుటవలన, రాజ్య కాంక్షాపరులైన దురధి కారుల చేజిక్కుకొనెను; రాజ్యాభిషేకము వలన నతడు పొందిన లాభమంతయు నిరంతర కారాగార నివాసమును నకాల దుర్మరణము నను నతిశ యోక్తి కాదు. అతనితో సాళువరాయ వంశము తుదముట్టినది; తరువాత తుళువ వంశజులు వజ్ర సింహాసనాధిపత్యము విజయనగర సామ్రాజ్యఖ్యాతిని దశదిశల బ్రసరింప జేసిరి.

తుళువ వంశము

వీరనరసింహరాయలు (క్రీ. శ. ౧౪౦౬-౧౪౦౯)

వీరనరసింహరాయ లైదేండ్లు సామ్రాజ్యాధి పత్యము నొనర్చెను; ఇతని రాజ్యకాలమునందు దేశమం దెల్లయెడల శాంతిచెడి కలతనందియుండి నది. రాయపదము నాక్రమించుకొనుటవలన పెక్కండ్రతో నితనికి విరోధము గల్గినది. సామంత మాండలిక మన్నియల నాయకత్వము క్రింద ప్రజ లితని యాధిపత్యము నొప్పుకొనక తిరుగబడిరి; కాని వీరనరసింహరాయలు వారిని హోరాహోరిగ బోరి లోబఱచుకొని తన సార్వభౌమత్వమును నిలబెట్టు కొనెను. అతని నెదిర్చి పరాభూతులైన శత్రుల నందఱిని పేరు గ్రుచ్చి చెప్పుటకు దగిన సాధనములు లేవు; కాని వారిలో బ్రధానులు మాత్రము శాసనము లందును సమకాలి కాంధ్రగ్రంథము లందును బేర్కొనబడియున్నారు.

మొట్ట మొదట నెన్నదగినవాడాదవని దుర్గా ధీశుడగు కాచప్ప ఉడయుడు. అతడు సాళువ నర సింహరాయల భృత్యుడు; నరసానాయకుని దక్షిణ దిగ్విజయ యాత్రయందు పెక్కుతావుల దన శౌర్య పరాక్రమమాదులను వెల్లడించి కీర్తిని గడించెను. అనంతపురమండలమందలి పెనుగొండ నుండి తుంగ భద్రయొడ్డుననుండు నాదవనిదుర్గము దాక వ్యాప్త మైన రాష్ట్ర మతని యేలుబడిక్రింద నుండినది. కాచప్ప వీరనరసింహరాయలశత్రులలో నెల్ల దుష్ట తముడు; అతనికి స్వతఃబలము చాలదు; మిత్రబలము

వలన నతడు గడుసరి యాయెను. రాయసామ్రాజ్యమునకు బద్ధవిరోధియగు యూసుఫు ఆదిల్ ఖానుని తోడను, రాయపీఠము దమదెయని ప్రకటించి స్వతంత్ర్య రాజ్యస్థాపనోద్యోగనిరతులై యుండు నమ్మత్తూరు పాళెగాండ్ర తోడను, మైత్రి వాటించి యతడు దుస్సాధ్యుడై విజృంభించెను. మానువదుర్గము కడ సరసానాయకుని వంచనచేసి పాఱదోలి నప్పటి నుండియు కృష్ణా తుంగభద్రల మధ్యరాష్ట్రమునంతటిని దన పాలన క్రిందికి దెచ్చుకొనవలయునని ఆదిల్ ఖానుడు సర్వథా ప్రయత్నము సేయుచుండెను. అతనిచే బురికొల్పబడి సుల్తా నిమ్మడి మహమూదు శాహు బహమనీ తన సామంతుల నెల్ల బిలిపించి విజయనగర కాఫరులపై జిహాదు సేయుట యుక్తమని చెప్పి విజయనగరముపై వర్షవర్షమును దండెత్తి పోవుటకు వారి నొడబఱచెను; దీనికి బీదరొడంబడిక యని పేరు. ఈ సమయము ననుసరించి క్రీ. శ. ౧౫౦౮ వ సంవత్సరమున నరసానాయకుని కడపటి యేట మొదటి జిహాదు నడచినది. ఇమ్మడి మహమూదుశాహు కృష్ణాతుంగభద్రల మధ్యరాష్ట్రమును రాయచూరు ముదుగల్లు దుర్గములతోగూడ జయించి యూసుఫు ఆదిల్ ఖానునికి స్వాధీనముజేసి నిజరాజధానికి బోయి చేరెను. మనుష్యరక్తము రుచిగన్న పెద్దపులివలె నాదిల్ ఖానునికి నూతన రాష్ట్రము స్వాధీన పడినప్పటినుండియు రాజ్యకాంక్ష అధికముగాజొచ్చెను; వీరనరసింహరాయలు సామ్రాజ్యము నాక్రమించుకొనుటవలన గలిగిన రాజ్యసంక్షోభ కారణమున నాదిల్ ఖానునికి క్రొత్త రాష్ట్రమును జయించుటకు మంచియవకాశము దొరికినది. ఆదవని దుర్గాధ్యక్షుడగు కాచప్ప యసంతృప్తుడైనట్లు నెఱిగి యతనితో సఖ్యము గుదుర్చుకొని, విజాపురమునుండి దండుతరలిపోయి కందనవోలు దుర్గమునకు ముట్టడి వేసెను. మొట్టమొదట కందనవోలును గైవసము జేసికొని అటుపిమ్మట నాదవానికి బోయి అచట కాచప్ప ఉడయని గలిసికొని యచటినుండి యిద్దఱు నేకీభవించి తుంగభద్రగట్టుననే రాయరాజధానియగు విజయనగరముపై నడచి దానిముట్టడించనలయునని యాదిల్ ఖాను డుద్దేశించినట్లున్నది; కాని యతని యుద్దేశము నెఱవేఱలేదు. వీరనరసింహరాయల యాజ్ఞపై నారవీటి రామరాజును నతని కుమారుడగు దిమ్మరాజును నాదిల్ ఖానునెదిర్చి పరాభూతుని గావించిరి; అతడు చెదరిన తన దండును గూర్చుకొని పశ్చిమాభిముఖుడై పోవుచుండ వెన్నంటి తఱుముచుబోయి తుంగభద్ర యొడ్డున నాదవని చెంత మరల యుద్ధమున జిదుగబొడిచిరి; అంతట నాదిల్ ఖానుడు వారిపరాక్రమమునకు దాళజాలక నిజ రాజ్యమునకు బరారిచిత్తగించెను. అటువెనుక రామ రాజును దిమ్మరాజును నాపవనికి ముట్టడివేసి కాచప్ప ఉడయని సంహరించి దుర్గమును స్వాధీనము జేసి కొనిరి. ఇట్లు ఆరవీటివారిచే దన శత్రులు నిర్మూలు రగుట గని వీరనరసింహరాయలు మిక్కిలియు సంతసించి వారి కాదవని కందనవోలు దుర్గములను రెంటి నమరమున కిచ్చి తిమ్మరాజునకు గండపెండేర మొసగి 'స్వామి ద్రోహరగండ' యను బిరుదమును బ్రసాదించెను.

తరువాత వీరనరసింహరాయలు గర్ణాటతులు మండలములను స్వాధీనపఱచుకొనుటకు ప్రయత్నము సల్పెను; కాని యతనికడక సంపూర్ణముగ ఫలితము గాలేదు. కొన్ని యెడల నతనికి విజయము జేకూడినను మఱికొన్ని యెడల పరాజయము దప్పినది కాదు. ఆద్యమున నత డుమ్మత్తూరుపై నడచి యా కోట నరికట్టెను; కాని యా పాళెగాడు సందీయక పోటు జూపుట వలన మూడు మాసములైన పిమ్మట ముట్టడి లేవదీసికొని పోవలసివచ్చెను; అచటినుండి శ్రీరంగపట్టణమునకు బోయెను; కాని యచట నుమ్మత్తూరు కంటె నత డెక్కువగ నెద్దియు సాధింపజాలక పోయెను; అచట రాజ్యము సేయుచుండిన హొయ్సలేంద్రు డుమ్మత్తూరు తలకాడుల కడనుండి దళమును రప్పించుకొని కోట వెలువడి రాయరాణువయందు దూటి యుద్ధముజేసి యోడించెను. కావున వీరనరసింహరాయలు గర్ణాటమును మరల రాయల యధికారము క్రిందికి దేవలయునని చేసిన ప్రయత్నము వితథమై పోయినది.

కర్ణాటమున జయము జేకుఱకున్నను పశ్చిమ సముద్రతీర దేశముపై వీరనరసింహరాయల దండయాత్ర విజయవంతముగ గొనసాగినది. పడమటి కనుములను దాటి వీరనరసింహరాయలు తుళురాజ్యమును బ్రవేశించి మంగళపురమునకు బోయి అచట

కొంతకాల మాగెను; విజయనగర దండయాత్ర తీరదేశమునందె నిర్నిరోధముగ సాగినది. వారి నెదు ర్కొనజాలక, బలవంతుడైన కలస-కర్క-లాధిపతి యిమ్మడి భైరన ఉడయరు రాజ్యమును విడిచి అడవులలో దల దాచుకొనెను. వీరనరసింహ రాయలు తుళువ దేశమునంతటిని గైవసము గావించుకొని యచటి కరపట్టణముల నన్నిటిని స్వాధీనము జేసికొనెను; కాని యుమ్మత్తూరు శ్రీరంగపట్టములను సాధించి దక్షిణ కర్ణాటకమును దన యధికారము క్రిందికి దెచ్చుకొనజాలక పోయి నందుల కత డత్యంతమైన వ్యథనందెను. కావున విజయనగరమును జేరినప్పటినుండి యుమ్మత్తూరిపై మరల దండు వెడలుటకు ప్రయత్నము సేయ నారం భించెను; కాని యుద్ధ ప్రయత్నములు సంపూర్ణము గాకమునుపే జాడ్యగ్రస్తుడై కాలధర్మమునందెను. అరగొరగ నతడు విడిచిన కార్యమును నిర్వహించు భార మాతని తమ్మునిపై బడినది.

సామ్రాజ్యము నేలిన కొలదికాలమును వీర నరసింహరాయలు నిరంతరము శత్రువులతో బోరు చుండినను, దళముల పోటరితనమును బెంపందించు టకు జాల శ్రమపడెను; అ ర్హత ననుసరించి భటుల నేర్చి సేనానిర్మాణము సేయువిధమునను, వారికి రణశిక్ష గఱపు పద్ధతులందును నతడు గొన్ని మార్పులు జేసెను. అశ్వదళస్థితిని జక్కపెట్టుట కొఱకు భటకులరేవు పట్టణమునకు వైదేశి కాశ్వ వర్తకుల రప్పించి వా రడిగిన వెలలిచ్చి యుత్త మాశ్వములను గొన నారంభించెను. అశ్వ వ్యాపార మంతయు నంతకుపూర్వ మరబీ పారశీ యశ్వ వర్తకులచేత నుండునది. అందాక వారు పెట్టిన భిక్ష : కాని తాను సింహాసనము నెక్కుట కేడెనిమి దేండ్లముందు పశ్చిమైరోపానుండి పోర్చుగీసులు ప్రత్యక్షమైరి. అప్పటినుండియు పశ్చిమ సముద్రాధి పత్యముకొఱకు దేశాంతర వ్యాపారమును సాగించు స్వామ్యాధికారములకొఱకును పోర్చుగీసులకును మహమ్మదీయులకును యుద్ధము ప్రారంభమైనది. పోర్చుగీసు వారీ యుద్ధమున మహమ్మదీయుల నోడించి అంతవఱకు వారు కాణాచిగ ననుభవించు చుండిన అశ్వ వ్యాపారమును నాచికొనిరి. వీర నరసింహరాయల కాలమునం దుభయపక్షముల వారును సరిపోరుచుండిరి; అప్పుడింక నెవ్వరికి విజ యము జేకూడునో నిర్ణయించి చెప్పుటకు వీలు గాకుండెను. సముద్ర యుద్ధమున బోర్చుగీసుల యాధిక్యమును గ్రహించి వారి గవర్నరైన యాల్మెదాకడకు రాయబారుల నంపి యొక యొడంబడికను జేసికొనెను. ఈ యొడంబడిక యొక్క కట్టుబాట్ల ప్రకార మాల్మెదా పోర్చు గీసులు గొనివచ్చు గుఱ్ఱములన్నిటిని రాయలకే విక్రయించుట కొప్పుకొనెను. సైన్యమునకు వలయు గుఱ్ఱములను సమకూర్చు నడతి దారు లిట్లుకుదిరిరి. ఆ యుత్త మాశ్వములను శిక్షించి స్వారిచేయుట కొఱకు జాతిమత భేదములను సరకు సేయక నర్హులైన వారినెల్ల రౌతులుగ నేర్పఱచుకొని యశ్వదళ బలము నభివృద్ధిజేసెను. మఱియు వీరనరసింహ రాయలు దనరాజ్యమందలి ప్రజలను బ్రోత్సాహము జేసి సాముగఱపి యస్త్రవిద్య లందు నిపుణులను గావించెను; తత్కారణమున ప్రజలలో రణలాలసత బెంపందినది. పోటుమానుసులు ప్రశంసాపాత్రులైరి. పందతనము గర్హ్యమాయెను. దేశమున యుద్ధాస క్తి ప్రబలినది. మహమ్మదీయులతో బోరాటమన్న చాలును ; లక్షలకొలది జనులు గయ్యమునకు సంసిద్ధు లగువారు. విజయనగరసామ్రాజ్యమునకు వీరనర సింహరాయ లొనర్చిన యమూల్యసేవ యిదియే.

వీరనరసింహరాయలు గర్షకుల యభ్యుదయ మును గోరు ప్రభువు. వారి కష్టములను శ్రద్ధతో విచారించి స్థితిగతులను జక్కపెట్టువాడు. ప్రజల కష్టభారమును దగ్గించుట కొఱ కతడు పెండ్లి సుంకమును బెక్కుచోట్ల ద్రోసివేసెను; విజయనగర సామ్రాజ్యమున నీ యుద్యమమును దలపెట్టుట కితడే ప్రథముడు; కావున రాజ్యమందంతటను నీ మార్పు నములుకు దే సాహసింపక రెండుమూడు సీమలతో దృప్తినందెను; కాని కృష్ణరాయలకాల మున నీ యుద్యమము ప్రబలి రాయసామ్రాజ్యమం దెల్ల యెడలను బర్వుకొనెను. కాని దీని ప్రారం భించిన కీర్తి వీరనరసింహరాయలకు జెందవలసి యున్నది.

కృష్ణదేవరాయలు

(క్రీ. శ. ౧౫౦౯-౧౫౨౯)

వీరనరసింహరాయలు స్వర్గస్థుడైనపిమ్మట అతని ద్వైమాతురుడగు కృష్ణదేవరాయలు వజ్ర సింహాసనము నధిష్ఠించెను. శకాబ్దము ౧౪౩౭ ప సంవత్సరమున శ్రీజయంతినాడు అనగా క్రీ. శ. ౧౫౦౯ ఆగస్టు ౮ వ తేదీన నతని పట్టాభిషేక మహోత్సవము జరిగెనని విజయనగర సామ్రాజ్యము నందు జెప్పియున్నది. ఇది వాస్తవము గావచ్చును. కాని యతని యధికారము సామ్రాజ్యమునం దెల్ల యెడలను చెల్లుబడికాలేదు. వీరనరసింహరాయలు దనపై ప్రతిఘటించిన సామంత నాయకవర్గమును జయించి వారి యాధిపత్యము క్రింద నుండిన సీమలను స్వాధీనపఱచుకొనెనని చరిత్రకారులు వ్రాసియున్నను, కొందఱు పాళె గాండ్రింకను రాయలను ధిక్కరించియేయుండిరి. మఱియు రాయల యేలుబడిక్రింది రాష్ట్రమునందు గూడ నతని యాజ్ఞ నిర్వ్యాజముగ సాగక యుండెను; అమరనాయకులు రాయల యాజ్ఞను శిరసాహింపక పలుమారు యథేచ్ఛగ వర్తించుచుండిరి; వారిని దగురీతిని శిక్షించి రాయల యాజ్ఞ నమలుకు దెచ్చుటకు కేంద్రప్రభుత్వమునకు శక్తి చాలదాయె. సామ్రాజ్యమంతటి స్థితిగతు లివి. వానికిదోడు రాయరాష్ట్రము నాక్రమించుకొని సుస్థిరులై యుండిన పరదేశ ప్రభువుల నోడించి తఱిమివేసి నష్టమైపోయిన సామ్రాజ్య భాగములను మరల జయించి స్వాధీనపఱచుకొనవలసి యుండెను. తీరాంధ్రమంతయు గజపతి క్రిందనుండెను; గజపతి ప్రతాపరుద్రుడు క్రీ. శ. ౧౫౦౯ లో విజయనగర ముపై నెత్తివచ్చి సామ్రాజ్యసంరక్షకులైన నరసానాయకునిచే పరభూతుడై పోయెనని పూర్వ ప్రకరణమున చెప్పియున్నదికదా. కాని యత డంతటితో తన పూనికను మానుకొనలేదు. వీరనరసింహరాయల కాలమున విజయనగర సామ్రాజ్యమున ప్రబలిన సామంతుల యాందోళన తన యుద్యమమున కనుకూలింపగా మరల దండెత్తి వచ్చెను. అతనిని ప్రతిఘటించుభారము కృష్ణదేవరాయలపై బడినట్లున్నది. ఇదియే గజపతి దళములతో సతని ప్రథమ సంఘట్టనము. ఈ యుద్ధమును గూర్చిన విశేషాంశము లెవ్వియు దెలియరాకున్నను గృష్ణరాయనికి జయము చేకురె నని యతడు నిజరాజ్యాభిషేక సమయమున హంపీ విరూపాక్షాలయమున వ్రాయించి నెలకొల్పిన శిలా శాసనములోని 'గజపతి గజకూటపాకలేక' యను వాక్యనువలన దెలియవచ్చుచున్నది. బహమనీ రాజ్య ముత్సన్నమైపోయినను, ఉత్తర దిక్కున మహమ్మదీయుల యొత్తిడి తగ్గలేదు; బహమనీ రాజ్య మునుండి యుత్పన్నమైన నూతన సంస్థానముల పాలకులు విజయనగర రాష్ట్రమును జయించి తన్మూలమున దమ రాజ్యవైశాల్యమును బెంపొందింప నెడతెగక ప్రయత్నము సల్పుచుండిరి. వారిలో ముఖ్యుడు బీజాపుర సంస్థానస్థాపకుడగు యూసుఫు ఆదిల్ ఖానుడు. ఇతనినే సమకాలికాంధ్ర గ్రంథకర్తలు సవాయియనియు సపాదుడనియు బేరొక్కనిరి. ఇతడు రాయరాష్ట్రమునాక్రమించు కొనుటకు గట్టి ప్రయత్నములు సేయుచుండెను. గోలొక్కండ ప్రభువు కుతుపు-ఉల్-ముల్కు గూడ రాయరాష్ట్రముపై గన్నువేసి సమయమనుకూలపడినపుడెల్ల దండయాత్రలు సాగింపుచుండెను. మఱియు క్రీ. శ. ౧౫ వ శతాబ్దాంతమున వర్తకము కొఱకు దక్షిణ భారతదేశమునకు వచ్చిన పాశ్చాత్య పోర్చుగీసులు క్రమక్రమముగ పశ్చిమ సముద్రతీరమందలి కరపట్టణముల నాక్రమించు కొని ప్రబల మొచ్చిరి. పోర్చుగీసులు సామాన్యముగ రాయలతో మైత్రి నెఱపి వర్తిలుచుండినను, గాదాచిత్కముగ వైరస్యము జూపుచుండిరి. కావున గృష్ణదేవరాయలు సామ్రాజ్యమును పాలించిన ఇరువదేండ్లును నెవ్వడైననొక శత్రునితో బోరాడవలసి వచ్చెను.

ఇరుగుపొరుగు రాజ్యములవారు సుహృద్భావమును వీడి కయ్యమునకు గాలుద్రవ్వుచుండ సామంతులును నమరనాయకులును రాజద్రోహమున దలపెట్టి విముఖులై స్వతంత్రులగుటకు ప్రయత్నములొనర్చుచుండిరి. రాయలకనతులై స్వతంత్రరాజ్యమునకు పునాదులువేయ సమకట్టిన

వారిలో నుమ్మత్తూరు శివనసముద్రప్రభువులును వీరికనుయాయులైన కర్ణాటనాయకులును నగ్రగణ్యులు. వీరి తిరుగుబాటు వీరనరసింహరాయల నాడు ప్రారంభమైనది. వీరినణగగొట్టుట కత డొనర్చిన ప్రయత్నము విఫలమగుట పూర్వప్రకరణమున వివరింపబడియున్నదికదా. కావున కృష్ణదేవరాయలకు వీరిని జయించి దక్షిణకర్ణాటక రాజ్యమును దన యేలుబడిక్రిందికి తెచ్చుకొనుట ప్రథమకర్తవ్యమాయెను. కాని యీకార్యమును జయవంతముగ కొనసాగించుటకు తగినసైన్యము గావలసియుండెను. కృష్ణరాయ లారితేరిన యోధుడు, నేర్పరియైన దండనాయకుడు. శత్రువులను పోరిజయించవలయుననిన ప్రచండసైన్యము లేక యీ కార్యము దుస్సాధ్యమని యతడెరుగును. అప్పటి విజయనగర స్థితిగతులంత తృప్తికరముగ నుండలేదు. రాయరాణువ కైజీత బలమనియు సమరనాయకదళములని ద్వివిధములుగ విభక్తమై యుండెడిది. స్వయమురాయల యాధిపత్యము క్రిందనుండి రాయభండారమునుండి వేతనమును గొని యుద్ధకార్యములందు నియుక్తమైయుండిన సేనకు కైజీతబలమనిపేరు. నాయంకరనియమముల ననుసరించి యమరనాయకులచే సమకూర్పబడి అనసరమైనపుడు వారి యాధిపత్యముక్రింద రాయల పక్షమున నడచు సేనలకు అమరనాయకదళమనిపేరు. ఉభయవర్గముల సేనలకును రాయలే ప్రధానాయకుడు. అతని యాజ్ఞానుసారమె సమస్త యుద్ధకార్యములు నడచెడివి. ఇమ్మడి నరసింహరాయలను జంపించి వీరనరసింహరాయలు సింహాసనము నాక్రమించుకొనిన పిమ్మట రాజ్యమున గలిగిన అంతఃకలహములవలన రాయరాణువ సన్నగిలెను. దానిని మరల బలపఱచుటకు వలసిన ధనము భండారమున లేకపోవుటవలన సైన్యము నభివృద్ధిసేయుటయెట్లు? అనునది యొక గొప్ప సమస్యగ పరిణామమై సమాధానమును గోరు చుండెను. కృష్ణదేవరాయలీ విషయమును మంత్రివర్గముతో చర్చించి ప్రధానమహామాత్యుడైన సాళువ తిమ్మరుసయ్య సలహాచొప్పున సులభముగ నావిషయము నిట్లు తీరుమానము గావించెను: నాయంకర నిబంధనల ప్రకారము అమరనాయకులు ప్రతి వర్షమును రాయలకు దామియ్యవలసిన కప్పమును కొన్నియేండ్లనుండియు జెల్లించకుండినందున వారు రాయభండారమునకు ఋణపడియుండిరి. సాళువ తిమ్మరుసయ్య యమరనాయకుల కవిలియలదెప్పించి లెక్కలు చూచి యెవ్వరెవ్వరు ఎంతెంతసొమ్మును రాయభండారమున కీయవలసియుండెనో నిర్ధారణచేసి తఱుణమాసొమ్మును చెల్లించవలసినదనియు నట్లు బాకీనిచెల్లించుటకువలసిన ధనము సిద్ధముగలేనివారలు తమ కొలువునందుండిన గజాశ్వ పదాతివర్గమునకు వెలలుకట్టి రాయల వారికి స్వాధీనముజేయవచ్చుననియు నిరూపములనంపెను. తమపై నిలువయున్న కప్పమును చెల్లించుటకు వలసినధనము తమయొద్ద లేకపోవుట వలన నమరనాయకులు దాని ప్రత్యామ్నాయముగ తమ కొలువునందున్న 'యేనుగగుర్రాలు రావుత్తులు కావుత్తులు బంటు పరిజనములను' రాయలవారికి స్వాధీనపఱచిరి. మఱియు రాయలవారు 'యేవేళ రాచకార్యానకు ఉద్యుక్తులై కదలుదురు' అనిన్ని చిత్తంవచ్చినప్పుడు గణితిపెట్ట ఉత్తర్వు యిచ్చి వారు యిచ్చిగణితిపెట్టినప్పటికిన్ని, నగరిలెక్కకన్నా పదేసియేనుగులున్నూ నూరేసిగుర్రాలున్నూ వెయ్యి మనిషిబంట్లున్ను సంతరించినాము. స్వామివారి సొమ్ము యిన్నాళ్లు ప్రసాబడ్డందుకు నగరి అవసర కార్యాలకు చిత్తం రాసడిచే వారమైయున్నాము' అని మనవిచేసిరి. ఇట్లు సైన్యమును సమకూర్చుకొని కృష్ణరాయలు శత్రు నిఘాదనమునకు సంసిద్ధుడాయెను.

రాజ్యాభిషేకము పడి మేనిపై నాఱవయు నాఱక మునుపే కృష్ణదేవరాయలకు పర భూమీశ్వరులతో యుద్ధము గలిగినది. క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరమున ప్రాయించిన రాయల హంపిశాసనమున సుల్తాను గజపతుల నిరువుర నతడోడించినట్లు చెప్పియున్నది; దీని సత్యము కొంతవఱకు 'అఫ్ఫాన్సో అల్బూకెర్కు కామెంటరీ' సను సమకాలిక పోర్చుగీసు గ్రంథము వలన రుజువగుచున్నది. అతడు క్రీ. శ. ౧౫౧౦ వ సంవత్సరమున దక్కను సుల్తానుతో యుద్ధము సేయుచుండెనని ప్రాసియున్నాడు. దక్కను

సుల్తానుతోడి యుద్ధమును గృష్ణరాయలు కోరి తెచ్చిపెట్టుకొన్నది కాదు. బీదరు ఒడంబడికె ప్రకారము సుల్తాను ఇమ్మడి మహమూదుశాహు ప్రాయశః యూసుఫు ఆదిల్ ఖానునిచే ప్రేరితుడై, క్రీ. శ. ౧౫౧౮ వ సంవత్సరాంతమున విజయ నగర కాఫరులపై జిహాదు ప్రకటించెను. పేరున కింకను నాతని యాధిపత్యము నంగీకరించి యుండిన యమిరోమ్రాలు మున్నగు సర్దారులెల్ల నతనిగూడి దండయాత్రకు సంసిద్ధులైరి.

బహమనీ సుల్తాను బృహత్సేనా సమేతుడై విజయనగర సామ్రాజ్యముపై దండయాత్ర వెడలెను. అతనితో గూడ మల్లిక్ అహమదు భైరీ, నూరీఖాన్ ఖ్వాజా-ఇ-జహాను, ఆదిల్ ఖాను, కుతుబ్-ఉల్-ముల్కు, దస్తూరీ మమాలికు, మిర్జా లుత్ఫుల్లా మొదలగు సుప్రసిద్ధులగు నమీరులును, సర్దారులును, దొరలును బెక్కండ్రుగూడ యుద్ధమునకు నడచిరి. విజయనగర గడిప్రదేశమం దుండు దోని యను స్థలమును జేరునప్పటికి రాయ రాణువ వారి కడ్డపడి మార్గము నరికట్టెను. భయంకర రణము సంప్రాప్తమైనది. మహమ్మ దీయులు ఘన పరాజయమును బొందిరి; సుల్తాను నకు బలమైన గాయములు దగిలినవి; అమీరులు సర్దారులు మున్నగు నతని అనుచరులు, జయో త్సాహముతో నుప్పొంగి పైకొను హిందూభటుల ధాటి కాగజాలక వెన్నిచ్చి కోవెలకొండ దుర్గము వైపు బఱువిడ నారంభించిరి; కాని కృష్ణరాయ లంతట ధర్మధార బట్టించి యుద్ధము మానుకొన లేదు; పాఱిపోవుచుండు తురకదండును వెన్నంటి తఱుమ నారంభించెను; కోవెలకొండ పరిసరముల జేరగనే బహమనీ దళములు వెనుదిరిగి పోటు చూపినవి. మఱియొకమారు యుద్ధమారంభ మైనది; మరల జయలక్ష్మి రాయరాణువనే వరించినది. దోనియుద్ధము కంటె గోవిలకొండ రణము వలన దురకల కెక్కువ హాని కలిగినది; నిజస్వతంత్రమును ప్రకటించినప్పటి నుండియు రాయసామ్రాజ్యమును జయింప నెడతెగక ప్రయత్నములు సల్పుచుండిన యూసుఫు ఆదిల్ ఖానుడు కోవెలకొండ రణక్షేత్రమున నిహతుడై వీరస్వర్గమును జూఱగొనెను; అతనిచే స్థాపితమైన విజాపుర సంస్థానము ప్రారంభదశయందె భీభత్సె కలతనందెను.

పై బేర్కొన్న రణక్షేత్రములందు తురకలను నిర్జించి విజయుడై కృష్ణదేవరాయలు విజయ నగరమునకు మరలిపోయినను బహమనీ రాజ్యము తోడి యుద్ధమంతట సమాప్తము గాలేదు. యూసుఫు ఆదిల్ ఖానుడు మృతినందిన పిమ్మట, నతనిపుత్రుడిస్మాయీల్ ఆదిల్ ఖానుడు సంస్థా నాధిపతి యయెను; ఇస్మాయీలు బాలుడు; రాజ్యకార్యముల నతడు స్వయముగ నిర్వహించు టకు శక్తి చాలనందున, నతని తండ్రికడ సేనాధ్యక్షుడై యుండిన కమాలుఖానుడు విజా పుర రాజ్యమునకు సంరక్షకు డాయెను; తన యజమానుడగు యూసుఫు ఆదిల్ ఖానుని రాజ్య విస్తారణ పద్ధతుల ననుసరించి కమాలుఖాను డిరుగుపొరుగు రాజ్యముల నాక్రమింపగడగెను. ప్రప్రథమమున బహమనీ సుల్తానుల ప్రాచీన రాజధానియైన కలుబరిగె యతనిదృష్టి నాక ర్షించినది. అది యప్పుడు మల్లికు దస్తూరు దీనా రను హబీసీ సర్దారుని యాధిపత్యముక్రింద నుండినది. విజాపుర సేనలతో గదలిపోయి కమాలుఖానుడు కలుబరిగె కోటను ముట్టడించెను; అతనిధాటి కాగజాలక దీనారు కలుబరిగెను ద్యజించి బీదరుకు పాఱిపోయి సుల్తాను ఇమ్మడి మహమూదుశాహునకు ప్రధానమంత్రియైన బరీద్-ఇ-మమాలికు నాశ్రయించెను; ఏలన పేరునకు ఇమ్మడి మహమూదుశాహే సుల్తానైనను, బీదరు రాజ్యమునకు వాస్తవమైన యధిపతి బరీదు; రాజ్యమందలి సర్వాధికారములును నతనియందే లగ్నమైయుండినవి. సుల్తా నతని చేతి జంత్రపు బొమ్మ. దీనారువచ్చి యాశ్రయింపగనె బరీ దాతని కభయహస్తమిచ్చి, సేనల గూర్చుకొని, సుల్తాను దనతోగూడ దోడ్కొని కలుబరిగెపై నెత్తిచనెను; కాని యతడు కమాలుఖానునిచే రణరంగమున నిర్జితుడై పాఱిపోయెను; సుల్తా నిమ్మడి మహ మూదుశాహు కమాలుని చేజిక్కెను; బరీదును జయించినపిమ్మట కమాలుఖానుడు బీదరుపైనడచి

యాపట్టణమును సాధించి దుర్గమును లగులువట్టి స్వాధీనపఱచుకొనెను. ఇమ్మడి మహామూదు శాహును బీదరు దుర్గమున నతని మందిరమునందే చెఱయుంచి, యజ్మత్-ఉల్-ముల్క-ను సరదారు నతనిపై గాపుంచెను. బీదరి ట్లాదిల్ ఖానునికి హస్తగత మగుటవలన నతని బలము హెచ్చినది; అందువలన బహమనీ సామంతు లందఱికిని భయము గలిగినది; ఆదిల్ ఖానుని యధికార బలము లభిసృద్ధి నందిన, నతడు క్రమక్రమముగ బహమనీరాజ్యము నంతటి నాక్రమించి తమ స్వాతంత్ర్యమునకు ముప్పు దేగలడని వారు తలచిరి; కావున మల్లిక్ అహమదు భైరీ, కుతుబ్-ఉల్-ముల్క-, బరీద్-ఇ-మమాలికు, దస్తూరుదీనారు మొదలగు దొర లాదిల్ ఖానుని యధికారమును గూలద్రోయ నేక మైరి. ఆరంభమున వారి యుద్యమము జయ ప్రదముగ సాగినది. బీదరు వారికి గైవసమైనది; కలుబరిగెయు హస్తగతమైనది; సుల్తాను ఆదిల్ ఖానుని చెఱనుండి విముక్తుడాయెను; కాని చివ రకు వారు కమాల్ ఖానునిచే నిర్జితులై యాదిల్ ఖానుని రాష్ట్రమును జయింప దలపెట్టిన కార్య మును మానుకొని యెవ్వరి స్థానమునకు వారేగిరి. విజాపుర రాజ్యమును జయింప నేకమై పచ్చిన శత్రుసమూహము నెదిర్చి పాఱదోలి నందువలన కమాలుఖానుని కీర్తిప్రతిష్ఠ లతిశయించెను; అతని హృదయమున దురాశపొడమి రాజద్రోహచింత యంకురించెను; కావున నతడు ఇస్మాయీ లాదిల్ ఖానుని రాజకుటుంబముతో గూడ చెఱవెట్టి సింహాసనము నాక్రమించుకొనుటకు సమకట్టెను; కాని రాజమాతయొక్క కుట్రచే ప్రాణమును గోల్పోయెను. కమాలుని వధ వలన నిస్మాయీ లాదిల్ ఖానుడు విముక్తుడై స్వయముగ రాజ్యాధి పత్యమును వహించినను నతని యధికారము నిరా టంకముగ సాగలేదు. రాజ్యమునం దసంతృప్తి ప్రబలియుండెను. కమాలుఖానుడుజాతిచేపారశీకుడు; ఆదిల్ ఖానుని కొలువునందుండిన పారశీక ఖురాసాని మహమ్మదీయ సర్దారులకెల్ల నాయకుడు; రాజ మాత కుట్రచేసి యతని జంపించుట వలన వారు ఇస్మాయీ లాదిల్ఖానునెడ విముఖులై యతని యాధిపత్యము నంగీకరింపక రాజద్రోహమును జింతింప నారంభించిరి. విజాపుర రాజ్యమిట్లు కలత నంది యుండుటను గని యదియె కృష్ణా తుంగ భద్రల మధ్యదేశమును జయించి స్వాధీనపఱచు కొనుట కనుకూలమైన సమయమని గుర్తించి కృష్ణ దేవరాయలు దండెత్తిపోయి రాయచూరు మున్నగు దుర్గములను సాధించి దేశమును స్వాధీన పఱచుకొనెను; తరువాత కలుబరిగెపై నెత్తిపోయి బరీద్-ఇ-మమాలికును యుద్ధమున నోడించి కోటను గైవశము గావించుకొనెను; తదనంతరము బరీదును వెన్నంటి తఱుముచుబోయి బీదరుకడ మఱియొక పర్యాయ మతని నిర్జించి పట్టణమును బట్టుకొనెను. కృష్ణదేవరాయ లంతట నిమ్మడిమహామూదు శాహును సింహాసనముపై ప్రతిష్ఠించి, రాజ్యమును మరల నతనికొసగి యవనరాజ్యప్రతిష్ఠాపనాచార్య యను బిరుదును వహించెను. ఇమ్మడి మహామూదు శాహును గృష్ణరాయలు వినోదముకొఱకు సింహా సనముపై నెక్కించి యాతని రాజ్యమందు పునఃప్రతిష్ఠితుని గావింపలేదు; రాయలు గొప్ప రాజ్య తంత్ర మర్మజ్ఞుడు; మహమూదుశాహును బరీదు బారినుండి తప్పించి రాజ్యాధిపత్యమును మరల నతనికి గైవసము జేసినందుకు గారణము లేక పోలేదు. ఎంతటి సత్వహీనుడైనను బహమనీసుల్తా నొకడు తఖ్తుపైనున్నంత కాలమును బహమనీ సామంతులకు సంపూర్ణ స్వాతంత్ర్యము లభింపదు; మఱియు సుల్తానును వశపఱచుకొని యతని పేర దక్కనుపై దమ యధికారమును సాగించుటకొఱకు వారి కొండొరులతో బోరాట తప్పదు. అంతఃకలహములయందు నిమగ్నులై యుండునంత కాలమును మహమ్మదీయులకు విజయనగరముపై నెత్తిరాగల శక్తియుండదు; కావున కృష్ణదేవ రాయ లిమ్మడి మహామూదుశాహు నతని రాజ్య మున బునఃప్రతిష్ఠించి తురకలపై దండయాత్రను సాలించి విజయనగరమునకు మరలిపోయెను.

ఉమ్మత్తూరు:— ఉత్తర దిక్కున మహా మ్మదీయులపై దండయాత్ర సాగించుకాలమునసె కృష్ణరాయలు దక్షిణమున నుమ్మత్తూరు పాళె గాండ్రను జయించుటకొఱ కొక సైన్యము నంపెను. సింహాసనము నెక్కినపిమ్మట నొక్క

సంవత్సరకాలము కృష్ణరాయలు సేనలను గూర్చు కొనుచు విజయనగరమున నుండెననియు, నేండ్ల కొలదియు నమరనాయకులు జెల్లింపక యప్పు పెట్టియుండిన కప్పమునకుమారు దమయొద్దనున్న యేనుగ గుజ్జము కాల్బలమును రాయలకు హవాలాచేసినపిమ్మట ఉమ్మత్తూరుపై దండు వెడలెననియు రాయవాచక కృష్ణరాయ విజయములందు చెప్పియున్నది. ఉమ్మత్తూరు పాళెగాని బలమంతయు నుమ్మత్తూరు శివనసముద్ర దుర్గములపై నాధారపడి యుండినది. అప్పుడా దుర్గమును బాలించుచుండిన గంగరాజు కృష్ణ రాయలు దనపై దండెత్తిరాగలడని యూహించి, శివనసముద్ర జలదుర్గమును దనకు ముఖ్య స్థానముగ జేసికొని కోట కొత్తళములను బాగుపఱచి దళముల గూర్చి, ఫిరంగులు మొదలైన అగ్నేయాయుధ విశేషములను బురుజులపై నెక్కించి యుద్ధ సన్నద్ధుడై రాయరాణువ రాకను బ్రతీక్షించు చుండెను.

ఉమ్మత్తూరు దండయాత్ర రెండేండ్లకాలము సాగినది. మొట్టమొదట కృష్ణరాయలుమ్మత్తూరు దుర్గమును ముట్టడించి దానిని నేలమట్టమునకు జదను గావించెను. తరువాత శివనసముద్రముపై నడచెను; కాని యా దుర్గమంత సులభముగ పశపడ లేదు. ఒక సంవత్సరమంతయు బోరాట నడచినది; తుదకు కృష్ణరాయ లా దుర్గమును సంపూర్ణముగ నరికట్టెను; కోటలోనివారికి బహిఃప్రపంచముతో సంబంధము లేకపోయినది; వెలుపలినుంచి కోటలోని కెవ్వరికిని ప్రవేశము లేకపోయినది. గంగరాజునకు రాయలను నివ్వారించు శక్తి సమసిపోయినది; నిలు పోపక నతడు నదీమార్గమున పాటిపోవుచుండ నొక మడువునబడి మునిగిపోయెను. అంతట శివన సముద్రము కృష్ణరాయలకు హస్తగతమైనది. ఉమ్మత్తూరు దుర్గమును బోలె శివనసముద్రమును ధ్వంసముజేసి యచటినుండి శ్రీరంగపట్టణమునకు బోయి దానిని వశము జేసికొనెను. శత్రువుల యేలుబడిక్రింద నుండిన రాష్ట్రమును సర్వమును జయించి, శ్రీరంగపట్టణము ప్రధాన స్థానముగ నొక నూతన రాజ్యమును నిర్మించి విశ్వాసపాత్రు లగు నధికారుల కారాజ్య పరిపాలన నప్పగించి కృష్ణదేవరాయలు జయజయధ్వానములు సెలగ మహావైభవముతో విజయనగరమునకు బోయి చేరెను.

కాళింగమర్దనము :— కృష్ణదేవరాయలు సామ్రాజ్యపదమున సుప్రతిష్ఠితుడాయెను; బహ మనీయులపై విజయములపలన తురకల యాటో పముడిందుపడినది. సుల్తాను బలము భగ్నమైనది; వీరోద్రగుండగు నాదిల్ఖానుని ప్రతాపము సన్న గిలినది; తుళువపంశజులతో ప్రతిఘటించి దక్షిణ కర్ణాటకమున స్వతంత్రరాజ్య స్థాపనకు అస్థిభారము వేసిన ఉమ్మత్తూరు పాళెగాండ్రు నిర్మూలమైపోయిరి. అంతశ్శత్రుభయము దొలగిపోయినది; ఇక కృష్ణ దేవరాయలు సాధింపవలసిన శత్రులలో గజపతి యొక్కడే మిగిలియుండెను; గజపతి ప్రతాప రుద్రుడు ప్రబలుడు; పెక్కు సమరములయందు శత్రునిషూదన మొనర్చి కీర్తిబొందిన శూరా గ్రేసరుడు; గంగా, పినాకినీ మధ్యస్థ పూర్వ సముద్రతీర దేశమునకధిపతి; అతని బలిమికలుముల యాధిక్యమును విశేషించి వర్ణించి చెప్పుటకు దరముగాదు. అశ్వపాయదళముల మాటనటుండ నిచ్చి, గజపతియొక్క గజబలము భరతఖండమున సుప్రసిద్ధి జెందినది. కావున కృష్ణదేవరాయలు దలపెట్టిన యుద్యమము సులభసాధ్యముగాదు.

కృష్ణరాయల కళింగ విజిగీషకు పెక్కుకారణ ములు గలవు. సంగమవంశజులనాటియుండియు వరతరమభివృద్ధియై వచ్చుచుండిన వైరమొకటి; విజయనగర సామ్రాజ్యాంతర్గతములైన యుదయ గిరి కొండవీటి మండలములను రెంటిని గజపతులు జయించి తమ రాజ్యమున గలుపుకొనియుండిరి; కృష్ణరాయలకు ముందు వ్రజసింహాసనాధిష్ఠితులైన రాయలెవ్వరును వానిని మరల స్వాధీనపఱచుకొన జాలకయుండిరి. సాళువ నరసింహరాయల మరణ శాసనము మజీయొక కారణము. అతడు రాయ సామ్రాజ్యమునకు జెందియుండిన యుదయగిరి కొండవీడు రాయచూరు దుర్గములను దనయసంత రము రాయపదము నధిష్ఠించువారు జయించి

వశపఱచుకొనవలసినదని యాదేశించి యుండెను. కృష్ణదేవరాయలు మహమ్మదీయులను జయించి రాయచూరు దుర్గమును గైవసము జేసికొనెను; తక్కిన రెండు దుర్గములును గజపతి యధీనమందుండినవి. కావున గజపతితో సమరము కృష్ణరాయల కవశ్యము కర్తవ్యమాయెను.

కృష్ణదేవరాయల కళింగ జైత్రయాత్రయందు రెండు ముఖ్యఘట్టములు గలవు. మొదటి ఘట్ట ముదయగిరి విజయముతో ముగిసినది. క్రీ. శ. ౧౫౧౩ వ సంవత్సరము జనవరి మాసమున కృష్ణరాయలు వెలిగుడారము వేసి విజయనగరమునుండి దండు వెడలిపోయి యుదయగిరిని ముట్టడించెను; ముట్టడి పదునెనిమిది మాసములు సాగినది. ప్రతాపరుద్ర గజపతి పినతండ్రి యగు తిరుమల రాహుత్త రాయలు దుర్గమును నేర్పుతో సంరక్షించుచు విజయనగర దళములను కోటగోడలను జేరనీయక దఱుమగొట్టుచుండెను; కాని రాయ సైన్యములు దుర్గమును విడిచిపోక ముసరుకొనుచుండినవి. రానురాను దుర్గ సంరక్షకుల స్థితి దుర్భరమగుచు వచ్చినది; ఆహార పదార్థములు దుర్లభము గాజొచ్చినవి. వారి స్థితిని దెలిసికొని ప్రతాపరుద్రగజపతి ముట్టడిని బాపుటకై పెద్ద సైన్యముతో నెత్తివచ్చెను; కాని కృష్ణరాయలతని నెదిర్చి యుద్ధమున బరాభూతుని గావించి కొండవీటి పర్యంతము దఱుముకొనుచు బోయి మరలివచ్చి యుదయగిరి జేరెను; ముట్టడి మునుపటికంటె నెక్కు డౌద్ధత్యముతో నడువ సాగినది. కోటచుట్టును కృష్ణదేవరాయలు వేణత వెట్టించెను.* బండలను గొండలను ఇడియ గొట్టించి తన భటులు కోటగోడలను నిరాటంకముగ జేరి లగ్గలు పట్టుట కనుకూలమగునట్లు విశాల మార్గములను నిర్మించెను. తిరుమల రాహుత్త రాయని కిక కోటను సంరక్షించుటకు సాధ్యము గాకపోయెను; విజయనగర సేనలు నేల యీనిసట్లు ప్రబలి యన్నివైపుల కోటగోడలెక్కి లోపల ప్రవేశించినవి, ఒడ్డెవారు పోటుజూపనోపక శరణు వేడిరి; తిరుమల రాహుత్త రాయలు కృష్ణరాయలకు బట్టువడి బందీకృతుడాయెను. ఉదయగిరి యొడ్డెవారి చేతినుండి దుసికిలిపోయినది. కృష్ణరాయ లుదయగిరి విజయమును సగర్వముగ నిట్లు దన యాముక్తమాల్యదయందు వర్ణించుకొనియున్నాడు.

70-71

'ఇది కర్ణాటధరాధృతి స్థిరభుజా హేలాక
లబ్ధేభరా
డుదయోర్వీధర తత్పితృవ్యకృతనవ్యోపాయ
నోష్ణిపర
త్నదృగంచత్పద కృష్ణరాయ వసుధాధ్యక్షో
దితాముక్తమా
ల్యదనాశ్వాసము హృద్యపద్యముల నాద్యం
బై మహింబొల్పగున్.'

ఇది గజపతిపై కృష్ణరాయల ప్రథమ విజయము. రానున్న విజయములకు శుభసూచకము. ఉదయగిరిని గైవసము జేసికొని రాయలు సేనలను గొండవీటివైపు దర్శించి తన యిష్టదైవమగు శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించి యా దేవునికి కృతజ్ఞతాపూర్వక నమస్కృతులను సమర్పించుటకు దిరుపతికి బయనమై పోయెను. దేవునికి కానుకల నర్పించి నిరంతరము దన భక్తిని ప్రకటించుటకా దేవుని సన్నిధిని చిన్నాదేవీ తిరుమలదేవీ సహితముగ దన ప్రతిబింబము నచట నిలిపి విజయనగరమున కేగెను.

---

* కొన్ని శాసనములలో 'మేణత వేయించి' అని యున్నది. 'వేణత' కాని 'మేణత' కాని యాంధ్ర నిఘంటువులలో గానరాదు. కన్నడ శాసనములలో 'వేణతవేయించి' అనుదాని బదులు 'విడియవనూహోకి' అని యున్నది. 'విడియవు' కిట్టెలు నిఘంటున లేదు. కాని తమిళ లెక్సికనునందు 'వేణ్‌కై' యను మాటకలదు. దీనికి 'surrounding wall ; outer fortification' అని యర్థము. అరవములోని 'క' తెనుగున 'త' గ మారును. కావున 'వేణత' యరవ 'వేణ్‌కై' యొక్క రూపాంతరమనుట తెల్లము. వేణతయన్నను మేణత యన్నను 'చుట్టుగోడ' యని యర్థము జేసికొనవలయును.

కాళింగమర్దనము, ద్వితీయ ఘట్టము:-

ఉదయగిరిని సాధించిన పిమ్మట కృష్ణదేవరాయలు సైన్యమును కొండవీటిని జయించుటకొఱకు పయనముచేసి యంపి, స్వయము తిరుపతిమార్గమున విజయనగరముబోయి చేరెను. రాయరాణువ కొండపీడు రాజ్యమును బ్రవేశించి గ్రామములను పల్లెలను గొల్లగొట్టి బరశురామ ప్రీతి గావింప నారంభించినది. భీతాగ్రులై ప్రజలు దమ నివాసస్థలముల వ్యజించి సమీపస్థములగు దుర్గములకు బాటిపోయి తల దాచుకొనిరి. కోటలయందు కాపుండిన యొడ్డె రాణ్యములు గర్ణాటకుల భాటి కాగజాలక యథాయథలై పరువిడిపోయి కొండవీటిదుర్గము నాశ్రయించినవి. కందుకూరు, అద్దంకి, వినుకొండ, బెల్లముకొండ, నాగార్జునకొండ, తంగెడ, కేతపరము మున్నగు దుర్గములన్నియు నొకదాని వెనుక నింకొక్కటి సత్వరముగ రాయ సైన్యములకు గైవసమైనవి. పరిసరప్రదేశముల దుర్గములను తదాశ్రయ భూముల నన్నిటిని జయించి వశముజేసికొని చిట్ట చివర కర్ణాటదళములు గొండవీటిపై నడచి దుర్గమును ముట్టడించినవి. రాయల సర్వశిరఃప్రధాని సాళువ తిమ్మరసయ్యగారి యాధిపత్యముక్రింద ముట్టడి ప్రారంభమైనది; కోటను సత్వరముగ సాధించుటకు దిమ్మరసయ్య సకలవిధముల ప్రయత్నమొనర్చెను. కొండవీడు బలిష్ఠమైన దుర్గము; పర్వతాగ్రమున సమున్నతసాలపరివృతమై నిర్మితమగుట వలన శత్రుజనుల కది దుస్సాధ్యమాయె; ఈ కారణముచే గృష్ణకు దక్షిణమందుండిన గజపతి బలముల కదిప్రధానస్కంధావారమైనది. పాత్రసామంతులు, నాయకులు మున్నగువారి కది యాటపట్టయినది; కావున మూడునెలల పర్యంతము తిమ్మరసయ్య దాని చుట్టును ముట్టడివేసి కూర్చున్నను లాభము లేకపోయినది. ముట్టడి యీ స్థితియందుండ, కృష్ణదేవరాయలు విజయనగరమునుండి విచ్చేసి సైన్యమును గలిసికొనెను. రాయలవారు పచ్చినప్పటినుండియు రాయస్కంధావారమున నూతన చైతన్యము గల్గినది; ఇక సత్వరముగగోట వశపడునను నమ్మిక మెల్లర హృదయసీమల నంకురించినది; ఈ నమ్మకము వ్యర్థమైనదికాదు; ఏలన, రాయ లట్టి ప్రతిభావంతుడైన దండనాయకుడు; అన్యసేనాధిపతులకు స్ఫురింపని యూహ లతని భావవీధిని సామాన్యముగ బొడచూపును; పరుల కెఱుకపడని మార్గము లతనికి గరతలామలకములు. కావున రాయలు సైన్యమును గూడగనే వారి యుత్సాహమతిశయించినది; ముట్టడి గాఢతరమైనది; కోటకు రాకపోకలు సంపూర్ణముగ నాగిపోయినవి. కొండవీటికి వచ్చి చేరిన వెంటనే కృష్ణరాయ లింతకాలము గోట కైవసము గాకపోవుటకు గారణము గ్రహించెను. ఉన్నతమైన కోటకొమ్మలపై నిలిచి యుద్ధము సేయు నొడ్డె భటులతో గ్రిందినుండి కర్ణాటకులు సమానముగ బోరుటకు వీలుగాక యుండినది. ఈ వ్యత్యాసమును దొలగించుటకు గృష్ణరాయ లొక నూతన మార్గమును గనిపెట్టెను. ద్రవిడులకు జక్కగ దెలియవచ్చుట కొఱకు నర్తకనర్తకీజను లెత్తైన మంచెలపై నాట్యము సేయుట నతడెఱుగును; అట్లే తన భటులు మంచెలపై నిలిచి యేల యుద్ధము సేయగూడదు? అది యసాధ్యముగాదు; అట్టి మంచెలమీద నెక్కిన దన సైనికు లొడ్డెభటుల ముందునిలిచి ముఖాముఖి యుద్ధము జేయవచ్చును గదా, యని యెంచి రాయలు పెక్కు నడచప్పరములు జేయించి కోటచుట్టును నిలిపెను; ఈ యుక్తివలన కర్ణాటకుల కొడ్డెవారి యెదురెదుర నిలిచి సమానముగ బోరాడుటకు వలనుపడినది. అటుపిమ్మట దుర్గసంరక్షకులకు శత్రుల నిల్వరించుటకు సాధ్యము గాకపోయెను. కర్ణాటకులు గొన్నియెడల కోట గోడల విఱుగబొడిచి యా మార్గమున లోపల బ్రవేశించిరి; మఱికొన్ని తావుల లగ్గలునట్టి పైకెగబ్రాకి పోయిరి; కోట కృష్ణరాయలకు హస్తగతమైనది. ప్రతాపరుద్ర గజపతి రాణి యొక్కతెయు, నతని పుత్రుడగు వీరభద్రుడును, బెక్కండ్రు పాత్రసామంతులును గృష్ణరాయల చేజిక్కిరి; వారినందఱిని బందీకృతులను గావించి విజయనగరమున జెఱసాలకంపెను. కొండవీడు దుర్గము స్వాధీనమైన

పిమ్మట నచట దుర్గాధిపత్యమునకు సాళువ తిమ్మ రసయ్యగారిని నియమించి కృష్ణరాయలు కృష్ణా నదివఱకు వ్యాప్తమైన తీరదేశమును గైవసము జేసికొనెను. కొండవీటి విజయమును రాయలాముక్త మాల్యద యందిట్లు వర్ణించియున్నాడు.

"ఇది భూమండన కొండవీడు ధరణీ భృద్దుర్గ
పూర్వాద్రి భా
స్వ దిభేశాత్మజ వీరభద్ర జనజీవ గ్రాహ
రాహూయమా
ణదృఢాంచద్భుజ కృష్ణరాయ మహిభృన్నా
మాస్మదాముక్తమా
ల్యద నా శ్వాసము హృద్యపద్యము ద్వితీ
యంబై మహింబొల్పగున్."

కొండవీడు దుర్గమును రాజ్యమును స్వాధీనము లైనవి. అంతట గృష్ణరాయలు చిన్నమదేవీ తిరుమలదేవీ సహితముగ నమరేశ్వరుని సేవింప నమరావతికి బయలువెడలెను. ఆ దేవుని పూజించి కానుక లర్పించి దాన ధర్మములగావించి యచటినుండి వెడలి శ్రీశైలము మీదుగ విజయనగరమునకు బోయిచేరెను.

తృతీయఘట్టము:—కొండవీడు విజయముతో కృష్ణరాయలు కృతకృత్యు డాయెను; సాళువ నరసింగరాయల కడపటి యాదేశము చొప్పున రాయచూరోదయగిరి కొండవీడు దుర్గములను మూడింటిని స్వాధీనపఱచుకొనెను; సపాదుని జయించి కృష్ణా తుంగభద్రల యంతర్వేదిని గొనెను; ఉమ్మత్తూరు నాయకులను గూలద్రోసి కావేరీతీర కన్నడదేశమును దన యేలుబడి క్రిందికి దెచ్చుకొనెను; గజపతిని నిర్జించి యుదయగిరి కొండవీడు దుర్గములను జయించి దక్షిణాంధ్ర తీరభూమిపై యథాపూర్వము రాయల యధికారమును నెల కొల్పెను; కాని యతనికి దృప్తి కలుగలేదు. పూర్వము గజపతి కపిలేశ్వరుడు రాయరాజధాని యగు విద్యానగరమును ముట్టడించి మల్లికార్జున రాయలకడ గప్పము గొనిపోయి యున్నాడు; తరువాత పురుషోత్తమ గజపతి సాళువ నరసింహరాయల పుత్రికను బలాత్కారముగ గొనిపోయి వివాహమాడియున్నాడు. వానికి ప్రతీకారము సేయవలసియున్నది; అట్లు సేయకపోయిన నతనికి మనశ్శాంతి గల్గదు; హృదయమందు రగులుకొనుచుండిన క్రోధాగ్ని చల్లారదు. కావున కృష్ణరాయలు కొండవీడు రాజ్యమును వశపఱచుకొనిన పిమ్మట కృష్ణకవ్వలి గజపతి రాజ్యమును జయింప సమకట్టి సైన్యములకు నదినిదాట నాజ్ఞ యొసగెను; సైన్యము కృష్ణను దాటి బెజవాడకు ముట్టడివేసినది; రాయలు విద్యానగరినుండి మరలించి దళములగూడెను; పట్టణము మీద కర్ణాటకుల యొత్తిడి యతిశయించెను; పుర సంరక్షకులు నిలుపోపక, రాయలకు బీగములను సమర్పించి కోట నప్పజెప్పిరి. అటుపిమ్మట బెజవాడను నెలవీడు గావించుకొని తూర్పున వేంగీదేశమును బశ్చిమమున తెలింగాణమును జయింప సమకట్టెను. ఈ యుద్యమము నెర వేరుట కాద్యమున గొండపల్లెను గైవసముజేసికొన వలసియుండె; కొండపల్లె బెజవాడకు బశ్చిమోత్తరమున పదిమైళ్ళ దూరమున కృష్ణ కుత్తరతటమందుండు ప్రబలగిరిదుర్గము; మధ్యాంధ్రమున ఆయపట్టు స్థానములయందు ప్రధానమైనది; ఆంధ్రదేశమందలి శత్రుదుర్భేద్య దుర్గముల యందొక్కటి. తీరదేశమునుండి తెలింగాణమునకు బోవు మార్గమును సంరక్షించు బోరు తలుపు; కావున తెలింగాణ త్రైత్రయాత్రకు ముందు కొండపల్లిని జయించి వశపఱచుకొనుట ప్రథమ కర్తవ్యమాయె; తత్కారణమున కృష్ణరాయలు కొండపల్లెకు దండు నడుపుకొని పోయి దుర్గమును ముట్టడించెను; గజపతి వారిపక్షమున ప్రహరేశ్వరమహాపాత్రుడు కోటనుసంరక్షించుచుండెను; బోడజన మహాపాత్రుడును బిజ్జీఖానుడును నతనికి ప్రాపై యుండిరి; దుర్గ మొక కొండ కొన యందు నిర్మితమై యున్నత సాలాపరివృతమగుట వలన శీఘ్రముగ వశపడలేదు. కృష్ణరాయలు కొండపల్లెకు ముట్టడి వేసియున్నాడని తెలిసికొని గజపతి ప్రతాపరుద్రుడు గొప్పదండును నడపుకొనుచు కృష్ణ నెచ్చటనో దాటి వెనుకనుండి రాయలుపై గూచి చేసి వచ్చెను; గజపతి యెత్తుగడ చక్కనైనదే; తాను పింగలి నుండి తారసిల్ల ప్రహరేశ్వరాదులు ముంగలినుండి పైబడి కర్ణాటక సైన్యమును రూపు

మాపవలయునని యతని యుద్దేశము; కాని యతని కడక విఫలమాయెను; వెనుకనుండి దండునడపు కొనుచు గజపతి వచ్చుచున్నాడను వార్త కృష్ణ రాయలకు వచ్చి చేరినది. అంత నతడు గజపతి నెదుర్కొని పాఱదోలుటకు నిశ్చయించి, కోటలోని వారిని వెలుపలికి రానీయక కోట చుట్టును గొంత దండును గాపుంచి తక్కిన సేనతోగూడ కృష్ణవైపు నకు నడచెను. కృష్ణరాయలు నదిని దాటుచుండ నదియ యనుకూల సమయమని తలచి గజపతి యతని దాకెను. భయంకర యుద్ధము సంప్రాప్తమైనది. నదిని దాటునప్పుడు వ్యూహము చెడి తారుమారై యున్నను కర్ణాటకులె విజయులైరి. యుద్ధమునందు నిర్జితుడై గజపతి పలాయితుడాయెను. అంతట కృష్ణరాయలు వెనుదిరిగి కొండపల్లెకడనున్న శిబిరమునకు బోయి చేరెను. ముట్టడి రెండు మాసముల కాలము సాగినది; ప్రహరేశ్వర మహాపాత్రున కటుపై గోటను సంరక్షింప శక్తి లేకపోయినది. కృష్ణరాయ లంతట కొండపల్లెనుబట్టుకొని ప్రహరేశ్వరునితనిమిత్రులతో గూడ బంధించి విజయనగరమందు చెఱసాల కంపెను. కొండపల్లె విజయమును గృష్ణదేవరాయ లాముక్త మాల్యదలో నిట్లు వర్ణించియున్నాడు.

"ఇది పాత్రప్రహరేశ్వర పభృతి బంహిష్ఠో
త్కలానీక గు
ప్తది విస్ఫూర్జటుయంత్రకొండ పలిహృద్బా
హోసికద్రూజ దీ
ప్యదుదారోద్యమ కృష్ణరాయనృప సంజ్ఞా
స్మృత్కృతాముక్త మా
ల్యద నాశ్వాసము హృద్యపద్యము తృతీ
యంబై మహింబొల్పగున్."

చతుర్థ ఘట్టము:—బెజవాడ కొండపల్లి దుర్గములు రెండును స్వాధీనపడుటవలన కృష్ణానది యుభయ తటములును రాయలకు హస్తగతములైనవి. రాయరాణువ నిరాటంకముగ నిక కృష్ణను దాటి గజపతి రాజ్యముపై దాడియూడ వచ్చును; వేంగీ తెలింగాణ విజయయాత్ర నారంభించవచ్చును; కళింగ దండయాత్రయం దే పట్టున కృష్ణరాయలు వేంగిని జయించెనో నిశ్చయించి చెప్పుటకు వీలులేదు. శాసనములందు గాని రాయవాచక కృష్ణరాయ విజయాది చరిత్ర గ్రంథములందు గాని వేంగీ విజయ ప్రస్తావన లేదు; కాని కొన్ని శాసనములందు రాజ మహేంద్రవరమును జయించినట్లు కలదు. ఇదికాక మనుచరిత్రయందు,

"సై! న్యస్తోమోత్థ రజో వ్రజస్థగిత కృష్ణా
గౌతమీ మధ్యభూ। మ్యస్తోకోత్కలరాట్పురీ
హరణ..."

అని పెద్దనార్యుడు కృష్ణరాయలను సంబోధించి యుండుట వలన నతడు వేంగీదేశమును జయించెనని నిస్సంశయముగ జెప్పవచ్చును.

తెలింగాణ విజయము శాసనాదులలో విపులముగ వర్ణింపబడి యున్నది. క్రీ. శ. ౧౫, ౧౬ శతాబ్దములందు తెలింగాణమును పాలించుచుండిన వెలమరాజులు ఖిలపడిపోయిరి. దేశమున జాలభాగమును గజపతుల యాధిపత్యము క్రింద సామంత భూపాలురు పెక్కండ్రు పాలించుచుండిరి. వీరిలో ప్రముఖుడు చిత్తాపఖానుడు; ఇతడు ఫణి వంశజుడు; శూర శిఖామణి; గోలకొండ కుతబ్-ఉల్-ముల్కు నోడించి యోరుగల్లును స్వాధీనము జేసికొనెను; ఆద్యమున నితని రాజ్యమునకు ప్రధాన స్థానము కంభము మెట్టయినను, దురకలను పాఱదోలినపిమ్మట నితడు రాజుకొండను రాజధానిగా జేసికొనెను. ప్రతాపరుద్ర గజపతి కితడు తెలింగాణ వ్యవహారములను నిర్వర్తించుటయందు దక్షిణ హస్తమువలె దోడ్పడుచుండి నందువలన, కృష్ణరాయలతో ప్రతిఘటించి పోట్లాడెను: కాని నిర్జితుడై రాష్ట్రమును సర్వమును గోలుపోయి యడవుల బట్టవలసివచ్చెను. కృష్ణరాయ లితనినే కాక సన్న సామంతుల ననేకులను జయించి వారి దుర్గములను రాష్ట్రములను వశపఱచుకొనెను. ఏకధాటియందు తెలుగురాజ్యమునకు జెందిన దుర్గములను-అనంతగిరి, ఉండ్రకొండ, ఉర్లగొండ, అరువపల్లి, జల్లిపల్లి, కందికొండ, నల్లగొండ, రాజుకొండ, దేవరకొండ, కంభముమెట్టు, కనకగిరి, శంకరగిరి మున్నగు

వానిని—సాధించినట్లు రాయల శాసనములందును సమకాలికాంధ్ర ప్రబంధములందును జెప్పియున్నది. తరువాత కృష్ణరాయలు జమ్మిలోయను జొచ్చి సింహాద్రి వైపు కూచిసేయ గడగెను. పతాపరుద్ర గజపతి దన రాజ్యమును సంరక్షించుకొనుటకు మఱి యొక ప్రయత్నము గావించెను; అఱువదివేల విలు కాండ్రతో గూడ చిత్తాపఖానుని గర్ణాటక సైన్యము వచ్చు మార్గమును కనుమలకడ నరికట్ట నంపెను; చిత్తాపఖానుడు కనుమల నాక్రమించుకొని కర్ణాట దళముల పై శరవర్షమును గురియించి వారినిముందు సాగనీయక నిలిపెను. కృష్ణరాయలంతట తన కైజీత బలగమును కొండల నెక్కిపోయి కనుమ కిరుపార్శ్వ ములందును చిత్తాపఖానుని వెనుకనుండి తారసిల్ల వలయునని యాజ్ఞాపించెను. పింగలినుండి వచ్చి పైబడిన రాయదళముల తాకున కోర్వజాలక, చిత్తాపఖానుని భటులు పంచబంగాళమై పాటి పోయిరి. కృష్ణరాయలటుపిమ్మట ముప్పదివేవురు భటులను కనుమలకు గావుంచి మరల ముందునకు పయనను సాగించి సింహాచలము దగ్గరనుండు పొట్నూరు కడకేగి జయస్తంభమును నిలిపెను. సింహాచల నరసింహస్వామిని దర్శనము జేసికొని సైన్యము నక్కడ నిలిపి కృష్ణరాయలు విజయనగర మునకు దరలిపోయెను. సింహాచల దండయాత్రను గృష్ణరాయ లిట్లు వర్ణించియున్నాడు.

"ఇది సింహాచల దంభకేసరి పదాభీష్టార్చనా
పుణ్యాల
బ్ధదురుట్టంకణ పొట్టునూరి విజయ స్తంభోప
లోట్టం కితాం
కదృఢోష్టాతుర కృష్ణరాయనృపసంజ్ఞాస్మ
త్కృతా ముక్తమా
ల్యద నాశ్వాసవరంబు నాల్గవది హృద్యం
బై మహిం బొల్పగున్"

పంచమ ఘట్టము :— దండయాత్ర ప్రారంభమైనప్పటి నుండియు గజపతి యొక యుద్ధమునం దైన జయమందలేదు; కాని యతడు ధైర్యమును గోల్పోయి సమాధానపడుట కీయకొన లేదు; రాయలతో నింకను బోల్లాడుటకు ప్రయత్న ములు సల్పుచుండెను. కావున కృష్ణరాయ లతని రాజధానియగు కటకముపై నెత్తిపోయి సంధికతని నీయకొలుప నిశ్చయించెను; కృష్ణరాయల కటక దండయాత్ర వృత్తాంతము శాసనములందు గాని న్యూనిజు చరిత్రయందుగాని యర్వాచీన గ్రంథము లగు రాయవాచక కృష్ణరాయ విజయములందు గాని కానరాదు; కాని కృష్ణరాయవిరచితాముక్త మాల్యద యందును పెద్దనగారి మనుచరిత్ర యందును, 'కటకపురి గాల్చె' నని స్పష్టముగ జెప్పి యున్నది; 'పగిలె గటకంబు' అని యొక చాటువు నందు కలదు దీనికి ప్రోద్బలముగ నాముక్తమాల్యద లో నీ క్రింది పద్యము గలదు :

"ఇది నీలాచల నీలచేలక సుభద్రేందీవరా
భాజికో
ణదృగంచద్భుజవీర్యధుర్యజయసన్నాహో
ర్భటీవాద్యభీ
త్యుదితేభేశ్వర కృష్ణరాయ మహిజాన్యుత్పా
దితాముక్తమా
ల్యద నాశ్వాసము సప్తమంబలరు హృద్యం
బైన పద్యంబులన్."

మఱియు క్రీ. శ. ౧౫౧౭ వ సంవత్సరాటి యొక శిలా శాసనమున కృష్ణరాయలు కటకము వఱకుగల దేశ మును జయించినట్లు చెప్పియున్నది. కావున కృష్ణ రాయలు గటకముపై నెత్తిపోయి దానిని దగుల బెట్టె ననుటకు సమకాలిక సాక్ష్యము గలదు; కాని యీ దండయాత్రయందు నడచిన విశేషాంశము లెవ్వియు దెలియరావు. తిమ్మరసు సలహాను వినక కృష్ణరాయలు గజపతి రాజ్యము లోనికి బోయి యతడుండు పట్టణముచెంత విడిసెననియు పోడశ మహాపాత్రులు సైన్యములతో గజపతికి దోడువచ్చి రాయరాణువను రూపుమాప సంసిద్ధులై రనియు, నటుపిమ్మట తిమ్మరసొక యుక్తిచేసి గజపతి చిత్త మున పోడశమహాపాత్రులయెడ సంశయము బుట్టించి యతనిని పట్టణమునుండి పాఱిపోవునట్లు చేసి తుదకు సంధి కొడబఱచెననియు రాయవాచక

మునందు గలదు. కాని న్యూనిజు సంధిని గూర్చి యిట్లు వ్రాసియున్నాడు: విజయనగరమున చెఱ యందున్న గజపతిపుత్రు డాత్మహత్య జేసికొనెను; అతనితోపాటు చెఱసాలయందుండు తనరాణికి గూడ విపత్తు కలుగవచ్చునని భయపడి గజపతి ప్రతాప రుద్రుడు రాయలమంత్రి యగు సాళువ తిమ్మరసయ్య పేర రాయలతో సంధి యెట్లు కుదురునో తెలియ జేయవలసినదని యుత్తరమును వ్రాసెను. రాయల వారికి తమ కుమార్తె నిచ్చి యుద్వాహము జేసిన సంధి కుదురునని తిమ్మరసయ్య ప్రత్యుత్తర మంపెను; గజపతి దన కుమార్తెను విజయనగరమునకు రాయల కడ కంపెను. ఆమెనుగాంచి సంతసించి రాయలామె నుద్వాహము జేసికొనెను. అంతట వారిరువురికిని సఖ్యము కుదిరినది; కృష్ణ కుత్తరమున దాను జయించిన రాష్ట్రము నంతటిని గజపతికి మరలనిచ్చి కృష్ణ రాయ లతనితో సంధి చేసికొనెను. న్యూనిజు చరిత్ర ప్రకారము గజపతికి రాయలకు సంధి కుదిరిన విధమిది. న్యూనిజు కృష్ణరాయలకు సమకాలికు డగుట వలన నతడు చెప్పు వృత్తాంతము విశ్వాసపాత్రమని మన మంగీకరింపవచ్చును.

REHBO2N239

ఆంధ్రప్రదేశ ప్రభుత్వ పాఠ్యగ్రంథముల
ముద్రణాలయమున ముద్రితము, హైదరాబాదు.

	మవసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	REHB02N239
పుస్తకం పేరు	మోడుగులపల్లి చరిత్ర
తారీఖు	2/2/24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	115
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	C1, D, 106, 107
లేవి పేజీలు	NO
తయారు చేసినవది	pragathi
పేజీలు విడదీసినవది	pragathi
స్కాన్ చేసినవది	pragathi
పరీక్ష చేసినవది	RAKSHITHA
పేజీలు సరిచూసినవది	
బైండింగు చేసినవది	
ప్యాకింగు చేసినవది	
స్కాన్ చెయ్యనివి	NO
తప్పులు	NO
పరిస్థితి	Good